ఈనాడు
అనంతపురం

ఆదివారం 31 డిసెంబరు 2017 | 16 పేజీలు



అభివృద్ధి వెలుగులు..
సంక్షేమం పరుగులు..
ఉపాధికి అడుగులు..
తారల తుళుకులు..
పుష్కల జలం..
సాగుకు బలం..
ఊహించని విపత్తులు..
వెంటాడిన విషాదాలు..
ఒక్కమాటలో చెప్పాలంటే 2017..
మిగిల్చిన తీపి చేదు జ్ఞాపకాలు
ఎన్నో ఎన్నెన్నో..

- 8, 9లో..



జైసింహా.. 102 నాటౌట్

క్రీడలంటే చిన్నప్పటి నుంచి చాలా ఇష్టం. క్రికెట్, వాలీబాల్, టెన్నిస్, కబడ్డీలో తోటి మిత్రులతో కలిసి ఆడేవాడినని ప్రముఖ నటుడు, హిందూపురం శాసన సభ్యుడు బాలయ్య తన చిన్నప్పటి జ్ఞాపకాలు గుర్తుచేసుకొన్నారు. శనివారం పురంలో పర్యటించిన ఆయన.. క్రికెట్ టోర్నీ ప్రారంభించి కాసేపు సరదాగా బ్యాటింగ్ చేశారు.

- 16లో



కిక్కు.. తేకుమా చిక్కు!

- మద్యం.. వేగం వద్దే వద్దు
- దూకుడుతో ప్రాణాలు తీసుకోవద్దు
- ఏ ఒక్కరూ తల్లడిల్లకూడదు సుమా
- అప్రమత్తతతోనే 'నూతన' వెలుగులు

న్యూస్‌టుడే, అనంత నేరవార్తలు

యువత... నిత్యం కొత్తదనం వైపు పరుగులు తీస్తోంది. నూతన సంవత్సరం వస్తుందంటే మద్యం మత్తులో.. పాత సంవత్సర చెడు ఘట్టాలను మరచి నూతన సంవత్సరానికి స్వాగతం పలకాలని ఎదురు చూస్తోంది. తల్లిదండ్రుల మాటలు సైతం పక్కన పెట్టి మిత్రులతో జతకడుతోంది. స్నేహితులు ఒకరికొకరు పోగై మందేసి.. చిందేయడం పరిపాటిగా మారింది. మరికొందరు ద్విచక్ర వాహనాల దూకుడు విపరీతంగా పెంచేస్తున్నారు. వాహనానికి పొగ గొట్టాన్ని (సైలెన్సర్) తొలగించి పెద్ద శబ్దంతో వేగంగా నడుపుతూ యువరక్తం వేడితో వాహనాన్ని పదునెక్కిస్తున్నారు. వేగంగా వాహనాన్ని నడుపుతూ ప్రమాదాలకు దారి తీస్తున్నారు. కొందరు ప్రాణాలను బలిగొంటుండగా.. మరికొందరు తమ ప్రాణాల మీదకూ తెచ్చుకుంటున్నారు. ఏటా నూతన సంవత్సర వేడుకల్లో ఒకరిద్దరు ప్రాణాలు కోల్పోతున్నారు. సుమారు 60 మంది దాకా గాయాలపాలై.. పలువురు జీవచ్ఛవాలుగా మారుతున్నారు. 2017కు స్వాగతం పలికే క్రమంలో ఏకంగా ముగ్గురు యువకులు దుర్మరణం పాలై కన్నవారికి కడుపుకోతను మిగిల్చారు. పోలీసులు ఎంత బందోబస్తు ఏర్పాటు చేసినా ఆశించిన ఫలితం ఉండటం లేదు. డిసెంబరు 31న రాత్రి బయటికి వెళ్లే యువత విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తమై జాగ్రత్తలు తీసుకోవాలి. ఆత్మీయంగా మెలుగుదాం.. సంయమనం పాటిద్దాం.. అందరం సంతోషంగా ఉందామని యువత ప్రతినబూని త్రికరణ శుద్ధిగా ఆచరిస్తేనే

మిగతా 7లో

ఉసురు తీసిన మద్యం

2016 డిసెంబరు31.. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా రాయదుర్గం శివారులోని పైతోట ప్రాంతానికి శివన్న మరో ఇద్దరితో కలిసి ద్విచక్ర వాహనంపై చక్కర్లు కొడుతున్నాడు. వన్నూరుస్వామి మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై తిరుగుతున్నాడు. అర్ధరాత్రి వేళ ఎదురుగా వచ్చిన వాహనాలు వేగాన్ని నియంత్రించలేక ఒకదానినొకటి ఢీకొన్నాయి. శివన్న(25), వన్నూరుస్వామి(18) అక్కడికక్కడే ప్రాణాలు వదలగా.. వీరి వెనుక కూర్చున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మద్యం మత్తులో వాహనం నడపడమే కారణమని పోలీసులు నిర్ధరించారు.



ఆశల త'రుణం'.. మెరవాలి తక్షణం!



రైతు రుణమాఫీ సమస్యల పరిష్కారానికి చేపట్టిన ప్రత్యేక కార్యక్రమానికి కర్షకులు పోటెత్తారు. అనంతపురం మార్కెట్‌యార్డుకు శనివారం అనంతపురం, కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ల నుంచి ఆరు వేల మందికిపైగా అన్నదాతలు రాగా రాత్రి 10 గంటల వరకు వినతులు స్వీకరించారు. పరిష్కార వేదిక ద్వారా తమ కష్టాలను సత్వరమే కొలిక్కి తేవాలని రైతన్నలు అధికారులను వేడుకున్నారు. - 11లో

చావుకు పిలవాల్సి వస్తుందనుకోలేదు

మనోవేదనతో యువకుడి ఆత్మహత్య



గోవర్ధన్ గౌడ్ (పాతచిత్రం)

చందన(యాడికి), అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: మరో రెండు నెలల్లో ఆ ఇంట్లో పెళ్లిబాజాలు మోగాల్సి ఉండగా చావు మేళం వినాల్సి రావటంతో ఆ తల్లిదండ్రుల గుండెలు చెరువులయ్యాయి. అండగా ఉంటాడనుకున్న కుమారుడు గుండెలవిసేలా చేశాడు. తమ కొడుకే లిఖించుకున్న మరణశాసనం లాంటి ఉత్తరం వాట్సాప్, ఫేసుబుక్కుల రూపంలో స్నేహితుల ద్వారా తమకు చేరుతుందని తల్లిదండ్రులు ఊహించలేకపోయారు. అనంతపురం నగరంలోని బస్టాండ్ సమీపంలోని ఓ లాడ్జిలో గోవర్ధన్ అలియాస్ గోపి(28) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు మూడో పట్టణ ఎస్సై క్రాంతికుమార్ తెలిపారు.

యాడికి మండలం చందన గ్రామానికి చెందిన సూర్యనారాయణ దంపతులకు గోవర్ధన్ ఒక్కగానొక్క కొడుకు. ఇంటర్‌తో చదువు ఆపేసి ఆటో నడుపుతూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండేవాడు. ఎలాంటి దురలవాట్లు లేవు. బాధ్యతగా వ్యవహరించి, తన ప్రవర్తనతో మంచి పేరు తెచ్చుకున్నాడు. ఇటీవలే వివాహ నిశ్చితార్థం కూడా అయింది. ఫిబ్రవరి 24న పెళ్లికూడా నిశ్చయించారు. ఇంతలో ఏమైందో కానీ శనివారం తెల్లవారుజామున తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఆరు పేజీల ఉత్తరం రాసి మరీ స్నేహితులకు వాట్సాప్, ఫేసుబుక్కుల్లో సమాచారం అందించాడు. 'నా చావుకు ఎవరూ కారణం కాదు. నాకు నా మనస్సాక్షికి జరిగిన సంఘర్షణతోనే ప్రాణాలు తీసుకుంటున్నా, అందరినీ విడిచి వెళ్తున్నందుకు బాధగా ఉంది. అందరినీ పెళ్లికి పిలవాలనుకున్నాను. కానీ నా చావుకు పిలవాల్సి వస్తుందనుకోలేదు'.అని తన మనోవేదనను ఉత్తరంలో వ్యక్తం చేశాడు.

పెళ్లి వాయిదా అనే..

గోపికి గత ఆగస్టులో వివాహం చేసేందుకు నిశ్చయించినట్లు పోలీసులు తెలిపారు. ఆ సమయంలో యువకుడి పెద్దనాన్న చనిపోవడంతో పెళ్లి వాయిదా వేశారు. అనంతరం గోపికి బట్ట తల అధికం కావడంతో పెళ్లి కుమార్తె వివాహం చేసుకొనేందుకు విముఖత వ్యక్తం చేసింది. దీనికితోడు కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవడం, ఉపాధి అవకాశాలు లభించక పోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. కొంత కాలంగా మనోవేదనకు గురయ్యాడు. ఈక్రమంలో అనంతపురానికి వెళ్లి శస్త్ర చికిత్స చేయించుకుంటానని ఇంట్లో చెప్పి శుక్రవారం రాత్రి నగరానికి చేరుకున్నాడు. ఆర్టీసీ బస్టాండు సమీపంలో లాడ్జిలో రాత్రి 9 గంటలకు చేరాడు. శనివారం తెల్లవారుజామున తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. దీంతో తల్లిదండ్రులు యాడికి పోలీసులకు విషయాన్ని తెలిపారు. యాడికి, అనంతపురం పోలీసులు అప్రమత్తమై లాడ్జిలోని గదిని పరిశీలించగా.. అప్పటికే విగత జీవిగా కనిపించాడు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనంతలో భారీ చోరీ

☛ పట్టపగలే దోపిడీ

☛ 41 తులాల బంగారు ఆభరణాలు అపహరణ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, ఎస్సై

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంత నగరంలో పట్టపగలే దొంగలు పడ్డారు. నిత్యం రద్దీగా ఉండే రాంనగర్‌లో మధ్యాహ్నం వేళ పంచాయతీ కార్యదర్శి లావణ్య ఇంట్లో చోరీ చేశారు. 41 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.88 వేలు నగదును అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు లావణ్య బుక్కరాయసముద్రంలో పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఆమె భర్త శివప్రసాద్ కోర్టు రోడ్డులో కంప్యూటర్ల మరమ్మతులు, విక్రయాల దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం లావణ్య విధులకు వెళ్లారు. పిల్లలు పాఠశాలకు వెళ్లడంతో శివప్రసాద్ దుకాణానికి వెళ్లాడు. మధ్యాహ్నం తర్వాత శివప్రసాద్ ఇంటికి వచ్చి చూడగా.. తాళం పగలగొట్టి ఉంది. నివాసంలో వెళ్లి చూడగా బీరువాలో ఆభరణాలు చోరీకి గురయిన విషయాన్ని గమనించాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. నగర డీఎస్పీ వెంకటరావు, నాల్గో పట్టణ ఎస్సై శేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నిపుణులు వేలిముద్రల సేకరణ, సాక్ష్యాధారాల కోసం నివాసంలో సోదాలు నిర్వహించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై శేఖర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైకాపా నాయకుడి హత్యకు కుట్ర?

పోలీసుల అదుపులో నిందితులు

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం పట్టణానికి చెందిన ఓ వైకాపా నాయకుడి హత్యకు ప్రత్యర్థులు కుట్రపన్నిన విషయం ఓ కేసు విచారణలో బయటపడింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు.. ధర్మవరం పట్టణంలోని బోయవీధిలో ఈ నెల 23వ తేదీ తెల్లవారు జామున చిన్నరాజన్న అనే వ్యక్తి ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తులు బాంబులు వేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. చిన్నరాజన్నకు ప్రత్యర్థులు ఎవరూ లేకపోవడంతో రాజన్న ఇంటిపై బాంబులు వేయాల్సిన అవసరం ఎవరికుంటుందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ దశలో అదే ప్రాంతంలో నివాసముంటున్న వైకాపా నాయకుడిని లక్ష్యంగా చేసుకొని బాంబు దాడి చేసి ఉంటారనే అనుమానాలు రావడంతో పోలీసులు పలు కోణాల్లో విచారణ చేపట్టారు. కీలక సమాచారం లభించడంతో చిత్తూరు జిల్లా గుర్రంకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని సుంకరవాండ్లపల్లి గ్రామంలో ధర్మవరం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ధర్మవరానికి చెందిన ఉపేంద్ర అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారి నుంచి బాంబులు, వేటకొడవళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ధర్మవరం బోయవీధిలో జరిగిన బాంబుదాడి ఘటనపై జిల్లా పోలీసు యంత్రాంగం సీరియస్‌గా పరిగణించడంతో కేసు దర్యాప్తునకు ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు. ఉపేంద్రకు, వైకాపా నాయకుడికి మధ్య పాతకక్షలు ఉన్నట్లు సమాచారం. వైకాపా నాయకుడి ఇంటిపై దాడి చేసేందుకు వచ్చిన ప్రత్యర్థులు పొరపాటున చిన్నరాజప్ప ఇంటిపై బాంబులు వేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాంబుదాడికి సంబంధించి ప్రమేయం ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు అత్యంత రహస్యంగా విచారణ చేస్తున్నారు. పూర్తి వివరాలు విచారణలో వెల్లడైన అనంతరం నిందితుల అరెస్టును చూపించనున్నారు.

మహిళపై అత్యాచార యత్నం

గుంతకల్లు: ములకలపెంట గ్రామంలో ఓ యువకుడు మహిళపై అత్యాచార యత్నానికి పాల్పడినట్లు కసాపురం పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన విజయకుమార్ (24) అనే యువకుడు గ్రామానికి చెందిన వివాహితపై శనివారం ఉదయం అత్యాచార యత్నానికి ఒడిగట్టాడని చెప్పారు. మహిళ బహిర్భూమికి వెళ్లిన సమయంలో ఆమెను వెంబడించగా కేకలు వేయడంతో చుట్టపక్కల వారు రావడంతో విజయకుమార్ పారిపోయాడని పేర్కొన్నారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

మహిళా చట్టాలపై అవగాహన పెంచాలి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: మహిళా చట్టాలు, భద్రత, రక్షణపై విద్యార్థినుల్లో అవగాహన పెంచాలని ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. శనివారం డివిజన్ల వారీగా మహిళా రక్షక్ బృందాల పనితీరుపై సమీక్షించారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ పట్టణాల్లో ఆర్టీసీ బస్టాండులు, రైల్వే స్టేషన్లు, బాలికల వసతి గృహాలు తదితర ప్రాంతాల్లో పౌర దుస్తుల్లో ఉంటూ 8 మంది ఈవ్‌టీజర్లను పట్టుకున్నారు. 8 మందిని మహిళా సమస్యల కేంద్రానికి తీసుకొచ్చారు. వారికి కౌన్సిలర్లు పరిటాల శైలజ, నిర్మల, ఇందిర, మున్వర్‌సుల్తానా, గోవిందమ్మ కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే కళ్యాణదుర్గం, కదిరి, తాడిపత్రి, గుంతకల్లు, ధర్మవరం, పెనుకొండ, పుట్టపర్తిలలో ఈవ్‌టీజర్లపై ఇదే తరహాలో చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

తప్పిన ప్రాణాపాయం



దెబ్బతిన్న కారు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు మండల పరిధిలోని హంద్రీనీవా కాలువ వంతెనపై శనివారం రాత్రి 7.30 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు ధ్వంసమై, త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. కొత్తచెరువు నుంచి గోరంట్లకు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. బస్సు వెనుక టైర్లను ఢీకొనడంతో కారు డ్రైవర్ వైపు తలుపు పూర్తిగా దెబ్బతింది. వంతెనపై వాహనాలు వెళ్లడానికి విశాలంగా ఉంది. అయితే కారుడ్రైవర్ నిర్లక్ష్యంతోనే బస్సు వెనుక భాగాన్ని ఢీకొన్నట్లు పోలీసులు నిర్ధరణకు వచ్చారు. ప్రమాదం జరిగిన తరువాత కారుడ్రైవర్ కొంత ముందుకు వెళ్లి వాహనాన్ని అక్కడే వదిలి వెళ్లిపోయినట్లు పోలీసులు గుర్తించారు. కారు అదుపు తప్పి ప్రమాదం జరిగిందా...! లేక డ్రైవర్ మద్యం మత్తు ప్రమాదానికి కారణమా అన్నది పోలీసుల విచారణలో వెల్లడి కావాల్సి ఉంది. ప్రమాదంలో కారు మాత్రమే దెబ్బతిని ప్రాణాపాయం తప్పడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. కేసు విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కౌలు రైతును బలిగొన్న అప్పులు



మృతుడు నల్లపరెడ్డి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: సాగు అవసరాలకు చేసిన అప్పులు తీర్చలేక నల్లపరెడ్డి(47) అనే కౌలు రైతు బలవన్మరణానికి పాల్పడిన విషాద ఘటన శనివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఆత్మకూరు పోలీసుల వివరాల మేరకు... ఆత్మకూరుకు చెందిన నల్లపరెడ్డి స్థానికంగా 17 ఎకరాలను కౌలు తీసుకున్నారు. ఆరేళ్లుగా సాగుపై ఆధారమై జీవిస్తున్నారు. అయితే కౌలు భూమికి శిస్తు, పంట పెట్టుబడి అధికం కావడంతో ఏటా అప్పులు పెరిగిపోయాయి. వ్యవసాయ పనుల నిమిత్తం దాదాపు రూ.5 లక్షల వరకు బంధువుల వద్ద అప్పులు చేశారు. మరోవైపు కూతురి పెళ్లి కోసం దాదాపు రూ.2.5 లక్షలు రుణం తెచ్చారు. నానాటికీ అప్పులు పెరిగిపోగా.. వాటిని తీర్చే మార్గం లేక మనస్తాపంతో శనివారం ఆయన పురుగుల మందు తాగారు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ను చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ప్రాణాలు వదిలారు.

చికెన్ ధరలు

బ్రాయిలర్ -	కేజీ
కోడిమాంసం -	రూ. 160
కోడిమాంసం(స్కిన్‌లెస్) -	రూ. 190
బోన్‌లెస్ -	రూ. 320
హోల్‌సేల్ లైవ్ -	రూ 88
నాటుకోడి (లైవ్) -	రూ. 320
నాటుకోడి మాంసం -	రూ. 420

మటన్ ధరలు

పొట్టేలు మాంసం -	కేజీ రూ. 500
గొర్రె మాంసం -	కేజీ రూ. 400

చేపలు ధరలు

సాధారణ చేపలు	రూ. 120
కట్ల రూహు చేపలు	రూ. 130
బొంగ్డా చేపలు-	రూ. 200
బోన్‌లెస్ చేపలు-	రూ. 220
చిన్న టైగర్ రొయ్యలు-	రూ. 240
పీతలు -	రూ. 170

కోడిగుడ్లు

డజను గుడ్లు(12)	- రూ. 53
హోల్‌సేల్(100)	- రూ. 410

మార్కెట్‌లో పట్టుగూళ్ల ధరలు

హిందూపురం, (న్యూస్‌టుడే):

రకము:	బైవోల్టిన్	క్రాస్‌బీడింగ్ (సిబి)
కనిష్ఠధర:	335.00	302.00
గరిష్ఠ ధర:	667.00	377.00
సగటు ధర:	575.00	347.00

వెండి తెర ఈనాడు

అనంతపురం

- గంగ... ఒక్క క్షణం
- గౌరి.... జుమాంజీ
- గాయత్రి.. 2 కంట్రీస్
- గౌతమి... ప్రాజెక్ట్ జెడ్
- త్రివేణి... టైగర్ జిందా హై
- తరంగిణి... ఒక్క క్షణం
- తేజస్విని... జవాన్
- శాంతి... హలో
- సుధ.. 2 కంట్రీస్
- స్వప్న... సర్వానిక్ రాయ్
- ఎస్వీ సినిమ్యాక్స్.. ఎంసీఏ
- నీలిమ... ఉన్నది ఒకటే జిందగీ


సిద్ధమైన కేకులు


కొనుగోలు సందడి

తియ్యని వేడుక చేద్దాం

నూతన సంవత్సర ప్రారంభోత్సవం సందర్భంగా నగరంలోని పలు దుకాణ దారులు ప్రత్యేకమైన మిఠాయిలను తయారు చేశారు. దాదాపు 80 రకాల మిఠాయిలు సిద్ధం చేసి, అమ్మకాలకు ఉంచారు. అలాగే బేకరిల్లోనూ కేకులను తయారు చేశారు. చాక్లెట్ దుకాణంలో పెళ్లికూతురు, పెళ్లికొడుకు, కార్లు ఇలా వివిధ రూపాల్లో చాక్లెట్ బొమ్మలను తీర్చిదిద్దారు. ఒకరోజు ముందుగానే నగరంలోని దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

- చిత్రాలు: ఈనాడు, అనంతపురం


చాక్లెట్ గిఫ్టులు


వివిధ ఆకృతులతో..


చాక్లెట్లతో తయారైన బొమ్మలు


మిఠాయిలను ఆసక్తిగా తిలకిస్తూ..

9,816 తెల్లరేషన్ కార్డుల పంపిణీకి చర్యలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో 2018 జనవరి 2 నుంచి జరిగే జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో తెల్లరేషన్ కార్డులు పంపిణీ జిల్లా పౌరసరఫరాలశాఖ సిద్ధం చేస్తోంది. జిల్లాలో మొత్తం 48 వేల దరఖాస్తులు వచ్చాయి. అవన్నీ క్షేత్రస్థాయిలో ఈనెల 24 వరకు పరిశీలించి, అంతర్జాలంలో అప్‌లోడ్ చేయడానికి రాత్రింబవళ్లు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మొత్తం 9,816 కొత్తగా తెల్లరేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని డీఎస్‌వో శివరామప్రసాద్ తెలిపారు. తెల్లరేషన్ కార్డుల ముద్రణకు ఆరు అంశాలను పరిగణలోకి తీసుకున్నామన్నారు. ప్రజాసాధికార సర్వేను రేషన్ కార్డులకు అనుసంధానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయని డీఎస్‌వో తెలిపారు. ఆ ప్రకారం అర్హులకు ఇవ్వాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఇందులో ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయ పన్ను చెల్లించేవారు, రెండేసిచోట్ల కార్డులున్నవారు, రూ.500 పైబడి పన్ను చెల్లించిన వారిని పరిగణనలోకి తీసుకుంటున్నట్లు సమాచారం. టెండర్లు పిలిచి కార్డుల ముద్రణకు చర్యలు తీసుకుని జన్మభూమిలో పంపిణీ చేస్తామని డీఎస్‌వో తెలియజేశారు.

చక్కెర పంపిణీ: తెల్లకార్డుదారులకు రాయితీ చక్కెర పంపిణీని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఏఏవై కార్డులకు మాత్రమే కిలో చొప్పున 1,04,739 మంది కార్డుదారులకు పంపిణీ చేస్తుంది. అయితే తెల్ల కార్డుదారులకు మాత్రం గత ఐదునెలలుగా చక్కెర పంపిణీ పూర్తిగా ఆపేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తూ జనవరి నెల నుంచి తెల్లకార్డుదారులకు చక్కెర పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈమేరకు జిల్లాకు 650 మెట్రిక్ టన్నులు కేటాయించినట్లు డీఎస్‌వో శివరామప్రసాద్ తెలిపారు. 10,90,436 తెల్లకార్డులకు అరకిలో రూ.10 చొప్పున పంపిణీ చేస్తారని, జనవరి నెల నుంచి అమలులోకి వస్తుందని డీఎస్‌వో పేర్కొన్నారు.

మిఠాయిలతో శ్రీ రూపం


మిఠాయిలతో తయారైన రూపం

సాయినగర్, న్యూస్‌టుడే: నగరంలోని టవర్‌క్లాక్ సమీపాన ఉన్న స్వగృహ ఫుడ్స్ నిర్వాహకులు మిఠాయిలతో శ్రీ ఆకారం రూపొందించారు. శివలింగం, పార్వతీదేవిని అందులో కొలువుదీర్చారు. శివ ద్వాదశి సందర్భంగా సుమారు 36 కిలోల మిఠాయిలతో మూడురోజులపాటు శ్రమించి ఆకర్షణీయంగా తయారు చేశారు. బాదుషా, జాంగ్రీ, కలాకాన్, తెల్లనువ్వులు, నల్లనువ్వులు వినియోగించినట్లు నిర్వాహకులు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు ఈ ప్రతిమను భక్తుల సందర్శనార్థం ఉంచి, ఆ తరువాత నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకులు వెంకటవిజయకుమార్, శ్రావణ్‌కుమార్ తెలిపారు.

1న ప్రధానాచార్యుల సమావేశం

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఇంటర్ ప్రయోగాలపై జనవరి 1న జిల్లాలోని అన్ని కళాశాలల ప్రధానాచార్యులకు సమావేశం ఏర్పాటు చేశామని ఆర్‌ఐఓ సురేష్‌బాబు తెలిపారు. అనంతపురం కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని వృత్తివిద్య కళాశాలలో సమావేశం ఉంటుంది.

దూరవిద్యలో అవకాశాలపై సదస్సు

అనంతపురం విద్య: దూరవిద్యలో అవకాశాలపై డిసెంబరు 31, జనవరి 7వ తేదీల్లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ శివశంకర్ తెలిపారు. అనంతపురంలోని రఘువీరాటవర్స్ వద్ద ఉన్న ఆర్ఎం డిగ్రీ కళాశాలలో ఉంటుందన్నారు.

విలువల విద్య బోధించండి


కాలమానిని విడుదల చేస్తున్న ట్రస్టు సభ్యుడు రత్నాకర్, ఎమ్మెల్సీ బాలసుబ్రమణ్యం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు విలువ, క్రమశిక్షణ కూడిన విద్యాబోధన అందించి, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసి సమాజానికి అందించాలని సత్యసాయి ట్రస్టు సభ్యుడు ఆర్.జె. రత్నాకర్ కోరారు. శనివారం పుట్టపర్తిలో యూటీఎఫ్ కాలమానిని ఆయన, ఎమ్మెల్సీ బాలసుబ్రమణ్యం, యూటీఎఫ్ నాయకులతో కలిసి విడుదల చేశారు. ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసి ఆదర్శంగా నిలవాలన్నారు. సత్యసాయి ట్రస్టు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చేయూత అందిస్తోందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు నూతన సంవత్సరంలో సుఖసంతోషాలతో ఉండాలని కాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు సంపత్‌కుమార్, శివశంకర్, భాస్కర్, రవిచంద్ర, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

విధి నిర్వహణలో ఓర్పు అవసరం

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: జలవనరుల శాఖ(ఎంఐ) ఎస్ఈ మగ్బూల్ సాహెబ్ ఎంతో ఓర్పు, సహనంతో పని చేస్తారు. ఆయన మృదుస్వభావి అని జిల్లా జలవనరుల శాఖ సీఈ జలంధర్, హెచ్చెల్సీ ఎస్ఈ సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం హెచ్చెల్సీ కాలనీలోని ఆ శాఖ కార్యాలయ ఆవరణలో ఎంఐ ఎస్ఈ మగ్బూల్‌కు ఆత్మీయ వీడ్కోలు సభను జరిపారు. హెచ్చెల్సీ డివిజన్ ఈఈగా పని చేస్తూ పదోన్నతిపై ఎంఐ ఎస్ఈ వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ ప్రజలు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడంలో మగ్బూల్ నేర్పరి అన్నారు. ఏ డివిజన్‌ను అప్పగించినా కష్టపడి పని చేసినట్లు గుర్తు చేశారు. ఎస్ఈ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ మగ్బూల్ పనితీరు, ప్రతిభ తనకు బాగా తెలుసన్నారు. ఆయన మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సీఈ శ్రీనివాసులు, ఉప ఎస్ఈ శ్రీనివాసులు, ఈఈలు మోహన్‌మూర్తి, రామకృష్ణారెడ్డి, డీఈలు రామయ్య, పక్కీరప్ప, వెంకటరమణ, ఏఈలు జ్ఞానేశ్వర్, రామేశ్వర్‌రెడ్డి, కవిత, సుధారాణి తదితరులు మాట్లాడారు.

వేడుకల్లో ఎవరినీ ఇబ్బందులు పెట్టొద్దు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఆదివారం అర్ధరాత్రి నిర్వహించే వేడుకల్లో యువత ఎవరికీ ఇబ్బంది కల్గించవద్దని ఎస్పీ అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియమ, నిబంధనలను ఉల్లంఘిస్తూ విషాదంగా మార్చితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. డిసెంబరు 31న అర్ధరాత్రి నిర్ణీత సమయానికి మద్యం దుకాణాలు, దాబాలు, బార్లు మూసి వేయాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు ముఖ్య పట్టణాలు, మండల కేంద్రాల్లో ఆరోజు రాత్రి పోలీసులు గట్టి నిఘా ఉంచుతారన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే శ్వాస పరీక్షలు నిర్వహించి చర్యలు తీసుకుంటారని తెలిపారు. జిల్లాలో పోలీసు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపుతున్నట్లు పేర్కొన్నారు. రహదారులపై యువత మద్యం తాగినా.. వాహనాలకు సైలెన్సర్లు తొలగించి అధికంగా శబ్దాలు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో వేడుకలు నిర్వహించేలా తల్లిదండ్రులు పిల్లలకు జాగ్రత్తలు చెప్పాలని సూచించారు.

జీఎం సేవలు భేష్

అనంతపురం (అరవిందనగర్), న్యూస్‌టుడే: బీఎస్ఎన్ఎల్ సంస్థలో జూనియర్ టెలికం ఇంజినీరుగా ఉద్యోగంలో చేరి అంచెలంచెలుగా జిల్లా జనరల్ మేనేజర్ స్థాయికి చేరుకోవడం అమోఘమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బీఎస్ఎన్ఎల్ జిల్లా జనరల్ మేనేజర్ వెంకటనారాయణ పదవీ విరమణ సందర్భంగా అనంతపురం నగరం వేమన టెలిఫోన్ భవన్లో శనివారం డీజీఎం విశ్వనాథ్ అధ్యక్షతన సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కడప పీఎంజీ శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో జీఎం వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తూ ఆర్థికాభివృద్ధిలో సంస్థను రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలిచేలా కృషి చేశారని ప్రశంసించారు. అనంతరం వెంకటనారాయణ మాట్లాడుతూ జీఎం పదవి ఎంతో సంతృప్తి ఇచ్చిందన్నారు. 1975లో కొడిగెనహళ్లి గురుకుల ఉన్నత పాఠశాలలో చదివానని, అక్కడ గురువులు నేర్పిన విద్య, క్రమశిక్షణే ఇంతటివాడిని చేసిందని చెప్పారు. విధి నిర్వహణలో అధికారులు, ఉద్యోగులు బాగా సహకరించారన్నారు. డీజీఎం నరసింహులు, రమేష్, విశ్రాంత డీజీఎంలు రాఘవులు, గోపాలరెడ్డి, అక్బర్‌బాష, మోహనరావు, గార్లదిన్నె రైతు శిక్షణ కేంద్రం డైరెక్టరు రావు, విశ్రాంత డిప్యూటీ కలెక్టరు మల్లేశ్వరయ్య, కొడిగెనహళ్లి ఉన్నతపాఠశాల అధ్యాపకులు, సంచార్ నిగం ఇంజినీర్ల సంఘం ప్రతినిధులు లింగమయ్య, రాజశేఖరరెడ్డి, ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు శివప్రసాద్, కార్యదర్శి చంద్రశేఖర్, డీఈ, ఎస్డీఈ, జేటీఓ అధికారులు పాల్గొన్నారు.


జీఎంకు ఆత్మీయ సత్కారం

బాధ్యుల అరెస్టుకు వినతి

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: రాజమండ్రిలో మౌజన్‌ను హత్యచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ముస్లీం నగారా వ్యవస్థాపకులు ఉమర్‌ఫరూక్, షబ్బీర్, ముస్తక్‌అహ్మద్ తదితరులు డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ చల్లావిశ్వనాథ్‌కు వినతిపత్రం అందించారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు, నిర్వహించాలన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి

గోళ్లాపురం(హిందూపురం(గ్రామీణం),న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు బి.గంగిరెడ్డి సూచించారు. గోళ్లాపురం, గుడ్డంపల్లి గ్రామాల్లో సంస్థ సభ్యులు, సేవాకర్తలు శనివారం మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. చెట్లుగా పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు.

తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చండి

ఎమ్మెల్యే బాలకృష్ణ



టేకులోడ్‌క్రాస్‌లో ఉపాధ్యాయ నివాస సముదాయాన్ని ప్రారంభిస్తూ...

టేకులోడుక్రాస్(చిలమత్తూరు), న్యూస్‌టుడే: విద్యార్థులతోనే దేశ భవిష్యత్తు సాధ్యమని ఎమ్మెల్యే బాలకృష్ణ పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివిస్తున్నారని, వారి ఆశలు నెరవేర్చాలని సూచించారు. మండలపరిధిలోని టేకులోడుక్రాస్‌లో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు నివాససముదాయాన్ని ప్రిన్సిపల్ మాలతీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీటీసీ నాగమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేను ఎంపీపీ నౌజియాభాను, జడ్పీటీసీ లక్ష్మీనారాయణరెడ్డి పూలమాల, శాలువాలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నివాస సముదాయాలను రూ.1.48 కోట్లతో ప్రారంభించినట్లు తెలిపారు. గురుకుల పాఠశాల ఆవరణలో వచ్చే ఏడాది రూ.10 కోట్లతో రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అక్కడి ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు పలు సమస్యలను విన్నవించారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం (పీఏబీఆర్) పైపులైను ద్వారా పాఠశాలకు నీటిని ఇప్పించాలని కోరారు. బాలకృష్ణ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో సర్పంచి బాలాజీ, ఉప సర్పంచి చంద్రారెడ్డి, ఎంపీటీసీలు ప్రవీణ్, సూర్యనారాయణ, తెదేపా మండల కన్వీనర్ బాబురెడ్డి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు శివప్ప, బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ రంగనాయకులు, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, ఆల్ ఇండియా ఎన్‌బీకే ఫ్యాన్స్ కన్వీనర్ నంబూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి...

హిందూపురం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే బాలకృష్ణ పేర్కొన్నారు. ఎంజీఎం మైదానంలో బసవతారకరామ క్రికెట్‌టోర్నీని శనివారం ఆయన ప్రారంభించారు. చిన్నప్పటి నుంచి క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చానని, మిత్రులతో కలిసి క్రికెట్, వాలీబాల్, టెన్నిస్, కబడ్డీ ఆడేవాడినని తెలిపారు. హిందూపురంలో క్రీడలను ప్రోత్సహించేందుకు రూ.2కోట్లతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మరో రూ.10 కోట్లతో ప్రణాళికలు సైతం తయారు చేశానన్నారు. మూడేళ్లుగా టోర్నీ నిర్వహిస్తున్నామని, బాలకృష్ణ చేతుల మీదుగా ప్రారంభించడం అదృష్టమని మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీ పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ రంగనాయకులు, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, గ్రంథాలయ ఛైర్మన్ గౌస్ మోయిద్దీన్, నాయకులు వెంకటస్వామి, నాగరాజు, అంబికా లక్ష్మీనారాయణ, బీఎస్ విద్యాసాగర్, లోక్‌నాథ్, హెచ్‌ఎన్‌కే పండిట్ తదితరులు ఉన్నారు. మైదానంలో క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేసి బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు.

మళ్లీ పురం నుంచే పోటీ చేయాలి...ఎమ్మెల్యే బాలకృష్ణ నియోజకవర్గానికి కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చారని, మళ్లీ ఇక్కడి నుంచే పోటీ చేయాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీ పేర్కొన్నారు. ఆటోనగర్‌లో పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆయన ఎక్కడ ఉన్నా నియోజకవర్గ అభివృద్ధి గురించే ఆలోచిస్తుంటారన్నారు. హిందూపురం అన్ని కుల, మతాల సమ్మేళనమని అందరూ సోదరభావంతో మెలుగుతున్నారని నాయకుడు అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గత ఏడాది శ్రీకంఠపురంలో ఇరువర్గాల మధ్య చిన్నసంఘటనతో పలువురు కోర్టు చుట్టూ తిరుగుతున్నారని ఆ సమస్య పరిష్కరించాలని కోరారు

మైనార్టీల సంక్షేమమే ధ్యేయం... మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని నింకంపల్లిలో నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అక్కడికి సమీపంలోనే మసీదు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం బహిరంగసభలో ఉర్దూలో మాట్లాడి అక్కడి వారిని ఆకట్టుకొన్నారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా మానెంపల్లిలో రూ.21 లక్షలతో నిర్మించనున్న మసీదుకు భూమిపూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జామియా మసీదు ముతవల్లీ తహలక్‌ఖాన్, తెదేపా నాయకులు రామాంజనేయులు, శ్రీనివాసులు, అంజినప్ప, నజీర్, రోషన్ అలీ తదితరులు పాల్గొన్నారు.



మసీదు నిర్మాణానికి భూమిపూజ

ఐసీడీఎస్ ప్రాజెక్టు నూతన కార్యాలయం ప్రారంభం

పూలకుంట(హిందూపురం అర్బన్): దాదాపు రెండున్నర దశాబ్దాలుగా అద్దెభవనాల్లో కొనసాగుతున్న శిశు సంక్షేమ ప్రాజెక్టు కార్యాలయానికి శనివారం సొంత భవనం అందుబాటులోకి వచ్చింది. నాబార్డు నిధులు రూ.53లక్షలతో నిర్మించిన ఐసీడీఎస్ ప్రాజెక్టు నూతన కార్యాలయ భవనాన్ని శనివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుభద్రమ్మ, జడ్పీటీసీ ఆదినారాయణ, సీడీపీవో నాగమల్లీశ్వరి, ఏసీడీపీవో శ్రీలత, సర్పంచి హనుమంతరాయుడు, నాయకులు అశ్వర్థనారాయణరెడ్డి, ఆదిరెడ్డి, నాగభూషణం, ఉమాశంకర్‌రెడ్డి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తూ...

కాలమానిని ఆవిష్కరణ...

టేకులోడుక్రాస్(చిలమత్తూరు): ఎన్‌బీకే ఫ్యాన్స్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన కాలమానిని ఎమ్మెల్యే బాలకృష్ణ టేకులోడుక్రాస్‌లోని గురుకుల పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. ఎన్‌బీకే ఫ్యాన్స్ మాట్లాడుతూ బాలకృష్ణ చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలతో కాలామానిని రూపొందించినట్లు తెలిపారు. ఆల్‌ఇండియా ఎన్‌బీకే ఫ్యాన్స్ కన్వీనర్ నంబూరి సతీష్, మండల కన్వీనర్ నరేష్, మూర్తి, మహేంద్ర, మల్లి, అంజి, ఈశ్వర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి చదువులో రాణించాలి... ప్రతి విద్యార్థి చదువులో రాణించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎంజీఎం ఉన్నత పాఠశాలలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ గౌస్‌మోయిద్దీన్ విద్యార్థులకు రాతపుస్తకాలను ఎమ్మెల్యే అధ్యక్షతన అందజేశారు. పోటీ పరీక్షలకు అనుగుణంగా గ్రంథాలయాల్లో పుస్తకాలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో పాఠశాలో ప్రధానోపాధ్యాయిని జీవరత్న, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు వీరయ్య, తోటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కాలమానిని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే...

రైతులకు న్యాయం చేయండి

చిలమత్తూరు, న్యూస్‌టుడే: కొడికొండ నుంచి అగళి వరకు ఏర్పాటవుతున్న జాతీయరహదారిలో భాగంగా బైపాస్‌రోడ్డును చిలమత్తూరులో నిర్మించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధారెడ్డి పేర్కొన్నారు. స్థానిక సొసైటీ ఆధ్వర్యంలో మండల రైతులతో శనివారం సమావేశం ఏర్పాటుచేశారు. ఆయన మాట్లాడుతూ దేమకేతేపల్లి, వడ్డిచెన్నంపల్లి, తుమ్మలకుంట, చిలమత్తూరు, గాడ్రాళ్లపల్లి, మరవకొత్తపల్లి గ్రామాల్లో రహదారి కోసం రైతులు పొలాలను తీసుకోవటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రైతుల అనుమతి లేకుండానే సర్వే చేశారన్నారు. గ్రామంలోనే భవనాలు తొలగించి రోడ్డు వెడల్పు చేస్తే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయక కార్యదర్శి వినోద్‌కుమార్, రైతు సంఘం మండల కార్యదర్శి లక్ష్మినారాయణ, సీపీఎం డివిజన్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గర్భస్థ లింగనిర్ధారణ నేరం

చిలమత్తూరు, న్యూస్‌టుడే: గర్భస్థ లింగనిర్ధారణ నేరమని ఇన్‌ఛార్జి డాక్టర్ శ్రావణి పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆశ కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా లింగ నిర్ధారణ జరిగినా, అందుకు సహకరించిన వారిపైనా చట్టరీత్యా చర్యలు తీసుకుంటారన్నారు. జన్మభూమి కార్యక్రమంలో వైద్యసేవల్ని ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు గంగాధర్, శ్రీభారతి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

విద్యావికాసానికి కృషి



ప్రసంగిస్తున్న స్వాతంత్ర్య సమరయోధుడు వి.ఎన్.రెడ్డి

సేవామందిర్(పరిగి), న్యూస్‌టుడే: నిరుపేద విద్యార్థుల విద్యావికాసానికి ఏఎం.లింగణ్ణ అహర్నిశలు శ్రమించారని పలువురు వక్తలు ప్రశంసించారు. శనివారం సేవామందిర్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుడు వి.ఎన్.రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యపోరాట సమయంలో ఎందరో సమరయోధులకు ఆశ్రయం కల్పించి, రహస్య పోరాటాలకు నిలయంగా ఏర్పడిందే సేవామందిర్ అని పేర్కొన్నారు. సేవామందిర్ వ్యవస్థాపకుడు ఏఎం.లింగణ్ణ సమాధికి ప్రముఖులు నివాళులు అర్పించారు. సేవామందిర్ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుండటం హర్షణీయమన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కె.తిప్పేస్వామి, కార్యదర్శి కె.టి.శ్రీధర్, ప్రముఖ కవులు సడ్లపల్లి చిదంబరెడ్డి, మల్లెల నరసింహమూర్తి, ఈశ్వరయ్య, ఎస్ఎస్‌బీఎన్ విశ్రాంత ప్రధానాచార్యులు రమేష్‌నారాయణ, ఫణీంద్రబాబు, చాంద్‌బాషా, మండల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళ్యాణశర్మ

వైభవంగా కళ్యాణోత్సవం

ఆర్పీజీటీరోడ్డు(హిందూపురంగ్రామీణం):సమస్త సర్వమంగళానికిప్రతీక అశ్వర్థనారాయణ లక్ష్మీ కళ్యాణోత్సవమని మైసూరు అవధూత దత్తపీఠం వేదపండితుడు కళ్యాణశర్మ వ్యాఖ్యానించారు. హిందూపురం అనఘాదత్త ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక ఆర్పీజీటీ రోడ్డులోని అశ్వర్థకట్ట ప్రాంగణంలో అశ్వర్థకళ్యాణ మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. అశ్వర్థనారాయణ,లక్ష్మీ విగ్రహాలకు అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో అనఘాదత్త కమిటీ ప్రతినిధులు విశ్వేశ్వరయ్య, రాజేశ్వరిదేవీ, రామకృష్ణయ్య, దైవాధీనంరెడ్డి, సుబ్రమణ్యం, రాజారెడ్డి, రాజేష్, మానస, అనిత, సుజాత, అరుణ, సునందమ్మ, దత్తపీఠం వేదపాఠశాల పురోహితులు, ప్రముఖులు పాల్గొన్నారు.

హిందూపురం

బోరులారీ సీజ్

చేనేపల్లి(చిలమత్తూరు), న్యూస్‌టుడే: మండల పరిధిలోని చేనేపల్లిలో అనుమతిలేకుండా బోరు వేస్తున్న లారీని తహసీల్దార్ మారుతిప్రసాద్ జప్తు చేశారు. శనివారం గ్రామస్థులు సమాచారం మేరకు వీఆర్వో రాజేంద్ర, ఆర్ఐ భాస్కర్‌తో వెళ్లి వాహనాన్ని జప్తు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ బోరుబావులు తవ్వించుకోవాలంటే ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. లేదంటే అపరాధ రుసుము విధిస్తామన్నారు.

మఠాల్లో ద్వాదశ పూజలు

సంతేబిదనూరు(హిందూపురంగ్రామీణం), న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని సంతేబిదనూరు, కోటలో వెలసిన శ్రీరాఘవేంద్రస్వామి, శ్రీసత్య పారాయణ, శ్రీసత్యవర మఠాల్లో శనివారం ద్వాదశ పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం, పుష్పార్చన, అలంకార సేవ, ఆభరణాల అలంకరణ చేశారు. ఉత్సవ విగ్రహాలను పుష్పాలతో అలంకరించి గ్రామవీధుల్లో ఊరేగించారు.

ముగిసిన నిత్యాన్నదానసేవ

లేపాక్షి, న్యూస్‌టుడే: పాతూరులో వెలసిన అయ్యప్ప స్వామి సన్నిధిలో నెలరోజులకు పైగా నిర్వహించిన నిత్యాన్నదాన కార్యక్రమం శనివారంతో ముగిసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి నెలరోజుల పాటు బియ్యం అందించిన సర్పంచి జయప్ప, దాతలకు కమిటీ ప్రతినిధులు శ్రీనివాసులు, శశిధర్, బసవరాజు, నాగభూషణం, లక్ష్మిరెడ్డి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. ఏటా అన్నదాన కార్యక్రమం కొనసాగిస్తామన్నారు. ఆదివారం నుంచి రెండు రోజుల పాటు ఆంజనేయస్వామి ఆలయంలో ఇరుముడి కార్యక్రమం ఉంటుందని వివరించారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పరిగి ఇండియన్ డిజైన్స్ దుస్తుల తయారీ పరిశ్రమలో పనిచేస్తూ ఇటీవల తొలగించిన మహిళా కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని గార్మెంట్స్ వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆశోక్ డిమాండ్ చేశారు. నెలరోజుల వ్యవధిలోనే 1,500 మందిని తొలగించటంతో ఆ కార్మికుల కుటుంబాలు అవస్థలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

15వరకు మొక్కజొన్న కొనుగోళ్లు

రహమత్‌పూర్(హిందూపురంగ్రామీణం): హిందూపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో నిర్వహిస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రం కొనసాగింపునకు గడువు పెంచినట్లు వ్యవసాయశాఖ సహాయసంచాలకులు ఎం.రవికుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ హిందూపురం వ్యవసాయ డివిజన్ పరిధిలో రైతులు 20వేల హెక్టార్లలో మొక్కజొన్న సాగుచేశారన్నారు. గిట్టుబాటు ధరలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రెండునెలలుగా నిర్వహిస్తోందన్నారు. రైతు సంఘం నాయకులు, రైతుల డిమాండ్ మేరకు జనవరి 15 వరకు కొనసాగిస్తామన్నారు. హిందూపురం, గోరంట్ల, చిలమత్తూరు, పరిగి, లేపాక్షి మండలాల రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీ కోరారు.

సమస్యలు పరిష్కరించండి

హిందూపురం, న్యూస్‌టుడే: జిల్లాలో హోమ్‌గార్డులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వేతనాలు సరిపోవటం లేదని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని హోమ్‌గార్డుల యూనియన్ నాయకులు శ్రీధర్ శివ, తాజుద్దీన్, నిజాం తదితరులు కోరారు. ఎమ్మెల్యే బాలకృష్ణను హిందూపురంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. తెలంగాణాలో అమలుచేస్తున్న విధంగా హోమ్‌గార్డుల వేతనాలు పెంచాలని, విధులు నిర్వర్తిస్తున్న ప్రాంతంలోనే నివాస సదుపాయం కల్పించేలా చూడాలన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ప్రధానోపాధ్యాయుడి సేవలు ప్రశంసనీయం

గొరవనహళ్లి(పరిగి), న్యూస్‌టుడే: ఉపాధ్యాయుడిగా శివయ్య సుదీర్ఘ సేవలు అందించి అనేకమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం మండలంలోని గొరవనహళ్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శివయ్య పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ సమాజాన్ని మార్చేదిశగా విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యనారాయణ, ఎంఈఓ లక్ష్మీదేవి, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు రాజు, కొత్తచెరువు ఎంఈవో వెంకటరెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బి.శివన్న, యూటీఎఫ్ కార్యదర్శి మహంతేష్, నాయకులు నాగరాజు, వెంకటేశ్, అశ్వర్థప్ప, ఫణీంద్ర, గ్రామస్థులు, ఉపాధ్యాయులు మాధవి, సుకన్య, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.



శివయ్య దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది



లేపాక్షిలో దైనందిని, కాలమానిని ఆవిష్కరిస్తున్న ఎంఈవో తదితరులు



చిలమత్తూరులో యూటీఎఫ్ కాలమానిని ఆవిష్కరణ



ఏపీటీఎఫ్ కాలమానిని, దైనందిని...

విద్యారంగ పరిరక్షణకు కృషి

లేపాక్షి, న్యూస్‌టుడే: విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగిస్తున్నామని ఏపీటీఎఫ్ ప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఏపీటీఎఫ్ నూతన సంవత్సరం దైనందిని, కాలమానిని ఎంఈఓ నాగరాజునాయక్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ఉపాధ్యాయ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో ఏపీటీఎఫ్ ముందుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓరియంటల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేషగిరిబాబు, ఏపీటీఎఫ్ మండల గౌరవ అధ్యక్షుడు రహంతుల్లా, అధ్యక్షుడు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి విజయశేఖర్, ప్రతినిధులు ఇందిర, అడివన్న, ఫణిభూషణరావు, పురుషోత్తం, వరదన్న, ప్రభాకర్, యాకుబ్, నరసింహులు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఈవో సురేష్‌బాబు తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద యూటీఎఫ్, ఏపీటీఎఫ్ కాలమానిని, దైనందినిని విడుదల చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ కార్యదర్శి రవికుమార్, అధ్యక్షుడు బాలకృష్ణ, ఉపాధ్యాయులు సతీష్, చంద్రమౌళీ, నాగరాజు, బాబాజాన్, రవిశంకర్, చంద్రశేఖర్, యూటీఎఫ్ అధ్యక్షుడు నంజప్ప, కోశాధికారి లక్ష్మిపతి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రాఘవేంద్రరావు, సుబ్రమణ్యం, సాధిక్, అభిరామ్ పాల్గొన్నారు.



పరిగిలో యూటీఎఫ్ దైనందినిని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ తదితరులు



హిందూపురం ఎమ్మార్సీలో....

పరిగి: పరిగిలో శనివారం యూటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర దైనందినిని ఎంపీపీ సత్యనారాయణ, ఎంఈవో లక్ష్మీదేవి ఆవిష్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు కొనసాగిస్తోందన్నారు. యూటీఎఫ్ శాఖ మండల అధ్యక్షుడు డి.అశ్వర్థనారాయణ, కార్యదర్శి మహంతేష్, జిల్లా కార్యదర్శి ఓబులేశు, కోశాధికారి హఫీజ్‌ఖాన్, జిల్లా కౌన్సిల్ మెంబర్లు శంకరప్ప, జయేంద్ర, పద్మావతి, రామకృష్ణ, సుల్తాన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం అర్బన్: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) దైనందినిని శనివారం ఎమ్మార్సీలో ఎంఈఓ ఏహెచ్ గంగప్ప ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావ్యవస్థ బలోపేతానికి యూటీఎఫ్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మారుతిశ్రీనివాస్, అశ్వర్థప్ప, బాబు, చెన్నకేశవులు, బాబాఫక్రుద్దీన్, గంగిరెడ్డి, నాగమణి, ప్రభాకర్, ఇందిరమ్మ, హుస్సేన్‌పీరా, నాగభూషణం మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురసేవా యాప్‌తో సత్వర సేవలు

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదు చేయడానికి, మున్సిపల్ సేవలను సత్వరం పొందడానికి 'పురసేవా' యాప్‌ను వినియోగించాలని మున్సిపల్ కమిషనర్ భాగ్యలక్ష్మి కోరారు. కాలువలు నిండిపోవడం, శుభ్రం చేయకపోవడం, నీటి సరఫరా, రోడ్ల నిర్వహణ, వీధి దీపాల సమస్య తదితరవాటిపై ఫిర్యాదు చేయడానికి, భవన నిర్మాణ అనుమతులు, పన్నులు తదితర వాటికి యాప్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

- మున్సిపల్ పన్నుల చెల్లింపునకు వడ్డీ రాయితీ ఆదివారంలో ముగియనుందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఇంటి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలాల పన్నులను వడ్డీ లేకుండా ఆదివారం చెల్లించవచ్చని, ఇందుకోసం మున్సిపాలిటీలో ప్రత్యేక కౌంటర్ ఉంటుందన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న సంఘం జిల్లా అధ్యక్షుడు బాబావలి

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

హిందూపురం అర్బన్: భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక శ్రీనివాస ఐటీఐ వద్ద శనివారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పతాకాన్ని సంఘం జిల్లా అధ్యక్షుడు బాబావలి ఆవిష్కరించి మాట్లాడారు. విద్యను ప్రభుత్వాలు వ్యాపారంగా మార్చడంపై సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ నాయకులు పురుషోత్తం, ఈశ్వర్, హేమంత్, జగన్, జయచంద్ర, మారుతి, అశ్వర్థ, మధు, రాము, హరి కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అంకితభావంతో గుర్తింపు



శర్మ దంపతులను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ తదితరులు

లేపాక్షి, న్యూస్‌టుడే: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవచ్చని ప్రిన్సిపల్ భాస్కర్‌కుమార్ అన్నారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పీఎస్ఆర్‌కే శర్మ శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసి శర్మ అధికారుల మన్ననలు పొందారన్నారు. సమయపాలన పాటించడమే గాక, విద్యార్థుల ఉన్నతికి అహర్నిశలు శ్రమించారన్నారు. ఆయనతోపాటు సతీమణి రాజ్యలక్ష్మిని పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కొడికొండ చెక్‌పోస్టు(చిలమత్తూరు), న్యూస్‌టుడే: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని హిందూపురం ఎక్సైజ్ ఎస్ఐ సతీష్, స్టేట్ టాస్క్‌ఫోర్స్ బృందానికి చెందిన లక్ష్మినారాయణరెడ్డి పట్టుకున్నారు. శనివారం కోడూరు పంచాయతీ కొడికొండ చెక్‌పోస్టులో కర్ణాటక బాగేపల్లి నుంచి లాలేపల్లి, పెద్దన్నపల్లికి కొందరు అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు డిమాండ్

హిందూపురంఅర్బన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎన్ఎస్‌యూఐ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ సందర్భగా శనివారం సంఘం ప్రతినిధులు రఫీజ్, ముస్తకీం, భార్గవ్, జిలాన్, శ్రీకాంత్, విజయ్, బాబావలి, వినయ్ తదితరులు మాట్లాడారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేనందున గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు వేలాది రూపాయలు చెల్లించి ప్రైవేటు కళాశాలల్లో విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

EENADU THE WAY CLASSIFIEDS

BIRTHDAY GREETINGS

ప్రథమ జన్మదిన శుభాకాంక్షలు



చి॥ సుంకు సాయి జ్యోతి స్వరూప్
అనంతపురము

మా ముద్దుల చిన్నారి చి॥ సుంకు సాయి జ్యోతి స్వరూప్‌కు మా హృదయపూర్వక 1వ జన్మదిన శుభాశీస్సులతో.. మీ..

తల్లి: ఎస్.సుష్మ
తండ్రి: ఎస్.నరేష్
అక్క: ఎస్.భవాని
చెల్లి: ఎస్.లతిక
మామ: డి.దినేష్
వదిన: కె.ఉత్రేక్ష

అవ్వ - తాత



ఎస్.ఆదిలక్ష్మి - ఎస్.శేషయ్య
మరియు సమస్త బంధుమిత్రులు,
ATP. Cell: 9866667386



VEHICLES FOR SALE

2017 NEW ASHOK Leyland 51 Seaters 15,25,000/-. 2011 Leyland 210 Wheel Base 51 Seater 7,95,000/-. 2012 Swaraj Mazda 32 Seaters 6,95,000/-. Finance 75% available. ✆ 95333 31111.



ATP విజయనగర్ కాలనీ H.P. పెట్రోల్ బంకు నందు క్రెడిట్ కార్డ్స్, డెబిట్ కార్డ్స్ స్వైప్ చేసి అమౌంట్ ఇవ్వబడును. సంప్ర॥ 9966712149, 7396778592.

WANTED DEALERS/AGENTS

TV11 న్యూస్ ఛానల్ డెవలప్‌మెంట్ కొరకు సీమాంధ్రలో ఫైనాన్షియల్ పార్టనర్ కావలెను. ఆసక్తి ఉన్నవారు మాత్రమే ✆ 9390888606/ 8142322214

BUSINESS OFFER

అతితక్కువ పెట్టుబడితో ప్లాస్టిక్ వస్తువులు తయారుచేయు మిషన్‌లు కలవు. ముడిసరుకు ఇస్తాం, తయారైనవి మేమే కొంటాం. కుమార్ ఎంటర్‌ప్రైజెస్, Rjy, ✆ 93933 32227, (నో ఛార్జెస్).

Raghu Computers Special Offer New PC C2DUO, M.B., 4GB 500 HDD, Cabinet K.B. Mouse, 17 LED, 1Y Wrt. 9999 Only ATP. 8977079082.

40 సంవత్సరాలు చరిత్ర కలిగిన MNC (Multi National Company) లో Distributor లుగా గొప్ప అవకాశం. (For Health & Wealth) (No Investment) ✆ 84285 75969.

జిల్లా వ్యాప్తంగా GST సువిధ కేంద్రాలు ఏర్పాటు చేసి GST రిటన్స్ దాఖలు చేయుటకు దరఖాస్తులు/ఫ్రాంచైజ్‌లు కోరుచున్నాము. ✆ 94941 23514.

LED Lights తయారుచేస్తూ రోజూ అధిక ఆదాయం సంపాదించండి. రా మెటీరియల్ ఫ్రీ. బైబ్యాక్ అగ్రి 2yrs. No Processing Fee ✆ 7840075254/ 7210864919

PACKERS & MOVERS

హనుమాన్ ప్యాకర్స్ & మూవర్స్, మీరు ఇల్లు మారాలనుకుంటున్నారా? వెంటనే సంప్రదించండి. రామ్‌నరేష్ ఫంక్షన్‌హాల్, హౌసింగ్‌బోర్డ్ కాలనీ, అనంతపురం. Ph: 8790704204.



SPOKEN ENGLISH

మీ ఇంట్లో ఉంటూ ప్రతిరోజు 1 గం॥ ఫోన్ ద్వారా ఇంగ్లీష్ నేర్చుకోవాలనుకుంటున్నారా? (5 am to 11 pm). మీ ఇంట్లోనే హోమ్ ట్యూషన్ లేదా ఇన్స్టిట్యూట్‌లో ట్రైనింగ్ కొరకు ✆ 9440741997. (sin: 2006)

DISTANCE EDUCATION

BNYS, BPT, B.Sc, MLT, DMLT, all Para Medical Cources and all Degrees & P.G 100% pass ✆ 89773 59598.



AYURVEDIC

సిగరెట్లు, మందు త్రాగడం మాన్పించడానికి ఆయుర్వేద మందులు లభించును. అమూల్య ఆయుర్వేద హాస్పిటల్, సెల్: 9440785957.



FLAT FOR SALE

నవ్యాంధ్ర రాజధాని అమరావతి నందు గేటెడ్ కమ్యూనిటీలో 1BHK 10 లక్షలు, 2BHK 14 లక్షలు, 15 లక్షలు, 18 లక్షలు ఎమినిటీస్ + ✆ 81010 10169, 81010 10168.

HOUSE FOR SALE

ATP, బళ్ళారి రోడ్డు, M.G.పెట్రోలు బంకు వెనుక భాగంలో 67x18 కొలత, 5 రూములు గల ఇల్లు అమ్మకానికి కలదు. కాంపౌండ్, నీటి వసతి కలదు. Ph: 9000108510.

ATP సాయినగర్ 5th క్రాసు పావని హాస్పిటల్ లైన్లో 12x90 చదరపు అడుగుల్లో గల ఇల్లు అమ్మబడును. ఆఫీసు/క్లీనిక్‌లకు అనుకూలం. Ph: 9966354262.

అపార్ట్‌మెంట్ ధరలకే ఇండిపెండెంట్ ఇండ్లు. తారు రోడ్లు, ఇరువైపుల చెట్లు, వీధి దీపాలు, డ్రైనేజీ, నీటి వసతితో కూడిన సదుపాయాలతో పూర్తి వాస్తు మోడ్రన్ ఎలివేషన్స్‌తో 50 ఇండ్లు గృహసముదాయము, ATP. కళ్యాణదుర్గం రోడ్‌లో కలదు. 9063552577, 8978672705.

LAND FOR SALE


134 ఎకరాల పండ్లతోట నెల్లూరు జిల్లా ఒజిల్ మండలం ఆర్మేనుపాడు గ్రామం NH 15 కు దగ్గర్లో సూర్యవనం అమ్మకం. 94401 83778, 94917 79999.

హిందూపూర్ హైవేకి కొల్లకుంట ఎదురుగా స్పిన్నింగ్ మిల్లు పక్కన, ఎకరా 30 సెంట్లు, మోదాలో 2 ఎకరాలు, హిందూపూర్‌లో పలుచోట్ల స్థలాలు అమ్మబడును. Ph: 7396287983.

PLOT FOR SALE

శంషాబాద్, షాద్‌నగర్, కొత్తూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, జడ్చర్ల, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో Open Lands, Plots అమ్మబడును/ కొనబడును. ✆ 9848589182/ 9392303122

హైదరాబాద్ పెద్దఅంబర్‌పేట్, హయత్‌నగర్, కొహెడ, జనచైతన్య, శ్రీమిత్ర, అ॥మెట్, బాటసింగారం, తుర్కయాంజాల్, శంషాబాద్‌లో ప్లాట్లు కొనబడును. ★ రవి 9347454990/ 9849454990



ATP కొవ్వూర్‌నగర్ విద్యారణ్య స్కూల్ ప్రక్కన తూర్పు ముఖం, Ist ఫ్లోర్, డబుల్ బెడ్‌రూం పార్కింగ్ వసతి కల ఇల్లు ఆఫీస్/ఫ్యామిలీలకు బాడుగకు కలదు. సంప్ర॥ 9573487517, 9849688706.

ATP అరవిందనగర్ 3rd క్రాసు, BJP ఆఫీసు దగ్గర ఉత్తర ముఖం, విశాలమైన కాంపౌండ్ గల గ్రౌండ్ & 1st ఫ్లోర్ (2 BHK) ఇల్లు ఆఫీసు/ఫ్యామిలీకి బాడుగకు ఇవ్వబడును. Ph: 08838619575.

ఇండిపెండెంట్ హౌస్ 3 బెడ్‌రూము ఇల్లు బాడుగకు కావలెను. Rent: 15,000 నుండి 18,000 లోపు. తూర్పు, ఉత్తరం ఫేసు ప్రాధాన్యత. ఏరియాలు అరవిందనగర్, రామ్‌నగర్, మారుతీనగర్, కోవూరునగర్, శ్రీనగర్ కాలనీ. సంప్ర॥ 9966641335.

ATP నందు సుభాష్‌రోడ్డులో LIC ఆఫీసు ఎదురుగా ఉన్న దిలీప్ కాంప్లెక్స్‌లో 1st ఫ్లోర్‌లో గల హాల్ బాడుగకు ఇవ్వబడును. Ph: 9848859497.

కళ్యాణదుర్గం రోడ్డు, మిలిటరీ క్యాంటీన్ వెనుకభాగంలో గ్రౌండ్‌ఫ్లోర్, 1st ఫ్లోర్ (2 BHK) కొత్త ఇల్లు బాడుగకు కలదు. నీటి వసతి, కారు పార్కింగ్ సౌకర్యం కలదు. Ph: 8309775513.



వృద్ధాశ్రంలో మంచానవున్న వృద్ధులకు సేవ చేయుటకు ఆయాలు, స్త్రీ/పురుషులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీతం: 8 to 10 వేలు. ✆94936 36855, 89779 27555.

Wanted Experienced Marketing Executives to work for a reputed Publishing Company and willing to Travel Ananthapuram District. Interested candidates can apply online at http://www.smartkidsindia.com/careers

Wanted Civil Engineer with Diploma or Degree for Preparing Valuation report & Estimates and Drawings, HDP Contact: 9390020348.

కావలెను: హిందూపురం కళ్యాణదుర్గం ప్రాంతాలలో సోనాలిక ట్రాక్టర్స్ షోరూమ్ నందు పనిచేయుటకు Sr మెకానిక్స్, Sr సేల్స్ మేనేజర్స్, ఫీల్డ్ పర్సన్స్ కావలెను. అర్హత, అనుభవం బట్టి జీతం. Call: 7799951005, 9966982888, 7799951001.

హిందూపురంలో బెడ్‌పైన ఉన్న పెద్దఆమెను చూసుకోవడానికి ఇంటిపని & వంటపని చేయుటకు అనుభవంగల ఆడమనిషి కా॥. భోజన వసతితోపాటు జీతం ఇవ్వబడును. Ph:79893 21471, 9618772353.

అనంతపురంలో మావిల్ ఇండస్ట్రీస్ నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. Ph: 9177130305, 9704277073.

రాజు రోడ్ గీతా రెసిడెన్సీ నందు పనిచేయుటకు రిసెప్షనిస్టు కావలెను. కంప్యూటర్ నాలెడ్జ్ ఉన్న వారికి ప్రాధాన్యత. మంచి జీతం ఇవ్వబడును. సంప్ర: 9948266888.

ప్రముఖ హోర్డింగ్ సంస్థకు ఆయా జిల్లాలలో వర్క్ సూపర్‌వైజర్లు కావలెను. (ఇంటర్/ITI Civil). అనుభవముబట్టి జీతము. ✆ 99634 71011. మెయిల్: kalyaniadsresumes.1986 @gmail.com

హైదరాబాద్‌లోని ఒక చిన్న కుటుంబానికి ఇంటిలో ఉండి పసిబిడ్డను చూసుకోవటానికి మరియు వంట చేయటానికి ఇద్దరు మహిళలు కావలెను. వయసు 30 సం॥లు, అనుభవం 2-3 సం॥లు, జీతము: 10,000 - 12,000, 9848069663కు కాల్ చేయండి.

హిందూపురం ప్రాంతంలో కణ్వ ఫ్యాషన్స్ నందు మార్కెటింగ్ నందు అనుభవంగల వారికి ప్రాధాన్యత. సంప్రదించవలసిన నెంబర్లు 8247489815, 7799119617.

బ్యూటిషియన్ మరియు మెడికల్ స్టోర్‌లో పనిచేయుటకు మహిళ అభ్యర్థులు కావలెను. సంప్రదించండి. సెల్: 9440785957.

బెంగళూరులో లిమిటెడ్ కంపెనీలకు స్త్రీ/పురుష అభ్యర్థులు కావలెను. మంచి జీతం భోజనం+వసతి. దీపా.వి (రేవతి కెరీర్ సొల్యూషన్స్) ✆: 8951010695, 7795550027.

రాప్తాడు IOC పెట్రోల్‌బంకు నందు పనిచేయుటకు పంపుబాయ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. Ph: 9440270324, 8105121521.

APలోని అన్ని పట్టణాలలో సుమధుర ఫుడ్ ప్రొడక్ట్స్ మార్కెటింగ్ చేయుటకు రిప్రజెంటేటివ్స్ కావలెను. sumadhurafoods@yahoo.com ✆ 90596 80822.

ఖాదీ గ్రామోద్యోగ్ (KVIC, Govt. of India) ఆధ్వర్యంలో పని చేయుటకు సేల్స్ ఆఫీసర్స్ మరియు ఏజెన్సీ నిర్వహించు నైపుణ్యం కలిగిన వ్యక్తులు కావలెను. ✆ 95335 55588

విజయవాడలోని ప్రముఖ డిజిటల్ కలర్ ల్యాబ్‌కు ధర్మవరంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కావలెను. Q: 10th పాస్/ ఫెయిల్. జీతం: 10 వేలు + ఇన్సెంటివ్స్ + అలవెన్సు. 2 వీలర్ మస్ట్ ధర్మవరం ప్రాంతంవారికి ప్రాధాన్యత. ✆ 96039 48999.

Pharmacist (Certificate) Wanted for a Medical Shop Opening Shortly at Anantapur City. Contact with details. 9441355500.

అనంతపురంలోని ప్రముఖ సత్యసాయి ఇంటీరియర్స్ నందు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. పోలీస్ వెల్ఫేర్ కాంప్లెక్స్ ప్రక్కన, ATP. 9440465643.

అనంతపురం RTC బస్టాండు దగ్గరలో ఉన్న శాంతి నర్సింగ్‌హోమ్‌లో పనిచేయుటకు అనుభవం గల నర్సులు కావలెను. సంప్ర॥ 9440549184.

MUDAR Indian Export నందు Lady Office Staff with M.S.Office & Internet Knowledge, English & Hindi Language are invited to attend personal interview with prior appointment. Ph: 9393710640.

SVR రియల్ ఎస్టేట్ నందు పనిచేయుటకు తాడిపత్రి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, యాడికి చుట్టుపక్కల గ్రామాలవారీగా మార్కెటింగ్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. కమీషన్ + ఇన్సెంటివ్ + భోజనవసతి కలదు. రిటైర్డ్ ఉద్యోగులు, LIC ఏజెంట్స్ & నిరుద్యోగులకు సువర్ణ అవకాశం. Ph: 7013623545, 9347325599.

రిలయన్స్ లైఫ్ కంపెనీ నందు P/F Time ఫైనాన్షియల్ అడ్వైజర్స్‌గా పనిచేయుటకు అభ్యర్థులు కావలెను. Q: డిగ్రీ/ P.G., Age: 25Y పైన. గృహిణులు/ రిటైర్డ్ ఉద్యోగులకు అవకాశం. 9182419225.

సిద్దప్ప జ్యూవెలర్స్ పాతవూరు షాపు నందు పనిచేయుటకు సేల్స్ గర్ల్స్ కావలెను sal:6000 Time 10.00am to 2.00pm, 3.30pm to 8.30 pm, ATP. 9440011394, 7569281888.

ATP రితి జ్యువెలర్స్ నందు పనిచేయుటకు టెలీకాలర్స్ కావలెను. (లేడీస్) అర్హత: డిగ్రీ పాస్. జీతం: 8,000/- + ఇన్సెంటివ్. ఇంటర్వ్యూ తేది: 2-1-18. 8919274376, 08554-222916.

MARKETING / SALES

సేల్స్ ఏజెంట్స్ కావలెను. ఆధునికంగా మన సంస్కృతిని కాపాడుకుందాం అన్ని శుభకార్యాలకు వేద ఆశీర్వచనాన్ని మీ సందేశంతో పాటు వీడియోద్వారా పంపించండి. FB/ వాట్సాప్‌లో షేర్‌చేసుకోండి. Ph: 9701763388

FACULTY / TEACHERS

పామిడి పట్టణము నందు 1 to 7th E.M. స్కూల్ నందు ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులు బోధించుటకు టీచర్లు కావలెను. Ph: 8919039395, 7075695613.

Wanted Teaching Staff (Lecturers) for all Subject for Junior and Senior Intermediate and P.R.O's. Interview on 31-12-2017. (Time: 10.00 A.M to 1.00) Sri New Chaitanya Junior College, Guntakal. Contact: 9703563628, 7013827351.

MEDICAL

Wanted M.S. Ortho Surgeon and B.Sc GNM or ANM Nurses for 50 Bed Multi Speciality Hospital Accommodation with Attractive Salary. Cont: 91820 95551.

Medical Rep. Job మెడికల్ రిప్రజంటేటివ్ తెలుగు, ఫ్రెషర్ లేదా అనుభవం గల వారు కావలెను. సంప్ర: Contact Cell Number 9206710477, Email: phamsonpharma@yahoo.com



శ్రీరేణుకా ట్రావెల్స్ 6 రోజులు 24-12-17, 23-1-18 భద్రాచలం, పాపికొండలు, అన్నవరం, పంచారామలింగాల దర్శనం. 24-1-18, 4 రోజులు భద్రాచలం, పాపికొండలు, అన్నవరం. 1-2-18, 4 రోజులు రామేశ్వరం, మధురై, తంజావూర్, అరుణాచలం. 6-2-18, 14 రోజులు కాశి, కలకత్తా, నైమిశారణ్యం, బిరిజాదేవి శక్తిపీఠం. 27-2-18, కాశి విమాన ప్రయాణం 6 రోజులు. ప్యాకేజీ, కాశీలో 9 రాత్రుల నిద్ర. 26-4-18, 15-5-18, 16 రోజులు చార్‌ధామ్ యాత్ర. అడ్వాన్స్‌గా బుకింగ్ జరుగుచున్నది. సంప్రదించండి. 9440556717, 9010913344, 08554-246717.

Your Powerful 5 Lines Classified Ad will cost you Rs.230/- Extra 5% GST



వేలం వేస్తున్న ఆరోగ్య అధికారులు

శీతలీకరణ యంత్రాల వేలం

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: జిల్లా వైద్య, ఆరోగ్య కార్యాలయంలో కొన్నేళ్లుగా వృధాగా పడిఉన్న శీతలీకరణ యంత్రాలు, పెట్టెలను వేలం వేశారు. శని వారం డీఎంహెచ్ఓ నివాస సముదాయ ఆవరణలో వేలం పాట నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ అని ల్‌కుమార్, డీఐఓ డాక్టర్ పురుషోత్తం, రాష్ట్ర శీతలీకరణ అధికారి దేవనందం తదితరుల సమక్షంలో ఈ ప్రక్రియ సాగింది. మొత్తం 36 మంది గుత్తేదారులు వేలం పాటలో పాల్గొన్నారు. 302 లీటర్ల సామర్థ్యం కల్గిన ఐఎల్ఆర్ ఒకటి, 70, 142, 144 లీటర్లు కల్గిన ఐఎల్ఆర్‌లు 40, డీఫ్రిజిరేటర్లు 32, స్టెబిలైజర్లు 22 ఉన్నాయి. వీటన్నింటిని వేలం వేశారు. మొత్తం రూ. 81,250 వేలం పాడారు. గుత్తేదారులు ముందుగా రింగ్ కావడంతో తక్కువగా వేలం పాట సాగింది.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

9 మందికి ఉద్యోగాలు

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: వెలుగు- ఈజీఎం సంయుక్త సారథ్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాలలో అపోలో ఆరోగ్య సంస్థ తొమ్మిదికి ఉద్యోగ అవకాశం కల్పించింది. ఎక్విప్‌మెంట్ ఆప్తమాలజీగా నియమిస్తూ ఆఫర్ లేఖలను అందించారు. శనివారం డీఆర్‌డీఏ-వెలుగు పీడీ కేఎస్ రామారావు తన కార్యాలయంలో ఆ తొమ్మిది మందికి నియామక లేఖలను అందించారు. ఈ కార్యక్రమంలో జేడీఎం సూర్యనారాయణ, ఆపోలో కంపెనీ ప్రతినిధులు సురేష్, రామాంజనేయులు, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లు మునీంద్ర, మహేష్ పాల్గొన్నారు.

మద్యం దుకాణానికి దరఖాస్తులు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో మిగిలిన మద్యం దుకాణం, బార్లకు మూడో విడతలో భాగంగా అబ్కారీశాఖ దరఖాస్తులను ఆహ్వానించింది. శనివారంతో దరఖాస్తు గడువు ముగిసింది. అనంత గ్రామీణం కందుకూరు మద్యం దుకాణానికి 33 దరఖాస్తులు వచ్చాయి. రాయదుర్గంలో రెండు బార్లకు రెండు దరఖాస్తులు వచ్చాయి. ధర్మవరంలో రెండు బార్లకు ఒక్కటీ దరఖాస్తు దాఖలు కాలేదు.

కిక్కు.. తేకుమా చిక్కు!

(మొదటి పేజీ తరువాయి)

నూతన వెలుగులు పరిఢవిల్లేది.

దూకుడు తగదు...

జిల్లా కేంద్రంలోని గడియార స్తంభం కూడలితోపాటు ప్రధాన కూడళ్లలో యువత అధిక సంఖ్యలో చేరుకొని కేక్ కట్ చేసి అక్కడికి చేరిన వారిపై విసిరి గేలి చేస్తారు. నూతన సంవత్సర స్వాగతం అంటూ యువతీ యువకులతో చేతులు కలిపి గోల చేస్తారు. యువతులను వెక్కిరిస్తుంటారు. నూతన వేడుకల్లో గేలి అధికమైతే అపార్థానికి దారి తీస్తుంది. ఆపై దూకుడుగా వ్యవహరిస్తూ ఏటా అర్ధరాత్రి వేడుకల్లో గాయాలపాలై ప్రాణాలు కోల్పోతున్నారు.

అర్ధరాత్రి దాకా మద్యం విక్రయాలు..

ఏటా డిసెంబరు 31న అర్ధరాత్రి దాకా మద్యం విక్రయాలకు ప్రభుత్వం అనుమతిస్తుంది. ప్రస్తుతం నేడు (ఆదివారం) కూడా మద్యం దుకాణాలు అర్ధరాత్రి 12 గంటల వరకు, బార్లు 1 గంటల వరకు అనుమతిస్తూ అబ్కారీశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మందుబాబులు మద్యం తాగి హల్‌చల్ చేసే వీలుంది. ఇలా మత్తు తగ్గకుండా మద్యం తాగుతూ రోడ్డు డివైడర్లపైనా, వీధి దీపాలపైనా, హోర్డింగులపైనా రాళ్లు రువ్వడం వంటి పోకిరీ చేష్టలకు పాల్పడుతుంటారు. రాత్రి పొద్దుపోయిన తర్వాత మద్యం తాగిన వారు ఇంటికి వెళ్లేలా పోలీసులు చూడగలిగితే కొంత వివాదం వైపు సంబరాలు వెళ్లకుండా ఉంటాయి. మద్యం తాగి వాహనాలను నడిపే వారిని పూర్తిగా నియంత్రించాలి. ఒక్క రోజే కదా అని విచక్షణా రహితంగా మద్యం తాగి గేలి చేస్తే అదే ఆఖరి రోజు కావచ్చు. మద్యం దుకాణాలు, బార్లలో పొద్దుపోయే దాకా మద్యం తాగిన వారు తిరిగి రోడ్డుపైకి చేరితే యువత కేరింతల్లో అల్లరి కిక్కు ఎక్కేస్తుంది.

2014 డిసెంబర్ 31: నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ అనంతపురంలోని గడియార స్తంభం కూడలి వద్ద యువత కేరింతలు వేసింది. ద్విచక్ర వాహనాలు రయ్‌మంటూ పరుగులు తీశాయి. వాహనాలను సైలెన్సర్లు తొలగించడంతో ఏ వాహనం ఎటు వైపు నుంచి వస్తుందో తెలియని పరిస్థితి. ఈ గందరగోళంలో నగర పాలక సంస్థ ఉద్యోగి.. వేణుగోపాల్‌నగర్‌కు చెందిన నరసింహారెడ్డి గడియారం కూడలిలో రోడ్డు మధ్యన ఐల్యాండ్‌పై విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఓ వాహనం ఢీ కొంది. తలకు తీవ్రంగా గాయం కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. అతడి కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. ద్విచక్ర వాహనాన్ని నిర్లక్ష్యంగా వేగంగా నడుపుతూ వ్యక్తి మృతికి కారణమైన జనశక్తినగర్‌కు చెందిన వంశీకృష్ణపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

2015 డిసెంబర్ 31: రాత్రి 11.45 గంటలకు అంతకు ముందు ఏడాది దుర్ఘటనకు బాధ్యుడైన వంశీకృష్ణ ద్విచక్ర వాహనాన్ని వేగంగా నడుపుతూ రోడ్డు పక్కన గోడను ఢీ కొట్టాడు. సరిగ్గా ఏడాది గడిచేసరికి అదే సమయానికి నిమిషం కూడా తేడా లేకుండా వంశీకృష్ణ కూడా స్వీయ తప్పిదంతో తానే వాహనాన్ని నడుపుతూ గోడను ఢీ కొట్టి దుర్మరణం పాలయ్యాడు. ఈ విషాదం చర్చనీయాంశంగా మారింది. వంశీకృష్ణ జలశుద్ధి పాంటులో నీటిని బట్వాడా చేసే సిబ్బందిగా పని చేసేవాడు. వంశీకృష్ణ మృతితో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

నగర పాలక ఆస్తులకు నిఘా..

యువత నూతనోత్సాహంతో రోడ్డు డివైడర్లు, వీధి దీపాలు, హోర్డింగులు, ఇతర నగర పాలక సంస్థ ఆస్తులను ధ్వంసం చేస్తుంటారు. నగర పాలక సంస్థ ఆస్తులను కాపాడటానికి డిసెంబరు 31న ఉద్యోగులను కూడళ్లు, ప్రధాన రహదారుల్లో విధులకు కేటాయిస్తారు. యువత ఆస్తులను ధ్వంసం చేయకుండా నివారించడానికి ఉద్యోగులు ఏటా నిఘా ఉంచుతున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం నగరంలో సుమారు 300 పైగా కెమెరాలు పని చేస్తున్నాయి. దీంతో అన్ని కూడళ్లలో ఎవరు ఏం చేస్తున్నారో జిల్లా పోలీసు కార్యాలయంలోని సీసీ కెమెరాల నియంత్రణ గదిలో పోలీసులు పర్యవేక్షిస్తూ నిఘా ఉంచాలని నిర్ణయించారు. దీంతో యువత ఏదైనా అవధులు దాటినా సీసీ కెమెరాల ఆధారంగా కేసులు నమోదు చేయనున్నారు. దీంతో కొంత విధ్వంస ప్రక్రియకు అడ్డుకట్ట పడుతుందని పోలీసులు భావిస్తున్నారు.

ప్రాణాలు బలిగొన్న వేగం



భాస్కర్.. స్వస్థలం హిందూపురంలోని చౌళూరు. హిందూపురంలోని ఓ కళాశాలలో ఎంబీఏ చదువుతున్నాడు. 2016 డిసెంబరు 31న రాత్రి పొద్దు పోయే వరకు మిత్రులతో కలిసి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నాడు. ఆదివారం వేకువ జామున హిందూపురం నుంచి ద్విచక్ర వాహనంపై చౌళూరుకు వెళ్తుండగా సంతేబిదనూరు వద్ద వాహనం అదుపుతప్పి అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. ఎదిగొచ్చిన బిడ్డ ఊహించని దరిమిలా దుర్మరణం పాలవడంతో అయినవారు పుట్టెడు దుఃఖంతో కుప్పకూలారు.

నిఘా ఉంది.. జాగ్రత్త

- అశోక్‌కుమార్, ఎస్పీ



నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పిల్లల నుంచి వృద్ధుల దాకా మహిళలు అందరూ సమష్టిగా సందడి చేసుకుంటే మంచిదే. వివాదాలకు దారి తీయకుండా చేసుకోవాలని జిల్లావాసులకు చెబుతున్నాం. పిల్లలు ఎక్కడైనా విందు చేసుకుంటున్నారని తెలిస్తే మద్యం తాగుతున్నారా? లేదా? అనే అంశంపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి. పిల్లలను ఎక్కడికీ పంపకుండా తల్లిదండ్రులతో కలసి ఇంటిలోనే వేడుకలు నిర్వహించుకుంటే బాగుంటుంది. యువత మద్యం తాగి వాహనాలు నడపవద్దని చెబుతున్నాం. ఒకే ద్విచక్ర వాహనంపై ముగ్గురు కూర్చొని ప్రయాణం చేయడం వంటివి పూర్తిగా నిషేధం. వేడుకల్లో మద్యం మత్తులో వాహనాలు నడపకుండా ప్రతి కూడలిలోనూ వాహన చోదకులకు శ్వాస పరీక్షలు నిర్వహిస్తాం. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. నగరంలో ఆస్తుల పర్యవేక్షణకు, వేడుకల్లో పోకిరీలను సీసీ కెమెరాల్లో పర్యవేక్షిస్తాం. ఎవరైనా వేడుకల్లో అఘాయిత్యాలకు, పోకిరీ చేష్టలకు పాల్పడితే సీసీ కెమెరాల ఆధారంగా కఠినంగా వ్యవహరిస్తాం.



మౌఖిక పరీక్ష నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

లబ్ధిదారుల ఎంపిక పూర్తి

లక్ష్మినగర్, న్యూస్‌టుడే: ఎన్‌ఎస్‌ఎఫ్‌డీసీ పథకం కింద రూ.10 లక్షల విలువైన యూనిట్లను పొందేందుకు ధరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ముగింది. శనివారం అనంతలోని పెన్నార్‌భవన్ ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఎంపిక కమిటీ సభ్యులు ఈడీ రామునాయక్, వ్యవసాయశాఖ ఏడీ విద్యావతి, పశువర్ధకశాఖ ఏడీ నాగార్జునరెడ్డి, ఏపీ టెక్ ఆర్డీ నూర్‌మహ్మద్, పరిశ్రమశాఖ ఐపీఓ ఓబులేసు మౌఖిక పరీక్ష నిర్వహించారు. ఈ పథకం కింద 14 యూనిట్లు ఉండగా సుమారు 290 మంది దరఖాస్తు చేసుకున్నారు. 243 మంది పరీక్షకు హాజరైనట్లు ఈడీ తెలిపారు. ఎంపికైన లబ్ధిదారుల జాబితాను త్వరలో వెల్లడిస్తామన్నారు.

పింఛన్‌దారుల వేలిముద్రల సేకరణ

రాంనగర్(అనంతపురం): ప్రభుత్వ పింఛన్‌దారులు బయోమెట్రిక్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్ పొందే సదుపాయం కల్పించినట్లు జిల్లా అధ్యక్షుడు పెద్దన్న గౌడ్ తెలిపారు. పింఛన్‌దారుల సంఘంలో సభ్యత్వం కలిగిన వారు గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు తీసుకువచ్చి పింఛన్‌దారుల భవనంలో నమోదు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.



నాన్‌బోర్డర్లు కనిపిస్తే కేసులే

ఎస్.కె.విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ఎస్కేయూ వసతి గృహాల్లో నాన్‌బోర్డర్లు కనిపిస్తే క్రిమినల్ కేసులు తప్పవని ఉపకులపతి రాజగోపాల్ హెచ్చరించారు. శనివారం వర్సిటీలో యంత్రాంగంతో సమీక్ష నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ నాన్‌బోర్డర్ల ఏరివేతకు పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. అయితే కొన్ని వసతి గృహాల్లో నాన్‌బోర్డర్లు ఉన్నట్లు సమాచారం ఉందని, ఎప్పుడైనా తనిఖీలు చేసి, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జనవరి 1, 2 తేదీల్లోపు విద్యార్థులందరికీ గుర్తింపు కార్డులు అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ లజపతిరాయ్, రిజిస్ట్రార్ సుధాకర్‌బాబు, చీఫ్ వార్డెన్ విజయకుమార్, వివిధ కళాశాలల ప్రధానాచార్యులు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న ఉపకులపతి రాజగోపాల్

బీసీ గణన చేపట్టాలి

మారుతీనగర్(అనంతపురం): బీసీ కులగణన ప్రభుత్వం వెంటనే చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బీసీ కులగణన చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. బీసీ జనాభాపై కచ్చితమైన లెక్కలు వెల్లడి కావడం లేదని, శ్వేత పత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో స్వరూప్‌బాబు, రామ్మోహన్, రమేష్, సుబ్బరాయుడు, శకుంతలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమ్మ గలగల.. అనంత కళకళ

● కరవుతీరా కరుణించిన వరుణుడు ● కియా రాకతో పారిశ్రామిక పరుగు







ఒకటి కాదు.. రెండు కాదు.. గడచిన 14 ఏళ్లలో జిల్లాలో కరవు విలయతాండవమాడింది. సాగునీటి మాట అటుంచితే తాగునీటికి సైతం కటకటలాడాల్సిన పరిస్థితి. వరుణుడి కరుణలేక.. వాన జాడ లేక.. రైతులు చేయని పూజల్లేవు.. మొక్కని దేవుడు లేడు. ఇదంతా గతం.. అవును 2017 జిల్లా చరిత్రలో లిఖించదగిన సంవత్సరం. దేవుడి కరుణకు తోడు.. పాలకుల శ్రమ ఫలించడంతో జిల్లాలో కృష్ణమ్మ బిరబిరామంటూ పరుగులు పెట్టింది. పాతాళ గంగమ్మ గలగలమంటూ పైకి ఉబికి వచ్చింది. తుంగభద్ర ఎగువ కాలువ (టీబీ హెచ్చెల్సీ), హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టులు జిల్లాకు వరంగా మారాయి. ఇక కియా కార్ల పరిశ్రమ రాకతో ఇటు పారిశ్రామికంగానూ జిల్లా దశ తిరిగింది. 600 ఎకరాల్లో 13 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో కార్ల తయారీ పరిశ్రమ పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీనికి అనుబంధంగా పదుల సంఖ్యలో పరిశ్రమలు వెలుస్తున్నాయి. రాప్తాడు సమీపంలో జాకీ దుస్తుల పరిశ్రమ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. సోమందేపల్లి, గోరంట్ల, హిందూపురం పరిసర ప్రాంతాల్లో భారీ పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. వీటన్నిటికి అంకురార్పణ జరిగింది 2017 సంవత్సరమే కావడం విశేషం. వర్షాకాలంలో కాలానుగుణ వ్యాధుల కారణంగా కొందరు మరణించడం, డిసెంబరు చివర్లో రెండు హత్యలు చోటు చేసుకోవడం కొంత కలవరపరచినా.. మొత్తంగా 2017 సంవత్సరం జిల్లాకు కలిసొచ్చిందనే చెప్పొచ్చు.

- న్యూస్‌టుడే, ఉరవకొండ పట్టణం, యాడికి, అనంతపురం (శ్రీనివాస్‌నగర్), అనంతపురం జిల్లా పరిషత్

తారలు దిగివచ్చిన వేళ...

నగరానికి వివిధ సందర్భాల్లో సినీతారలు తరలివచ్చి సందడి చేశారు. ప్రణీత, పూనమ్‌కౌర్, రెజీనా, తమన్నా, కాజల్‌లు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే కథానాయకులు నాని, రాణా, శర్వానంద్‌ల సినిమాలు ఇక్కడే షూటింగ్ జరుపుకొన్నాయి.

అక్షర వెలుగులకు శ్రీకారం

జనవరి

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్న ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో మరో 500 పిల్లలను దత్తత తీసుకొనే బృహత్తర క్రతువుకు తొలి అడుగు పడింది. ఇంతటి చక్కని కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు స్పెయిన్‌కు చెందిన మారథాన్ జువాన్ మానువెల్. కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనపల్లిలో అంతర్జాతీయ రిలే అల్ట్రా మారథాన్‌కు శ్రీకారం చుట్టారు. 36 మంది స్పెయిన్ అథ్లెట్లు, 12 మంది స్థానిక అథ్లెట్లతో కలిసి 170 కిలోమీటర్ల మారథాన్‌ను నిర్వహించారు. తద్వారా 500 మంది విద్యార్థులను స్పెయిన్ దేశస్థులు దత్తత తీసుకొని వారికి విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించారు.



మారథాన్‌లో పాల్గొన్న జువాన్ మానువెల్, మాంచో ఫెర్రర్ తదితరులు

అనంత టు అమరావతి

ఫిబ్రవరి

జిల్లా కేంద్రమైన అనంతపురం నుంచి రాష్ట్ర రాజధాని అమరావతికి నిర్మించే నాలుగు, ఆరు వరుసల రహదారి నిర్మాణంపై ఫిబ్రవరిలో ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. 373 కిలోమీటర్ల మేర మలుపులు లేని రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రాయలసీమ జిల్లాలకు చెందిన ప్రజలు తక్కువ సమయంలో రాజధానికి సౌకర్యంగా చేరుకోవాలన్న లక్ష్యంతో ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రణాళికను సిద్ధం చేశారు. తొలుత హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి -44లోని రాప్తాడు మండలం మరూరు గ్రామ పరిధిలో ఎక్స్‌ప్రెస్‌వే మొదలవుతుంది. మొత్తంగా 1,017 హెక్టార్ల భూమి అవసరమని అధికారులు తేల్చారు. ఇందులో 72 హెక్టార్లు అటవీ ప్రాంతం ఉంది. దీనిపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు పలు మార్పులు చేస్తోంది.





ఎంఈవోలతో ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి

విద్యా రథసారథుల నియామకం

మార్చి

జిల్లాలో 12 ఏళ్ల ప్రతిష్టంభనకు ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. మొత్తం 52 మండల విద్యాధికారుల నియామకాన్ని చేపట్టింది. మండలంలో మొత్తం 63 మండలాలు ఉండగా 11 మంది రెగ్యులర్ ఎంఈవోలు ఉన్నారు. మిగిలిన మండలాలకు ఇన్నాళ్లు ఇన్‌ఛార్జులతోనే నెట్టుకొచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మార్చినెలలో మిగిలిన మండలాలకు రెగ్యులర్ ఎంఈవోలను నియమించింది. కరవు సీమలో అక్షరాభివృద్ధికి ఈ నిర్ణయం కీలకంగా మారనుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మండలాల్లో విద్యా వ్యవస్థను పర్యవేక్షించేవారు లేక గతంలో ఇబ్బందులు ఎదురయ్యేవి. ప్రభుత్వ నిర్ణయంతో అక్షర ప్రగతికి అంకురార్పణ జరిగింది.



ఇద్దరు చంద్రులు.. జిల్లాలో అక్టోబరు 1న పరిటాల శ్రీరామ్ పెళ్లి సందర్భంగా ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, కేసీఆర్ ఇలా కలుసుకొన్నారు.

పెను విషాదం..

ఏప్రిల్

గుత్తి సమీపంలోని వైటీ చెరువులో తెప్ప బోల్తా పడిన సంఘటనలో అక్కడికక్కడే 13 మంది దుర్మరణం పాలవడం జిల్లాలో విషాదం నింపింది. ఏప్రిల్ 28న పిల్లాపాపలతో ఊరంతా సంబరం చేసుకొంటున్న సమయంలో విధి ఆ ఊరిపై చిన్న చూపుచూడటంతో సంబరాలకు వచ్చిన వారి ఉసురు తీసింది. పరిమితికి మించి ప్రయాణించడంతో చెరువులో తెప్ప పల్టీ కొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన 13 మంది అదే రోజు దుర్మరణం చెందగా మరో వ్యక్తి మరుసటి రోజు మరణించారు. రాత్రివేళ అయినప్పటికీ జిల్లా యంత్రాంగం సమస్తం అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టింది. వైటీ చెరువుతో పాటు సమీప గ్రామాల్లోనూ ఈ సంఘటనతో విషాదఛాయలు కమ్ముకున్నాయి. పోలీసు, అగ్నిమాపక శాఖలు సమర్థ సేవలందించడం, ప్రభుత్వం బాసటగా నిలవడంతో కొద్దిలో కొద్దిగా బాధితులకు ఊరట లభించింది.



రోదిస్తున్న బంధువులు (పాత చిత్రం)

జలనామ సంవత్సరం

46.096 టీఎంసీల నిల్వ



అక్టోబరు నెలలో ఎన్నడూ లేనివిధంగా భారీ వర్షాలు కురవడంతో వంకలు.. వాగులు, కుంటలు పొంగిపొర్లాయి. ఎక్కడికక్కడ చెరువుల్లోకి నీరు వచ్చాయి. ఇదే క్రమంలో ఎగువ ప్రాంతాల్లో వర్షాలు బాగా కురవడంతో దిగువునకు జలాలు పరిగెత్తుకుంటూ వచ్చాయి. ఇలా వివిధ రూపాల్లో ఈ ఒక్క సంవత్సరమే 46.096 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. వర్షపు నీరు ఎక్కడికక్కడ భూగర్భంలోకి వెళ్లింది. దీంతో నిమిత్తం లేకుండా 46.096 టీఎంసీలు నిల్వ ఉండటం విశేషం. ఈ ఏడాది అక్టోబరు, నవంబరు మాసాల్లో కురిసిన వర్షాలకు 923 చెరువుల్లోకి 13.164 టీఎంసీల నీరు వచ్చి చేరింది. అలాగే 79,454 సేద్యపు కుంటలు, చెక్‌డ్యామ్‌ల్లోకి 3.750 టీఎంసీలు వచ్చాయి. మరో వైపు... తుంగభద్ర జలాశయం నుంచి ఇప్పటి దాకా హెచ్చెల్సీ వాటాగా 14.215 టీఎంసీలు లభించాయి. హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు 14.967 టీఎంసీలు జిల్లాకు చేరాయి. హెచ్చెల్సీ, హంద్రీనీవా నీటిని తొమ్మిది జలాశయాల్లో నిల్వ ఉంచారు. ఇలా మొత్తం ఇప్పటి దాకా 46.096 టీఎంసీలు జిల్లాలో నిల్వ ఉన్నట్లే. ఇందులో కొన్ని టీఎంసీలు సాగు, తాగునీటికి వినియోగించారు. ప్రస్తుతం జలాశయాల్లో నిల్వ పరిస్థితిని చూస్తే... పీఏబీఆర్‌లో 4.181 టీఎంసీలు, ఎంపీఆర్: 2.375, సీబీఆర్: 4.238, జీడిపల్లి: 1.398, పెండేకల్లు: 0.321, చాగల్లు: 0.753 టీఎంసీల చొప్పున నీరు నిల్వ ఉంది. ఇక మధ్య తరహా ప్రాజెక్టుల్లో చూస్తే... బీటీపీలో 1.311 టీఎంసీలు, ఎగువ పెన్నార్(పేరూరు)లో 0.14, యోగివేమనలో 0.84 టీఎంసీల మేర నిల్వ ఉన్నాయి. అందుకే 2017ను జలనామ సంవత్సరంగా చెప్పవచ్చు.

జలసౌరభానికి సన్నాహాలు

మే

పీఏబీఆర్ ప్రాజెక్టుపై సౌర విద్యుత్తు ఉత్పత్తికి కోల్‌కతా సంస్థ అధ్యయనం చేయడం శుభపరిణామానికి సూచిక. జిల్లాలో నేలపై సౌరఫలకాలు ఏర్పాటు చేసి సౌరవిద్యుత్తును ఉత్పత్తి చేయడం అనే సరికొత్త ప్రతిపాదన జిల్లాలో కొత్త ఆశలు రేకెత్తించింది. దీనికి పెన్న అహోబిలం సమతుల జలాశయం వేదిక కావడం విశేషం. ఇప్పటికే 1,350 మెగావాట్లపవన విద్యుత్తు, 550 మెగా వాట్ల సౌర విద్యుత్తుతో రాష్ట్రేతర విద్యుత్తు సంస్థల దృష్టిని ఆకర్షిస్తున్న అనంతలో దేశంలోనే తొలిసారిగా జలాశయ నీటిపై నిర్మించనున్న సౌర విద్యుత్తు ప్రాజెక్టు రూపకల్పనకు సన్నాహాలు ప్రారంభించినట్లైంది. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సోలార్ ఎనర్జీ సొసైటీ సహకారంతో నిర్మించతలపెట్టిన ఈ జలాశయ సౌర విద్యుత్తు ప్రాజెక్టుకు నూతన ఏడాదిలో అంకురార్పణ జరిగే అవకాశాలున్నాయి.



పీఏబీఆర్ జలాశయం

అనంతలో అడుగిడిన కియా..

జూన్


కరవుకు పేరొందిన అనంతపురం జిల్లాలో రూ.13 వేల కోట్ల పెట్టుబడితో అడుగిడిన కియా కార్ల కంపెనీ స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఊపిరిపోసిందని చెప్పవచ్చు. ఏడాదికి 3 లక్షల కార్ల తయారీ లక్ష్యంతో 11 వేలమందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా రూపొందిన కియా కార్ల కంపెనీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారికి పక్కనే ఉన్న పెనుగొండ సమీపంలో 600 ఎకరాల్లో ఈ పరిశ్రమ ఏర్పాటు చేయడం ద్వారా అనంత ప్రగతి మరో అడుగు ముందుకు పడినట్లైంది. జిల్లాలో అతిపెద్ద పరిశ్రమ ఇదే కావడంవిశేషం. ఈ పరిశ్రమ ఏర్పాటు కోసం వివిధ రాష్ట్రాలు ప్రయత్నం చేసినా, మన రాష్ట్రంలో నెల్లూరు, చిత్తూరు జిల్లాలు పరిశీలించినా అనంతలోనే కార్యరూపం దాల్చింది. దీనికి అనుబంధంగా అనేక పరిశ్రమలు వచ్చేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.



చురుగ్గా జరుగుతున్న కియా పనులు

రైతు మోమున పండగ

జులై



జులై మాసం రైతుల మోముల్లో పండగ కాంతులు నింపింది. 2016 ఖరీఫ్‌లో ప్రారంభంలో ఆశించిన స్థాయిలో వర్షాలు పడ్డాయి. దీంతో రైతులు జిల్లాలో 7.5 లక్షల హెక్టార్లలో వేరుసెనగను సాగు చేశారు. అయితే ఆ ఏడాది ఆగస్టు నుంచి వర్షం జాడ కరవయింది. జల ఫిరంగుల ద్వారా నీటిని అందిస్తూ పంటను కాపాడటానికి ప్రయత్నాలు చేశారు. కానీ, మధ్యలో ఎక్కువ సమయం కావడంతో పంటను రక్షించడం సాధ్యం కాలేదు. సగటున ఎకరాకు 212 కిలోల దిగుబడి మాత్రమే వచ్చినట్లు అధికారులు నిర్ధారించగా, అవి కూడా నాణ్యత లేని కాయలుగా తేలింది. దీంతో మొత్తం 7.50 లక్షల హెక్టార్లలో పంట ఎండిపోయింది. దీని కారణంగా రైతులకు కడగండ్లు మిగిలాయి. దీనిని గుర్తించిన ప్రభుత్వం పంట నష్టపరిహారానికి జిల్లా వ్యవసాయ శాఖ నుంచి ప్రతిపాదనలు తీసుకుంది. 2015 వరకు హెక్టారుకు రూ.10 వేలు మాత్రమే పంట నష్టపరిహారం ఇవ్వగా, దానిని 2016 నుంచి రూ.15 వేలకు పెంచి వ్యవసాయ శాఖ ప్రతిపాదించిన రూ.1032 కోట్ల పరిహారాన్ని మంజూరు చేసింది. ఎన్నడూ లేని విధంగా అధిక మొత్తం మంజూరయింది. ఈ ఏడాది జులై మాసంలో రైతుల ఖాతాలకు జమ చేసింది. దీంతో రైతుల మోముల్లో పండగ వాతావరణం కనిపించింది.

ఆలస్యమైన సాగు..

ఆగస్టు



జిల్లాకు వరప్రదాయిని తుంగభద్ర జలాశయం. దాని ఆధారంగానే జిల్లాలో వ్యవసాయ సాగు ఆధారపడి ఉంది. ఆగస్టు రాగానే తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్ఎల్‌సీ) పరిధిలోని ప్రతి రైతు సాగు సన్నద్ధం అయ్యేవారు. సాగు ప్రయత్నాలతో పొలాలకు పండగ వచ్చినట్లు ఉండేది. అయితే ఈ ఏడాది జూన్, జులై, ఆగస్టు మాసాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు కారణంగా ఆ జలాశయానికి నీరు రాలేదు. జులై 15 నాటికే జలాశయం నిండేది. కానీ, ఈ ఏడాది ఆగస్టు చివరి నాటికి కూడా 100 టీఎంసీలకు గాను 53 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఆ నీటిలో జిల్లా వాటా 13.5 శాతం మాత్రమే దక్కింది. అంటే కేవలం 8 టీఎంసీల నీరు మాత్రమే జిల్లాకు కేటాయించారు. ఈ నీరు జిల్లాలోని సాగుకు ఏ మాత్రం సరి పోలేదు. కేవలం 83 రోజులు మాత్రమే ఇవ్వడానికి నిర్ణయించారు. ఈ నీరు సాగుకు ఆరుతడి పంటలకు కూడా సరిపోని పరిస్థితి. దీంతో సాగు ఆలస్యమైంది. ఎన్నడూ లేని విధంగా నీటిని ఈ ఏడాది చాలా భద్రంగా వాడుకోవాల్సి వచ్చింది.

మరణ మృదంగం

సెప్టెంబరు

ఈ ఏడాది జ్వరాల ప్రభావం తీవ్రంగా కనిపించింది. ప్రధానంగా సెప్టెంబరు మాసంలో డెంగీ, మలేరియా తదితర విష జ్వరాలతో జిల్లా ప్రజలు వణికిపోయారు. ఎన్నడూ లేని విధంగా జ్వర బాధితుల మరణాలు కొనసాగాయి. ఈ మాసంలో 18 నుంచి వరుసగా ఐదు రోజుల పాటు 9 మంది విష జ్వరాల బారినపడి మరణించారు. అంతేకాకుండా వివిధ వ్యాధులతో జిల్లా సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతూ ఇదే నెల 26 రాత్రి గంటకు ఒకరు చొప్పున తెల్లారేలోగా మొత్తం 10 మంది మృతి చెందారు. మృతులంతా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందినవారు. ఒకే రాత్రి ఇంతమంది చనిపోవడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యింది. మొత్తంగా ఆ నెలలో కొనసాగిన మరణాలు ప్రజల్లో ఆందోళనను సృష్టించాయి. జిల్లాలోని మరణ మృదంగంపై స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలతో వ్యాధుల ప్రభావం తీవ్రంగా కొనసాగింది. జిల్లావ్యాప్తంగా డెంగీ, మలేరియా జ్వరాల ప్రభావం ఎక్కువగా కనిపించింది.



రోగులతో కిక్కిరిసిన ప్రభుత్వ ఆసుపత్రి (దాచిన చిత్రం)

ఉపాధికల్పన దిశగా అడుగులు...

అక్టోబరు

జిల్లాలో పెనుకొండ వద్ద కియా కార్ల పరిశ్రమ ఏర్పాటు చురుగ్గా సాగుతున్న వేళ మరిన్ని వివిధ రకాల పరిశ్రమల ఏర్పాటుకు మార్గం ఏర్పడుతోంది. ఇందులో భాగంగా అనంతపురం నగరం సమీపంలో జాకీ దుస్తుల పరిశ్రమ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. దీనికి అవసరమైన 28 ఎకరాల భూమిని జిల్లా ఉన్నత అధికారులు సిద్ధం చేశారు. ఈ సంస్థకు కర్ణాటకలో ఆరు పరిశ్రమలు ఉండగా, ఏపీ, తమిళనాడులో కూడా తమ ఉత్పత్తులను తరలించేందుకు వీలుగా ఉంటుందనే ఉద్దేశంతో అనంత నగర సమీపంలో రాప్తాడు వద్ద దుస్తుల పరిశ్రమ ఏర్పాటుకు వీలు కల్పించారు. ఇది ఏర్పాటయితే అనంతపురం చుట్టుపక్కల మండలాల్లోని 6 వేల మంది మహిళలకు ఉపాధి లభించనుంది. వారు సులభంగా తమ గ్రామాలకు దగ్గరలోనే ఉపాధి పొందడానికి అవకాశం కలిగించడానికి, పరిశ్రమ నిర్మాణం వేగంగా పూర్తయ్యేలా చూసి, త్వరగా ప్రారంభించేలా ప్రభుత్వం భావిస్తోంది.



రాప్తాడు సమీపంలో సమీకరించిన భూములు

నూతన సారథ్యం..







2017లో జిల్లాకు సంబంధించి కీలక మార్పులు చోటు చేసుకొన్నాయి. జిల్లా కలెక్టర్‌గా వీరపాండియన్, ఎస్పీగా అశోక్‌కుమార్ నియమితులయ్యారు. అలాగే రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రిగా కాలవ శ్రీనివాసులు, శాసనమండలి చీఫ్‌విప్‌గా పయ్యావుల కేశవ్, శాసనసభ చీఫ్‌విప్‌గా పల్లె రఘునాథరెడ్డికి అవకాశం దక్కింది. జేసీ రమామణికి ఐఏఎస్ హోదా లభించింది. అలాగే జేఎన్‌టీయూ వీసీగా ఆచార్య శ్రీనివాసకుమార్, జిల్లా విద్యాశాఖాధికారిగా జనార్దనాచారి, డ్వామా పీడీగా జ్యోతిబసు నియమితులయ్యారు.





సామాజిక ఎత్తిపోతల బిందు సేద్య పథకానికి శ్రీకారం

నవంబరు

జిల్లాలో కొన్నేళ్లుగా కరవు ఛాయలు కొనసాగుతున్నాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులు బోర్లు, బావుల ద్వారా పాతాళ గంగను పైకి తెచ్చి బిందు, తుంపర్ల సేద్యం ద్వారా పంటలు పండించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే అందరికీ సాధ్యం కాకపోగా, వర్షాభావ పరిస్థితులు కొనసాగుతుండడం కారణంగా భూగర్భ జలం లభించడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని కరవు రైతులకు ఉపశమనం కల్గించడానికి ప్రభుత్వం సామాజిక ఎత్తిపోతల బిందు సేద్య పథకానికి శ్రీకారం చుట్టింది. దీనికి రూ.890.60 కోట్లు కేటాయించింది. ఈ పథకం అమలుకు ఉరవకొండ నియోజకవర్గాన్ని ఎంపిక చేయగా, సెప్టెంబరు మాసంలో సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. అయితే కర్ణాటకలోని రామ్నాల్ ప్రాంతంలో అమలవుతున్న పథకంలా దీన్ని చేపట్టాలన్నది ఆలోచన. ఆ దిశగా జిల్లా ఉన్నతాధికారులు అక్కడ పర్యటించి ఈ పథకానికి నవంబరులో తుది రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా ఈ సామాజిక ఎత్తిపోతల బిందు సేద్య పథకానికి జీడిపల్లి, పీఏబీఆర్, ఎంపీఆర్ జలాశయాలకు హంద్రీనీవా ద్వారా చేరుతున్న నీటిలో 1.69 టీఎంసీల నీటిని 50వేల ఎకరాల్లో సామూహిక బిందు సేద్య పథకానికి ఉపయోగించాలన్నది లక్ష్యం. ఏడాదిన్నర లోగా ఇక్కడ ఆ జలాశయాలకు కుడి, ఎడమల వైపు ఒక్కో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి, ఎంపిక చేసిన గ్రామాల వరకు పైపులైన్ తీసుకెళ్లి, అక్కడ భూముల్లో పంటల సాగుకు చుక్కల సాగు పద్ధతిలో నీటిని ఇవ్వాలన్నది ప్రధాన ఉద్దేశం.



బిందు సేద్యం విధానంలో సాగవుతున్న పంట

హత్యలతో కలవరం

డిసెంబరు

● జిల్లాలో ఫ్యాక్షన్ అంతరించిపోతోందనుకొంటున్న సమయంలో మరో ఫ్యాక్షన్ హత్య చోటు చేసుకొంది. డిసెంబరు 6న ధర్మవరం మండలం బుడ్డన్నపల్లెలో వైకాపా నాయకుడు యర్రగుంట్ల చెన్నారెడ్డిని ప్రత్యర్థులు హత్య చేశారు. ఈ హత్యతో ధర్మవరం ప్రాంతంలో పగలు ప్రతీకారాలు చెలరేగుతాయేమోనన్న చర్చసాగింది. పాత కక్షల నేపథ్యంలో ఈ హత్య చోటు చేసుకుంది. ఈ ఘటనపై వైపాకా నాయకులు ఆందోళనలు చేశారు. అయితే పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకొని పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చింది.

● డిసెంబరు 13న జిల్లా కేంద్రంలోని తపోవనం కూడలిలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ పార్టీ అనుబంధ కార్మిక సంఘం ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యుడు రామస్వరూప్‌రెడ్డి హత్యకు గురయ్యారు. సంఘంలో ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో హత్య చోటు చేసుకుంది. 2014 జనవరి 1న రామస్వరూప్‌రెడ్డి తండ్రి, సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకుడు రామకృష్ణారెడ్డి జాతీయ రహదారిపై ఉద్యానవనం సమీపంలో హత్యకు గురయ్యారు. తండ్రీ కొడుకులు హత్యకు గురికావడంతో స్థానికంగా కొంత కలకలం రేగింది.



బుడ్డన్నపల్లెలో పోలీసుల విచారణ



రామస్వరూప్‌రెడ్డి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

హాయ్! బుజ్జీ!!

హాయ్... నేస్తాలూ... బాగున్నారా... ప్చ్... 2017 ఇట్టే గడిచిపోయింది. హాయిగా ఆడుతూ పాడుతూ ఆనందంగా గడిపేశాం. సంవత్సరమంతా బోలెడు సంఘటనలు జరిగాయి. అందులో కొన్ని మనల్ని సంతోషపెడితే.. కొన్ని ఏడిపించేశాయి... మరికొన్ని మన ముఖాల్లో నవ్వులు పూయించి అలరించాయి. ఆశ్చర్యపరిచి... ఆటాడించి, మాయ చేసి... ఊరించి ఊరడించాయి ఇంకొన్ని. సరదాగా వీటికి అవార్డులు ప్రకటించేద్దామా... కొత్త ఏడాదిలో అడుగుపెట్టే ముందు... ఒక్కసారి మరొక్కసారి... ఆ ముచ్చట్లు గుర్తుకు చేసుకుందామా!

ఎన్నెన్నో గుర్తులు!



మెరిశాడు!

హాలీవుడ్ హీరో...

ఆడుతూ పాడుతూ ఆడుకునే వయసులోనే మన నేస్తం హాలీవుడ్‌లో హీరో అయిపోయాడు. ఈ ఏడాది మెరిసిన చిన్నారిగా నిలిచాడు. ఎందుకంటే తను ఇంగ్లిష్ సినిమాలో పెద్ద పాత్రనే దక్కించుకున్నాడు. అవునూ! ఈ అబ్బాయి పేరు రోనీ ఆకురాతి. వీళ్ల సొంతూరు పశ్చిమ గోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం. అయితే వీళ్ల అమ్మా నాన్నాలతో కలిసి అమెరికాలోని ఇల్లినాయిస్‌లో ఉంటాడు. నటన మీద తనకున్న ఆసక్తిని గ్రహించిన వాళ్ల అమ్మ రోనీని యాక్టింగ్ స్కూల్లో చేర్చారు. అక్కడే తను నటన పాఠాలు నేర్చుకున్నాడు. చివరికి 'గ్రోయింగ్ అప్ స్మిత్' సినిమాలో హీరోగా నటించే అవకాశాన్ని దక్కించుకున్నాడు. అదీ అంత తేలికగా ఏం రాలేదు. ఆ పాత్ర కోసం వెయ్యి మందికి పైగా పిల్లలు పోటీపడ్డారు. అందరికంటే రోనీ హావభావాలు దర్శకుడికి బాగా నచ్చడంతో చిత్రంలో నటించే అవకాశం వచ్చింది.

జీవి కొంచెం... ఆయువు ఘనం!



ఆశ్చర్యపరిచింది!

శాస్త్రవేత్తలు ఎప్పుడూ పరిశోధనలు చేసి కొత్త కొత్త సంగతులు బయటపెడుతుంటారుగా. అలా ఈ ఏడాది ఓ ఆసక్తికరమైన విషయం తెలుసుకున్నారు. అదేంటంటే... సముద్రపు లోతుల్లో ఉండే ట్యూబ్ వార్మ్ అనే జీవుల్లో ఒకటైన 'ఎస్కర్పియా లామినటా' గురించి. దేహమంతా గొట్టాల్లా ఉండే ఈ జీవి ఏకంగా 300 ఏళ్ల కన్నా ఎక్కువే జీవిస్తుందట. అందుకే ఇప్పుడున్న జీవరాశులన్నింటిలో అత్యధికంగా బతికే ప్రాణి ఇదే కావచ్చని అనుకుంటున్నారు పరిశోధకులు. ఎక్కువగా గల్ఫ్ ఆఫ్ మెక్సికో సముద్రం లోపల ఉండే ఈ జీవి ఆకారం చిన్నది, దానికి తోడు లోతుల్లో ఉండటం వల్ల ఇప్పటి వరకు దీని గురించి తెలియలేదట. ఏది ఏమైనా భలే జీవి కదూ!



కొత్త కొత్త చాక్లెట్!



ఊరించింది!

చాక్లెట్... ఈ పేరు వింటేనే నోరూరిపోతుంది. అయితే ఇప్పటి వరకు వీటిల్లో డార్క్, మిల్క్, వైట్ చాక్లెట్లే మనకు తెలుసు. కానీ ఈ ఏడాదిలో కొత్త రంగు కొత్త రుచితో ఓ చాక్లెట్ వచ్చి వాటి పక్కన చేరిపోయింది. పేరు రూబీ చాక్లెట్. ఎరుపు గులాబీ రంగులు కల గలిపి ఉంటుంది. ఇప్పటికే తినే ఉంటారుగా. 'అదేంటీ? చిన్న చిన్న చాక్లెట్ బిళ్లలు చాలా రంగుల్లోనే ఉంటాయే మరి దీని ప్రత్యేకత ఏంటో' అనే సందేహం వచ్చిందా? అసలు విషయం ఏమంటే.. వాటన్నింటిలో కృత్రిమ రంగులు కలుపుతారు. కానీ డార్క్, మిల్క్, వైట్, రూబీ చాక్లెట్ రంగులు మాత్రం సహజసిద్ధమైనవి. ఎలాంటి రంగులు కలపకుండా తయారుచేసినవన్నమాట. రూబీ కోకో బీన్స్‌తో తయారు చేశారీ రూబీ చాక్లెట్‌ని. తెలుపు రంగు చాక్లెట్ బార్ మార్కెట్లోకి వచ్చాక అంటే దాదాపు 80 సంవత్సరాల తర్వాత మొదటిసారిగా చాక్లెట్లలో కొత్తరంగు వచ్చింది ఈ ఏడాదిలోనే.



ఆటాడించింది!

గిరగిరా తిప్పేసింది!

ఈ ఏడాదిలో పిల్లల దగ్గర్నించి పెద్దల వరకు ఎవరి చేతిలో చూసినా ఆ వస్తువే ఎక్కువగా కనిపించింది. అందరితో తెగ ఆడేసుకుంది.. ఆటాడించింది. అదేనండి... ఫిడ్జెట్ స్పిన్నర్. మీరూ కొనే ఉంటారుగా! 2017 మార్కెట్లోకి వచ్చిన బొమ్మలన్నింటిలో మొదటిస్థానం దీనిదే. ఆన్‌లైన్ వెబ్‌సైట్లలోనూ ఎక్కువగా కొనుగోలైందీ ఇదే. ఈ బొమ్మతో ఎలా ఆడాలో చూపిస్తూ చేసిన వీడియోలను కోట్ల మంది వీక్షించారు. చేతిలో పట్టేంత పరిమాణంలో మూడు రెక్కలతో ఉండే ఈ చిన్న బొమ్మ పరికరం బేరింగుల సాయంతో బొంగరంలా తిరిగేస్తుంది. ఆట విడుపుకే కాకుండా ఈ బొమ్మ ఒత్తిడిని దూరం చేస్తుందని పేరు తెచ్చుకుంది. ఈ ఏడాదిలో ఆకట్టుకున్న ఈ స్పిన్నర్‌ని ఎప్పుడో 1993లోనే కనిపెట్టారు.

ఆకు కాదిది జీవి..

ఈ ఏడాది శాస్త్రవేత్తలు గుర్తించిన ఓ రకం కీటకం అందరినీ మాయ చేసింది. ఎందుకంటే అదిఅచ్చం ఆకులాగే ఉంటుంది. ఈ జీవి కాట్యాడిడ్ పురుగుల జాతిలో కొత్తది. దాని శరీరం, కాళ్లు.. శరీరభాగాలన్నీ చిగురుటాకుల్లాగే ఉంటాయి. కనుమాయ చేసేలా ఉన్న ఇది శాస్త్రవేత్తల కళ్ల నుంచీ ఇప్పటి వరకూ తప్పించుకుంది. చివరికి ఈ ఏడాదిలో మాత్రం దొరికిపోయింది. మలేసియాలో బోర్నియోలో ఈ వింత పురుగును గుర్తించారు. ఆకులు అలముల మధ్యలో ఉన్న దీన్ని పరిశీలనగా చూస్తే తప్ప ఇది జీవన్న విషయం ఎవ్వరికీ తెలియదు. వీటిల్లో ఆడకీటకాలు ఇలా గులాబిరంగులో నిగనిగలాడుతూ ఉంటాయి. మగవి ఆకుపచ్చ రంగులో ఆకులాగే ఉంటాయి.

మాయ చేసింది!





అలరించింది!

ఎమోజీల సందడి..

ఈ ఏడాది వచ్చిన, పిల్లలకు ఎక్కువగా నచ్చిన.. యానిమేషన్ సినిమా 'ది ఎమోజీ'. ఫోను, మెసేజింగ్ యాప్‌ల్లో మనం ఎక్కువగా ఎమోజీల్ని వాడేస్తుంటాం. వాటికే నోరుంటే అవి మాట్లేడేస్తే ఎలాగుంటుంది? అదే ఈ సినిమాలో చూడొచ్చు. దీనిలో హీరో ఎమోజీ జీన్. తోటి ఎమోజీలన్నీ ఒక్కొక్క హావభావాన్నే పలికిస్తే తాను మాత్రం చాలా రకాల హావభావాల్ని పలికిస్తుంది. అయితే అదే తన గొప్పదనం అని గుర్తించకుండా పక్కవాటిలా మారాలనుకుంటుంది. అందుకు కోడ్ కనిపెట్టడం, చివరికి తనలా ఉండటమే ప్రత్యేకత అని తెలుసుకోవడం కథ. అయితే ఎమోజీ బొమ్మలు మాట్లాడుకోవడం, వాటి హావభావాలు, వేషధారణ... చూస్తుంటే అన్నీ భలే గమ్మత్తుగా అనిపిస్తాయి. అందుకే ప్రపంచ దేశాలన్నీ ఈ సినిమాని ఆసక్తిగా చూశాయి. సోనీ పిక్చర్స్ తీసిన ఈ సినిమాలో వేషధారణలు తమాషాగా ఉన్నాయి. అలాంటివి ధరించి కొంత మంది వీధుల్లో ఒక్కచోట చేరారు. గిన్నిస్ రికార్డూ కొట్టారు.

పే...ద్ద ఫెర్రిస్ వీల్!



కిక్కిచ్చింది!

మనకు రైడ్లంటే భలే సరదా. వాటిల్లో ఎక్కాలన్నా... వాటి కబుర్లు వినాలన్నా మనకెంతో ఇష్టం మరి. అందుకే ప్రపంచంలో వింతైన భారీ రైడ్లు ఏర్పాటు చేస్తే ఆ సంగతులు వెంటనే చెప్పేసుకుంటాం. అలా ఈ ఏడాదిలో కొత్తగా వచ్చింది ఓ ఫెర్రిస్ వీల్. చైనాలోని వీఫాంగ్ నగరంలో ఏర్పాటు చేశారు దీన్ని. పెద్ద చక్రంలా ఉండి గుండ్రంగా రయ్యి రయ్యిమని తిప్పేసే ఫెర్రిస్ వీల్ తెలుసుగా. వాటిల్లోనే భిన్నమైందిది. ఆ ప్రత్యేకత ఏమిటంటే... చక్రం మధ్యలో చువ్వలు లేని ఏకైక ఫెర్రిస్ వీల్. పైగా ప్రపంచంలోని ఎత్తయిన వీల్స్‌లో ఒకటైన 'లండన్ ఐ' కన్నా ఇదే పెద్దది. 1,771 అడుగుల ఎత్తులో ఉన్న బైలాంగ్ రివర్ బ్రిడ్జ్‌పై కట్టిన ఈ జెయింట్ వీల్ ఎత్తు ఏకంగా 476 అడుగులు. మొత్తం 36 గదులతో భారీ ఉంగరంలా అందర్నీ ఆకర్షించింది. గిరగిరా తిరిగేస్తూ ఎక్కిన వారికి గుండె జారిపోయినట్టు గమ్మత్తయిన అనుభూతినిస్తోంది. తెగ ఆకట్టుకుంది.



భయపెట్టింది!

ఎంత పనిచేసింది!

ఈ ఏడాది కంప్యూటర్లు, ఫోన్లలో పిల్లల్ని భయభ్రాంతులకు గురిచేసిన గేమ్ బ్లూవేల్. బ్లూవేల్ ఛాలెంజ్ పేరుతో ఇది ఆటగాళ్లను ఆత్మహత్య చేసుకునేటట్లు ప్రేరేపించి వారి జీవితాల్ని బలితీసుకుంటుంది. నిజానికి ఈ బ్లూవేల్ డౌన్‌లోడ్ చేసుకుని ఆడే ఆట కాదు. సాఫ్ట్‌వేర్ కూడా కానే కాదు. ఇంటర్నెట్‌కు ఆకర్షితులైన పిల్లలకు ప్రత్యేక స్నేహితులుగా పరిచయం చేసుకుని రహస్యంగా ఆన్‌లైన్ ఛాలెంజ్‌లు ఇస్తుంది. బ్లేడుతో చేతిపై చిత్రాలు గీసుకోవడం లాంటి హింసతో కూడిన టాస్క్‌లతో ప్రాణాలు తీసేస్తుంది. ఈ ఏడాదే వచ్చిన ఈ ఆట కొంత మంది ప్రాణం తీసి వారి ఇంట్లో వారికి తీరని వేదనను మిగిల్చింది. తల్లిదండ్రుల్ని ఎక్కువ కలవర పెట్టిన ఈ గేమ్ ఈ ఏడాది మనల్ని చాలానే భయపెట్టేసింది. ఈ ఆటను నిషేధించే స్థాయికి తీసుకెళ్లింది.

జిల్లాలో ఇంకా నిరక్షరాస్యులు	వయోజన విద్యా కేంద్రాలు	మండల సమన్వయకర్తలు	గ్రామ సమన్వయకర్తలు	పథకం అమలు	ఉద్దేశం
3.88లక్షల మంది	992	63 మంది	1984మంది	2010	సంపూర్ణ అక్షరాస్యత

సాక్షర భారత్ ఉన్నట్టా..లేనట్టా..?

◆ నేటితో ముగియనున్న గడువు ◆ కేంద్రం నిర్ణయంపైనే ఆశలు ◆ పథకం అమలుపై సందిగ్ధత



సాక్షరభారత్ కేంద్రం

జిల్లా అక్షరాస్యత	గుర్తించిన నిరక్షరాస్యులు	ఏడు విడతల్లో అక్షరాస్యులు	ఇంకా నిరక్షరాస్యులు
63.57శాతం	8,93,391 మంది	5,05,377 మంది	3,88,014మంది

పుట్టపర్తిగ్రామీణం,న్యూస్‌టుడే: వందశాతం అక్షరాస్యత సాధనలో భాగంగా అమల్లోకి వచ్చిన సాక్షర భారత్ కార్యక్రమం జిల్లాలో లక్ష్యం పూర్తి కాకుండానే కొడిగట్టనుంది. కార్యక్రమం డిసెంబరు 31తో ముగియనుంది. తదుపరి కార్యక్రమం ఉంటుందా ఊడుతుందా అన్న సందేహాలు సర్వత్రా నెలకొన్నాయి. ఈనెలాఖరుతో సాక్షర భారత్ గ్రామ, మండల సమన్వయకర్తల ఉద్యోగ కాలం ముగియనుంది. కార్యక్రమం అమలుపై స్పష్టత లేకపోవడంతో పలు సందేహాలు వెంటాడుతున్నాయి. అయితే కేంద్రం ఏప్రిల్‌లో 2020 నాటికి దేశంలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేస్తామని ప్రకటించింది. రాష్ట్రంలో కృష్ణా, ఉభయగోదావరి జిల్లాలు మినహా మిగిలిన 10 జిల్లాల్లో సాక్షర భారత్ కార్యక్రమం ద్వారా వయోజనులకు అక్షరాలు నేర్పుతున్నారు. ఇంకా లక్ష్యం చేరుకోవడానికి మూడేళ్లున్నా కేంద్రం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు అందక పోవడంతో అటు అధికారులు ఇటు సమన్వయకర్తలను సందిగ్ధత వెంటాడుతోంది. గడువు మీద గడువు: సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యంగా ప్రారంభించిన పథకంపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఈపథకం గడువు మార్చి 31తో ముగిసినా కేంద్రం మరో ఆరు నెలలు పొడిగించింది. అది సెప్టెంబర్ 30తో ముగిసింది. మరోసారి డిసెంబరు 31 వరకు పెంచింది. ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. దీంతో పథకం కొనసాగుతుందా, రద్దుచేస్తారా అన్న సందేహాలు ఉన్నాయి. వయోజనులైన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దితే సామాజిక అభివృద్ధి సాధ్యపడుతుందనేది ప్రభుత్వ ఉద్దేశం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళల్లో అక్షరాస్యతను పెంచి మహిళా సాధికారతను సాధించాలన్నదే లక్ష్యం. 2010 సెప్టెంబరు 8 నుంచి 2017 సెప్టెంబరు 30 వరకు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించారు. ఏడేళ్లలో సుమారు 72 శాతం మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దామని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో పరిస్థితి: జిల్లాలో 63 మంది మండల సమన్వయకర్తలు, 1984 మంది గ్రామ సమన్వయకర్తలు పనిచేస్తున్నారు. గ్రామ సమన్వయ కర్తలకు గౌరవ వేతనం కింద నెలకు రూ.2 వేలు, ఎంసీవోలకు రూ.6వేల చొప్పున చెల్లించేది. అలా ఒక్కో నిరక్షరాస్యునిపై రూ. 100 చొప్పున ఖర్చు చేశారు.

ఏడు విడతల్లో 5.05లక్షల మంది అక్షరాస్యులు : పథకం ప్రారంభంలో జిల్లాలో 15-50 ఏళ్ల వయసు ఉన్న నిరక్షరాస్యులను సర్వేచేసి 8,93,391 మందిని గుర్తించారు. ఏడు విడతల్లో 7 లక్షల మందిని వయోజన విద్యా కేంద్రాల్లో నమోదు చేశారు. అధికారిక లెక్కల ప్రకారం ఏడు విడతల్లో 5.05 లక్షల మందిని(72 శాతం)అక్షరాస్యులుగా తీర్చిద్దినట్లు చెబుతున్నారు.

చదువురానివారు 3.88 లక్షల మంది

ఇంకా జిల్లాలో 3.88 లక్షల మంది చదువు రాని వారున్నారు. అక్షరాలు రాని వీరిలో వీరికి ఒకొక్కక్కరికి స్వల్పకాలిక కోర్సు కింద రూ.230 ఖర్చు చేయాలని ప్రభుత్వ యోచన. ఈ వ్యయాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 60.40 నిష్పత్తిలో భరించనున్నాయి. వయోజన విద్యాశాఖ 5.05 లక్షల మందిని అక్షరాస్యులుగా చేస్తే మిగిలిన 3.88 లక్షల మందిని సెర్ప్, ఉపాధి హామీ పథకం యంత్రాంగం అక్షరాలు నేర్పాల్సి ఉంది. ఈ ప్రక్రియపైనే ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

8 నెలల బకాయి: జిల్లాలో మండల, గ్రామ సమన్వయకర్తలకు వేతన బకాయిలు ఇవ్వాలి. మే నుంచి డిసెంబరు వరకు 8 నెలలకు సంబంధించి రూ.2.72 కోట్లు చెల్లించాల్సి ఉంది. అరకొర వేతనాలు, నెలల తరబడి బకాయి, భద్రతలేని ఉద్యోగం వెరసి ఆ ప్రభావం పథకం అమలుపై పడుతోంది. పటిష్ఠ చర్యలు తీసుకుని అమలు చేస్తే సత్ఫలితాలు వస్తాయని విద్యావేత్తలు అంటున్నారు.

తదుపరి ఉత్తర్వులు రావాలి



సాక్షర భారత్ కార్యక్రమం 2020 వరకు కొనసాగాలి. కొనసాగింపుపై మార్పులు చేర్పులతో మార్గదర్శకాలు రావాల్సి ఉంది. పథకం సంపూర్ణ అక్షరాస్యత సాధించే వరకు రద్దు కాదు. కేంద్ర ప్రభుత్వం నుంచి తాజా ఉత్తర్వులు రావాలి. గ్రామ సమన్వయ కర్తలకు రూ.2 కోట్ల వరకు బకాయి ఉంది. మే నుంచి సెప్టెంబర్ వరకు వేతనం ఇస్తాం. అక్టోబర్ నుంచి డిసెంబరు వరకు మలి విడత కింద చెలిస్తాం. **- ఉమాదేవి, డీడీ, వయోజనవిద్య**

50,853 ఇళ్లు మంజూరు



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ వీరపాండియన్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద 50,853 గృహాలను మంజూరు చేశామని కలెక్టర్ వీరపాండియన్ తెలిపారు. వివిధ అంశాలపై శనివారం రాజధాని నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ దూరశ్రవణ వీక్షణా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 48,917 గృహాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. 2018 ఫిబ్రవరి నాటికి గృహ నిర్మాణాలు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. వీసీలో జేసీ రమామణి, డీఆర్వో రఘునాథ్, ఎస్ఈ హరేరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మీకోసం రద్దు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో జనవరి 2 నుంచి 11వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించనున్నారు. అందులో భాగంగా జనవరి ఒకటో తేదీన కలెక్టరేట్, మండల, డివిజన్ స్థాయిలో జరిగే మీకోసం సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం కలెక్టర్ ఆదేశాల మేరకు రద్దు చేసినట్లు డీఆర్వో రఘునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ఏమైనా సమస్యలుంటే జన్మభూమి గ్రామసభల్లో అర్జీలను ఇవ్వాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

జిల్లా సచివాలయం: జిల్లాలో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి యంత్రాంగం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 57 పోస్టులు భర్తీ చేయనున్నారు. నూతన సంవత్సరం కానుకగా 2018 జనవరి ఒకటో తేదీన నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు డీఆర్వో రఘునాథ్ తెలిపారు. ఎస్సీ జనరల్ 20, మహిళలకు 18, ఎస్టీ జనరల్ 07, మహిళలకు 12 చొప్పున కేటగిరీల వారీగా అర్హతను బట్టి భర్తీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఫిబ్రవరి 28 నాటికి ప్రక్రియను పూర్తి చేసి, మార్చి ఒకటో తేదీ నాటికి విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని డీఆర్వో తెలియజేశారు.

ఉప సర్వేయర్ల నియామకానికి చర్యలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ ద్వారా 22 ఉప సర్వేయర్ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు మంజూరు చేసిందని జేసీ రమామణి తెలిపారు. ఏపీపీఎస్సీ ద్వారా రాత పరీక్షలు, మౌఖిక పరీక్షలు నిర్వహించి, అందులో అర్హత సాధించిన 22 మంది ఉప సర్వేయర్లను జిల్లాకు కేటాయించిందన్నారు. అర్హత సాధించిన వారు జనవరి 2న ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు నకళ్లను తీసుకుని కలెక్టరేట్‌లోని సర్వే భూరికార్డుల కార్యాలయానికి హాజరు కావాలని జేసీ విజ్ఞప్తి చేశారు.

జనవరి 28, మార్చి 11న పల్స్‌పోలియో

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: ఈ దఫా కూడా రెండు విడతల్లో సామూహిక చుక్కల మందు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సకల ఏర్పాట్లు చేస్తున్నాం. దీన్ని ఒక ఉద్యమంలా నిర్వహించి విజయవంతం చేసేందుకు ప్రతి వైద్యుడు అంకితభావంతో పని చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆ శాఖ కార్యాలయ సభా మందిరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సమావేశం జరిగింది. పల్స్ పోలియో కార్యక్రమ కార్యాచరణపై ఒక్కరోజు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ జనవరి 28, మార్చి 11న పల్స్‌పోలియో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పోలియో మహమ్మారి లేదు. అయినా పొరుగు దేశాల్లో ఈ వ్యాధి చిన్నారులను వేధిస్తోంది. ముందు జాగ్రత్త చర్యగా రెండు విడతలుగా చిన్నారులకు చుక్కల మందు వేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మరోవైపు జనవరి 2 నుంచి జరిగే ఐదో విడత జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ప్రతి పల్లెలోనూ వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) ప్రతినిధి డాక్టర్ పవన్‌కుమార్, రాష్ట్ర కోల్డ్‌చైన్ అధికారి డాక్టర్ దేవనందం మాట్లాడుతూ నిర్దేశించిన ప్రతి చిన్నారికి రెండు చుక్కలు వేయాలన్నారు. డీఐఓ డాక్టర్ పురుషోత్తం, పీఓ డీటీటీ డాక్టర్ సుజాత, ధర్మవరం, పెనుకొండ డివిజన్ల ఉప వైద్యాధికారులు యుగంధర్, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ జాతర

◆ కిక్కిరిసిన కేంద్రాలు ◆ తరలివచ్చిన రైతులు



రైతులతో మాట్లాడుతున్న మంత్రి పరిటాలసునీత

జిల్లా వ్యవసాయం, న్యూస్‌టుడే: రుణమాఫీ సమస్యలపై శనివారం అనంతపురం మార్కెట్ యార్డులో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. అనంతపురం, కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో జాతరను తలపించింది. వ్యవసాయశాఖ 14 కేంద్రాలను ఏర్పాటు చేసింది. రైతులు కేంద్రాల వద్ద బారులు తీరారు. మూడేళ్ల కిందట తొలిసారిగా రూ.50 వేలు పూర్తిగా రుణమాఫీ అయిన వారు కూడా వచ్చారు. మూడో విడత రుణమాఫీ ఖాతాలకు ఇంకా జమకాలేదు. పరిష్కార వేదికలో ఇస్తే.. తక్షణమే సొమ్ము ఖాతాలో పడుతుందని భావించిన రైతులు పెద్ద సంఖ్యలో వచ్చారు. పెట్టుబడి రాయితీ అందలేదని పలువురు వచ్చారు. ఈనెల 29న రాప్తాడులో అర్జీలు ఇచ్చిన రైతులు మళ్లీ ఇక్కడ రావడంతో కేంద్రాలన్నీ కిక్కిరిసిపోయాయి. తొలి, రెండో విడతలో రుణమాఫీ వచ్చి మూడో విడతలో రానివారు, ఒకవేళ బాండ్లు పోగొట్టుకున్న వారు అర్జీలు ఇవ్వాలని వ్యవసాయాధికారులు చెబుతున్నా వినడం లేదు. రెండు రెవెన్యూ డివిజన్లలోని 28 మండలాల నుంచి సుమారు ఆరు వేలకుపైగా రైతులు వచ్చారు. శనివారం రాత్రి 10 గంటల వరకు రైతుల నుంచి వినతులు తీసుకున్నారు. జేడీఏ శ్రీరామ్మూర్తి, డీడీ శ్రీనివాసులు, ఏడీఏలు మోహన్‌విజయ్‌కుమార్, శ్రీనివాసులు రాత్రి వరకు అక్కడే ఉండి పర్యవేక్షించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన రైతులకు వ్యవసాయశాఖ భోజన వసతి కల్పించింది. జనవరి ఒకటో తేదీ కూడా రుణమాఫీ పరిష్కార వేదిక ఉంటుందని జేడీఏ తెలియజేశారు.

నేడు పెనుకొండ, ధర్మవరం డివిజన్లు

రుణమాఫీ పరిష్కార వేదిక తేదీలను మార్పు చేశారు. ఈనెల 31న పెనుకొండ, ధర్మవరం రెవెన్యూ డివిజన్లకు, జనవరి ఒకటో తేదీ కదిరి రెవెన్యూ డివిజన్‌కు అనంతపురం మార్కెట్‌యార్డులో రుణమాఫీ పరిష్కార వేదికను ఏర్పాటు చేశామని జేడీఏ శ్రీరామ్మూర్తి తెలిపారు. ఈనెల 31న పెనుకొండ డివిజన్‌లోని పెనుకొండ, సోమందేపల్లి, రొద్దం, మడకశిర, అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి, హిందూపురం, పరిగి, లేపాక్షి, చిలమత్తూరు, గోరంట్ల మండలాలకు, ధర్మవరం డివిజన్‌లోని ధర్మవరం, తాడిమర్రి, బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాల రైతులకు పరిష్కార వేదిక ఉంటుంది.

రేపు కదిరి డివిజన్:జనవరి 1న కదిరి రెవెన్యూ డివిజన్‌లోని కదిరి, నల్లమాడ, నంబులపూలకుంట, తలుపుల, నల్లచెరువు, ఓబుళదేవరచెరువు, తనకల్లు, అమడగూరు, గాండ్లపెంట, పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాలకు పరిష్కార వేదిక ఉంటుంది.

రుణమాఫీ సమస్యలు పరిష్కరిస్తాం

అనంతమార్కెట్‌యార్డు, న్యూస్‌టుడే : రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి రుణమాఫీ సమస్యలు పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సెర్ప్, మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. రెండోరోజు శనివారం అనంతపురం మార్కెట్ యార్డులో రైతు సాధికార సంస్థ, వ్యవసాయశాఖ సంయుక్తంగా రుణమాఫీ పరిష్కార వేదికను నిర్వహించారు. పరిష్కార వేదికను సాయంత్రం మంత్రి పరిశీలించారు. రైతులు రద్దీ ఉండడంతో మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. రైతులతో సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. రుణమాఫీ సమస్యలున్న రైతులు మాత్రమే రావాలని మంత్రి సూచించారు. రైతుల రద్దీను బట్టి మరోరోజు గడువు పెంచాలని అధికారులను ఆదేశించారు.

అంగన్‌వాడీల బలోపేతంపై ప్రత్యేక శ్రద్ధ

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: అనంత నగరంలోని అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని సీడీపీఓ కృష్ణకుమారి తెలిపారు. శనివారం అనంత అర్బన్ ప్రాజెక్టు కార్యాలయంలో వృత్తివిద్యా కోర్సు విద్యార్థినులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వ కేఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు నెల రోజులపాటు వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లో అధ్యయనం చేశారు. అక్కడ వారు ఎన్నో విషయాలను నేర్చుకున్నారు. ముగింపు కార్యక్రమంలో సీడీపీఓ మాట్లాడుతూ పలువురు వృత్తి విద్యా కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థినులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేస్తున్న పథకాలు, పౌష్టికాహారం పంపిణీ... వంటివి అధ్యయనం చేశారు. చాలా విషయాలు నేర్చుకున్నారు. పూర్వ ప్రాథమిక విద్యాబోధనను కూడా చేశారు. ఆఖరుకు పఠన సామగ్రిని తయారీ చేసి అంగన్‌వాడీ కేంద్రాలకు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కొండమ్మ, నేతాజీబీ, ఆ కళాశాల అధ్యాపకులు వసంతగౌరి, గిరిజా తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయాల జోరు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. డిసెంబరు 31న అర్ధరాత్రి దాకా విక్రయాలు సాగించేలా అబ్కారీశాఖ మద్యం దుకాణాలు, బార్లకు అనుమతులు ఇచ్చింది. దీంతో ఆదివారం మద్యం విక్రయాలు అధికంగా ఉంటాయని భావిస్తున్నారు. దీంతో శనివారం దుకాణాదారులు బారీగా సరకును తరలించారు. రోజూ సగటున 6 వేల కేసులు లిక్కర్ విక్రయాలు సాగుతుండగా శనివారం డిపోలో 11,140 కేసులు వ్యాపారులు తీసుకెళ్లారు. బీర్లు రోజూ 3 వేల కేసులు విక్రయాలుండగా 6,012 కేసుల విక్రయాలు సాగాయి. రెట్టింపు స్థాయిలో డిపో నుంచి నిల్వలు తీసుకెళ్లారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45 ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: 2018 సంవత్సరం జయప్రదం కావాలంటే..., లక్ష్మీదేవి అనుగ్రహం కోసం సంప్రదాయరీత్యా 2018ని ఎలా స్వాగతించాలి?, 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: పాడుతా తీయగా (రిపీట్), 10-00: శ్రీ భాగవతం (భక్తి రసాత్మక దృశ్యకావ్యం) 11-00: జబర్దస్త్ (కామెడీ షో రిపీట్).

మధ్యాహ్నం

12-00: జబర్దస్త్ జల్సా టైం (రిపీట్) 12-30: ఢీ-10 (సుప్రీం డాన్స్ షో) (రిపీట్), 2-00: సండే సూపర్‌హిట్ సినిమా: సామాన్యుడు (జగపతిబాబు).

సాయంత్రం

04-30: పుష్పకవిమానం (ప్రఖ్యాత దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు సినీ ప్రయాణం...) కమల్‌హాసన్, రేవతి, ఊర్వశి నటించిన 'ఆడవాళ్ళకు మాత్రమే' - చిత్ర విశేషాలు, 05-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ (రిపీట్), 6-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ జల్సా టైం (రిపీట్), 07-00: స్వరాభిషేకం: సుమధుర స్వరకర్తలు అందించిన అపురూప గీతాలతో...

రాత్రి

09-00: ఈటీవీ న్యూస్, 9-30: ఇట్స్ టైమ్ టు పార్టీ 2018 (గ్రాండ్ ఈవెంట్) న్యూఇయర్ స్పెషల్ నవ్వుల నజరానా...

ఈటీవీ ప్లస్

మధ్యాహ్నం

11:00 పోవే..పోరా రిపీట్

12:00 ఎక్స్‌ప్రెస్ రాజా బ్యాండ్ బాజా

01:00 ఎక్స్‌ట్రా జబర్దస్త్ రిమిక్స్ రిపీట్

02:00 పటాస్ పంచెస్ రిపీట్

03:00 క్రాక్ కిడ్స్ రిపీట్

సాయంత్రం

04:00 పటాస్ రిపీట్

05:00 సండే కామెడీ మూవీ.. 'శ్రీ కనక మహలక్ష్మీ రికార్డింగ్ డాన్స్ ట్రూప్'

రాత్రి

07:30 పటాస్ పంచెస్ రిపీట్

08:30 ఎక్స్‌ట్రా జబర్దస్త్ రిమిక్స్

09:30 నా షో నా ఇష్టం రిపీట్

10:30 సినిమా చూపిస్త మావ రిపీట్

11:30 పటాస్ రిపీట్

ఈటీవీ లైఫ్

★ సద్గురు సన్నిధిలో (ఉ. 6:00)

★ మానస (ఉ. 6:30, 7:00, 10:00, 10:30, 11:00)

★ సైజ్ జీరో (ఉ. 7:30)

★ అమృతం (ఉ. 8:00, మ. 12:00, 1:00, సా. 6:00, రా. 8:00)

★ హెల్దీ & టేస్టీ (ఉ. 8:30, మ. 12:30, 1:30, సా. 6:30, రా. 08:30)

★ ఆరోగ్యమస్తు (ఉ. 9:00, మ. 2:00, రా. 7:00, 9:00, 10:00)

★ డా.ఈటీవీ (ఉ. 9:30, మ. 2:30, 3:30, రా. 7:30, 9:30, 10:30)

★ అందరికి ఆరోగ్యం (మ. 3:00)

★ అమృతం చిరుధాన్యాలు స్పెషల్ (రా. 11:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: మధురానగరిలో (శ్రీకాంత్, నిరోషా) 10-00: మార్నింగ్ షో: బ్రహ్మచారి (ఏఎన్నార్) మధ్యాహ్నం: 1-00: మాట్నీ: మగ మహారాజు (చిరంజీవి) సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: రాజ్‌కుమార్ (శోభన్‌బాబు) రాత్రి: 7-00: ఫస్ట్ షో: నర్తనశాల (ఎన్టీఆర్, సావిత్రి) 10-00: సూపర్‌మస్తీ: వండర్‌ఫుల్ ఈవెంట్.

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - ఆకుకూర చిరుధాన్యాల పూరీ & బుల్గుర గోధుమ బెర్రీ క్రేప్స్, ఉ.8:30 వావ్ ఏమి రుచి - బొహెమియన్ సాస్ & ఆనియన్ రింగ్స్, ఉ.9.30: గోరు ముద్దలు - సూజీ & బ్రెడ్ పిజ్జా, ఉ.9.45: మమ్మీస్ కిచెన్ - కోకోనట్ కాజు మైసూర్ పాక్, ఉ.11.00: బాబాయ్ హోటల్ - తెలగపిండి ఎండు రొయ్యలు కూర & రొయ్యల కారం, ఉ.11.30: షాహీ దక్కని - తుటక్ & తల్వా ముర్గ్, మ.12.00, రా.8.30: సూపర్ ఛీమ్ - గేమ్ షో, మ.1.00, సా.5.30: అతిథి - మీ ఇంటింటి నేస్తం (న్యూ ఇయర్ స్పెషల్స్), మ.1.30, రా.10.30: ఆహారవీధిలో - ప్రముఖ రెస్టారెంట్‌లో, మ.2.00: చోటా షెఫ్ - పొటాటో వీల్స్, మ.2.15: పిండివంటలు, ప్రసాదాలు - పుట్నాలపిండి పాపిడి & స్వీట్ ఊతప్పం, మ.2.45: పదండి విందుకు - ప్రముఖ రెస్టారెంట్‌లో, మ.3.15: టేస్ట్ ఆఫ్ ఇండియా (పంజాబీ క్యూసైన్) - మఖనీ ఔర్ పన్నీర్ మఖ్‌మలీ, సా.3.30: కారాలు, పొడులు - మెంతి గసాల కారం పొడి & మెంతి రోటి పొడి, సా.4.30: షాహీ దక్కని - తుటక్ & తల్వా ముర్గ్, రా.7.30: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - ఖీమ సమోసా, రా.7.45: డైట్ మెనూ - మష్రూమ్ ఆమ్లెట్, రా.8.00: బ్రేక్ ఫాస్ట్ షో - కోడిగుడ్డు శెనగల చాట్ & గోధుమగడ్డి బాదం పాన్‌కేక్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 º, 08-30 యువ (రి), 09-00 ఘంటారావం, 09-30 కమర్షియల్ స్లాట్, 10-00 ఘంటారావం, 10-30 లక్ష్యం, 11-00 ఘంటారావం, 11-30 తెలుగు వెలుగు, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30: నారీ భేరి: కొత్త ఏడాది సరికొత్తగా..., 01-00 ఈటీవీ 360 º, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: వైద్యరంగం@2017, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30: తీర్థయాత్ర: శ్రీ మహాగణపతి దేవస్థానం, కల్పతి అగ్రహారం, పాలక్కడ్, కేరళ, 05-00 ఘంటారావం, 05-30 ఔరా!, 06-00 ఘంటారావం, 06-30 శ్రీనిలయం, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి!, 08-00 ఈటీవీ 360º, 09-00: మార్గదర్శి: హేమమాలిని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!.

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360º, 08-30 యువ (రి), 09 -00 ఘంటారావం, 09-30 కమర్షియల్ స్లాట్, 10-00 ఘంటారావం, 10-30 లక్ష్యం, 11-00 ఘంటారావం, 11-30 తెలుగు వెలుగు, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30: నారీ భేరి: కొత్త ఏడాది సరికొత్తగా..., 01-00 ఈటీవీ 360º, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30: తీర్థయాత్ర, శ్రీ నందీశ్వరస్వామి దేవస్థానం, రాయచూర్, కర్ణాటక, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: వైద్యరంగం@2017, 05-00 ఘంటారావం, 05-30 ఔరా!, 06-00 ఘంటారావం, 06-30 శ్రీనిలయం, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి!, 08-00 ఈటీవీ 360º, 09-00: మార్గదర్శి: హేమమాలిని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!.

ఏ ఛానల్లో ఏముంది.. 31-12-2017

SVBC: **ఉదయం:** 06-30 శుభోదయం + నిత్యపూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు సమాహారం, 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయె - సూర్యభగవాన్, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు కన్నడ, 10-30 భగవద్గీత - బాలవికాసం, 11-00 వేదసూక్తం, 11-30 స్పెషల్ న్యూస్ - ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 నరసింహ దివ్యక్షేత్రాలు, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్రనామామృతం, 02-00 సినిమా, **సాయంత్రం:** 04-30 విలువలు - విజ్ఞానం, 05-00 లైవ్ ఎస్.డి సేవ + స్పెషల్ న్యూస్ + లక్ష్మీగద్యం, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + భవయామి రఘురామం, 08-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం, 09-30 అద్భుత ఆలయాలు - మురుడేశ్వర్ ఆలయం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 లైవ్ నామసంకీర్తనం.

భక్తి TV: **ఉదయం:** 06-00 శ్రీగణేశ సహస్రం, 6-30 శ్రీ లక్ష్మీసహస్రం, 7-00 అర్చన, 7-30 శ్రీ కనకధారస్తోత్రం, 8-00 పుణ్యక్షేత్రం, 9-00 వారఫలం, 10-00 వైకుంఠవైభవం, 11-00 ధర్మసందేహాలు, 11-30 వేదం.. జీవననాదం, 04-30 పుణ్యక్షేత్రం, 5-00 శ్రీకనక ధారస్తోత్రం, 5-30 శ్రీగణేశసహస్రం, 06-00 శ్రీ లక్ష్మీసహస్రం, 7-00 భక్తివిశేషాలు 7-30 అదృష్టం-2018, 8-30 వైకుంఠవైభవం, 9-00 వారఫలం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తి విశేషాలు 11-00 స్వాగతం-2018 (లైవ్).

Zee తెలుగు: **ఉదయం:** 06-30 టెలీషాపింగ్, 07-00 జీటియమ్- టెలీషాపింగ్, 07-30 ఓం కారం, 08-00 డా. సుభాష్ చంద్ర షో, 10-00 సినిమా: సుప్రీమ్, 9-00 జీ గోల్డెన్ అవార్డ్స్ 2017, **మధ్యాహ్నం:** 01-00 సినిమా: రారండోయ్ వేడుక చూద్దాం, 04-00 జీ గోల్డెన్ అవార్డ్స్ 2017 , **సాయంత్రం:** 06-00 సినిమా: శ్రీమంతుడు, **రాత్రి:** 09-00 కొంచెం టచ్‌లో ఉంటే చెప్తా, 10-00 గోల్డ్‌రష్ (రిపీట్), 11-00 పోలీస్ డైరీ.

maa: **ఉదయం:** 06-30 మ్యూజిక్ బాక్స్, 07-00 ఫిల్మ్ బేస్డ్, 07-30 విహారి, 08-00 రాశి ఫలాలు - దిన ఫలం, 09-00 సినిమా: సింగం-3, **మధ్యాహ్నం:** 12-30 సినిమా: జనతా గ్యారేజ్, 04-00 సినిమా: మన్యం పులి, **సాయంత్రం:** 07-00 సినిమా: ఫిదా, 10-00 సాహో రే 2018.

GEMINI: **ఉదయం:** 06-30 టెలీషాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 స్పెషల్ ప్రోగ్రామ్, 08-30 సినిమా: కిట్టు ఉన్నాడు జాగ్రత్త, **మధ్యాహ్నం:** 11-20 సినిమా: అల్లుడు శీను, 02-25 సినిమా: టెంపర్, **సాయంత్రం:** 05-30 సినిమా: పైసా వసూల్, **రాత్రి:** 08-30 ఫిదా: మీ ఫేవరేట్ స్టార్‌తో.., 09-30 బ్లాక్ బాస్టర్, 10-30 హ్యాపీ హ్యాపీ 2018.

HBO: ఉదయం: 06-14 స్టార్ ట్రెక్, 08-19 బీతోవెన్, 09-57 ది డిక్టేటర్, 11-23 ఐరన్‌మ్యాన్, మధ్యాహ్నం: 01-36 ది హ్యాంగ్ ఓవర్ పార్ట్ 2, 03-19 మడ్‌గాస్కర్: ఎస్కేప్ 2 ఆఫ్రికా, సాయంత్రం: 04-58 ది డార్క్‌నైట్ రైజెస్, రాత్రి: 08-00 ట్రాన్స్‌ఫార్మర్స్ : రివెంజ్ ఆఫ్ ది ఫాలెన్, 10-43 జి.ఐ.జో :రిటాలియేషన్.

STAR MOVIES: **ఉదయం:** 06-16 పెర్సి జాక్సన్: సీ ఆఫ్ మాన్‌స్టర్స్, 08-23 ది అడ్వెంచర్స్ ఆఫ్ టిన్‌టిన్, 10-30 జుమాంజి, **మధ్యాహ్నం:** 12-40 జూటోపియా, 02-46 ట్రోల్స్, **సాయంత్రం:** 04-34 ఇండిపెండెన్స్‌డే :రిసర్జెన్స్, రాత్రి: 07-06 కుంగ్ ఫూ పాండా 3, 09-00 రోగ్ వన్: ఎ స్టార్ వార్స్ స్టోరీ, 11-48 ఛాపి.

SONY PIX: ఉదయం: 06-00 ది గార్డియన్, 07-50 2012, 11-15 ది షాలోస్, మధ్యాహ్నం: 01-00 ది మమ్మీ రిటర్న్స్, 03-51 బిగ్ హీరో 6, సాయంత్రం: 06-03 ది కరాటే కిడ్, రాత్రి: 09-14 లూసి, 11-00 హిట్స్.

StarGOLD: ఉదయం: 05-30 లిటిల్ కృష్ణ 3: ది వండర్స్ ఫీట్స్, 07-30 సింగం రిటర్న్స్, 10-35 సర్దార్‌జీ 2, మధ్యాహ్నం: 01-35 హౌజ్‌ఫుల్ 2, సాయంత్రం: 05-00 సన్ ఆఫ్ సర్దార్, రాత్రి: 07-55 సింగం, 11-00 బజరంగి బాయ్‌జాన్.

వ్యవసాయ పరిజ్ఞానం - క్విజ్

1. కింది పోషక ధాతువుల్లో పంట మొక్కలు, పండ్ల వృక్షాలకు తప్పనిసరిగా వాడాల్సిన అవసరం లేని సూక్ష్మపోషకం?
ఎ) మాంగనీసు బి) బోరాన్
సి) సోడియం డి) సున్నం

2. ఖనిజాలు అనేవి ముఖ్యంగా?
ఎ) పంటల సాగుకు అవసరమైనవి
బి) పునరుత్పత్తి చేయలేనివి
సి) పరిశ్రమాభివృద్ధికి డి) ఏదీకాదు

3. భారతదేశంలో అత్యల్ప వర్షపాతం ఉన్న ప్రాంతం?
ఎ) దక్కను పీఠభూమి బి) జైసల్మేర్
సి) అనంతపురం డి) జోధ్‌పూర్

4) పొగమల్లె బెడద లేకుండా చేసేందుకు శాశ్వత నివారణ చర్య ఏది?
ఎ) వేసవి లోతు దుక్కులు చేసి రెండు, మూడు సంవత్సరాలు పంటమార్పిడి చేయాలి బి) లోతుదుక్కులు చేసి వంగ టొమాటోతో పంటమార్పిడి చేయాలి సి) లోతు దుక్కులు చేయాలి డి) పంట విరామం పాటించాలి

5. సూక్ష్మజీవులను ఉపయోగించి కాలుష్య కారకాలను నిర్మూలించే విధానాన్ని ఏమంటారు?
ఎ) బయో అక్క్యుమలేషన్ బి) బయోలాజికల్ కంట్రోల్ సి) బయోరెమిటేషన్
డి) బయోమ్యాగ్నిఫికేషన్

6. తెలంగాణ ప్రాంతంలో ఎక్సాలి పంటగా చెరకు నాటేందుకు అనువైన సమయం ఏది?
ఎ) ఆగస్టు నుండి సెప్టెంబరు
బి) డిసెంబరు నుండి జనవరి
సి) జనవరి నుండి మార్చి డి) జూన్ మొదటి వారం నుండి జులై ఆఖరు

7. నువ్వు పంటకు అనువైన సమయం ఏది?
ఎ) వర్షాకాలం బి) మాఘీ పంట కాలం
సి) చలి కాలం డి) వేసవి కాలము

8. కర్బూజ సాగుకు నేల ఉదజని సూచిక ఎంతుండాలి?
ఎ) 5.5 కంటే తక్కువ బి) 6.0 నుండి 7.0 వరకు మిక్కిలి అనుకూలం సి) 8.5 కంటే ఎక్కువ డి) 4.0 నుండి 5.0 వరకు మిక్కిలి అనుకూలం

9. అగాకర జాతి మొక్కల వ్యాప్తి ప్రత్యుత్పత్తి ఎలా చేస్తారు?
ఎ) విత్తనం ద్వారా బి) 5 కణుపులున్న కొమ్మల ద్వారా సి) దుంపల ద్వారా
డి) వీలును బట్టి అన్ని విధానాలలో

10. వేసవి పొద్దుతిరుగుడు పంటలో ముదురు ఆకులు లేత ఆకుపచ్చరంగులోఉండి- మచ్చలుఏర్పడితే సూక్ష్మ పోషక ధాతువు లోపాన్ని సూచిస్తుంది?
ఎ) యశదం బి) మాలిబ్డినం
సి) బోరాన్ డి) సున్నం

11. ఆపిల్ బేర్ ప్రవర్ధనం ఎలా చేస్తారు?
ఎ) మొగ్గంట్ల ద్వారా బి) ఛేదనములు (కట్టింగ్స్) సి) విత్తనముల ద్వారా
డి) వేర్లద్వారా

సమాధానాలు:
1) సి 2) బి 3) బి 4) ఎ 5) సి 6) బి 7) డి 8) బి 9) డి 10) బి 11) ఎ

– కూర్పు: **గొంటుముక్కల రామయ్య,** కర్నూలు

రబీ మొక్కజొన్న సాగులో మెలకువలు



జిల్లాలోని మెట్ట మండలాల్లో ఈ రబీలో దాదాపు 50 వేల హెక్టార్లలో మొక్కజొన్నను సాగు చేస్తున్నారు. అక్టోబరు నుంచి జనవరి రెండో వారం వరకు విత్తుతారని పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ సహాయ సంచాలకులు డాక్టర్ పిజి.బుజ్జిబాబు తెలిపారు. మొక్కజొన్న విత్తే సమయంలో, పంటదశలో పాటించాల్సిన మెలకువలను వివరించారు.

సాధారణ రకానికి 7 కిలోలు, పాప్‌కార్న్ మాధురి రకాలకు 4 కిలోల విత్తనాలు విత్తనశుద్ధి చేసి ఎకరాలో విత్తాలి. 48 కిలోలు నత్రజని, 24 కిలోలు భాస్వరం, 20 కిలోలు పొటాష్‌ను ఎకరా పైరుకు వెయ్యాలి. పంట 45 రోజులప్పుడు కల్టివేటర్‌తో అంతరకృషి చేసి ఆ తర్వాత బోదె నాగలితో సాలు చేసుకోవాలి. రబీలో చీడపీడలు ఎక్కువగా ఆశిస్తాయి.

★ **గులాబీరంగు పురుగు:** ఇది పత్రహరితాన్ని తినేస్తుంది. దీని నివారణకు కార్బోఫ్యూరాన్ గుళికలు ఎకరాకు మూడు కిలోలు వాడాలి.

★ **రసంపీల్చే పురుగులు:** 30 రోజులు పైబడిన పైరులో నల్లి, పేనుబంక పురుగు ఆశిస్తాయి. పంట ఎదిగే భాగం నుంచి ఇవి రసాన్ని పీల్చేస్తాయి. వీటి నివారణకు డైమిథోయేట్ లేదా మోనోక్రోటోఫాస్ 2 మి.లీ., నీటికి చొప్పున కలిపి పైరుపై పిచికారి చెయ్యాలి.

★ **ఆకుమాడు తెగులు:** ఇది ఆశించిన ఆకులపై మచ్చలు కనిపిస్తాయి. నివారణకు 2.5 గ్రా. మాంకోజెబ్ లీటరు నీటికి కలిపి పిచికారి చెయ్యాలి.

★ **మసికుళ్లు:** నివారణకు.. పుష్పించే దశ నుంచి పంటకు నీటిఎద్దడి రాకుండా చూడాలి. పూతదశలో ముందుగా పొడతెడులు ఆశిస్తుంది. దీని నివారణకు.. ఒక గ్రాము కార్బెండిజమ్, లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చెయ్యాలి.

★ కండెపైగల పొరలు విడిపోయి గింజ మొదట్లో నల్లటి చారికలకు ఏర్పడటం పంట పరిపక్వతకు సూచన. ఈ దశలో కండెలను మొక్కల నుంచి వేరు చేసి 3, 4 రోజులు ఎండలో ఆరబెట్టాలి. తర్వాత విత్తనాలను యంత్రం సహాయంతో ఒలుచుకుంటే మేలు.

– న్యూస్‌టుడే, చింతలపూడి (ప.గో.జిల్లా)

డీఎస్సీలో అన్ని ఖాళీలను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వం రాష్ట్రంలోని ఉపాధ్యాయ ఖాళీ పోస్టులన్నింటిని, సమగ్రంగా రూపొందించి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఎనుములపల్లి ఉన్నత పాఠశాలను సందర్శించి, పాఠశాలలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సాయి ఆరామంలో మాట్లాడుతూ ప్రభుత్వం 12వేల ఉపాధ్యాయ పోస్టులు అవసరమని భర్తీ చేస్తామని ప్రకటన చేస్తోందని, అన్ని విద్యాసంస్థల్లో దాదాపు 20 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అన్నిటికి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. 400 మంది విద్యార్థులున్న ప్రతి ఉన్నత పాఠశాలలో ఇద్దరు పీఈటీలను నియమించాలని, ఇందులో ఒక మహిళ ఉండేలా చూడాలన్నారు. మైనార్టీ భాషలు ఉర్దూ, కన్నడం, తమిళం, మరాఠీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వం ఏపీపీఎస్సీ ద్వారా కాకుండా విద్యాశాఖ ద్వారానే నియామకాలు చేపట్టాలన్నారు. నూతనంగా ఏర్పాటైన మున్సిపాలిటీలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు హెచ్ఆర్ఏ పెంచాలన్నారు. పీఆర్సీ బకాయిలు వెంటనే ఇవ్వాలని, వేతన సంఘాన్ని నియమించాలన్నారు. ఆదర్శపాఠశాలలను ప్రభుత్వ పాఠశాలలుగా చేర్చుకొని, పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. సీపీఎస్ విధానంపై ప్రభుత్వ వైఖరి ఏమిటో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయులు హక్కులు, సమస్యల కోసం పోరాడడమే కాకుండా పాఠశాలల పరిరక్షణ, విద్యార్థులకు ఉన్నత బోధన, విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతిలో ఉందని, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది సమాజానికి అందించాలన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో ఎంఈవో గోపాల్‌నాయక్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్, యూటీఎఫ్ నాయకులు సంపత్‌కుమార్, శివశంకర్, భాస్కర్, రవీంద్రరెడ్డి, బాబయ్య, మల్లికార్జున, వాసు, వెంగమనాయుడు, రవిచంద్ర, పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

అన్యాయం చేస్తే ఊరుకోం

జిల్లా సచివాలయం: మాదిగలకు అన్యాయం చేస్తే ఊరుకోమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఈశ్వరయ్య హెచ్చరించారు. అనేక సమస్యలపై శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు కొందరికే అనుమతివ్వడంతో డీఆర్వో రఘునాథ్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు ఈశ్వరయ్య మాట్లాడుతూ విద్య, ఉద్యోగం, వైద్యం, భూపంపిణీ, రుణాల మంజూరు, పింఛన్ల పంపిణీలో మాదిగలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఒప్పంద పద్ధతిలో కాకుండా ప్రభుత్వశాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఆయన డిమాండు చేశారు. నిరుద్యోగులకు బ్యాంకులతో సంబంధం లేకుండా కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలన్నారు. తప్పెట కళాకారులకు పింఛన్లు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకన్న, అక్కులప్ప, జయప్రకాష్, తిమ్మరాజు, వన్నూరుస్వామి తదిరులు పాల్గొన్నారు.

అనధికార భవనాలను కూల్చేయండి



మాట్లాడుతున్న పట్టణ ప్రణాళికశాఖ సంచాలకులు రాముడు

అనంత నగరపాలిక, న్యూస్‌టుడే: నగరంలో అనధికార భవనాలను కమిషనర్ సహకారంతో కూల్చివేయాలని పట్టణ ప్రణాళిక శాఖ రాష్ట్ర సంచాలకులు రాముడు ఆదేశించారు. రాయలసీమ జిల్లాల పట్టణ ప్రణాళిక అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మూడోరోడ్డులోని జీఆర్ ఫంక్షన్‌హాల్లో శనివారం ఈ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ అనధికార భవనాలు తొలుత 100 గుర్తించాలని, నిబంధన ప్రకారం కమిషనర్ చొరవతో వాటిని కూల్చేయాలన్నారు. అన్ని మున్సిపాలిటీల్లోనూ అక్రమ భవనాలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీల వారిగా ప్లాన్‌అప్రూవల్‌పై ఆరా తీశారు. భవన నిర్మాణాల అనుమతులు (ప్లాన్ అప్రూవల్) మంజూరు చేయడంలో నిర్లక్ష్యం చేస్తే ఇంటికి పంపిస్తానని నంద్యాలకు చెందిన బాలసిద్ధయ్య, పలమనేరుకు చెందిన షణ్ముఖంలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 5 సంవత్సరాల అనుభవం ఉన్నా ప్లాన్‌అప్రూవల్స్ ఎందుకు జారీ చేయడం లేదని నిలదీశారు. అక్రమాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. పట్టణ ప్రణాళిక విభాగం అంటే కేవలం అనుమతులు మంజూరు చేయడమే కాదు, సుందరీకరణకు కూడా కృషి చేయాలన్నారు. మాస్టర్‌ప్లాన్ అమలు చేయాలని సూచించారు. మున్సిపల్ ఆర్డీ రవీంద్రబాబు మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక విభాగం మున్సిపాలిటీల్లో కీలకమని, అనధికార భవనాలు, రోడ్డు ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. లైసెన్స్ సర్వేయర్లు కూడా అక్రమ భవనాలు నిరోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక విభాగం ఉప సంచాలకులు రామకృష్ణ, పుడా ఉపాధ్యక్షుడు మల్లయ్య, తుడా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణ ప్రణాళిక ఆర్డీ శైలజ, నగర ఏసీపీ ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

భూ అక్రమాలకు కళ్లెం



మాట్లాడుతున్న ఏడీ మశ్చీంద్రనాథ్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: భూ అక్రమాలకు కళ్లెం వేయడానికి ప్రభుత్వం సిద్ధమయింది. కొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. భూమి హద్దులకు (ఎఫ్-లైన్ పిటిషన్లు) మీసేవలో దరఖాస్తు తీసుకుంటున్నారు. దీన్ని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రయోగాత్మకంగా చేపడుతున్నారని భూరికార్డులు, సర్వే శాఖ సహాయ సంచాలకులు మశ్చీంద్రనాథ్ ఆదేశించారు. దీనిపై శనివారం రెవెన్యూ భవన్‌లో సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ భూమి కొనుగోలు తర్వాత తప్పకుండా తహసీల్దారుతో భూమార్పిడి చేసుకోవాలన్నారు. 1బీ అడంగల్ ఉంటేనే మీసేవలో దరఖాస్తు చేసుకునే వీలుంటుంది. లేకపోతే ఆన్‌లైన్‌లో చేయడానికి కుదరదన్నారు. మీసేవ నుంచి తహసీల్దారు లాగిన్‌కు వెళుతుంది. దాన్ని తహసీల్దారు 48 గంటల్లో సర్వేయర్ లాంగిన్‌కు పంపుతారన్నారు. ఒకవేళ పంపకపోయిన సర్వేయర్ లాగిన్‌కు వచ్చేస్తుందని ఆయన తెలిపారు. ఎఫ్-లైన్‌లో ఒక నంబరు వస్తుందని, దాన్ని మార్చడానికి ఉండదన్నారు. అర్జీదారుడి నోటీసు ఆన్‌లైన్‌లో నమోదవుతుంది. ఆ నోటీసును అర్జీదారునితో పాటు చుట్టుపక్కల ఉన్న రైతులకు సర్వేయర్ పంపాలన్నారు. ఒకవేళ అర్జీదారుడు రాకపోతే పొరుగు రైతులతో సంతకాలు తీసుకుని, సర్వేయర్ నివేదికతో తహసీల్దారు లాంగిన్‌కు పంపాలి. దాన్ని సరిచూసిన తర్వాత ఆ అర్జీని రద్దు చేసే అధికారం తహసీల్దారుకు ఉంటుందని ఏడీ వివరించారు. తద్వారా భూఅక్రమాలకు పూర్తిగా అడ్డుకట్ట వేయవచ్చని ఆయన తెలియజేశారు.

పరీక్షల విభాగం మరింత పటిష్ఠం



నాగేంద్రకు ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ

ఎస్.కె.విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరీక్షల విభాగం మరింత పటిష్ఠం చేసే దిశగా ఉపకులపతి రాజగోపాల్ నిర్ణయించారు. ఎస్కేయూలోని అన్ని రకాల పరీక్షల విభాగాలన్నీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చిన ఉపకులపతి డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ఏర్పాటు చేశారు. ఈక్రమంలో పరీక్షల నిర్వహణ మరింత కట్టుదిట్టంగా నిర్వహించి, సకాలంలో ఫలితాలు విడుదల చేయడానికి ముగ్గురు అదనపు సంచాలకులను నియమించారు. కంప్యూటర్‌సైన్సు విభాగానికి చెందిన ఆచార్య నాగేంద్ర, లైబ్రరీసైన్సు ఇన్ఫరేషన్ విభాగం అధిపతి దాశరథి రవీంద్ర, ఆర్థికశాఖ విభాగానికి చెందిన రామప్పలను నియమించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రధానాచార్యులు రాఘవేంద్రరావును కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వ్యాయామ విభాగానికి చెందిన డాక్టర్ బి.జెస్సీ మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎంపీఈడీ) కోర్సుకు బోధన చేయడానికి అవకాశం కల్పించారు.

ఆర్టీసీలో అధికారుల బదిలీ

అనంతపురం ఆర్టీసీ న్యూస్‌టుడే: అనంతపురం రీజియన్ వ్యాప్తంగా ఆర్టీసీలో పలువులు అధికారుల బదిలీలు జరిగాయి. అనంతపురం రీజినల్ కార్యాలయంలో పనిచేస్తున్న పీఓ(పర్సనల్ ఆఫీసర్) చంద్రాయుడు కర్నూలుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కడప అసిస్టెంట్ మేనేజరు అశ్విని కుమార్ రానున్నారు. అలాగే కళ్యాణదుర్గం డిపో మేనేజరుగా పనిచేస్తున్న పెంచలయ్య స్థానంలో తిరుపతి అసిస్టెంట్ మెనేజరు (టెక్నికల్) డీఆర్ నాయుడు రానున్నారు. తాడిపత్రిలో అసిస్టెంట్ మేనేజరుగా పనిచేస్తున్న ఎస్ఎండీ హుస్సేన్ కడప ఎస్ఓగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సుబ్బారావు బాధ్యతలు చేపట్టనున్నారు.

రజకులను ఎస్సీల్లో చేర్చాలి



మాట్లాడుతున్న దేవేంద్రప్ప

బళ్లారిరోడ్డు, న్యూస్‌టుడే: ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు రజకులను ఎస్సీలుగా గుర్తించాలని రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవేంద్రప్ప కోరారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో రజక ఐక్య వేదిక ఆధ్వర్యంలో రాయలసీమ జిల్లాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులను ఎస్సీల్లో చేర్చే వరకు ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. రెండు ఎమ్మెల్యే స్థానాలు లేదా ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్లు ఇవ్వాలన్నారు. 50 ఏళ్లు ముగిసిన రజకులకు పింఛన్ మంజూరు చేయాలన్నారు. ప్రతి మండలంలో కమ్యూనిటీ భవనాలు నిర్మించాలని, రజక యువతి, యువకులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రజకులకు అవకాశాలు కల్పించే పార్టీలకే తమ మద్దతు ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగన్న, లింగమయ్య, కమ్మన్న, చంద్రశేఖర్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు రాంబాబు, చిత్తూరు ప్రకాష్, కడప శ్రీనివాసులు, దాము, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కక్షిదారులకు విశ్రాంతి గది


మూడోరోడ్డు(అనంతపురం), న్యూస్‌టుడే: కోర్టుకు వచ్చే కక్షిదారులు వేచి ఉండటానికి విశ్రాంతి గదులు ఎంతో అవసరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శశిధర్‌రెడ్డి అన్నారు. కోర్టు ఆవరణలో కక్షిదారుల కోసం ఏర్పాటు చేసిన గదిని ఆయన శనివారం ప్రారంభించారు. జిల్లా కోర్టు సముదాయంలోని కోర్టులకు వాయిదాల కోసం అనేక మంది కక్షిదారులు వస్తుంటారన్నారు. వారు కాసేపు సేద తీరేందుకు విశ్రాంతి గదిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి మురళీమోహన్‌రెడ్డి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాధమ్మ, సీనియర్ సివిల్ జడ్జి కమలాకర్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.



విశ్రాంతి గదిని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి

2017 క్రీడలు

15 జులై



వింబుల్డన్ మహిళల సింగిల్స్ విజేతగా గార్బైన్ ముగురుజ (స్పెయిన్) నిలిచింది. రన్నరప్ వీనస్ విలియమ్స్ (అమెరికా).

29 అక్టోబరు



ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ సిరీస్ బ్యాడ్మింటన్ టైటిల్‌ను ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్ నెగ్గాడు. తద్వారా ఒక ఏడాదిలో 4 సూపర్ సిరీస్ టైటిళ్లు సాధించిన ఏకైక భారత షట్లర్‌గా శ్రీకాంత్ రికార్డు సృష్టించాడు.

ప్రతిభ

పాలీ ఉమ్రిగర్ అవార్డు విజేత...?

జనవరి

8: చెన్నై ఓపెన్ టెన్నిస్ టోర్నీ సింగిల్స్ టైటిల్‌ను రాబర్టో బౌటిస్టా అగట్ (స్పెయిన్) గెలుచుకున్నాడు.

22: భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ మలేసియా మాస్టర్స్ గ్రాండ్ ప్రి గోల్డ్ టైటిల్ నెగ్గింది. ఫైనల్లో చోచువాంగ్ (థాయ్‌లాండ్)ను ఓడించింది.

28: ఆస్ట్రేలియన్ ఓపెన్ - 2017 మహిళల సింగిల్స్ విజేతగా సెరెనా విలియమ్స్ (అమెరికా) నిలిచింది. ఫైనల్లో అక్క వీనస్ విలియమ్స్‌పై నెగ్గింది.

✪ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్) నెగ్గాడు. ఫైనల్లో రఫెల్ నాదల్ (స్పెయిన్)ను ఓడించాడు.

ఫిబ్రవరి

7: జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను సౌరభ్‌వర్మ నెగ్గాడు. మహిళల సింగిల్స్ టైటిల్‌ను రితూపర్ణ దాస్ చేజిక్కించుకుంది.

12: భారత అంధుల క్రికెట్ జట్టు టీ20 ప్రపంచకప్ విజేతగా నిలిచింది. బెంగళూరులో జరిగిన ఫైనల్‌లో పాకిస్థాన్‌పై నెగ్గింది.

మార్చి

7: మొబైల్ తయారీ సంస్థ ఒప్పో అయిదేళ్ల కాలానికి రూ. 1079 కోట్లు చెల్లించి టీమిండియా స్పాన్సర్‌షిప్ సొంతం చేసుకుంది.

ఏప్రిల్

2: ఇండియా ఓపెన్ సూపర్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విజేతగా పీవీ సింధు నిలిచింది. రన్నరప్ కరోలినా మరిన్ (స్పెయిన్).

23: మాంటెకార్లో మాస్టర్స్ సిరీస్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను రఫెల్ నాదల్ (స్పెయిన్) నెగ్గాడు. ఈ టోర్నీ విజేతగా నిలవడం నాదల్‌కు ఇది పదోసారి కావడం విశేషం. దీంతో క్లే కోర్టులపై అత్యధికంగా 50 సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన క్రీడాకారుడిగా గుర్తింపు పొందాడు.

30: భారత స్క్వాష్ క్రీడాకారిణి జోష్న చిన్నప్ప ఆసియా స్క్వాష్ టైటిల్ గెలిచిన తొలి భారత ప్లేయర్‌గా నిలిచింది. చెన్నైలో జరిగిన ఫైనల్లో భారత్‌కే చెందిన దీపిక పల్లికల్‌పై నెగ్గింది.

మే

6: అజ్లాన్‌షా హాకీ టోర్నీ విజేతగా బ్రిటన్ నిలిచింది. మలేసియాలోని ఇఫోలో జరిగిన టోర్నీలో ఆస్ట్రేలియా రన్నరప్‌గా, భారత్ మూడో స్థానంలో నిలిచాయి.

21: ఐపీఎల్ -2017 (సీజన్ 10) విజేతగా ముంబయి ఇండియన్స్ నిలిచింది. హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్లో రైజింగ్ పుణె సూపర్ జైంట్స్‌పై విజయం సాధించింది. మూడు ఐపీఎల్ టైటిళ్లు గెలిచిన తొలి జట్టుగా ముంబయి నిలిచింది.

28: దక్షిణ కొరియా జట్టు సుదిర్మన్ కప్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేతగా నిలిచింది. ఫైనల్లో చైనాపై నెగ్గింది.

జూన్

4: తెలుగు తేజం భమిడిపాటి సాయి ప్రణీత్ థాయ్‌లాండ్ ఓపెన్ గ్రాండ్ ప్రి గోల్డ్ బ్యాడ్మింటన్ టైటిల్ నెగ్గాడు. సాయి కెరియర్‌లో ఇదే తొలి ప్రి గోల్డ్ టైటిల్.

10: ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ విజేతగా జెలెనా వోస్టాపెంకో (లాత్వియా) నిలిచింది. రన్నరప్ సిమోనా హలెప్ (రొమేనియా).

✪ పురుషుల సింగిల్స్ విజేతగా రఫెల్ నాదల్(స్పెయిన్) నిలిచాడు. రన్నరప్‌గా వావ్రింకా (స్విట్జర్లాండ్) నిలిచాడు.

18: ఇండోనేషియా ఓపెన్ సూపర్‌సిరీస్ ప్రీమియర్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేతగా తెలుగు తేజం కిదాంబి శ్రీకాంత్ నిలిచాడు. రన్నరప్ కజుమస సకాయ్ (జపాన్).

10 ఫిబ్రవరి

హైదరాబాద్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి ద్విశతకం (204) నమోదు చేశాడు. తద్వారా వరుసగా 4 టెస్ట్ సిరీస్‌ల్లో డబుల్ సెంచరీలు సాధించిన ఏకైక బ్యాట్స్‌మన్‌గా రికార్డు సృష్టించాడు.



1 మార్చి

2015-16 సీజన్‌కు బీసీసీఐ వార్షిక అవార్డులను ప్రకటించింది. పాలీ ఉమ్రిగర్ అవార్డును విరాట్ కోహ్లికి ప్రకటించారు. 2011-12, 2014-15 లో కూడా ఈ అవార్డు గెలుచుకున్న కోహ్లి, మూడుసార్లు దీనికి ఎంపికైన తొలి భారత క్రికెటర్‌గా నిలిచాడు.

జులై

9: భువనేశ్వర్‌లో జరిగిన ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ 29 (12 + 5 + 12) పతకాలతో అగ్రస్థానంలో నిలిచింది.

15: వింబుల్డన్ పురుషుల సింగిల్స్ విజేతగా రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్) నిలిచాడు. లండన్‌లో జరిగిన ఫైనల్లో మారిన్ సిలిచ్ (క్రొయేషియా)పై నెగ్గాడు.

23: మహిళల క్రికెట్ ప్రపంచకప్ విజేతగా ఇంగ్లండ్ నిలిచింది. లండన్‌లోని లార్డ్స్‌లో జరిగిన ఫైనల్లో 9 పరుగుల తేడాతో భారత్‌పై నెగ్గింది. భారత్ జట్టు కెప్టెన్‌గా మిథాలీ రాజ్ వ్యవహరించారు.

24: యూఎస్ ఓపెన్ గ్రాండ్ ప్రి గోల్డ్ టోర్నీ పురుషుల సింగిల్స్ టైటిల్ విజేతగా భారత్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ నిలిచాడు. రన్నరప్ - భారత క్రీడాకారుడు పారుపల్లి కశ్యప్.

ఆగస్టు

6: లండన్‌లో జరిగిన ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల పరుగులో అమెరికా అథ్లెట్ జస్టిన్ గాట్లిన్ స్వర్ణం నెగ్గాడు. ఉసేన్ బోల్ట్ (జమైకా) తన చివరి రేసులో కాంస్యానికే పరిమితమయ్యాడు.

17: బల్గేరియా ఓపెన్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను భారత్‌కు చెందిన లక్ష్యసేన్ నెగ్గాడు.

27: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను ఒకుహర (జపాన్) నెగ్గింది. రన్నరప్‌గా పీవీ సింధు నిలిచింది. పురుషుల సింగిల్స్ టైటిల్‌ను విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్) నెగ్గాడు.

సెప్టెంబరు

5: వరల్డ్ రెజ్లింగ్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో పాల్గొన్న తొలి భారతీయురాలిగా హరియాణాకు చెందిన కవితాదేవి చరిత్ర సృష్టించింది.

7: కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో రాగాల వెంకట రాహుల్, రాగాల వరుణ్ స్వర్ణాలు నెగ్గారు.

10: యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను స్లోన్‌స్టీవెన్స్ (అమెరికా) గెలిచింది. ఫైనల్లో మాడిసన్ కీస్‌పై నెగ్గింది.

✪ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను రఫెల్ నాదల్ (స్పెయిన్) నెగ్గాడు. రన్నరప్ - కెవిన్ ఆండర్సన్ (దక్షిణాఫ్రికా).

17: కొరియా ఓపెన్ సూపర్ సిరీస్ విజేతగా పీవీ సింధు నిలిచింది. సియోల్‌లో జరిగిన ఫైనల్లో ఒకుహర (జపాన్)పై నెగ్గింది.

అక్టోబరు

22: ఆసియాకప్ హాకీ టోర్నీ విజేతగా భారత్ నిలిచింది. ఢాకాలో జరిగిన ఫైనల్లో 2-1 తో మలేసియాపై నెగ్గింది.

✪ డెన్మార్క్ ఓపెన్ సూపర్ సిరీస్ విజేతగా కిదాంబి శ్రీకాంత్ నిలిచాడు. రన్నరప్ లీ హ్యున్ (దక్షిణ కొరియా).

28: భారత్ తొలిసారిగా ఆతిథ్యమిచ్చిన ఫిఫా అండర్ -17 ప్రపంచకప్ విజేతగా ఇంగ్లండ్ నిలిచింది. కోల్‌కతాలో జరిగిన ఫైనల్లో 5-2 గోల్స్‌తో స్పెయిన్‌ను ఓడించింది.

30: బ్రిటన్ రేసర్ లూయిస్ హామిల్టన్ ఫార్ములావన్ ప్రపంచ ఛాంపియన్ షిప్ టైటిల్ విజేతగా నిలిచాడు.

నవంబరు

5: మహిళల ఆసియాకప్ హాకీ టోర్నీ విజేతగా భారత్ నిలిచింది. జపాన్‌లోని కకామిగహరలో జరిగిన ఫైనల్లో చైనాపై నెగ్గింది.

8: జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పురుషులు, మహిళల విభాగాల్లో హెచ్‌ఎస్ ప్రణయ్, సైనా నెహ్వాల్ విజేతలుగా నిలిచారు.

27: భారత స్టార్ పంకజ్ అద్వాణీ ఐబీఎస్‌ఎఫ్ ప్రపంచ స్నూకర్ టైటిల్ విజేతగా నిలిచాడు. పంకజ్ కెరియర్‌లో ఇది 18 వ ప్రపంచ టైటిల్.

డిసెంబరు

8: ప్రతిష్ఠాత్మక గోల్డెన్ బాల్ అవార్డును పోర్చుగల్ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రోనాల్డోకు పారిస్‌లో ప్రదానం చేశారు. రొనాల్డో ఈ అవార్డు గెలుచుకోవడం ఇది అయిదోసారి.

27: దక్షిణాఫ్రికాలోని పోర్ట్ ఎలిజబెత్‌లో ఐసీసీ ప్రయోగాత్మకంగా నిర్వహించిన మొట్టమొదటి నాలుగు రోజుల టెస్టు మ్యాచ్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ 120 పరుగుల తేడాతో జింబాబ్వేను ఓడించింది.

28: సౌదీ అరేబియాలోని రియాద్‌లో జరిగిన ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను విశ్వనాథన్ ఆనంద్ గెలుచుకున్నాడు.

2017 పర్యటనలు

జనవరి

7: ఏడు రోజుల పర్యటన నిమిత్తం పోర్చుగల్ ప్రధానమంత్రి ఆంటోనియో కోస్టా దిల్లీ చేరుకున్నారు. ప్రధాని మోదీతో సమావేశమయ్యారు.

11: భారత పర్యటనలో భాగంగా కెన్యా అధ్యక్షుడు ఉహూరు కెన్యాట్టా రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, ప్రధాని మోదీలతో దిల్లీలో సమావేశమయ్యారు.

ఫిబ్రవరి

21: అమెరికా నుంచి వచ్చిన 26 మంది శాసనకర్తల బృందం ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమైంది. అమెరికాలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఈ బృందం రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

✪ భారత పర్యటనలో భాగంగా మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

మార్చి

6: ఉపరాష్ట్రపతి మహ్మద్ హమీద్ అన్సారీ రెండు రోజుల పాటు జకార్తాలో పర్యటించారు. మొట్టమొదటి ఐఓఆర్‌ఏ (ఇండియన్ ఓషన్ రిమ్ అసోసియేషన్) నాయకత్వ సదస్సులో పాల్గొన్నారు.

7: ఉగాండా ప్రధానమంత్రి రుహాకనా రుగుండా అయిదు రోజులపాటు భారత్‌లో పర్యటించారు.

ఏప్రిల్

8: బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

10: భారత్‌లో పర్యటిస్తున్న ఆస్ట్రేలియా ప్రధాని మాల్కమ్ టర్న్‌బుల్ మోదీతో సమావేశమయ్యారు.

28: సైప్రస్ అధ్యక్షుడు నికోస్ అనస్తాషియెస్ భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

మే

11: ప్రధాని మోదీ రెండు రోజులపాటు శ్రీలంకలో పర్యటించారు. కొలంబోలో నిర్వహించిన అంతర్జాతీయ వేసక్ దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

31: ప్రధాని మోదీ స్పెయిన్ పర్యటనలో భాగంగా అధ్యక్షుడు మారియానో రజోయ్‌తో సమావేశమయ్యారు. ఏడు ఒప్పందాలపై సంతకాలు చేశారు.

జూన్

1: మోదీ రష్యా పర్యటనలో భాగంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో సమావేశమయ్యారు. నాగ్‌పుర్-సికింద్రాబాద్ మధ్య అత్యంత వేగవంతమైన రైలు సర్వీసు ఏర్పాటుకు ఈ సందర్భంగా ఒప్పందం కుదిరింది.

3: ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో పారిస్‌లోని అధ్యక్ష భవనం ఎల్సీ ప్యాలెస్‌లో సమావేశమయ్యారు.

9: కజకిస్థాన్ రాజధాని ఆస్తానాలో జరిగిన షాంఘై సహకార సంస్థ వార్షిక సదస్సుకు ప్రధాని మోదీ హాజరయ్యారు.

24: ప్రధాని మోదీ పోర్చుగల్ పర్యటనలో భాగంగా పోర్చుగల్ ప్రధాని ఆంటోనియా కోస్తాతో సమావేశమయ్యారు.

27: మూడు రోజుల అమెరికా పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ వాషింగ్టన్‌లోని శ్వేతసౌధంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమయ్యారు. సీమాంతర ఉగ్రవాదంపై ఇరువురు నేతలు ప్రధానంగా చర్చించారు.

✪ అమెరికా పర్యటన తర్వాత మోదీ నెదర్లాండ్స్ చేరుకుని, ప్రధాని మార్క్ రూత్‌తో సమావేశమయ్యారు.

జులై

5: ప్రధాని మోదీ మూడురోజుల ఇజ్రాయెల్ పర్యటనలో భాగంగా ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో జెరూసలేంలో చర్చలు జరిపారు. అధ్యక్షుడు రూవెన్ రివ్లిన్‌తోనూ సమావేశమయ్యారు. ఇజ్రాయెల్ సందర్శించిన తొలి భారత ప్రధానిగా మోదీ చరిత్ర సృష్టించారు.

7: జర్మనీలోని హాంబర్గ్‌లో జరిగిన జీ-20 శిఖరాగ్ర సదస్సులో మోదీ పాల్గొని ప్రసంగించారు.

ఆగస్టు

24: నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవుబా భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు. ఎనిమిది ఒప్పందాలు కుదిరాయి.

31: స్విట్జర్లాండ్ అధ్యక్షురాలు డోరిస్ లూథర్డ్ భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

సెప్టెంబరు

4: చైనాలోని షామన్‌లో జరిగిన బ్రిక్స్ కూటమి శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ పాల్గొన్నారు.

12: బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో సమావేశమయ్యారు.

14: రెండు రోజుల భారత పర్యటనలో భాగంగా జపాన్ ప్రధాని షింజో అబే ప్రధాని మోదీతో గాంధీనగర్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

అక్టోబరు

4: రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నాలుగు రోజుల తొలి విదేశీ పర్యటనలో భాగంగా అధ్యక్షుడు ఒమర్‌గులేహ్‌తో జిబూతీలో సమావేశమయ్యారు.

24: అఫ్గనిస్థాన్ అధ్యక్షుడు అష్రాఫ్ ఘనీ భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌లతో విడివిడిగా సమావేశమయ్యారు.

30: ఇటలీ ప్రధానమంత్రి పవోలో జెంటిలోని భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

నవంబరు

1: భారత పర్యటనలో భాగంగా భూటాన్ రాజు జిగ్మేఖేసర్ నాంగ్యల్ వాంగ్‌చుక్ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో దిల్లీలో సమావేశమయ్యారు.

13: మనీలాలో 'ఆసియాన్' వాణిజ్యవేదిక సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు.

14: మనీలాలో నిర్వహించిన 15 వ ఆసియాన్-భారత్ సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగించారు.

డిసెంబరు

13: కామన్‌వెల్త్ సెక్రటరీ జనరల్ పెట్రీషియా స్కాట్‌ల్యాండ్ నాలుగు రోజులపాటు భారత్‌లో పర్యటించారు.

23: రష్యా ఉపప్రధాని దిమిత్రీ రొగోజిన్ భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

రచయిత – సీహెచ్ కృష్ణప్రసాద్

1 ఏప్రిల్

భారత్‌లో ఆరు రోజుల పర్యటనకు వచ్చిన మలేసియా ప్రధానమంత్రి నజీబ్ అబ్దుల్ రజాక్ ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.




30 మే

ప్రధాని మోదీ నాలుగు దేశాల పర్యటనలో భాగంగా జర్మనీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్‌తో బెర్లిన్‌లో సమావేశమయ్యారు. 12 ద్వైపాక్షిక ఒప్పందాలపై సంతకాలు చేశారు.



6 సెప్టెంబరు

ప్రధాని నరేంద్ర మోదీ ద్వైపాక్షిక పర్యటన నిమిత్తం మొదటిసారిగా మయన్మార్ చేరుకున్నారు. ప్రభుత్వ సలహాదారు ఆంగ్‌సాన్ సూచీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు.



5 అక్టోబరు

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఇథియోపియా పర్యటన సందర్భంగా అధ్యక్షుడు మాలాతు తెషోమేతో రాజధాని అడీస్ అబాబాలో చర్చలు జరిపారు.



Beesula Rajaiah, Mahadevpur

Q: Respected sir, please explain the meanings of the following words in Telugu with examples.

1. Perception 2. Perpetuate 3. Crave for
4. Take leave of 5. Supervision 6. Astonishment
7. Case of

A: 1) దేన్నైనా మనం అర్థం చేసుకునే తీరు. Eg: My perception of his nature is different from the others' perception of his nature.

2. Do something bad. Eg: He perpetuated the murder.

3. పరితపించి పోవడం. Eg: Having lost his mother in his early age, he is craving for a mother's love.

4. వీడ్కోలు పలకడం. Eg: He took leave of his father before going to America.

5. పర్యవేక్షణ. Eg: Under his supervision the work was done well.


6. విపరీతమైన ఆశ్చర్యం. Eg: I was filled with astonishment when I heard that I won a lakh rupees in the lottery.

7. The correct expression is 'in case of' = ఆ పరిస్థితిలో
Eg: In case of serious illness go to a doctor.

ప్రతిభ

స్పోకెన్ ఇంగ్లిష్ పాత సంచికల కోసం చూడండి.. www.eenadupratibha.net

VOCABULARY



1. Expedite = Speed up. (వేగవంతం చేయడం)
Eg: The manager wanted the setting up of another branch of the company expedited.

✪ Expedite X Slow down (తాత్సారం చేయడం).
Eg: The progress of the work on the bridge has slowed down.

2. Interrupt = To cause a break (అంతరాయం కలిగించడం).
Eg: To announce something, he interrupted the programme.

✪ Interrupt X Continue (కొనసాగించడం).
Eg: They continued the programme without any interruption.

3. Sedentary = Not moving / seated at a place / stationary (ఒకేచోట కూర్చుని చేసే పని)
Eg: A clerk's job is a sedentary job (because they are seated most of the time and do not move).

✪ Sedentary X mobile (moving) (కదిలే).
Eg: A police constable's job is mobile.

4. Transparent = a) Allowing light to pass through so that objects on the other side can be seen (పారదర్శకమైన).
Eg: Glass is transparent X opaque (కాంతిని అడ్డుకునే)

b) Easy to understand (సులభంగా అర్థం చేసుకునే).
Eg: His ideas are very transparent

✪ Transparent X dark / difficult to understand (అర్థం కాని).

5. Adequate = Enough (చాలినంత)
Eg: He has adequate money to buy a house.

✪ Adequate X Inadequate / meagre (తక్కువైన).
Eg: His earnings are so meagre that he cannot buy a house.



Writer
- M. Suresan

మీ ప్రశ్నలు పంపాల్సిన చిరునామా...
స్పోకెన్ ఇంగ్లిష్, ప్రతిభ విభాగం,
ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిల్మ్ సిటీ,
అనాజ్‌పూర్, రంగారెడ్డి జిల్లా.
Email your questions to:
pratibhadesk@eenadu.net

Wish strongly for something...

SPOKEN ENGLISH
ఆంగ్లభాషణ 972

Chinna Gowd

Q: Sir, please define the following words in Telugu with some examples.

1. Conjugation of tenses
2. Voice (active& passive)
3. Transcoding information
4. Vowel 5.Consonant 6. Dipthongs
7. Semi-vowels 8. Spotting errors
9. Paranyms 10. Aspect.

A: 1) Conjugation of tenses means forming the present tense, the past tense and the future tense of a verb, along with the subdivisions - the simple, continuous, the perfect and the perfect continuous tenses of a verb. (ఒక verb కు Tenses ఏర్పరచడాన్ని conjugation అంటారు. ప్రస్తుతం, ఎప్పుడూ, అలవాటు ప్రకారం చేసేది present tense. గతంలో ఉండటం, జరిగిన వాటిని past tense అంటాం. భవిష్యత్‌లో జరిగేదాన్ని future tense అంటాం.

2. In the active voice, we say, somebody does something, and in the passive voice, we say something is done by somebody (Active voice అంటే ఒకరు ఒక పని చేశారు అని చెప్పడం. Passive voice అంటే ఒకరి చేత ఒక పని చేయబడింది అని చెప్పడం).

Eg: Active Voice: Ramana says something.
Passive voice: Something is said by Ramana.

Only verbs with objects have passive voice, except in the case of imperative sentences like, orders, requests, etc. (ఆజ్ఞలు, విన్నపాలు లాంటి వాక్యాలకు తప్ప, object లేని verbs కు passive voice ఉండదు.)

3. Transcoding information is adapting information to the digital version. This is technical, and however much it may be explained here, it is difficult to understand. (డిజిటల్ పద్ధతిలో సమాచారాన్ని మార్చడాన్ని Transcoding అంటారు. ఇది పూర్తిగా సాంకేతికం.)

4. Vowel sounds are sounds which we utter with our mouths open, vowel sounds అంటే తెలుగులో అచ్చులు. and the tongue or the lips not touching the other parts of the mouth. Vowels are not letters but the sounds of speech made by the organs of the mouth. (అచ్చులు అంటే అక్షరాలు కావు. నోటితో ఉచ్చరించే శబ్దాలు. In English the sounds represented by a, e, i, o, and u are vowel sounds. ఆంగ్లంలో a, e, i, o, u లు తెలిపే శబ్దాలను vowels అంటారు).

5. Consonant sounds are those which are made by the contact of one organ of the mouth with another organ of the mouth. Except the sounds represented by a, e, i, o and u are consonants. Consonants అంటే హల్లులు. ఆంగ్లంలో a, e, i, o, u లతో లేని శబ్దాలను consonants అంటాం.

6. Diphthongs are sounds formed by a combination of two vowels in a single syllable, in which the sound begins as one vowel, and moves towards another. Eg: Coin, loud, side. In coin, the sound begins with o and moves towards i. So here, the combination of the sounds of 'o' and 'i' is a diphthong.

7. A semivowel is a sound that is between a vowel and a consonant. Eg: H and Y.

8. Spotting errors means finding out the mistakes in a sentence.

9. Paranyms are euphemisms, that is, expressing an unpleasant matter in a pleasant manner. Eg: He is not such a fool as to be cheated by anybody.

10. Aspect is the positioning of something - it has other meanings too.



Kaja Syamala

Q: Please let me know the following in English
ఈ రోజుల్లో వచ్చే సినిమా హీరో, హీరోయిన్స్‌ను చూడలేకపోతున్నాం. చూడటానికి ఎవరూ బాగుండటం లేదు - ఈ వాక్యాన్ని ఇంగ్లిష్‌లో ఏమనాలి?

A: We find it difficult to see / we cannot see the heroes and heroines of today, as none of them is good looking.

Raju Surla

Q: Dear sir, please explain the following words in Telugu with examples.

1. Convulsed with 2. Convicted of
3. Convinced of 4. Distinguish from
5. Die for

A: 1. బాగా వణికిపోవడం, మన అదుపు లేకుండా
Eg: Because of a high fever, he was convulsing.

2. Punished (శిక్షపడటం). **Eg:** The judge convicted him to six months in jail.

3. This is the same as No 2.

4. Make a difference (వ్యత్యాసం చూపడం).
Eg: The teacher distinguished him from the others in the class because he was very clever.

5. Wish strongly for something.
Eg: Having lost his parents he is dying for parental love.

Grammar & Usage



In the last lesson we have seen the uses of was/were, the past doing word (Eg: saw, went, took, loved, linked, etc.) Now we are going to see the past perfect forms and the past perfect continuous forms.

Examples of the past perfect continuous tense:
a) Had been, b) had + PP (past participle / V3).

'Had been' talks of an earlier of two past states of being (గతంలో రెండు ఉండటాలు ఉన్నప్పుడు, ముందర ఉన్నదానికి had been వాడతాం.)

He had been an MLA, before he was a minister. (అతడు మంత్రిగా ఉండే ముందు MLA గా ఉన్నాడు. అంటే ఇప్పుడు మంత్రిగా కూడా లేడు).

He had been in Vijayawada and then he was in Mumbai (మొదట విజయవాడలో ఉన్నాడు. తర్వాత ముంబయిలో ఉన్నాడు - ఇప్పుడు ముంబయిలో కూడా లేడు)

'Had been' అనేది 'be' form కదా, అంటే అది ఉండటాన్ని తెలుపుతుంది. ఇప్పుడు had + PP (V3) గురించి తెలుసుకుందాం. ఉదా: had seen, had gone, had done, etc. This verb talks about an action earlier than another past action. అంటే గతంలో రెండు చర్యల్లో ముందు జరిగిన చర్యకు had + PP (V3) వాడతాం.

Eg: a) He told me yesterday that he had seen the movie. (నిన్న నాతో చెప్పాడు తాను ఆ సినిమా (అంతకు ముందే) చూశానని - గమనించండి: ఇక్కడ గతంలో జరిగిన రెండు చర్యల్లో ముందు జరిగిన చర్యకు had + PP (V3) వాడతాం.

b) The train had left before I entered the station (నేను స్టేషన్లోకి ప్రవేశించకముందే రైలు వెళ్లిపోయింది) - ఇక్కడ కూడా, రెండు గతంలో జరిగిన పనులు ఉన్నాయి. ముందు జరిగింది రైలు వెళ్లిపోవడం, తర్వాత నేను ప్రవేశించడం. ఇదీ had + PP (V3) ఉపయోగం. తర్వాతి verb, had been + ing: ఇది గతంలో ముందు ప్రారంభమై, రెండో పని జరిగేవరకు కొనసాగిన పనిని తెలుపుతుంది.

Eg: She had been working here until she got transferred (ఆమె బదిలీ అయ్యేవరకు ఇక్కడే పని చేస్తూ ఉండేది). ఇక్కడ ఆమె పని చేయడం, ఆమె బదిలీ అయ్యేవరకు కొనసాగింది. అందుకని ఒక పని ముందర ప్రారంభమై, రెండో పని జరిగే వరకు కొనసాగిన పనిని had been + ing form లో తెలుపుతాం. ఇవన్నీ కూడా past tense forms. మరికొన్ని వివరాలు వచ్చేవారం.



ఇంటి పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ



హాజరైన జనం

పురానికి మరిన్ని పరిశ్రమలు

ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం, న్యూస్‌టుడే: నాడు ఎన్టీఆర్, నేడు చంద్రబాబు పారిశ్రామిప్రగతికి పెద్దపీట వేశారని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. శనివారం హిందూపురంలో ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆటోనగర్‌లో మినీలారీ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బహిరంగసభలో మాట్లాడుతూ ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ప్రాతినిధ్యం వహించిన సమయంలో హిందూపురం తూమకుంట వద్ద వందలాది పరిశ్రమలు తీసుకొచ్చారని, నేడు చంద్రబాబు జిల్లాకు కియా కార్ల పరిశ్రమ తీసుకొచ్చారన్నారు. వచ్చే రెండేళ్లలో ఈ ప్రాంతానికి మరిన్ని పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగ సమస్య తీరుస్తానని చెప్పారు. ప్రధానంగా దుస్తుల తయారీ పరిశ్రమలతోపాటు బయోటెక్, ఎలక్ట్రానిక్, ఐటీ పరిశ్రమలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాన్నారు. ఇది తన ఒక్కడితో సాధ్యం కాదని అధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రులు, ముఖ్యమంత్రి సమష్టి సహకారంతోనే వీలవుతుందన్నారు. బెంగళూరు విమానాశ్రయం దగ్గరగా ఉండటం, కొడికొండ-శిర జాతీయ రహదారి ఏర్పాటుతో పారిశ్రామికంగా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆర్డీఓ రామమూర్తి ఆధ్వర్యంలో మినీలారీ అసోషియేషన్ కార్మికులు 80 మందికి పట్టాలు పంపిణీ చేశారు. హిందూపురం నియోజకవర్గంలోని మసీదుల మరమ్మతులకు రూ.కోటి నిధులు ఇచ్చామన్నారు. పార్టీతో సంబంధం లేకుండా ప్రతి పేదవాడికి గూడు కల్పించాలన్న లక్ష్యంతో జి+3 నిర్మాణాలు చేపట్టి 11 వేల మందికి ఇళ్లు నిర్మిస్తామన్నారు.

నందమూరిపురం....హిందూపురం నందమూరిపురమని ఎన్టీఆర్ ఇక్కడి నుంచే ప్రాతినిధ్యం వహించగా అనంతరం సోదరుడు హరికృష్ణ ఇప్పుడు తాను ప్రాతినిధ్యం వహిస్తున్నానన్నారు. రాబోయే రోజుల్లోనూ నందమూరి కుటుంబంతో ఇక్కడి ప్రజలకు విడదీయరాని బంధం ఉంటుందన్న ఆశాభావం వ్యక్తపరిచారు. సూరప్పకుంట చెరువు ప్రాంతాన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌గానేకాకుండా పార్కు ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలన్న ఉద్దేశంతో ఇంటి పట్టాలను మహిళల పేర్లతో ఆయా కార్మికుల కుటుంబీకులకు పసుపు కుంకుమలతో కలిపి అందజేశారు.

పార్టీలో చేరిక... ఆటోనగర్ ప్రాంతానికి చెందిన మినిలారీ అసోసియేషన్ అధ్యక్షుడు నాగన్న ఆధ్వర్యంలో తెదేపాలో చేరిన పలువురికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యేను లారీ అసోసియేషన్ కార్మికులు, అయ్యప్ప భక్తులు గజమాలలతో సన్మానించారు. బాలకృష్ణ అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నంబూరి సతీష్, ఎమ్మెల్యే పీఏ వీరయ్య, మినీ లారీ అసోషియేషన్ అధ్యక్షుడు నాగన్న, కార్తీక్, కమిషనర్ భాగ్యలక్ష్మీ, ప్రత్యేక అధికారి విశ్వనాథ్, తహసిల్దార్ చల్లా విశ్వనాథ్, కౌన్సిలర్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు. ఎంజీఎం మైదానంలో బసవతారకరామ క్రికెట్‌టోర్నీని బ్యాటింగ్ చేసి ప్రారంభించారు.



చిలమత్తూరు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆటోలకు అడ్డాగా మారింది...

బస్టాండు.. ఆటోలతో నిండు

చిలమత్తూరు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆటోలకు అడ్డాగా మారింది. వరుసగా బస్టాండు చుట్టూ ఆటోలను ప్రయాణికులు వెళ్లేందుకు వీళ్లేకుండా నిలిపిఉంచారు. దీంతో బస్సులు లోపలికి ప్రవేశించేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. మరోవైప ఆవరణలో అభివృద్ధి పనులు జరుగుతుండడంతో ఒకవైపు మాత్రమే ప్రవేశించే వీలుంది. అదికాస్తా ఆటోలకు అడ్డాగా మారడంతో ప్రయాణికుల తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

చిత్రం: ఈనాడు, హిందూపురం

శ్రీలంక జట్ల విజయం

అనంతపురం క్రీడలు: ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ స్మారక ఆహ్వాన క్రికెట్ పోటీల్లో శ్రీలంక జట్లు విజయభేరి మోగించాయి. అనంత క్రీడా గ్రామం ప్రధాన స్టేడియంలో జరిగిన పోటీలో శ్రీలంక జట్టు అనంత జట్టుపై 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన అనంత జట్టు 25 ఓవర్లలో 96 పరుగులకు ఆలౌటైంది. జట్టులోని భార్గవ్‌రాజా (39) బ్యాటింగ్‌లో రాణించాడు. శ్రీలంక బౌలర్లు కనిష్కర్ (3/4), నాదిల్ (3/17), హిరణ్ (2/30) అనంత బ్యాట్స్‌మెన్లు కట్టడిచేశారు. శ్రీలంక జట్లు తర్వాత బ్యాటింగ్ చేసి 16 ఓవర్లలో 2 వికెట్లకు వంద పరుగులు సాధించింది. ఆల్‌రౌండరు కనిష్క (28) బ్యాటింగ్‌లోనూ చెలరేగాడు. బి-మైదానంలో జరిగిన అండర్-15 విభాగం పోటీలో శ్రీలంక జట్టు అనంత జట్టుపై 49 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన శ్రీలంక జట్టు మొదట బ్యాటింగ్ చేసి నిర్ణీత 25 ఓవర్లలో 8 వికెట్లకు 186 పరుగుల భారీస్కోరు సాధించింది. అమంత (66), దిముతు (48) బ్యాటింగ్‌లో చెలరేగడంతో జట్టు భారీ స్కోరు నమోదు చేసింది. భారీ విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 25 ఓవర్లలో 8 వికెట్లకు 137 పరుగులే చేసి ఓటమిపాలైంది. పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం జరగనుంది.

అండర్-23 క్రికెట్ ఛాంపియన్ కడప

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: అంతర్ జిల్లా అండర్-23 క్రికెట్ ట్రోఫీని కడప జట్టు కైవసం చేసుకుంది. ఆతిథ్య జట్టుకు రెండో స్థానం దక్కింది. శనివారం అనంతపురంలోని సంజీవరెడ్డి స్టేడియంలో జరిగిన పోటీలో కడప జట్టు నెల్లూరు జట్టును 97 పరుగుల తేడాతో ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన కడప జట్టు షరీఫ్ (49), జయవర్ధన్ (48) బ్యాటింగ్‌లో విజృంభించడంతో నిర్ణీత 50 ఓవర్లలో ఏడు వికెట్లకు 266 పరుగులు చేసింది. నెల్లూరు బౌలరు అఖిల్ శ్రీనివాస్ (3 వికెట్లు) ప్రత్యర్థిని కట్టడి చేశాడు. ఆ తర్వాత నెల్లూరు జట్టు బ్యాటింగ్ చేసి 31.4 ఓవర్లలో 169 పరుగులకే కుప్పకూలింది. జట్టులోని మాచెర్ల (38) ఒంటరిగా పోరాడినా ఫలితం లేకపోయింది. విన్సెంట్ మైదానంలో జరిగిన మరో పోటీలో అనంతపురం జట్టు చిత్తూరు జట్టుపై 2 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు 50 ఓవర్లలో 9 వికెట్లకు 231 పరుగులు చేసింది. ఈ జట్టులోని హేమాద్రినాయుడు (103) శతకంతో మెరిపించాడు. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు సాయికుమార్ (88), కార్తీక్ (55), వినీల్ కుమార్ (32) బ్యాటింగ్ ప్రతిభతో 48.2 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. అనంతపురం, కడప జట్లకు వచ్చిన పాయింట్ల ఆధారంగా విజేతను ప్రకటించారు. కడప జట్టు ఛాంపియన్‌షిప్‌ను దక్కించుకుంది. పోటీల ముగింపు కార్యక్రమానికి దక్షిణ మండల క్రికెట్ కార్యదర్శి నాగేశ్వరరాజు, సెలెక్టర్లు గులాం, కిశోర్, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి షాబుద్దీన్, శిక్షకులు మధుసూదన్‌రెడ్డి తదితరులు హాజరై విజేతలకు ట్రోఫీలను అందజేశారు.



కప్ అందుకుంటున్న కడప జట్టు



అనంతపురం జట్టు

హాకీ ఛాంపియన్‌గా ఆర్డీటీ జట్టు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: బెంగళూరులో జరిగిన బి-డివిజన్ కర్ణాటక రాష్ట్ర లీగ్ హాకీ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను ఆర్డీటీ అకాడమీ జట్టు చేజిక్కించుకుంది. శనివారం బెంగళూరులో జరిగిన తుది పోరులో ఆర్డీటీ జట్టు 5-0 గోల్స్ తేడాతో బెంగళూరు జూడ్ ఫెలిక్ హాకీ అకాడమీ జట్టుపై ఘనవిజయం సాధించి ట్రోఫీ అందుకుంది. ఈ విజయంతో ప్రస్తుతం బి-డివిజన్‌లో ఉన్న ఆర్డీటీ జట్టు ఎ-డివిజన్‌కు అర్హత సాధించింది. వచ్చే ఏడాది జరిగే లీగ్ పోటీల్లో ఎ-డివిజన్‌లో పాల్గొంటుంది. ఏకపక్షంగా జరిగిన ఫైనల్ పోటీలో సందీప్, భగత్, శివ చెలరేగిపోయారు. బెంగళూరు జట్టుకు ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా సునాయాసంగా గెలిచింది. విజయం సాధించిన ఆర్డీటీ జట్టుకు రూ.30 వేల నగదు, ట్రోఫీని ప్రదానం చేశారు. విజేతగా నిలిచిన జట్టు ఆర్డీటీ పీడీ మాంచోఫెర్రర్, క్రీడా సంచాలకులు నిర్మల్‌కుమార్, హాకీ శిక్షకుడు లక్ష్మీనారాయణ అభినందించారు.



విజేత ఆర్డీటీ అకాడమీ జట్టు

2 నుంచి జన్మభూమి క్రీడాపోటీలు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడానికి జన్మభూమి క్రీడా పోటీలు జనవరి 2 నుంచి నిర్వహించనున్నట్లు డీఎస్‌డీఓ బాషామొహిద్దీన్ తెలిపారు. జనవరి 2 నుంచి 5 వరకు అన్ని గ్రామ పంచాయతీ కేంద్రాల్లో వరుసగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. డీఈఓ, ఎంపీడీఓ, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు పోటీల నిర్వహణలో భాగస్వాములు కావాలని కోరారు. పంచాయతీల్లో మొదటిస్థానం సాధించిన జట్లకు మండల స్థాయిలో జనవరి 6 నుంచి 10 వరకు కబడ్డీ, 5కె రన్, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. జనవరి 7న జిల్లా స్థాయిలో 5కె రన్ జరుగుతుందన్నారు. జనవరి 11న ముగింపు కార్యక్రమం నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి గల జిల్లా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



ఉరవకొండ: ప్రథమస్థానంలో నిలిచిన నెరమెట్ల జట్టు

హాకీ విజేత నెరమెట్ల

నెరమెట్ల (ఉరవకొండ), న్యూస్‌టుడే: అత్యంతం ఉత్కంఠభరితంగా సాగిన పోరులో నెరమెట్ల జట్టు ఒక గోల్ తేడాతో ఛాంపియన్‌షిప్‌ను సాధించింది. ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో ఉరవకొండ మండలం నెరమెట్ల గ్రామంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో హాకీ బాలికల లీగ్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ పోటీలు శనివారం జరిగాయి. ఈ పోరులో చిగిచెర్ల, నెరమెట్ల జట్లు తలపడగా నెరమెట్ల విజయం సాధించింది. జిల్లాను క్రీడల ఖిల్లాగా మార్చడమే లక్ష్యమని.. ఇందుకు ప్రతి క్రీడాకారుడు కృషి చేయ్యాలని హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అజయ్ బాబు అన్నారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. జిల్లాలో క్రీడాకారులను వెలికి తీయడం కోసం ఆర్డీటీ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం నెరమెట్ల జట్టు తరుపున ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, చంద్రశేఖర్ కప్పును అందుకొన్నారు. ద్వితీయ స్థానం సాధించిన చిగిచెర్ల జట్టుకు ట్రోఫిని అందించారు. కార్యక్రమంలో పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.



అనంతపురం

వేడుకల్లో విషాదం వద్దు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ నగరవాసులు నిర్వహించుకునే వేడుకల్లో విషాదానికి తావు లేకుండా చూడాలని రెండో పట్టణ ఎస్సై శ్రీరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో ఎవరికీ ఇబ్బంది కల్గించకుండా యువత వేడులకను నిర్వహించుకోవచ్చున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు.

ఉచిత వైద్యశిబిరం

మున్నానగర్, న్యూస్‌టుడే: బుడ్డప్పనగర్ మహబూబ్ సుబహాని జెండా కట్ట వద్ద జరిగిన దస్తగిరి స్వామి ఉరుసు ఉత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు అన్నదాన శిబిరం, ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు అబ్దుల్ రజాక్ గఫూర్ పాల్గొని పరీక్షలు చేశారు. డాక్టర్ అర్షద్ అయూబ్ గఫూర్, డాక్టర్ అలీమూస తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యం కోసమే జన్మభూమి



మాట్లాడుతున్న మేయర్ స్వరూప

అనంత నగరపాలిక, న్యూస్‌టుడే: ప్రజలను పాలనలో భాగస్వామ్యం చేయడం కోసమే జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మేయర్ స్వరూప పేర్కొన్నారు. జన్మభూమిపై నగరపాలక అధికారులతో శనివారం కార్పొరేషన్‌లోని కౌన్సిల్‌హాల్లో సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ జనవరి 2 నుంచి 11 వరకూ జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అధికారులు చిత్తశుద్ధితో వ్యహరించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోజుకు 5 డివిజన్లలో సభా కార్యక్రమం నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. కమిషనర్ మూర్తి, అదనపు కమిషనర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

అనంత నగరపాలిక, న్యూస్‌టుడే: నగరంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని మేయర్ స్వరూప ఇంజినీర్లను ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులతో మేయర్ శనివారం తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. నగరంలో తరచూ నీటి సమస్య ఏర్పడుతోందని, నిర్వహణలో లోపం లేకుండా పనిచేయాలన్నారు. పనిచేయడం ఇష్టం లేకపోతే వెళ్లిపోండని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీరు రాకపోతే ప్రజలు ఎంత ఇబ్బంది పడతారో తెలియదా అంటూ మండిపడ్డారు. వెంటనే నీటి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు డివైడర్లు

నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు డివైడర్లు ఏర్పాటు చేశామని మేయర్ స్వరూప పేర్కొన్నారు. శ్రీకంఠం కూడలి నుంచి సూర్యానగర్ వరకూ ఏర్పాటు చేసిన డివైడర్లను శనివారం పరిశీలించారు. రహదారిలో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం నవోదయకాలనీలో పైపులైను పనులు పరిశీలించారు.



చైతన్య పాఠశాలలో చిన్నారుల రింగాట

చదువుతోపాటు క్రీడలు తప్పనిసరి

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడలు తప్పనిసరి అని శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. హౌసింగ్ బోర్డులోని చైతన్య పాఠశాలలో స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. క్రీడల వల్లే దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకొని రావచ్చని ఏజీఎం తెలిపారు. మానసిక ప్రశాంతత, దేహదారుఢ్యానికి, సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతాయన్నారు. వివిధ క్రీడల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానాచార్యులు సమీరాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

సాయినగర్‌లోని కేశవరెడ్డి పాఠశాలలో వివిధ క్రీడాంశాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానాచార్యులు సులోచన మాట్లాడుతూ పాఠశాలలో చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలంటే క్రీడల్లో పాల్గొనాలన్నారు.

నిస్సహాయులకు అండ

గుల్జార్‌పేట: నేటి యువత చేస్తున్న వృధా ఖర్చులను తగ్గించి నిస్సహాయులకు అండగా ఉండాలని ఓసీ స్టూడెంట్ రైట్స్ ఆర్గనైజేషన్ అండ్ సోషియల్ సర్వీస్ ఫౌండేషన్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని నిస్సహాయులకు దుప్పట్లు, నిత్యావసర సరకులు అందజేశారు. కొత్త సంవత్సరం అంటూ యువత వృధా ఖర్చులు చేస్తుంటారని, అందులో కొంతైనా పేదలకు ఉపయోగించాలని కోరారు.

కమ్యూనిటీహాలు ప్రారంభం

అనంత నగరపాలిక: రంగస్వామినగర్‌లో ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి చేతుల మీదుగా కమ్యూనిటీ హాలును శనివారం ప్రారంభించారు. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.7 లక్షలతో భవనం నిర్మించారు. మేయర్ స్వరూప,. ఉపమేయర్ గంపన్న, కార్పొరేటర్ పెద్దక్క పాల్గొన్నారు.

చైతన్యం కల్పించండి

సిండికేట్‌నగర్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల చట్టంపై అవగాహన కల్పించాలని వినియోగదారుల రక్షణ కమిటీ రాయలసీమ రీజినల్ అధ్యక్షుడు నబీ రసూల్ పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీకి సంబంధించి రాయలసీమ ప్రాంతానికి తనను ఎంపిక చేసినట్లు ఆయన చెప్పారు. వినియోగదారుల హక్కుల రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. .

27న గిరిజనుల శంఖారావం సభ

మారుతీనగర్(అనంతపురం): గిరిజనుల ఆత్మగౌరవానికై జనవరి 27న ఆర్ట్స్ కళాశాల మైదానంలో గిరిజన శంఖారావం సభ నిర్వహిస్తున్నట్లు గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున నాయక్ తెలిపారు. శనివారం లిటిల్‌ఫ్లవర్ కళాశాలలో గిరిజన శంఖారావం సభ గోడ పత్రాలు ఆవిష్కరించారు. నాయకులు రవికుమార్ నాయక్, గోపాల్‌నాయక్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

పశువులను తరలించండి



ప్రధాన రహదారిపై పశువులు

కళ్యాణదుర్గం రోడ్డు, న్యూస్‌టుడే: నిత్యం రద్దీగా ఉండే కళ్యాణదుర్గం ప్రధాన రహదారిపై పశువులు సంచరిస్తున్నాయి. దీంతో ప్రజలకు ఇబ్బందిగా మారింది. నడిమివంక నుంచి ఆజాద్‌నగర్, కళ్యాణదుర్గం కూడలి, రాజాహోటల్ వరకు దారి పొడవునా పశువులు తిరుగుతున్నాయి. పశువులను తరలించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

ఎస్టీయూ కాలమానిని ఆవిష్కరణ



దైనందిని, కాలమానిని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ యామినీబాల

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సంఘాలకు సమస్యల పరిష్కారంతో పాటు బాధ్యతలు తప్పనిసరి అని ప్రభుత్వ విప్ యామినీబాల పేర్కొన్నారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో ముద్రించిన దైనందిని, జీఓల పుస్తకంను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు పీఆర్‌సీ, సీపీఎస్ రద్దు కోసం కృషి చేయాలని విప్‌కు విన్నవించారు. కార్యక్రమంలో ఎస్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రామన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యనారాయణగౌడ్, ఇతర నేతలు సూర్యుడు, రమణారెడ్డి, శివయ్యచారి, చలపతి, రవి, రామాంజనేయులు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో..

జిల్లా ప్రైవేటు పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండరును డీఈఓ జనార్దనాచార్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఓ సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనరు గోవిందనాయక్, ఉపవిద్యాశాఖాధికారులు లక్ష్మీనారాయణ, మల్లికార్జునతో పాటు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం సంఘం నాయకులు గోపాల్‌రెడ్డి, గంగాధర్, రవిచంద్రారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాంటిస్సోరిలో చిన్నారులతో యాజమాన్యం



బ్రైట్ పాఠశాలలో సంబరం

విద్యాలయాల్లో వేడుకలు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: విద్యాలయాల్లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. పలు పాఠశాలల్లో ముందస్తు సంబరాలు జరుపుకొన్నారు. 2018 జనవరి 1న పలు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. దీంతో శనివారమే నూతన సంవత్సరం వేడుకలు చేశారు. కేకు కోసి హ్యాపీ న్యూఇయర్ అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. సంగమేష్‌నగర్, గుత్తి రోడ్డులోని మాంటిస్సోరి పాఠశాలల్లో నిర్వహించిన వేడుకల్లో కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి, కార్యదర్శి మాధవి, ప్రధానాచార్యులు పద్మావతి, రమాదేవి పాల్గొన్నారు. వినాయకనగర్‌లోని బ్రైట్ పాఠశాలలో వివిధ రకాల వంటకాలు చేసి పంపిణీ చేశారు. రవీంద్రభారతి పాఠశాలలో కేకు కోసి సంబరం చేసుకున్నారు.



రవీంద్రభారతి పాఠశాలలో కేకు కోస్తున్న ప్రతినిధులు



కూడలిలో ఏర్పాటు చేసిన సిగ్నల్స్

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

కళ్యాణదుర్గంరోడ్డు(జిల్లా సచివాలయం), న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం రహదారి ప్రధాన కూడలిలో ట్రాఫిక్ రోజురోజుకు పెరిగిపోతోంది. నాలుగు రహదారులు కలవడంతో సాయంత్రం వేళ ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోతున్నాయి. పోలీసుల నియంత్రణ లేకుండా పోయింది. లారీలు తిరగడంతో మరింత ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ట్రాఫిక్ నియంత్రించడానికి శనివారం కొత్తగా కూడలిలో వంతెనకు ఇరువైపులా సిగ్నల్స్‌ను పోలీసులు ఏర్పాటు చేశారు. వారం, పదిరోజుల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ అందుబాటులోకి రానున్నాయి.

కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

గుల్జార్‌పేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు కళాశాలలపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని అనంత స్టూడెంట్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు జీతిన్ పేర్కొన్నారు. శ్రీచైతన్య కళాశాలలో అక్రమంగా అడ్మిషన్లు చేస్తున్నారంటూ శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్ కళాశాలలు అధిక ఫీజులు చేస్తూ దోచుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అవినాష్, భరత్, కిరణ్, మణిదీప్ పాల్గొన్నారు.

అనంతపురం

తపాలా ఉద్యోగుల దైనందిని ఆవిష్కరణ

అనంతపురం (అరవిందనగర్), న్యూస్‌టుడే: తపాలాలో ఖాతాదారులకు మెరుగైన సేవలందించి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని శాసనసభ్యుడు ప్రభాకర్‌చౌదరి పేర్కొన్నారు. నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం ఉదయం తపాలా శాఖ ఎఫ్‌ఎన్‌పీఓ సంఘం దైనందిని ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు సర్కిల్ అధ్యక్షుడు సుధాకర్, డివిజనల్ అధ్యక్షుడు శ్రీధర్‌బాబు, కార్యదర్శి శ్రీనివాసులు, గనేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఈయూ సమ్మె విరమణ

అనంతపురం ఆర్టీసీ: ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి తలపెట్టిన సమ్మె వాయిదా పడంది. కడప ఈడీ రామారావు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో సమ్మెను వాయిదా వేస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా డిపో ప్రాంగణంలో దీక్ష చేపట్టిన ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు నబిరసూల్‌కు డిప్యూటీ సీటీఎం గోపాల్‌రెడ్డి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.

నేత్రానందం.. శ్రీనివాసుడి కల్యాణం



వేదికపై ఉత్సవమూర్తులు

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలోని పాతూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన వైకుంఠ ఏకాదశి వేడుకలు ముగిశాయి. ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యుల ఆధ్వర్యంలో శనివారం ఆలయ కల్యాణ మండపంలో శ్రీనివాస కల్యాణం నేత్రానందంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అద్దాల మండపంలో పట్టుపీతాంబరాలతో ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సహిత శ్రీనివాసుడిని కొలువుదీర్చి, వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొని కల్యాణ వేడుకను వీక్షించారు. ఈ కార్యక్రమంలో వాసవి మహిళా మండలి సభ్యులు, ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవం తిలకిస్తున్న మహిళలు

పరీక్షల్లో మార్పు చేయాల్సిందే



ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు, నాయకులు

ఎస్.కె.విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో పరీక్షల నిర్వహణలో మార్పు చేయాలని ఏఐడీఎస్‌ఓ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాల వద్ద ర్యాలీ నిర్వహించి అనంతరం ఎస్కేయూకి చేరుకున్నారు. ఎస్కేయూలో ర్యాలీగా వచ్చి పరిపాలనా భవనం వద్ద బైఠాయించారు. ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేంద్ర మాట్లాడుతూ డిగ్రీ కళాశాలల్లో సెమిస్టర్ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని కోరారు. డిగ్రీలో మూడేళ్ల అనంతరం ఒక సబ్జెక్టులో తప్పితే గతంలో ఇన్‌స్టంట్ ఉండేదని, అదే తరహాలో సెమిస్టర్ విద్యార్థులకు ఇన్‌స్టంట్ పెట్టాలన్నారు. సెమిస్టర్ పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రిజిస్ట్రార్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించే విషయాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఏఐడీఎస్‌ఓ జిల్లా అధ్యక్షులు నాగరాజు, నాయకులు రాజశేఖర్, అమిరున్, రాహుల్, మహేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎం జిల్లా ఇన్‌ఛార్జి ఎన్నిక

అనంత గ్రామీణం (తపోవనం), న్యూస్‌టుడే: అంబేడ్కర్ ఇండియా మిషన్ జిల్లా బాధ్యులుగా నాగమునెయ్యను ఎన్నుకున్నారు. శనివారం ఎన్‌జీఓ హోమ్‌లో ఏఐఎం సభ్యుల సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సమన్వయకర్తగా రామాంజనేయులు, ఉద్యోగుల విభాగం సమన్వయకర్తగా పుండరీకాక్ష, న్యాయవాదుల సమన్వయ కర్తలుగా రంగనాయకులు, ఆంజనేయులను నియమించారు. ఈసీ సభ్యులుగా తిరుపాల్, వెంకటేశ్, యలమందయ్య, ప్రభాకర్, రాము ఎన్నికయ్యారు. రాష్ట్ర ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్ స్థాపించిన ఈ మిషన్ ఎస్సీ, ఎస్టీల సమస్యపై రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. మార్చి లేదా ఏప్రిల్ నెలలో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహిస్తామని వారు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శనిత్రయోదశి పూజలు



శనీశ్వరునికి అలంకరణ

శారదానగర్: శనిత్రయోదశి పురస్కరించుకుని నగరంలోని పలు ఆలయాల్లో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయాల్లోని శనీశ్వరుడికి అభిషేకాలు, అలంకరణ చేశారు. శివకోటి ఆలయంలో శనైశ్చరస్వామికి తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నవగ్రహ కన్యా పాశుపతహోమం చేశారు.

సమాజాభివృద్ధికి తోడ్పడాలి



జేసీని సత్కరిస్తున్న ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు

అనంత సాంస్కృతికం: ఆర్యవైశ్య మహిళలు సేవా కార్యక్రమాలు విరివిగా నిర్వహించి సమాజాభివృద్ధికి తోడ్పాటునందించాలని ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పాతూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరిగిన శ్రీనివాస కల్యాణాన్ని ఆయన తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా గుణం ఉన్న ఆడపడుచులు బయటి ప్రపంచానికి వచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సేవలతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం జేసీ దివాకర్‌రెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, కొత్తపూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మచ్చా నరసింహులు తదితరులకు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో పాతూరు ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు ముత్యాలరంగయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ధర్మకర్త నాగరత్నం, సాయినాథగుప్తా, ఆర్యవైశ్య మహిళామండలి అధ్యక్షురాలు మేడా అరుణ, ప్రధాన కార్యదర్శి చల్లా స్వర్ణలత పాల్గొన్నారు.

సమస్యలపై నిర్లక్ష్యం



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

అనంతపురం ఆర్టీసీ, న్యూస్‌టుడే : అనంతపురం రీజియన్ వ్యాప్తంగా ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రీజినల్ మేనేజరు చిట్టిబాబును సస్పెండ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. అనంతపురం డిపో ప్రాంగణలో గత రెండురోజులుగా ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు దీక్ష చేపట్టారు. శనివారం వారికి ఏఐటీయూసీ మద్దతు పలికింది. ఆర్ఎం చిట్టిబాబుకు నవంబరులో తెలియజేసిన సమస్యలను పరిష్కరించలేదన్నారు. అక్రమ సస్పెన్షన్లు, ఒప్పంద కార్మికుల క్రమబద్ధీకరణ, కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్తవి, కారుణ్య నియామకాలు తదితర న్యాయమైన కార్మికుల కోర్కెలను పరిష్కరించకుండా అలసత్వం ప్రదర్శించడం సరికాదన్నారు. ఏఐటీయూసీ నాయకులు చంద్రాయుడు, బాలపెద్దన్న, శ్రీనివాసులు, రమకృష్ణ, ప్రభాకర్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు మూసివేయాలి

కోవూర్‌నగర్: నూతన సంవత్సర వేడుకలు పురస్కరించుకుని ఆదివారం జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలు ముసివేయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వరలక్ష్మి, పద్మావతి కోరారు. శనివారం వారు మాట్లాడుతూ వేడుకల సందర్భంగా మద్యం విక్రయాల వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందన్నారు.

హంతకులను శిక్షించాలి

లక్ష్మీనగర్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని నూరానీ మసీదులో పని చేస్తున్న మౌజన్‌ను హత్య చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఇస్లాం ఇన్సాఫ్ రాష్ట్ర కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. శనివారం అనంతపురంలో ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. మౌజన్‌ను మసీదులోనే హత్య చేసి ఖురాన్ దహనం చేయడం దారుణమన్నారు. ఈ ఘటనపై న్యాయ విచారణ చేసి నిందితులను శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ నాయకుడు వలి, ఇమామ్, ఐఎంఎం నాయకుడు మహబూబ్‌బాషా, అమ్మ ఆర్గనైజేషన్ నాయకులు మైనుద్దీన్, బాషా, అల్లీపీరా, ఖాజా మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే సమాజాభివృద్ధి



సభ్యులకు జ్ఞాపిక అందజేస్తున్న మేయర్

కమలానగర్, న్యూస్‌టుడే: యువత భాగస్వామ్యంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని నగర మేయర్ స్వరూప పేర్కొన్నారు. ఫ్రెండ్స్ అండ్ హెల్త్ సొసైటీ మొదటి వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మేయర్ స్వరూప మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవరచుకోవాలన్నారు. నేటి యువతే రేపటి పౌరులన్నారు. సంస్థ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సేవలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించారు. 100 మందికి రక్త గ్రూపులు, వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు చంద్రశేఖర్, నరేష్, నిరంజన్, షేక్షా, వైద్యులు మోహన్, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి హుండీ ఆదాయం రూ.3.81 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

అనంతసాంస్కృతికం, న్యూస్‌టుడే: అనంత నగరంలోని తాడిపత్రి బస్టాండు సమీపాన ఉన్న లక్ష్మిచెన్నకేశవస్వామి ఆలయంలో హుండీల లెక్కింపు నిర్వహించారు. ఏటా వైకుంఠ ఏకాదశి తర్వాత ఆలయ హుండీల లెక్కించడం ఆనవాయితీ. 2014-15 యేడాదికి గాను రూ.2,73,458, 2015-16కు సంబంధించి రూ.2,67,545 రాగా ఈసారి రూ.3,81,728 ఆదాయం వచ్చింది. గతేడాది కన్నా రూ.1,14,183 అధికంగా ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

పట్టణంలో పుస్తక ప్రదర్శన

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక కళాశాల క్రీడామైదానం వద్ద భారీ పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. నిర్వాహకులు శివప్రసాద్, ఉడుముల శివా రెడ్డి మాట్లాడుతూ పాఠకులకు మూడు వేల పుస్తకాలను పాఠకులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. 15 రోజుల పాటు ప్రదర్శన ఉంటుందని చెప్పారు. తక్కువ ధరలకే విలువైన పుస్తకాలను విక్రయిస్తున్నట్లు తెలిపారు.

నిత్యావసర వస్తువుల ధరలు

కందిపప్పు-రూ.65, పెసరపప్పు-రూ.75, ఉద్దిబేడలు -రూ.70, శనగబేడలు - రూ.75, బియ్యం(మేలురకం) -రూ.50, రెండోరకం - రూ.40, బెల్లం -రూ.55, చక్కెర - రూ.40, ఎండుమిరప - రూ.80, గోధుమపిండి - రూ.24, వేరుసెనగ-రూ.70, చింతపండు - రూ.220.

అధికార పార్టీ కౌన్సిలర్ల రభస

☛ వాడీవేడిగా సాగిన కౌన్సిల్ సమావేశం ☛ సమావేశం నుంచి వైకాపా కౌన్సిలర్ల వాకౌట్



కింద కూర్చుని వైస్ ఛైర్మన్ గవ్వల బాబుతో వాగ్వాదానికి దిగిన కౌన్సిలర్లు రాము, పామిశెట్టి శివశంకర్

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: అధికార పార్టీ కౌన్సిలర్లు ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, వ్యక్తిగత దూషణలతో కౌన్సిల్ సమావేశంలో విలువైన సమయాన్ని వృథా చేశారు. ఒకరినొకరు దూషించుకున్నారు. ప్రగతి పనులపై చర్చించకుండా వ్యక్తిగత మాటల యుద్ధానికి దిగారు. శనివారం ధర్మవరం పట్టణ పురపాలకశాఖ కార్యాలయంలో బీరే గోపాలకృష్ణ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభానికి ముందు మున్సిపల్ సిబ్బంది ప్రభాకర్ మృతికి సంతాపంగా కాసేపు మౌనం పాటించారు. అనంతరం అజెండా వినిపించడానికి ప్రయత్నం చేయగానే.. ప్రతిపక్ష కౌన్సిలర్లు బీరే ఎర్రిస్వామి, నారాయణరెడ్డి, వైకాపా కౌన్సిలర్ బృందం అధ్యక్షుని వద్దకు వెళ్లి నవంబరు 25వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశంలో అజెండాలో పొందుపరిచిన పనులు తేడాగా ఉన్నాయని వాటిని తిరస్కరించాలని, సరైన సమాధానం చెప్పాలని ఛైర్మన్‌ను నిలదీశారు. నాకు ఎలాంటి నివేదిక అందలేదని ఆయన సమాధానం ఇచ్చారు. అనంతరం నివేదిక అందించి కౌన్సిల్ సమావేశం తిరస్కరించి వారు బయటకు వెళ్లారు. అనంతరం అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ల మధ్య వాడీవేడిగా చర్చ జరిగింది.

ఈఈపై ఆగ్రహం

నిబంధనలకు విరుద్ధంగా గతంలో చేసిన గుత్తేదారులకే అధికారులు పనులు కట్టబెడుతున్నారని కౌన్సిలర్ రాయపాటి రామకృష్ణ ఈఈ నాగమోహన్‌పై మండిపడ్డారు. టెండర్లు పిలిచి ఒప్పందం పూర్తి చేసిన పనులకు అధికారులు అడ్డంకిగా మారుతున్నారంటూ వాదనకు దిగారు. కౌన్సిలర్ శ్రీనివాసులు మాట్లాడుతూ నీటి పారుదలశాఖ స్థలంలో ఇళ్లు నిర్మిస్తున్నట్లు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎన్టీఆర్ గృహాల లబ్ధిదారులకు టీపీఎస్‌లు డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. కౌన్సిల్ సమావేశానికి పట్టణ ప్రణాళికాధికారులు ఎందుకు రాలేదని ఈఈ, మేనేజర్‌ను ప్రశ్నించారు. కాలనీలో మురుగునీటి కాలువ సమస్య ఉన్నట్లు కౌన్సిలర్ గోవిందు వివరించారు. కార్యక్రమంలో అధికార పార్టీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, టీపీవో చిన్నబాబయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీనారాయణశర్మ, బాబ్‌జాన్, తదితరులు పాల్గొన్నారు.



ఈఈ నాగమోహన్‌తో వాగ్వాదం చేస్తున్న రాయపాటి రామకృష్ణ

వైస్ ఛైర్మన్‌గా అసమర్థుడిని ఎంపిక చేశాం

అజెండాలో పొందుపరచిన అంశాలపై కౌన్సిలర్ ఉడుముల రాము అధికారులను, ఛైర్మన్‌ను ప్రశ్నిస్తుంచారు. మీరు సమాధానం చెప్పాలని ఛైర్మన్‌ను డిమాండ్ చేశారు. ఈ సమయంలో వైస్ ఛైర్మన్ గవ్వల బాబు కల్పించుకుని మర్యాదగా మాట్లాడలని వాదన చేశారు. పామిశెట్టి శివశంకర్ కల్పించుకుని ఏక వచనం, బహువచనం అంటే తెలుసా? అంటూ వైస్ ఛైర్మన్‌ను ప్రశ్నించారు. ఈ సందర్భంగా వారి మధ్య వాగ్వాదం తీవ్రంగా జరిగింది. అసమర్థులకు పదవులు కట్టబెడితే ఇలాగే ఉంటుందని పామిశెట్టి శివశంకర్ మండిపడ్డారు. అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఒకరినొకరు దూషించుకోవడంతో అభివృద్ధి పనులపై చర్చ పక్కదారి పట్టింది. సీనియర్ నాయకులతో ఇష్టారాజ్యంగా మాట్లాడటం తగదని వారు కింద కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. తోటి కౌన్సిలర్లు నచ్చజెప్పి వైస్ ఛైర్మన్‌తో క్షమాపణ చెప్పించడంతో వివాదం సద్దుమణిగింది.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు లక్ష్యమని ఏపీజీబీ రీజినల్ డైరెక్టర్ శ్రీరంగన్న పేర్కొన్నారు. శనివారం స్థానిక ఏపీజీబీ ప్రధాన కార్యాలయంలో ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడు తప్పకుండా ఆధార్‌కార్డు నంబరును ఖాతాకు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. బ్యాంకు ఖాతాకు చరవాణి నంబరుతో అనుసంధానం చేసుకుంటే లావాదేవీల వివరాలు సందేశాల ద్వారా తెలుసుకునే వెసులుబాటు ఉందన్నారు. బ్యాంకు ఆధ్వర్యంలో రూ.25 లక్షలు గృహ రుణాలు, రూ.కోటి పొదుపు సంఘాల మహిళలకు రుణాల చెక్కులను అందించారు. రుణాలు సక్రమంగా చెల్లించి మరిన్ని రుణాలు పొందాలని ఖాతాదారులకు సూచించారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు, కొత్తపేట మేనేజర్ రిజ్వానా, క్షేత్రసహాయధికారి జగదీశ్వరెడ్డి, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులు

మానసికంగా ధైర్యంగా ఉండాలి

గాంధీనగర్(ధర్మవరం పట్టణం), న్యూస్‌టుడే: హెచ్‌ఐవీ బాధితులు మానసికంగా ధైర్యంగా ఉండాలని శక్తి మైత్రి సంఘం ప్రాజెక్టు మేనేజర్ ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక గాంధీనగర్ కాలనీలోని శక్తి మైత్రి సంఘం కార్యాలయంలో సంఘ సభ్యులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల ఎయిడ్స్ వ్యాధిపై చైతన్య సదస్సులు నిర్వహించి 1,300 మంది హెచ్‌ఐవీ బాధితులకు మానసిక ధైర్యాన్ని నింపినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు షంషాద్, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యా వలంటీర్ల నియామకానికి కౌన్సిల్ తీర్మానం

సుందరయ్యనగర్(ధర్మవరం పట్టణం),న్యూస్‌టుడే: పట్టణంలోని సుందరయ్యనగర్ గణేష్ ప్రాథమిక పురపాలకశాఖ పాఠశాలకు ఎట్టకేలకు నలుగురు విద్యా వలంటీర్లను నియమించారు. పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఈ ఏడాది 390 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రస్తుతం ఒక ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు, ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యార్థుల సంఖ్యను పరిగణలోకి తీసుకుని నలుగురు వలంటీర్లను నియమించేందుకు పురపాలకశాఖ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు.

ఏపీటీఎఫ్ కాలమానిని ఆవిష్కరణ

ధర్మవరం పట్టణం,న్యూస్‌టుడే: స్థానిక సిద్ధయ్య గుట్ట పురపాలకశాఖ అతిథి గృహంలో ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ 2018 కాలమానిని పురపాలక సంఘం కమిషనర్ రవి శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి రామకృష్ణ, రవీంద్రరెడ్డి, ఉపాధ్యాయులు సంజీవయ్య, అమానుల్లా, చెన్నూడు, శ్రీనివాసులు, వెంకటేష్, రాజకుమార్, శేఖర్, వెంకటరాముడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కాలమానిని ఆవిష్కరిస్తున్న కమిషనర్, సంఘం నాయకులు

హాకీ రన్నర్స్ చిగిచెర్ల బాలికల జట్టు

చిగిచెర్ల(ధర్మవరం పట్టణం),న్యూస్‌టుడే: మండలంలోని చిగిచెర్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల బాలిక హాకీ జట్టు లీగ్ రన్నర్స్‌గా విజయం సాధించింది. ఈ సందర్భంగా పీఈటీ చామంతి మాట్లాడుతూ రెండు రోజులుగా ఆర్డీటీ ఆధ్వర్యంలో నెరిమెట్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో హాకీ లీగ్ పోటీలు జరిగాయని తెలిపారు. పోటీల్లో 8 హాకీ జట్లు పాల్గొన్నాయని, తుది పోరులో నెరిమెట్ల, చిగిచెర్ల జట్లు తలపడ్డాయన్నారు. చిగిచెర్ల బాలిక జట్టు రన్నర్స్‌గా నిలిచిందని చెప్పారు. వీరిని, పీఈటీని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయసాయి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.



రన్నర్స్‌గా నిలిచిన చిగిచెర్ల ఉన్నత పాఠశాల జట్టు

ఎంపీ నిమ్మలను పరామర్శించిన మంత్రి

గోరంట్ల, న్యూస్‌టుడే: హిందూపురం పార్లమెంటు సభ్యుడు నిమ్మల కిష్టప్ప మాతృమూర్తి ఆదిలక్ష్మమ్మ శుక్రవారం మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం గోరంట్లలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఎంపీని రాష్ట్ర మంత్రి పరిటాల సునీత, జిల్లా పరిషత్ ఛైర్మన్ పూలనాగరాజు, పలువురు ఎమ్మెల్యేలు పరామర్శించారు. ఎమ్మెల్యేలు బీకే పార్థసారథి, గోనుగుంట్ల సూర్యనారాయణ, అత్తార్ చాంద్‌బాషా, ఎమ్మెల్సీ గుండుమాల తిప్పేస్వామి, హిందూపురం పార్లమెంటు పరిధిలోని వివిధ మండలాలకు చెందిన తెదేపా ప్రజాప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు ఎంపీని పరామర్శించిన వారిలో ఉన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: అన్నదాతలు రాయితీ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి ఎల్లప్ప పేర్కొన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద మహిళా రైతు ఛాయాదేవికు రాయితీపై మంజూరైన ట్రాక్టర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లేనిపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతుకు రాయితీపై మినీట్రాక్టర్ అందిస్తున్నట్లు తెలిపారు. ట్రాక్టర్ ధర రూ.3.68 లక్షలు. రైతు వాటా రూ.2.68 లక్షలు చెల్లించారు. మిగిలిన రూ.లక్ష రాయితీ ప్రభుత్వం చెల్లించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఈవోలు రాజేశ్వరి, పోతలయ్య, దివ్య, సుమ, పూర్ణిమ, గీత, జయరాములు తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్టర్ పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి ఎల్లప్ప

చిత్తశుద్ధి ఏదీ?

తాడిమర్రి, న్యూస్‌టుడే: వీధుల్లో కుండీలు ఏర్పాటు చేయక పలువురు చెత్తను రహదారులపై వేస్తున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన గేటు ఎదురుగా గ్రామంలోని చెత్తను తీసుకొచ్చి వేయడం వల్ల ఆ ప్రాంతం దుర్గంధం వెదజల్లుతోంది. పరిస్థితి ఇలా ఉంటే అంటు రోగాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెత్త కుండీలను ఏర్పాటు చేసి, గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.



పేరుకు పోయిన చెత్త

ధర్మవరం

అర్జీలపై వెంటనే స్పందించండి

బత్తలపల్లి, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ చేపట్టిన ఇంటింటికీ తెదేపా కార్యక్రమంలో వచ్చిన అర్జీలను వెంటనే పరిశీలించి పరిష్కారం చేయాలని తహసీల్దార్ పీఎల్ సురేష్‌బాబు సూచించారు. శనివారం తహసీల్దార్ ఛాంబర్‌లో ఆర్ఐలు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క అధికారి రెవెన్యూ పంచాయతీ పరిధిలో జన్మభూమి-మీఊరు కార్యక్రమం గురించి దండోరా వేయించాలన్నారు.

వినూత్నంగా విద్యార్థుల ప్రదర్శన

బత్తలపల్లి, న్యూస్‌టుడే: 2017 సంవత్సరానికి వీడ్కోలు.. 2018 ఏడాదికి స్వాగతం పలుకుతూ విద్యార్థులు వినూత్నంగా ప్రదర్శన చేశారు. బత్తలపల్లిలోని జక్కంపూటి వెంకటేశ్వర్లు జిల్లా పరిషత్ బాలుర పాఠశాల చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు శనివారం పాఠశాల ఆవరణలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు.



పురవీధుల్లో గంధం ఊరేగింపు

ఘనంగా ఉరుసు

ధర్మవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పట్టణంలోని కొత్తపేట అస్తాన-ఎ-హజరత్ మహబూబ్ సుబహాని దర్గా గంధం శనివారం తెల్లవారుజామున జరిగింది. ఉరుసులో భాగంగా గంధం సిద్ధయ్యగుట్టలోని షేక్షావలి ఇంటినుంచి ప్రారంభమైంది. దర్గా పీఠాధిపతి అహమద్ ఖాజా నసీరుద్దీన్ షా ఖాద్రి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పక్కీర్లతో జల్సా కార్యక్రమం సాగింది. ఉత్సవాలకు జిల్లా నుంచే కాకుండా హైదరాబాద్, మహబూబ్‌నగర్, కడప చిత్తూరు జిల్లాలతోపాటు కర్నాటకలోని గౌరిబిదనూరు, బాగేపల్లి, చిక్కబళాపూర్, బెంగళూరు నుంచి భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాత్రి జరిగిన ఆధ్యాత్మిక సమావేశంలో పలువురు గురువులు, వేదపండితుల ఉపన్యాసాలు జరిగాయి

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న తాడిమర్రి ఎమ్పీడీవో దివాకర్

తాడిమర్రి, న్యూస్‌టుడే: జనవరి 2 నుంచి 11వ తేదీ వరకు జరిగే జన్మభూమి కార్యక్రమానికి మండల అధికారులు పక్కా సమాచారంతో హాజరుకావాలని ఎమ్పీడీవో దివాకర్ కోరారు. శనివారం ఎమ్పీడీవో కార్యాలయంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో చేపట్టాల్సిన అంశాలపై ఎమ్పీడీవో అధ్యక్షతన మండల అధికారులు, జన్మభూమి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎమ్పీడీవో మాట్లాడుతూ ప్రజలు, జన్మభూమి కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ విస్తరణాధికారి గంగావతి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగేంద్ర, ఏపీఎం ఓబిలేసు, విద్యుత్తు ఏఈ మధు, ఏపీవో సావిత్రి, మండల విద్యాధికారి కృష్ణమోహన్, హౌసింగ్ ఏఈ హుమాయూన్, ఆరోగ్య అధికారి కళావతి, పంచాయతీ అధికారులు కుళ్ళాయినాయుడు, బాబా, శిరీషా, తెదేపా కన్వీనర్ సాయి, జన్మభూమి కమిటీ సభ్యులు శివంపల్లి రవీంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కునుకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, వై.బాస్కర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి - మాఊరుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోండి

బత్తలపల్లి, న్యూస్‌టుడే: జనవరి రెండో తేదీ నుంచి జరిగే జన్మభూమి-మీఊరు కార్యక్రమానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీడీవో ప్రభాకర్‌గౌడ్ సూచించారు. శనివారం తన కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు ఈనెల ఒకటో తేదీన ప్రణాళికలను ఎంపీడీవో కార్యాలయానికి తీసుకు రావాలన్నారు. గ్రామ సభల్లో వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు. దరఖాస్తులకు రశీదులు ఇవ్వడానికి ప్రత్యేకంగా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కమనీయంగా చెన్నకేశవుని గ్రామోత్సవం

ధర్మవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం రాత్రి కల్యాణమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామిని గరుడ వాహనంపై ఊరేగించారు. ఉభయ దాతలు మోకా చిన్నవెంకట సుబ్బయ్య వంశస్థులు హైదరాబాదు వాస్తవ్యులు మోకా రాఘవేంద్ర రవితేజ, నాగశ్రావ్య, శ్యామలానాథ్, రజనీకాంతమ్మలు ప్రథమ పూజను నిర్వహించిన అనంతరం గ్రామోత్సవం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అంబటి రామయ్య, రంగయ్య వంశస్థులు శ్రీధర్ దంపతులు తోమాలను సమర్పించారు. ఈఓ ఆనంద్, దేవాదాయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ కలవల రాంకుమార్, ధర్మకర్తలు పాల్గొన్నారు.



గరుడవాహనంపై కొలువైన చెన్నకేశవుడు



కాలమానిని విడుదల చేస్తున్న సంఘ సభ్యులు

కాలమానిని ఆవిష్కరణ

ధర్మవరం సాంస్కృతికం: స్థానిక మార్కండేయస్వామి ఆలయంలో శనివారం శ్రీపద్మశాలీయ బహుత్తమ సంఘం వారు ఆలయ సమాచార కాలమానిని విడుదల చేసింది. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జక్కా చిన్నశింగరయ్య, జింకా చిన్నప్ప, కోశాధికారి పొరాళ్ల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. జనవరి 25నుంచి 27వరకు ఆలయ బ్రహ్మోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు.

తెరపై ఈనాడు

లక్ష్మీనారాయణ- **సప్తగిరి ఎల్ఎల్‌బీ, సిద్ధార్థ- 2 కంట్రీస్,** వరలక్ష్మి - **ఒక్క క్షణం,** విజయలక్ష్మి- **ఖాకి, లక్ష్మీ**చక్రవర్తి- **ఇంద్రసేన,** రంగా సినీ సెంట్రల్- **ఎంసీఏ, టైగర్ జిందా హై, హలో, జవాన్**

కూరగాయల ధరలు (నిన్నటివి కిలోల్లో)

ధర్మవరం: పచ్చిమిరప- రూ.20, టమోటా రూ.5, క్యారెట్ - రూ.50, కాకర -రూ.30, వంకాయలు - రూ.15, బీట్‌రూట్ - రూ.40, బంగాళాదుంపలు - రూ.15, చౌడేకాయలు - రూ.30, బీరకాయలు-రూ.20, ముల్లంగి - రూ.30, క్యాబేజి - రూ.30, బీన్స్-రూ.50, బెండ - రూ.20, ఉల్లిపాయలు - రూ.40.

మహిళలకు ఉపాధి అవకాశాలు



పరిశ్రమను ప్రారంభిస్తున్న పట్టుపరిశ్రమ జేడీ అరుణకుమారి

గొట్లూరు(ధర్మవరం పట్టణం),న్యూస్‌టుడే: పేద మహిళకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి రాయితీపై సిల్క్ రీలింగ్ పరికరాలను అందిస్తున్నట్లు సెంట్రల్ సిల్క్ బోర్డు డైరెక్టర్ సుభాష్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం ధర్మవరం మండలంలోని గొట్లూరు గ్రామంలో రాయితీపై ఏర్పాటు చేసిన సిల్క్ రీలింగ్ కుటీర పరిశ్రమాన్ని పట్టు పరిశ్రమశాఖ జేడీ అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుభాష్ నాయక్ మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం పెద్ద ఎత్తున రాయితీలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీలకు చెందిన నాగలక్ష్మి, రమేష్‌కు రూ.50 లక్షలతో సిల్క్ రీలింగ్ కుటీర పరిశ్రమకు రుణ సదుపాయాన్ని కల్పించినట్లు తెలిపారు. ఇందులో రూ.28.05 లక్షలు రాయితీ పోగా మిగిలిన సొమ్మును బ్యాంకు, లబ్ధిదారుల వాటా కింద చెల్లింపు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ పరిశ్రమ ద్వారా 50 మంది మహిళలకు స్థానికంగా ఉపాధి అవకాశం దక్కుతుందన్నారు. ధర్మవరం పట్టణంలో గతంలో జనరల్ కేటగిరి కింద రాయితీపై 15 సిల్క్ రీలింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మది అలిగన్, పట్టు పరిశ్రమ డివిజన్ సంచాలకురాలు శోభారాణి, సర్పంచి శివయ్య, మహదేవ్, నల్లబాబు, వెంకటేశ్వర్లు, బ్యాంకు మేనేజర్లు లోకేష్, వెంకటేష్, మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రథమస్థానం సాధించిన విద్యార్థిని నవిత

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు ఆసక్తిగా పాల్గొని రంగవల్లులు వేశారు. విద్యార్థిని నవిత వేసిన ముగ్గు ప్రథమస్థానానికి ఎంపికైంది. నవ్య వేసిన ముగ్గుకు ద్వితీయస్థానం లభించింది. కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీకాంత్ రెడ్డి, అధ్యాపకులు శ్రీవల్లి, వనితవాణి, శాంతి, పద్మజ పర్యవేక్షించారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేయండి

బత్తలపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేయాలని వెలుగు పథకం ఏపీఎం పద్మావతి సూచించారు. శనివారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో సాధికార మిత్ర సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పథకాలను లబ్ధిదారులకు అందించాలనే లక్ష్యంతో సాధికార మిత్రలను ప్రభుత్వం నియమించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు బాధ్యతతో పని చేయాలన్నారు. సమావేశంలో శిక్షకులు, మహిళా సమాఖ్య సంఘాల లీడర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీవో పద్మావతి

గుంతకల్లు

నేడు ఆస్తి పన్ను వసూలు

పామిడి: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఆస్తి పన్ను వసూలు చేయడానికి కౌంటర్ తెరచి ఉంటుందని, పన్ను చెల్లించి రసీదులు పొందాలని కమిషనరు నాసిర్‌హుసేన్ ప్రజలకు శనివారం తెలియజేశారు. జనవరి 1 నుంచి ఆస్తి పన్నుకు సంబంధించి వడ్డీ వసూలు చేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పట్టణ ప్రజలకు సూచించారు.

కస్తూరిబా పాఠశాలలో కిశోర వికాసం

గుత్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని కస్తూరిబా పాఠశాలలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాస్ కార్యక్రమం జరిగింది. సీడీపీవో సుగుణమ్మ, చైల్డ్‌లైన్ సమన్వయకర్త బాలాజీ కార్యక్రమాన్ని నిర్వహించారు. యుక్తవయస్సులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఆరోగ్యంగా ఉండేందుకు పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. పోషకాహారంతోనే రక్తహీనత దూరం అవుతుందన్నారు.

చెత్తను తోపుడుబండ్లలోనే వేయండి

పామిడి, న్యూస్‌టుడే: ఇళ్లలో నుంచి వెలువడే తడి, పొడి చెత్తను రోజూ ఇళ్ల వద్దకు వచ్చే తోపుడు బండ్లలో వేయాలని కమిషనరు నాసిర్‌హుసేన్ పట్టణ ప్రజలను కోరారు. శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛ కార్పొరేషన్ ద్వారా వచ్చిన 20 తోపుడు బండ్లను, 160 చెత్త బిన్‌లను ఆయన ఛైర్మన్ గౌస్‌పీరా, ఉపాధ్యక్షురాలు బొల్లుశ్యామలాదేవి, కౌన్సిలర్ల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ముస్లింలకు రక్షణ కల్పించాలని వినతి

హనుమేష్‌నగర్ (గుంతకల్లు), న్యూస్‌టుడే : ప్రభుత్వం ముస్లింల రక్షణకోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని వైకాపా మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు అహమ్మద్ బాషా, కౌన్సిల్ ప్రతిపక్షనాయకుడు మహబూబ్‌బాషా కోరారు. నాయకుల సమావేశం శనివారం సాయంత్రం జరిగింది. రాజమండ్రిలోని మసీదులో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మౌజాన్‌ను హత్య చేయడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలను పక్కనపెట్టి ముస్లింలకు రక్షణ కల్పించాలని వారు కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు మౌలా, జమీల్, మహబూబ్‌పీరా, నూర్‌నిజామి, అరీఫ్, గఫార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : రాజమండ్రిలోని మసీదులో మౌజాన్‌ను హత్యచేసిన నిందితులను ప్రభుత్వం గుర్తించి గట్టి చర్యలు తీసుకోవాలని పట్టణ అంజుమన్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ జాఫర్, కాంగ్రెస్ నియోజకవర్గ బాధ్యుడు ప్రభాకర్ వేర్వేరు పత్రికా ప్రకటనల్లో కోరారు. ముస్లిం మైనార్టీల రక్షణ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలి

అంజుమన్‌కాలనీ (గుంతకల్లు), న్యూస్‌టుడే : కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి యువతీయువకులు ముందుకు రావాలని జిల్లా పరిశ్రమల కేంద్ర జనరల్ మేనేజరు సుదర్శన్‌బాబు అన్నారు. అంజుమన్ కాలనీలోని స్త్రీశక్తి భవనంలో శనివారం పట్టణంలోని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, విద్యార్థుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు, విద్యావంతులు ఉద్యోగాలపై ఆధారపడకుండా పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి పొందుతూ మరికొందరికి ఉపాధి కల్పించడానికి ముందుకు రావాలన్నారు. ఇందుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారాన్ని అందిస్తామని చెప్పారు. వినియోగదారులకు మంచి సేవలు అందించేవారే రాణిస్తారని చెప్పారు. కార్యక్రమంలో యువకులు, పారిశ్రామిక శిక్షణాకేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. సమావేశంలో పరిశ్రమల కేంద్రం ఉప సంచాలకులు సువదర్‌రాజు, స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ సీనియర్ బ్రాంచ్ మేనేజరు నాంచారయ్య, గుంతకల్లు పారిశ్రామికవేత్త రామ్మోహన్ గుప్తా పాల్గొని ప్రసంగించారు.



ప్రసంగిస్తున్న జనరల్ మేనేజరు సుదర్శన్ బాబు

అజెండా చదవకుండానే ఆమోదం

పట్టణంలో లోపించిన పారిశుద్ధ్యంపై ప్రశ్నించిన ప్రతిపక్షం


మున్సిపల్ అధ్యక్షురాలితో వైకాపా కౌన్సిలర్ల వాగ్వాదం

గుంతకల్లు, న్యూస్‌టుడే : మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, ఈ విషయంలో అధికారులు విఫలం అవుతున్నారని కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు మహబూబ్ బాషా, ఆ పార్టీ కౌన్సిలర్ గోపి ఆరోపించారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం కౌన్సిల్ సమావేశపు మందిరంలో జరిగింది. పారిశుద్ధ్యం సక్రమంగా లేదనడం మంచిదికాదని, రెండు నెలల్లో సమస్యకు పరిష్కారం లభిస్తుందని మున్సిపల్ అధ్యక్షురాలు అపర్ణ అన్నారు. వైకాపాకు చెందిన కౌన్సిలర్లు అధ్యక్షురాలి పోడియం వద్దకు వచ్చి వాగ్వాదానికి దిగారు. దీంతో ఆమె అజెండాను చదివించడం ప్రారంభించారు. ఇందుకు ప్రతిపక్ష కౌన్సిలర్లు అడ్డుతగిలారు. ఉపాధ్యక్షుడు శ్రీనాథ్‌గౌడ్ వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో తాము అజెండాను ఆమోదిస్తున్నామని శ్రీనాథ్‌గౌడ్ చెప్పడంతో అపర్ణ సమావేశాన్ని ముగిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వైకాపా కౌన్సిలర్లు నిరసన తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని అడగడమే తప్పా అని ప్రశ్నించారు. వైకాపా కౌన్సిలర్ల వార్డుల్లో పనులు పెద్దగా చేపట్టడం లేదని తెలిపారు. సమావేశంలో కమిషనర్ సత్యనారాయణ, మున్సిపల్ ఇంజినీరు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.


గుత్తి: మాట్లాడుతున్న కౌన్సిలర్లు

నూతన సంవత్సరం వేడుక..

కౌన్సిల్ సమావేశానికి ముందు సమావేశపు మందిరంలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఇందుకు అవసరమైన కేకును వైకాపాకు చెందిన కౌన్సిలర్ మధు సమకూర్చారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులు కేకును కోసి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యలు తీర్చమంటే నిధులులేవంటారే?

గుత్తి: పురపాలికలోని వార్డుల్లో సమస్యలను పరిష్కరించమంటే నిధులు లేవంటారని శనివారం ఛైర్‌పర్సన్ తులశమ్మ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు వాపోయారు. మీరు చేపట్టే పనులకు నిధులుంటాయి. మేము అడిగే పనులకు ఎందుకు నిధులు ఉండటం లేదని ఆరోపించారు. వైకాపా కౌన్సిలర్ల వార్డుల్లో నిధులు వ్యయం చేయరా? అని కౌన్సిలర్లు వరలక్ష్మి, రాజేశ్వరి, జరినా, హసీనా, కమలాక్షమ్మ, కళ్యాణి అధికారులను ప్రశ్నించారు. తన వార్డులో 4 ఏళ్ల నుంచి సిమెంట్ రహదారిని నిర్మించడంలేదని వరలక్ష్మి వాపోయారు. హోరేబు చర్చి ప్రాంతంలో ప్రజలు అనేక సమస్యలతో బాధపడుతున్నట్లు కౌన్సిలర్ రాజేశ్వరి తెలిపారు. గుత్తిఆర్.ఎస్.లో స్పాట్‌డెలివరీ ట్యాంకు మోటారు పనిచేయక ప్రజలు తాగునీటికి ఇబ్బందిపడుతున్నట్లు వరలక్ష్మి వాపోయారు. సమస్యలను తీర్చలేనప్పుడు సమావేశాలను ఎందుకు నిర్వహిస్తున్నట్లు అని కౌన్సిలర్ షఫీ సమావేశం నుంచి వెళ్లిపోయారు. సమావేశంలో ఆర్ఐ మంజునాథగౌడ్, ఏఈ శ్రీకాంత్, పట్టణ ప్రణాళిక అధికారి దామోదర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


పామిడి: సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

ఎన్టీఆర్ ఇళ్ల జాబితా ఏమైనట్లు?

పామిడి: ఎన్టీఆర్ ఇళ్ల మంజూరు కోసం వార్డుల వారీగా అర్హులైన నిరుపేదలను గుర్తించి కార్యాలయంలో జాబితా అందజేయడం జరిగిందని, అయితే ఎంపికైన జాబితాలో తాము ఇచ్చినవారి పేర్లు కాకుండా ఇతరుల పేర్లు ఎలా వచ్చాయని కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఛైర్మన్ గౌస్‌పీరా అధ్యక్షతన కమిషనరు నాసిర్‌హుసేన్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీలకు అతీతంగా ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో ఇళ్లను మంజూరు చేస్తున్నామని ఛైర్మన్ అనడంతో కౌన్సిలర్లు పైవిధంగా స్పందించారు. ప్రతి పక్ష కౌన్సిలర్ల వార్డులలో కూడా అభివృద్ధి పనులను చేపట్టాలని 8వ వార్డు కౌన్సిలర్ ప్రశ్నించగా అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తున్నామని, ఇందులో ఎవరికీ ఎలాంటి సందేహం అవసరం లేదన్నారు. అనంతరం చేపడుతున్న పలు అభివృద్ధి పనుల తీర్మానాలను కౌన్సిల్ ముందు చదివి వినిపించారు. ఈ సమావేశంలో వైస్‌ఛైర్మన్ బొల్లు శ్యామలాదేవి, అన్ని శాఖల అధికారులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నగదు అందజేత


అయ్యవారిపల్లి (గుంతకల్లు గ్రామీణం), న్యూస్‌టుడే : అనారోగ్యంతో బాధపడుతూ సూర్యనారాయణ అనేవ్యక్తి శనివారం మృతి చెందారు. దీంతో సూర్యనారాయణ కుటుంబానికి వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త వెంకట్రామిరెడ్డి రూ.10 వేల నగదును అందజేశారు. మండలంలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు అయిన సూర్యనారాయణ గత 5 ఏళ్ల నుంచి కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతి చెందడంతో నాయకులతో కలిసి మృతుడికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుడికి ముగ్గురు కూతుర్లు ఉన్నారు. భార్య ఇంతకుముందే మరణించారు. ముగ్గురు ఆడపిల్లలు అనాథలుగా మిగలడంతో వారికి ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి దామోదర్‌రెడ్డి, తిప్పారెడ్డి, దశరథరామిరెడ్డి, ఎద్దుల శంకర్, సోమిరెడ్డి, జయరామిరెడ్డి, ఓబులేసు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


నగదు అందజేస్తున్న వెంకట్రామిరెడ్డి

ముస్లిం మహిళల సంబరాలు

గుంతకల్లు: ముస్లిం మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడటానికి ప్రధాని నరేంద్ర మోదీ మూడుసార్లు తలాక్ చెప్పడానికి వ్యతిరేకంగా లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేశారని భాజపా జిల్లా కార్యదర్శి, భేటీ బచావో.. భేటీ పడావో పథకం రాష్ట్ర సంయుక్త కన్వీనర్ విజయలక్ష్మి అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం ముస్లిం మహిళలతో కలిసి సంబరాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ముస్లిం మహిళలకు వారి భర్తలు మూడుసార్లు తలాక్ చెప్పి వారిని వదిలించుకోవడం అమానుషమనీ... వారి జీవితాలు నాశనం అవుతాయని మోదీ నిర్ణయించి వారికి అండగా నిలబవడానికే బిల్లును ప్రవేశపెట్టారని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ముస్లిం మహిళలు మోదీకి ధన్యవాదాలు తెలిపారు. ఐక్యతను చాటుతూ తీపిపదార్థాలను పంచుకొన్నారు. ప్రతినిధులు జయమ్మ, శైలజ, పుష్పలత, సుజాత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


ముజుంబిల్ బాషా


భరత్

గుంతకల్లు, న్యూస్‌టుడే : దక్షిణ భారతదేశ క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు ఎస్.ఎస్.జి.ఎస్. ఎయిడెడ్ డిగ్రీ కళాశాలకు చెందిన క్రీడాకారుడు ముజంబిల్ బాషా ఎన్నిక కావడం కళాశాలకే గర్వకారణమని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రామాంజనేయులు అన్నారు. ఈనెల 18న ఎస్.కె. యూనివర్సిటీలో జరిగిన అంతర్ కళాశాలల క్రికెట్ పోటీల్లో ప్రతిభను చూపినందుకు ముజంబిల్ బాషా విశాఖపట్నంలో త్వరలో జరగనున్న దక్షిణభారతదేశ కళాశాలల పోటీలకు ఎంపికయ్యాడని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొని క్రీడాకారుణ్ని అభినందించారు.

● ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి భరత్ ఎన్.ఎస్.ఎస్. రాష్ట్రస్థాయి ఉత్సవాల్లో పాల్గొనడానికి ఎంపిక అయినందుకు తమకు చాలా సంతోషంగా ఉందని ప్రిన్సిపల్ శ్రీనివాసులు అన్నారు. ఎస్.కె. యూనివర్శిటీలో శుక్రవారం జరిగిన పోటీల్లో భరత్ మిమిక్రీ అంశంలో ప్రథమ బహుమతిని అందుకొన్నాడు. దీంతో రాష్ట్రస్థాయి ఉత్సవాలకు అవకాశం కల్పించారు. ఎన్.ఎస్.ఎస్. అధికారులు సుబ్రహ్మణ్యం, చంద్రకళ, విద్యార్థులు భరత్‌ను అభినందించారు.

గుంతకల్లు

నేడు రెడ్డి సంక్షేమ సంఘం కాలమానిని ఆవిష్కరణ

గుంతకల్లు, న్యూస్‌టుడే: రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం కాలమాని పట్టికల ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని సంఘం అధ్యక్షుడు జి.పి. విశ్వనాథరెడ్డి తెలిపారు. తిలక్‌నగర్‌లోని ప్రసాద్ థియేటర్‌లో ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి సంఘం నాయకులు, సభ్యులు, రెడ్డి కులస్థులు హాజరు కావాలని ఆయన కోరారు.

సంతోషంగా వేడుకలు జరుపుకోవాలి

వజ్రకరూరు, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని ఎస్సై జనార్దననాయుడు కోరారు. పోలీసు స్టేషన్‌లో శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఈనెల 31న రాత్రి పది గంటల నుంచి సోమవారం తెల్లవారుజామున ఐదు గంటల వరకు వివిధ ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తారన్నారు.

క్రీడల్లో రాణింపుతో భవిత



జ్యోతి వెలిగిస్తున్న ఎస్సై వెంకటప్రసాద్

పిఅండ్‌టికాలనీ (గుంతకల్లు), న్యూస్‌టుడే: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమని ఒకటో పట్టణ ఎస్.ఐ. వెంకటప్రసాద్, ప్రిన్సిపల్ మస్రత్ బేగం అన్నారు. పట్టణంలోని పి.అండ్.టి. కాలనీలోని శ్రీచైతన్య పాఠశాలలో క్రీడా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు వారికి ఇష్టమైన ఆటను ఎంపిక చేసుకొని ఆడటం ఆరోగ్య పరిరక్షణకు చాలా అవసరమని అన్నారు. తాము గతంలో ఆటలు ఆడటంతోనే ఈ రోజు ఆరోగ్యంగా ఉన్నామని చెప్పారు. క్రీడలతో విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని చెప్పారు. ఎస్సై క్రీడాజ్యోతిని వెలిగించగా.. విద్యార్థులు కవాతు చేసి వివిధ ఆటలు ఆడారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఎ.జి.ఎం. సుబ్బారెడ్డి, డీన్ నాగభూషణం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

గుంతకల్లు గ్రామీణం: వాసవి : ఎంసీఏ

కేపీఎస్: హలో, **చైతన్య :** 2 కంట్రీస్

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

తిలక్‌నగర్ (గుంతకల్లు), న్యూస్‌టుడే: గుంతకల్లు మున్సిపల్ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి రామ్మూర్తి గుంతకల్లు పట్టణానికి అందిస్తున్న సేవలను తాము మర్చిపోలేమని మున్సిపల్ అధ్యక్షురాలు అపర్ణ, ఉపాధ్యక్షుడు శ్రీనాథ్‌గౌడ్, కమిషనర్ సత్యనారాయణ అన్నారు. ఆయన ఉద్యోగ విరమణను పురస్కరించుకొని శనివారం మున్సిపల్ సమావేశ మందిరంలో ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ, రోగులకు వైద్యం అందించే విషయంలో ఏ రోజు కూడా నిర్లక్ష్యానికి, విమర్శలకు తావు ఇవ్వకుండా విధులను నిర్వహించారని వారు కొనియాడారు. ఒకవైపు వైద్య వృత్తిని కొనసాగిస్తూ మరోవైపు అనాథ బాలుర శరణాలయం నిర్వహణ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేస్తూ మంచి పేరు గడించారని వారు తెలిపారు. కౌన్సిలర్లు, మున్సిపల్ ఇంజినీరు ఈశ్వరయ్య, డీఈ వెంకటచలపతి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ రామ్మూర్తికి సన్మానం

● **అధ్యాపకుడికి సన్మానం..:** శంకరానందగిరిస్వామి ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో వాణిజ్య అధ్యాపకుడుగా పనిచేసిన కె. రంగయ్య చౌదరి శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన అధ్యాపకుడిగా పనిచేస్తూ రోటరీక్లబ్‌లో ఉంటూ వివిధ హోదాల్లో పనిచేసి.. సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. అధ్యాపకులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. కరస్పాండెంట్ కె.సి.నారాయణ, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రామాంజనేయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

పోరాటాలతోనే హక్కుల సాధన

భాగ్యనగర్ (గుంతకల్లు), న్యూస్‌టుడే: విద్యార్థుల హక్కుల సాధన కోసం నిరంతరం ఆందోళన చేస్తున్నామని భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కె.రమేష్, డివిజన్ అధ్యక్షుడు సి.రమేష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం సమాఖ్య ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. వారు సమాఖ్య పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేశారు. నాయకులు కైలాష్ వర్మ, హరీష్, బాబు, శివ, రమేష్, అమరేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

మాళాపురం(విడపనకల్లు): ప్రభుత్వ పథకాలపై కైజాల యాప్ ద్వారా ట్రైనీలు అజిత్, శివకుమార్ శనివారం వి.కొత్తకోట, మాళాపురం గ్రామాల్లో అవగాహన కల్పించారు. తెదేపా గ్రామ కమిటీలు, మండల కమిటీలకు పథకాల గురించి సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరించారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొంటోందని తెలిపారు. సమస్యలు ఉంటే యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. నిర్వాహకుడు ధనుంజయ్య పాల్గొన్నారు.

చిన్నప్పటి నుంచే సేవాభావం అవసరం



అనాథ ఆశ్రమంలో కేకును కోస్తున్న విద్యార్థులు

తిలక్‌నగర్ (గుంతకల్లు గ్రామీణం), న్యూస్‌టుడే : ఇతరులకు సేవ చేయడం విద్యార్థులు చిన్నప్పటి నుంచే అలవరచుకోవాలని బాష్యం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయకరవర్మ సూచించారు. పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఉన్న బాష్యం పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థులు వారి సొంత ఖర్చుతో తిలక్‌నగర్‌లోని విశ్వహిందూ పరిషత్ అనాథ ఆశ్రమంలోని చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు, చాక్లెట్లు పంచిపెట్టి, కేకును కోసి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటం, కష్టాలు వచ్చినప్పుడు వాటిని ధైర్యంగా ఎదుర్కోవడం చిన్నప్పటి నుంచే నేర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య పథకాల గురించి తెలియజేయాలి

నాగసముద్రం(గుంతకల్లు గ్రామీణం), న్యూస్‌టుడే : ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఎవరి గ్రామంలో వారు జన్మభూమి కార్యక్రమంలో పాల్గొని ఆరోగ్య సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేసే వైద్యశిబిరాలలో పాల్గొనాలని ఆరోగ్య బోధకురాలు రామలక్ష్మి సూచించారు. మండలంలోని నాగసముద్రం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ప్రధానమంత్రి మాతృ యోజన, మాహిళా మాస్టర్ హెల్త్ పరీక్షలు, కాలానుగుణ వ్యాధుల నియంత్రణ గురించి అవగాహన కల్పించారు. ప్రజలకు వ్యాధులు రాకుండా నివారించే బాధ్యత ఆశా కార్యకర్తలదేనన్నారు. గ్రామాల్లో వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి నివారణ చేసి వ్యాధులను దూరం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు విజయమ్మ, సూర్యనారాయణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలను మూయించాలి

గుంతకల్లు: కొత్త సంవత్సరం సందర్భంగా పట్టణంలోని బార్‌లు, మద్యం దుకాణాలను ఆదివారం, సోమవారం మూయించేలా చర్యలు తీసుకోవాలని ఐద్వా పట్టణ అధ్యక్షురాలు జ్యోతి, భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మారుతిప్రసాద్ కోరారు. వారు శనివారం పట్టణ సి.ఐ. రాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. మద్యం అమ్మకాలతో ప్రమాదాలకు వీలుందని ఆవరు వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రతినిధులు బి.శ్రీనివాసులు, సుమలత, జానకమ్మ, ఖాజా, వలిబాషా తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఏకాదశి వేడుక జయప్రదం

కదిరి: శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుక అందరి సహకారంతో జయప్రదమైందని ఆలయ కమిటీ, అధికారులు తెలిపారు. వేడుకకు ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దేందుకు తెదేపా బాధ్యుడు కందికుంటప్రసాద్ పుష్పాలంకరణ, విద్యుత్తుదీపాలంకరణ, ఇనుప క్యూలైన్ల ఏర్పాటుతో పాటు ప్రసాదాల వితరణకు సహకరించటంపై ధన్యవాదాలు తెలిపారు. భక్తులు ఎలాంటి ఇబ్బంది పడకుండా బందోబస్తు కల్పించిన పోలీసు శాఖ, మున్సిపల్‌శాఖతో పాటు గ్రామీణ బ్యాంకు సిబ్బంది అందించిన సేవలను అభినందించారు. భవిష్యతులోనూ ఆలయ కార్యక్రమాలకు ఇదే సహకారంతో జయప్రదం చేయాలన్నారు.

పన్ను చెల్లింపుదారులకు బంగారునాణెం

కదిరి: జనవరి 12లోపు పన్నులు చెల్లించే భవన యజమానులకు లక్కీ డ్రా ద్వారా బంగారు నాణెం బహుమతి ఇస్తామని కమిషనర్ ప్రమీల తెలిపారు. 12 వరకు చెల్లించే వారిలో ఐదుగురిని లక్కీడ్రా ద్వారా ఎంపిక చేస్తామన్నారు. యజమానులు పన్ను చెల్లించిన రశీదు నకలు (జిరాక్స్) తీసి ఫోన్ నంబరు పూర్తి వివరాలతో కార్యాలయంలో అందజేయాలన్నారు. ఎంపికయిన ఐదుగురికి సంక్రాంతికి బంగారు నాణేలు అందజేస్తామన్నారు.



డోళ్లతో కళాకారుల ప్రదర్శన.

డిపో నష్టాలను తగ్గించండి

కదిరి, న్యూస్‌టుడే: నష్టాల బాటలో పయనిస్తున్న కదిరి ఆర్టీసీ డిపో లాభాల బాటలో పయనించేలా కార్మికులు కృషి చేయాలని డిపో మేనేజర్ సూర్యనారాయణ కోరారు. ఆయన ఛాంబర్‌లో 2018 నూతన దైనందినిని (డైరీని) ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఇప్పటివరకు కదిరి డిపో రూ.3 కోట్ల నష్టంతో నడుస్తోందన్నారు. నష్టాన్ని తగ్గించేలా కార్మికులు సమష్టిగా పనిచేయాల్సి ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 124 డిపోల్లో కదిరి డిపో 81వ స్థానంలో ఉందని అన్నారు. కేఎంపీఎల్ విషయంలో వెనుకబడి ఉన్నట్లు వివరించారు. డ్రైవర్లు ఇంధన పొదుపును పాటిస్తే నష్టాన్ని తగ్గించవచ్చన్నారు. అంతేకాకుండా కార్గో సేవలపైనా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. త్వరలో నూతన వస్తు రవాణా (కార్గో) కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు డీఎం పేర్కొన్నారు. ప్రయాణికుల లగేజీకి భద్రత కల్పించటంలో మెరుగైన సేవలను అందించి ఆదాయాన్ని పెంచే ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో సీసీఎస్ డెలిగేట్ మోక హరిమోహన్, బైరిశెట్టి, ఎన్వీరమణ, శివారెడ్డి, ఓబులేసు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



దైనందినిని విడుదల చేస్తున్న డిపో మేనేజరు

సంప్రదాయానికి ప్రతీక

తనకల్లు,న్యూస్‌టుడే: బీరప్పడోళ్లతో సాంస్కృతిక కార్యక్రమాలకు పునరుజ్జీవం వస్తుందని, అవి మన సంప్రదాయానికి ప్రతీకని అనంత మహిళా మండలి అధ్యక్షురాలు తోటసరోజమ్మ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని దళితవాడలో ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతికశాఖ సహకారంతో అనంత మహిళామండలి ఆధ్వర్యంలో బీరప్పడోళ్లతో కళాకారులు వివిధ కళారూపాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా యల్లమ్మ, మల్లప్ప, మల్లన్న, చిన్నమ్మ కథల ప్రదర్శనలో బీరప్ప డోళ్ల ప్రాముఖ్యతను తెలిపారు. పరమశివుడు డోళాసురుడు అనే రాక్షసుణ్ని చంపినప్పుడు ఆ రాక్షసుని కోరిక మేరకు అతని చర్మాన్ని డోలుకి ఉపయోగపడేలా శివుడు వరమిచ్చాడని సరోజమ్మ అన్నారు. జానపదగేయాల్లో డోళ్ల ప్రాముఖ్యతను వివరించారు.

జన్మభూమి కమిటీలను రద్దు చేయాలి



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తనకల్లు,న్యూస్‌టుడే: జన్మభూమి కమిటీలను రద్దుచేయాలని కాంగ్రెస్ నాయకులు శనివారం తహసీల్దారు లక్ష్మీనాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. మొదట అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి అనంతరం ప్రదర్శనగా వెళ్లి తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. గతంలో జరిగిన జన్మభూమి కార్యక్రమాల్లో ప్రజల నుండి పింఛన్లు, ఇళ్లు, ప్రభుత్వ పథకాలకు వేల దరఖాస్తులు అందితే వాటిని పరిష్కరించింది లేదు కాని ఇప్పుడు మళ్లీ జన్మభూమి అంటున్నారన్నారు. జన్మభూమి పేరుతో తెదేపా నాయకులు మాత్రమే లబ్ధి పొందుతున్నారన్నారు. గత మూడేళ్ల నుండి మండలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రుణాలు అందలేదంటే నాయకులు పెత్తనం ఎలా ఉందో అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు కొమ్ముభాస్కర్, లీగల్‌సెల్ కన్వీనర్ రామస్వామినాయుడు, బీసీసెల్ కన్వీనర్ కృష్ణమూర్తి, పీసీసీ కార్యదర్శి అహమ్మద్, డీసీసీ కార్యదర్శి ఖాదర్‌వలి, మేదర నాగభూషణం, బాలకృష్ణయాదవ్, భాస్కర్‌నాయక్, మండల కన్వీనర్ పారేసు, నాయకులు విజయ్‌కుమార్, చంద్ర ఉన్నారు.



మాట్లాడుతున్న డీపీఎం రామ్మోహన్

ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేయాలి

నల్లచెరువు, న్యూస్‌టుడే: సాధికారమిత్రలుగా నియమితులయిన మహిళా సంఘాల సభ్యులకు రెండు రోజులుగా శిక్షణ ఇస్తున్నామని డీపీఎం రామ్మోహన్ తెలిపారు. మండల వ్యాప్తంగా 339 మంది మాహిళలకు వివిధ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలియజేశారు. 41 రకాల ప్రభుత్వ పథకాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలో ప్రజలకు తెలియజెప్పాలన్నారు. అలాగే వీరంతా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వపథకాలు సద్వినియోగం, అమలులో లోపాలు, ఇబ్బందులును 1100 ద్వారా ప్రభుత్వానికి సమాచారం చేరవేస్తారని సూచించారు. 35 కుటుంబాలకు ఒకరు ఉండి, సేవాభావంతో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం రామ్మోహన్, సమన్వయకర్త రవీంద్రబాబు, ఏపీఎం భాస్కర్ నాయుడు, తెదేపా నాయకుడు నాగభూషణం నాయుడు, వెలుగు సిబ్బంది బాబ్‌జాన్, నరసింహారెడ్డి, రామచంద్ర, లలిత, చంద్రకళ, చందన, సుగణమ్మ పాల్గొన్నారు.

కూలీపై దాడి

బత్రేపల్లి(తలుపుల), న్యూస్‌టుడే: బత్రేపల్లి పంచాయతీకి చెందిన ఓ మహిళా కూలీపై క్షేత్రస్థాయి సిబ్బంది దాడి చేసి కొట్టారు.. అనంతరం మహిళా కూలీ బంధువులు కూడా ఉపాధి సిబ్బందిపై దాడిచేసి కొట్టారని, పరస్పరం ఫిర్యాదు చేసుకొన్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు కొత్త ఉపాధికార్డుల విషయంలో బత్రేపల్లికి చెందిన రూప అనే మహిళ, అదేగ్రామానికి చెందిన క్షేత్రస్థాయి సిబ్బంది శివారెడ్డిని అడిగారు. అతను సరైన సమాధానం చేప్పలేదన్న నెపంతో ఆ మహిళ దుర్భాషలాడడంతో ఆగ్రహించిన అతను ఆమెపై చేయి చేసుకొన్నాడు. దీంతో ఆమె మొదట అతనిపై ఫిర్యాదు చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉండగా శివారెడ్డిపై రూప బంధువులు దాడిచేసి కొట్టినట్లు అతను కూడా ఫిర్యాదు చేశారన్నారు. వీటిపై విచారించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దుకాణాల హక్కులకు వేలం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుకాణాల హక్కులకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం వేలంపాట నిర్వహించారు. ఇందులో ఆలయ ముందుభాగంలోని సీడీ విక్రయ దుకాణాన్ని కదిరికి చెందిన వెంకటనారాయణ హెచ్చుపాటతో రూ.2.22 లక్షలకు దక్కించుకున్నారు. ఇందుకు జీఎస్టీ 18శాతం రూ.39960 కలిపి రూ.2.61 లక్షలను వసూలు చేశారు. గతేడాది ఈ దుకాణం 2.19 లక్షలు పలికింది. దీంతో పాటు ఆలయ తూర్పురాజగోపురం ముందున్న టెంకాయల రెండో దుకాణానికి నిర్వహించిన వేలంలో ముగ్గురు పాల్గొన్నారు. వీరిలో కదిరికి చెందిన బాలప్ప అందరికంటే ఎక్కువ మొత్తం రూ.8.45 లక్షలకు పాడి హక్కు దక్కించుకున్నారు. గతేడాది ఈ దుకాణం రూ.9.56 లక్షలు పలికింది. ఈ సారి పాటకు 18 శాతం జీఎస్టీతో రూ.1.52 లక్షలు కలిపి రూ.9.97లక్షలను వసూలు చేశారు.

భార్యపై హత్యాయత్నం



మదనపల్లి ఆసుపత్రిలో సరస్వతి

పెడబల్లి(నంబులపూలకుంట), న్యూస్‌టుడే: పెడబల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్య భార్య వివాహేతర సంబంధం పెట్టుకుందన్న అనుమానంతో హత్యాయత్నం చేసిన సంఘటన వెలుగుచూసింది. ఎస్సై రమేష్ బాబు తెలిపిన మేరకు వివరాలు. పెడబల్లికి చెందిన లక్ష్మయ్య భార్య సరస్వతిని తరచూ వేధింస్తుండేవాడు. గతంలో ఆమెను వివస్త్రను చేసి బయటకు నెట్టినట్లు సమాచారం ఉందన్నారు. ఇలాంటి సంఘటనలు జరిగిన పలుమార్లు స్థానికులు లక్ష్మయ్యను మందలించారు. గురువారం రాత్రి మద్యం తాగి భార్యపై దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. ఆమె మెడకు ఉరివేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడన్నారు. పరిస్థితిని గమనించిన బంధువులు చిత్తూరు జిల్లా మనదపల్లికి తరలించారు. మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితురాలు పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలాన్ని తమకు పంపారన్నారు. ఆ సమాచారం మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆదివారం భార్యభర్తలు ఇద్దరూ స్టేషన్‌కు వస్తామని తెలిపారని ఎస్సై పేర్కొన్నారు.

మౌజన్ హత్య దారుణం



మాట్లాడుతున్న ప్రభుత్వ ఖాజీ

కదిరి, న్యూస్‌టుడే: రాజమహేంద్రపురంలో నూరానీ మసీదు మౌజన్‌ను హత్యచేయటం దారుణమని ప్రభుత్వ చీఫ్‌ఖాజీ అన్సర్‌బాషా ఖండించారు. మదరసాలో శనివారం ఆయన మాట్లాడారు. నూరానీ మసీదులో బీహార్‌కు చెందిన మహమ్మద్ ఫారూఖ్(60) మూడునెలలుగా పనిచేస్తున్నాడన్నారు. ఐదుపూటలా నమాజు చేసుకుంటూ ఖురాన్ బోధించేవారన్నారు. మసీదులోకి ప్రవేశించిన కొందరు అల్లరిమూకలు పవిత్ర ఖురాన్‌ను కాల్చే ప్రయత్నాన్ని అడ్డుకున్న మౌజన్‌ను దారుణంగా హత్యచేశారన్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని ఇమాం, మౌజన్ల కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు హఫీజ్ జబివుల్లా డిమాండ్ చేశారు. పోలీసులు తక్షణం స్పందించి న్యాయపరంగా కఠినమైన శిక్షపడేలా చూడాలన్నారు. సమావేశంలో ఇమాం, మౌజన్ల సంఘ నాయకులు హఫీజ్ అర్షద్‌సాబ్, ఖాజీ అల్లాబకష్, ముతవల్లి సద్దాం, ఇమాంఅలి, మౌలానాఆ ఫిరోజ్, వేమల ముజీబ్, షబ్బీర్ అహమ్మద్, అనీఫ్, మన్సూర్, సుబహాన్ పాల్గొన్నారు.

నూరానీ మసీదు మౌజన్ హత్య దారుణమని వైకాపా పట్టణ అధ్యక్షుడు బహావుద్దీన్ ఖండించారు. హత్యచేసిన దుండగులను కఠినంగా శిక్షించి శాంతిభద్రలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఉత్తరాదిమాదిరిగా ఆంధ్రప్రదేశ్ లోనూ మతస్వేచ్ఛ లేకుండా హరించాలని చూస్తున్న అరాచక శక్తుల ఆటకట్టించి ముస్లిం మైనార్టీలకు రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నౌషాద్ ఖాన్, జిలాన్, ఖలీల్, కరీముల్లా, ఖాదర్‌బాషా, ఇలాహి, అతహర్, ఎహసాన్, ఖాజాబాబా, మహబూబ్‌బాషా, గౌస్ ఖాన్, షౌకత్, అల్తాఫ్‌లు పాల్గొన్నారు.

విశ్రాంత అధ్యాపకుడికి సన్మానం

కదిరి, న్యూస్‌టుడే: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్యశాస్త్ర అధ్యాపకుడిగా ఉద్యోగ విరమణ పొందిన నరసింహారావుకు శనివారం ఘన సన్మానం చేశారు. మొదట టైపిస్ట్‌గా చేరి, జూనియర్ లెక్చరర్, తర్వాత డిగ్రీకళాశాల అధ్యాపకుడిగా విరమణ పొందారన్నారు.. ప్రిన్సిపల్ శ్రీనివాసనాయుడు, వైస్ ప్రిన్సిపల్ స్మిత, అధ్యాపకులు శ్రీనివాసులు, ఆదినారాయణ, చిట్టెమ్మ, రాజ్‌మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న అధ్యాపకులు

కదిరి

కూరగాయల ధరలు కేజీ (రూ.ల్లో)

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి మార్కెట్‌లో నిన్నటి ధరలు టమోటా. 5, పచ్చిమిర్చి 30, వంకాయ 20, బెండ 40, క్యారెట్ 50, ఆలుగడ్డ 20, బీట్‌రూట్ 50, బీన్స్ 20, ముల్లంగి 30, బీరకాయ 40, సీమవంకాయ 30, క్యాప్సికమ్ 60, క్యాబేజి 30, కాకర 40, కాలిఫ్లవర్ ఒక్కొటి 30, మునగకాయలు 200, గోరుచిక్కుడు 40, చిక్కుడు 50, యర్రగడ్డలు 50, తెల్లగడ్డలు 80


2 నుంచి జన్మభూమి సభలు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: జనవరి రెండోతేదీ నుంచి ఐదోవిడత జన్మభూమి మాఊరు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఆదినారాయణ తెలిపారు. జనవరి రెండో తేదీ నుంచి 10 వరకు పదిరోజుల పాటు మండల పరిధిలోని 12 పంచాయతీల్లోనూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అధికారులు వివరిస్తారు. ప్రజల నుంచి వినతులు, దరఖాస్తులు తీసుకుంటారన్నారు. 12 పంచాయతీల్లోనూ మండల స్థాయి అధికారులు, వివిధశాఖల సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి గ్రామసభలు నిర్వహిస్తారని ఎంపీడీవో తెలిపారు. 11న పట్టణంలోని బాలికల ఉన్నతపాఠశాల ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు అవార్డుల ప్రదానం నిర్వహిస్తామన్నారు. ప్రజలు గ్రామసభలకు హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

గాండ్లపెంటలో...

గాండ్లపెంట: ఐదో విడత జన్మభూమి- మాఊరు కార్యక్రమాలు జనవరి 2 నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీరాములు తెలిపారు. 2న గొడ్డువెలుగల, జీనులకుంట, 3న తుమ్మలబైలు, వేపరాల, 4న కటారుపల్లి, 5న మద్దివారిగొంది, 6న మల్లమీదపల్లి, 7న చామాలగొంది, 8న తూపల్లి, 9న సోమయాజులపల్లి, 10న కూరమామిడి, చివరి రోజున 11న గాండ్లపెంటలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. జనవరి 2, 3 తేదీల్లో రెండు బృందాలుగా ఉంటాయని ఒకదానికి ఎంపీడీవో శ్రీరాములు, రెండవ బృందానికి తహసీల్దార్ శ్రీనివాసులు నేతృత్వం వ్యవహరిస్తారన్నారు. 4 నుంచి అధికారులంతా ఒకే బృందంగా ఉంటారని తెలిపారు.

కదిరి క్రీడాకారుల ప్రతిభ




సాంబశివ, సంపత్‌కుమార్

కదిరి, న్యూస్‌టుడే: విజయనగరంలో జనవరి రెండు నుంచి ప్రారంభమయ్యే అండర్-19 కూచ్‌బీహార్ ట్రోఫీలో పాల్గొనేందుకు కదిరి క్రీడాకారుడు సాంబశివ ఎంపికయినట్లు కోచ్ నజీర్ తెలిపారు. ఆంధ్రజట్టు, గుజరాత్ జట్టుతో తలపడనుందని పేర్కొన్నారు. అంతేకాకుండా అంతర్‌విశ్వవిద్యాలయాల పోటీలకు సంపత్‌కుమార్ ఎంపికయ్యాడన్నారు. అనంతపురంలో జరిగిన అంతర్ కళాశాలల పోటీలలో విశేష ప్రతిభ చాటిన ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి సంపత్‌కుమార్ అంతర్ విశ్వవిద్యాలయాల జట్టులో స్థానం పొందాడన్నారు. వీరిద్దరు ఎంపికపట్ల ఆర్టీటీ కదిరి రీజనల్ డైరెక్టర్ ప్రమీలకుమారి, ఏటీఎల్ రుక్మాంగద, కదిరి మండల క్రికెట్ సంఘ అధ్యక్షుడు కందికుంట ప్రసాద్, పవన్‌కుమార్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసనాయుడు హర్షం వ్యక్తం చేశారు.

చైతన్యంతోనే మహిళల ముందడుగు



మాట్లాతున్న డీఎస్పీ శ్రీలక్ష్మి

గాండ్లపెంట,న్యూస్‌టుడే: మహిళలు చదువుతో పాటు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించినప్పడే మోసపోకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందని కదిరి డీఎస్పీ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. శనివారం కమతంపల్లిలో గ్రామస్థులకు రహదారి నిబంధనలు, మహిళ అక్రమ రవాణా, వలసల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ మహిళలు విద్యతో పాటు ఆర్థికంగా వెనుకబాటు కారణంగా వలస వెళ్తున్నారని దీనిని ఆసరాగా చేసుకొని కొందరు వ్యక్తుల వారిని అక్రమంగా రవాణా చేస్తున్నారని తెలిపారు. మహిళలు అమాయకత్వంతో కొందరు వ్యక్తుల మాయమాటలకు మోసపోతున్నట్లు వివరించారు. వీటిని అధిగమించడానికి మహిళల్లో చైతన్యంతోనే సాధ్యమవుతుందన్నారు. వలస వెళ్లిన చోట మహిళలకు అనేక రకాలైన ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వలస వెళ్లకుండా గ్రామంలోనే ఉపాధి పనులు చేసుకుంటూ కుటుంబంతో కలిసి ఉండి అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని సూచించారు. గ్రామీణ సీఐ మన్సూరుద్దీన్ మాట్లాడుతూ వాహన చోదకులు రహదారి నిబంధనలు పాటించాలని, శిరస్త్రాణం, సీటుబెల్ట్ తప్పని సరిగా ధరించాలని సూచించారు. ఈకార్యక్రమంలో యాంటీ ట్రాఫికింగ్ సీఐ లక్ష్మన్న, ఎస్సై హరినాథరెడ్డి, ఏటీఎల్ గోవిందప్ప, ఎస్టీఎల్ అనిత, వసంత, స్వచ్ఛంద సంస్థ సభ్యుడు ఓబుళపతి పాల్గొన్నారు.

సీఎం నిధి సాయం అందజేత

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: వంకమద్ది పంచాయతీ పోరెడ్డివారిపల్లికి చెందిన నాగార్జునఆచారికి తెదేపా బాధ్యుడు కందికుంట వెంకటప్రసాద్ సీఎం నిధి సాయాన్ని అందించారు. బాధితుడు మూడునెలల క్రితం వంకమద్దిక్రాస్ వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వివిధ ఆసుపత్రుల్లో వైద్యం పొందాడు. స్థోమతకు మించిన ఖర్చులతో అప్పుల భారం పెరిగింది. ఆర్థిక సాయం మంజూరు చేయాలని సీఎం నిధికి కందికుంట ప్రసాద్ ద్వారా దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకు స్పందించిన ముఖ్యమంత్రి బాధితుడికి రూ. 30వేలు మంజూరు చేశారు. ఆసాయాన్ని కందికుంట పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు, నరసింహులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల ఆవశ్యకత తెలియజేయాలి

నల్లచెరువు, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా వ్యక్తిగత మరుగుదొడ్ల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ మగ్బుల్‌బాషా సాక్షరభారత్ గ్రామ సమన్వయకర్తలకు సూచించారు. మండలపరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ జనవరి రెండు నుండి జరిగే జన్మభూమి కార్యక్రమంలో గ్రామకోఆర్డినేటర్లు పాల్గొనాలన్నారు లోక్ శిక్షా కేంద్రాల్లో కుట్టుమిషన్ శిక్షణ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మండల సమన్వయకర్త విశ్వేశర మాట్లాడుతూ సాక్షరభారత్ కార్యక్రమం డిసెంబర్ 31న పూర్తవుతుందని పొడిగిస్తారా లేదా అనే అంశంపై స్పష్టత రాలేదని తెలిపారు. గ్రామకోర్డినేటర్లు రూ. రెండు వేలకు, మండల కోఆర్డినేటర్లు రూ. ఆరు వేలకు, గత ఏడేళ్లుగా తక్కువ వేతనంతో పనిచేస్తున్నామని చెప్పారు. మండలంలో 12674 మంది నిరక్షరాస్యులు ఉన్నారని ఏడు విడతలలో అక్షరాస్యులైనవారు 4832 మందని చెప్పారు. ఈ పథకం కొనసాగించి వేతనం పెంచాలని కోరారు.

ఐక్యతతో రాజ్యాధికార సాధన



కాలమానిని విడుదల చేస్తున్న ఉద్యోగ సంక్షేమ సంఘం

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఓట్లతో గద్దెనెక్కే పాలకులు ఆవర్గాలను నిర్లక్ష్యం చేస్తున్నాయని, ఈతీరు మారాలంటే మన ఓట్లను మన అభ్యర్థులకే వేసుకోవాలని బీసీ ఉద్యోగ సంక్షేమ సంఘ నాయకులు కోరారు. శనివారం కదిరిలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధాన పార్టీలన్నీ అగ్రకులాల వారు స్థాపించినవేనన్నారు. ఈ పార్టీల అధిష్ఠానం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కేవలం ఓటర్లగా మాత్రమే చూస్తున్నాయని అన్నారు. రానున్న ఎన్నికల నుంచి అయినా స్థానిక సంస్థల నుంచి అసెంబ్లీ, పార్లమెంటు వరకు మన అభ్యర్థులను ఎన్నికల బరిలో నిలిపి మన ఓట్లు, మన అభ్యర్థులకే వేసుకుందామని పిలుపునిచ్చారు. అత్యధిక జనాభా కలిగిన ఎస్సీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలు ఐక్యంగా నిలిస్తే రాజ్యాధికారాన్ని సాధించవచ్చున్నారు. కార్యక్రమంలో భాగంగా బీసీ ఉద్యోగ సంక్షేమసంఘం రూపొందించిన కాలమానిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు అంపావతిని గోవిందు, నాయకులు జయరాజు, అలి, లక్ష్మన్న, సూర్యనారాయణ, ఇర్ఫాన్, షమీర్, విజయభాస్కర్, శంకర్ పాల్గొన్నారు.

రుణమాఫీ పరిష్కార వేదిక రేపు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: రైతుసాధికార సంస్థ అనంతపురంలో నిర్వహిస్తున్న రుణమాఫీ పరిష్కారవేదికకు దరఖాస్తులు పెద్దసంఖ్యలో వస్తున్నందున పరిష్కారవేదికను మరోరోజు పొడిగించినట్లు కదిరి ఏడీఏ రామసురేష్ తెలిపారు. గతంలో రెండురోజులు మాత్రమే నిర్వహించ తలపెట్టిన సాధికారసంస్థ మరోరోజుకు పొడిగించినట్లు ఆయన చెప్పారు. రుణమాఫీ వర్తించని రైతుల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమాన్ని రైతుసాధికార సంస్థ శుక్రవారం నుంచి ప్రారంభించింది. వేదికకు రుణమాఫీ వర్తించని రైతులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో కార్యక్రమాన్ని మరోరోజు పొడిగించారు. పంట కోసం తీసుకున్న అప్పుమాఫీ కాని రైతులు 4,5 విడతల్లో రుణమాఫీ వర్తింపచేసేందుకు దరఖాస్తులు తీసుకుంటున్నట్లు ఏడీఏ రామసురేష్ తెలిపారు. కదిరి డివిజన్ రైతులు జనవరి ఒకటోతేదీ అనంతపురం వెళ్లి అర్జీలు అందజేయాలని సూచించారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్, రేషన్, ఓటరుగుర్తింపుకార్డు, రుణం బ్యాంక్ ఖాతాపుస్తకం నకలు ప్రతులను జతచేసి అందజేయాలన్నారు.

సభ్యత్వ నమోదులో ప్రథమం అభినందనీయం



కాలమానిని విడుదల చేస్తున్న కందికుంట

కదిరి, న్యూస్‌టుడే: తెలుగునాడు ఉపాధ్యాయ సంఘ సభ్యత్వ నమోదులో జిల్లాను ప్రథమంలో నిలపటం అభినందనీయమని తెదేపా నియోజకవర్గ బాధ్యుడు కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. కదిరిలో శనివారం టీఎన్‌యూఎస్ నూతన కాలమానిని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టీఎన్‌యూఎస్ భవిష్యత్తులో మరింత బలోపేతం కావాలన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ముందుండి పార్టీకి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థి లోకాన్ని తీర్చిదిద్దే ఉపాధ్యాయులు విధినిర్వహణతో పాటు ఆహ్లాదాన్ని పొందేలా క్రీడల్లో పాల్గొనాల్సి ఉందన్నారు. అప్పుడే మరింత ఉత్సాహంగా పనిచేయగలరని వివరించారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ టీఎన్‌యూఎస్ ప్రధాన లక్ష్యం సీపీఎస్ విధానం రద్దేనన్నారు. అందుకు కందికుంట తమకు మద్దతుగా ఉండి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు సహకరించారన్నారు. సమస్యను విన్న ముఖ్యమంత్రి సీపీఎస్‌ను అధ్యయనం చేసిన తర్వాత పరిష్కారానికి కృషి చేద్దామని సూచించారన్నారు. సీపీఎస్ సమస్య పరిష్కారం తెదేపాతో సాధ్యమని నాయకులు తెలిపారు. ముఖ్యమంత్రి కచ్చితంగా సమస్యను తీరుస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బండారు గంగాధర్, చింతా నాగరాజు, రెడ్డెప్ప, చలపతి, శంకర, దశరథ, ఆనంద్, నాగరాజు నాయక్, సుబహాన్, నాగరాజు, విజయకుమార్, సూర్యశేఖర్, నజురుల్లా, ఉమామహేశ్వర్, సీపీఎస్ నాయకులు రామాంజులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం

2 నుంచి జన్మభూమి - మాఊరు గ్రామసభలు

బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జన్మభూమి - మాఊరు కార్యక్రమం మండలంలో జనవరి 2వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ సూపరింటెండెంట్ శంకర్, తహసీల్దారు వెంకటశేషు తెలిపారు. 2న తీటకల్లు, రాయలప్పదొడ్డి, 3న కన్నేపల్లి, బొమ్మగానిపల్లి, 4న ముప్పలకుంట, పిల్లలపల్లి, 5న నాగిరెడ్డిపల్లి, భైరసముద్రం, 6న పాలవెంకటాపురం, సంతేకొండాపురం, 7న ఎరడికెర, పడమటి కోడిపల్లి, 8న భైరవానితిప్ప, గుండిగానిపల్లి, 9న వేపలపర్తి, బ్రహ్మసముద్రం గ్రామ పంచాయతీల్లో జన్మభూమి - మాఊరు గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయుడి చేయూత

కణేకల్లు, న్యూస్‌టుడే : మండలంలోని అంబాపురం పాఠశాలలో శనివారం విద్యార్థులకు టై, బెల్టు పంపిణీ చేశారు. ఉపాధ్యాయుడు మల్లికార్జున వితరణతో విద్యార్థులకు టై, బెల్టుకు కొనుగోలు చేసి పంపిణీ చేసినట్లు హెచ్ఎం విజయసారథి తెలిపారు. గ్రామానికి చెందిన దాత ధనంజయరెడ్డి అందించిన రూ.10 వేలు విరాళంతో సింటెక్స్ ట్యాంకు ఏర్పాటు చేసి తాగు నీటి వసతి కల్పించామన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి మండల పూజ



శెట్టూరులో అన్నదానం చేస్తున్న అయ్యప్ప భక్తులు

శెట్టూరు, న్యూస్‌టుడే : శెట్టూరులోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం అయ్యప్పస్వామి భక్తులు మండల పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప చిత్రపటానికి, శ్రీ ఆంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులు ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. శబరిమలైకు వెళ్లేదాకా ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆందోళనబాటలో మార్కెట్ వ్యాపారులు

దౌర్జన్యం చేసిన వారిపై చర్యలకు డిమాండ్

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : మార్కెట్ రామన్న సంతాప సభలో తీసుకున్న నిర్ణయం మేరకు కళ్యాణదుర్గం మార్కెట్ వ్యాపారులు ఆందోళన బాట పట్టారు. కూరగాయల మార్కెట్ తొలగించాలని దౌర్జన్యం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. శనివారం కూరగాయల మార్కెట్ వద్ద మార్కెట్ వ్యాపారులు రాజ్‌కుమార్, దామోదర్, మహబూబ్‌బాషా, తిప్పేస్వామి, దాదాపీర్, అశోక్, శీనా, పరమేశ్వరప్ప, వంశీలు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. రిలే నిరాహార దీక్షలకు వైకాపా నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కూరగాయల మార్కెట్ వ్యాపారుల కమిటీ నాయకులు మాట్లాడుతూ రామన్న మృతికి అధికారుల చర్యే కారణమని వారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వారిపై చర్యలు తీసుకునేంత వరకు ఆందోళన ఆపమని స్పష్టం చేశారు. అలాగే రామన్న కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకు బాధ్యులైన మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లు వెంటనే రాజీనామా చేయాలన్నారు. ఆకులకట్ట పాత మార్కెట్ స్థలం (గాంధీ కూడలి)లో 37 సెంట్లలో మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మించాలని, కూరగాయల మార్కెట్ తరలించాలన్న నిర్ణయాన్ని మానుకోవాలన్నారు. మార్కెట్ శుభ్రతపై చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీ వారికి చెల్లించిన నగదులకు రశీదులు ఇవ్వాలని, ప్రతి శుక్రవారం జరిగే సంతలో ఇబ్బందులు లేకుండా రైతులు కూరగాయలు అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వైకాపా పట్టణ కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ అధికారులు, నాయకులు తీసుకున్న అనాలోచిత నిర్ణయాలవల్లే రామన్న మృతి చెందాడన్నారు. అందుకు బాధ్యులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. కూరగాయల వ్యాపారుల కమిటీ సభ్యులు అరుణ్, రామకృష్ణ, వెంకటేశులు, రమేష్, గోవింద్, బాలాజీ, సురేష్, వైకాపా నాయకులు దేవేంద్ర, దాదాఖలందర్, వెంకటేశులు నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్షలో పాల్గొన్న కూరగాయల మార్కెట్ వ్యాపారులు

బండ్లపై కూరగాయలు విక్రయించండి

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే : దిన మార్కెట్ బంద్‌లో ఉన్నందున్న ప్రజల సౌకర్యార్థం వ్యాపారులు ఎక్కడైనా తోపుడు బండ్లపై కూరగాయలు విక్రయించుకోవచ్చని మున్సిపల్ ఛైర్మన్ బిక్కి రామలక్ష్మి తెలిపారు. అయితే ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా, వాహన రాకపోకలకు సమస్య లేకుండా తోపుడు బండ్లలో వ్యాపారం చేసుకోవాలని సూచించారు. ఇందుకు పోలీసు, పురపాలక శాఖ అధికారులు సహకారం అందిస్తారని తెలియజేశారు.

సినిమాలు

వెంకటేశ్వర : ఒక్కక్షణం, **నూర్‌ముబారక్ :** ఎంసీఏ, **సౌభాగ్య :** హలో

గ్యాస్ సమాచారం

ఏజెన్సీపేరు	కంపెనీ	ఫోన్	నమోదు	పంపిణీ
సాయిరాం	ఇండేన్	200511	29వ తేది వరకు-	నేడు

దివ్యాంగులకు సదావకాశం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : శారీరకంగా వికలత్వం ఉండి ఉన్నత విద్య చదివిన వారికి సదావకాశం ఆర్డీటీ కల్పిస్తోందని సీబీఆర్ ఎస్టీఎల్ ఎల్లమ్మ తెలిపారు. శనివారం స్థానిక ఆర్డీటీ రీజనల్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. శారీరక వికలత్వం కలిగి ఉండి ఎదైనా డిగ్రీ, పీజీ చేసినా, డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నా విదేశీ భాషలు, కంప్యూటర్, అకౌంట్స్ విభాగాల్లో ఉద్యోగార్జనకు అవసరమైన నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏడాదిపాటు శిక్షణ ఉంటుందని, ఇందులో ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్ భాషలపై మహిళలకు, పురుషులకు వేరువేరుగా శిక్షణ ఇస్తారన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీఎల్ ఎల్లమ్మ

ఇందులో చేరేందుకు అభ్యర్థులు జనవరి 31, 2018లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏడాది శిక్షణకు అడ్మిషన్ ఫీజు రూ.10 వేలు ఉంటుందన్నారు. వీటితో పాటు బత్తలపల్లిలో నర్సింగ్ స్కూల్‌లో 6 మాసాలు ఆంగ్ల భాషపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అందుకు ప్రవేశ ఫీజు, రూ.5 వేలు చెల్లించాల్సి ఉందన్నారు. అభ్యర్థులు శారీరక వికలత్వం ఉండి, అవివాహితులై ఉండవలేనని, వయసు 21 నుంచి 30 సంవత్సరాలకు మించకూడదని, గ్రామీణ ప్రాంతాలే కాకుండా పట్టణంలో ఉన్నవారు కూడా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో ఏటీఎల్ లక్ష్మయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహిళా సంఘం నాయకులు

నేడు మద్యం విక్రయించకూడదు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే : ఏడాది చివరి రోజన యువత మద్యం తాగి ప్రమాదాలకు గురై తల్లిదండ్రులకు తీరని వేదనకు గురిచేస్తున్నారు. దీంతో డిసెంబరు 31న మద్యం విక్రయించకూడదని అనంత మహిళా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగమ్మ, స్థానిక అధ్యక్షులు కృష్ణవేణి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడారు. మద్యం మత్తులో యువత పెడదారి పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 31న రాత్రి తీవ్రంగా మద్యం తాగి ద్విచక్ర వాహనాలను నడపడం, పట్టణంలోని విద్యుత్తు దీపాలను పగలగొట్టడం వంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలతో ప్రాణం మీదికి తెచ్చుకుంటున్నారని తెలియజేశారు. ఎక్సైజ్ అధికారులు, పోలీసులు దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షులు అరుణ, కార్యదర్శి షాకీర, రత్నమ్మ, సునీత, రత్నమ్మ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పంచాయతీ భవనం

ఒంటిమిద్ది (కళ్యాణదుర్గం), న్యూస్‌టుడే : నాడు పంచాయతీ భవనం.. నేడు మున్సిపాలిటీ భవనం. పేరు మాత్రమే మారింది.. సమస్యలన్నీ అలాగే ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామంలో పంచాయతీ భవనం సామగ్రి గదిగాను, చెత్త వేసుకునే దిబ్బగాను మారిపోయింది. ఆ భవనంలో కట్టెలు, పేడ కుప్పలతో కనిపిస్తోంది. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా దానిని శుభ్రం చేసి మున్సిపాలిటీ అవసరాలకు వాడాల్సిందిపోయి అలాగే వదిలేశారు. దీంతో ఆ గదులు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందిస్తే కొంత ఉపయోగం ఉంటుంది.



కార్యాలయంలో ఇలా..

ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : ఎయిడ్స్ రహిత సమాజాన్ని నెలకొల్పడమే ప్రతి ఒక్కరి బాధ్యత అని వైద్యాధికారిణి సింధూ పేర్కొన్నారు. శనివారం సీహెచ్‌సీలో ఏపీఎస్ఏసీఎస్, రిడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి సింధూ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమన్నారు. ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, ఎలా వ్యాపిస్తుందనే విషయాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. హెచ్ఐవీ బాధితులపై వివక్షత చూపకూడదని, వారికి మనోధైర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా పరీక్షలతోపాటు మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. బాధితులతో స్నేహపూర్వకంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు కుశలప్రియ, రిడ్స్ మేనేజర్ ఉపేంద్ర, ఐసీటీసీ కౌన్సిలర్ ఈశ్వరయ్య, రాజగోపాల్, రిడ్స్ సిబ్బంది మహేష్, వరలక్ష్మి, చిట్టెమ్మ, చంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యురాలు సింధూ

ఎయిడ్స్ వ్యాప్తిని అరికడదాం

కంబదూరు, న్యూస్‌టుడే : ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి ఎయిడ్స్ వ్యాప్తిని అరికడదామని వైద్యుడు అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దండా గోవింద చౌదరి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడారు. కంబదూరు, శెట్టూరు, కుందుర్పి మండలాల్లో ప్రజలకు, అధికారులకు, కార్మిక సంఘాల ప్రతినిధులకు హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తిపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివారెడ్డి, తహసీల్దారు రఫిక్ అహమ్మద్, జడ్పీటీసీ సభ్యుడు రామ్మోహన్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర ధరలు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే : కళ్యాణదుర్గం మార్కెట్‌లో శనివారం ధరలు ఇలా.. (కిలో/రూ.లలో) వెల్లుల్లి - 50, కందిపప్పు- 65, వట్టిమిరప - 90, వేరు సెనగపప్పు - 80, సెనగబేడలు - 70, గోధుమపిండి- 25, ఉప్మారవ్వ - 35, కొబ్బరి - 160, చక్కెర - 40, బెల్లం - 45, బియ్యం సోనామసూరి - 40 (పాతవి), సోనామసూరి - 35 (కొత్తవి), రాగులు - 24, జొన్నలు - 25, సజ్జలు - 20, పామాయిల్ - 70, సూర్యకాంతి నూనె - 85, పప్పులు - 90

కళ్యాణదుర్గం

హమాలీలపై తహసీల్దారు మండిపాటు

కంబదూరు, న్యూస్‌టుడే : పౌరసరఫరాల గోదాము హమాలీలపై తహసీల్దారు రఫిక్ అహమ్మద్ శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. సరకుల లోడింగ్ విషయంలో జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతి నెలా 30వ తేదీ లోపల డీలర్లకు సరకులు చేర్చాలని ఏ ఒక్కటీ పెండింగు ఉండరాదని స్టాకిస్టు నరేష్‌కు సూచించారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం

కంబదూరు, న్యూస్‌టుడే : చిరు ధాన్యాల వంటలను రోజూ తినాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని వెలుగు ఏపీఎం నాగరాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక వెలుగు స్త్రీశక్తి భవనంలో ఏర్పాటు చేసిన మండల సమాఖ్య సాధికారిత మిత్ర సభ్యులకు రిడ్స్ సంస్థ అధికారులచే చిరు ధాన్యాల వంటలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రాగి, జొన్న, సద్ద, కొర్రలతో తయారైన వంటలను తీసుకోవాలని, అవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయని అన్నారు. అప్పుడే ఆరోగ్యం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో రిడ్స్ సంస్థ అధికారులు పీఎం విశ్వనాథ్, ఎంఈవో మంజునాథ్, మల్లేష్, ఏఎన్ఎం రాధమ్మ, వోఆర్‌డబ్ల్యూ యశోధమ్మ, మండల సమాఖ్య అధ్యక్షులు లక్ష్మీదేవి, వెలుగు సిబ్బంది, సాధికారిత మిత్ర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

‘జన్మభూమి - మాఊరు’ జయప్రదం చేయండి

ఎమ్మెల్యే ఉన్నం పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉన్నం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : ఐదో విడత జన్మభూమి - మాఊరు కార్యక్రమాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు చక్కగా పనిచేసి జయప్రదం చేయాలని ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జన్మభూమి - మాఊరు కార్యక్రమం నిర్వహణపై ప్రత్యేక అధికారి నరసింహారెడ్డితో కలిసి ఎమ్మెల్యే మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత జన్మభూమితో పోల్చితే ఈ జన్మభూమికి మరుగుదొడ్ల నిర్మాణాలు, సీసీ రహదారులు చాలా వరకు పూర్తి చేశామన్నారు, ఒక్క వ్యవసాయ శాఖ సిబ్బంది చేసిన తప్పిదం తప్పితే మిగిలిన శాఖలు చక్కగానే పనిచేశాయన్నారు. జన్మభూమి - మాఊరు కార్యక్రమంలో అర్హులైన వారికి పింఛన్లు, బియ్యం కార్డులు, ఇళ్లు, ఇంటి పట్టాలు ఇస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనర్హులకు ఇచ్చిందన్నారు. వయసు లేనివారికి కూడా పింఛన్లు ఇవ్వమనడం సమంజసం కాదన్నారు. రఘువీరా రెడ్డి బయోమెట్రిక్ వద్దంటున్నారంటే ఎంత అమాయకత్వమో అర్థం చేసుకోవాలని, పారదర్శకంగా పంపిణీ చేసేందుకే తెదేపా ప్రభుత్వం బయోమెట్రిక్ విధానం తీసుకొచ్చిందన్నారు. అనంతరం ఏపీడీ, ప్రత్యేకాధికారి నరసింహారెడ్డి మాట్లాడుతూ జనవరి 2న జన్మభూమి- మాఊరు కార్యక్రమం ప్రారంభమవుతుందని, 10న ముగుస్తుందన్నారు. ప్రతి శాఖ అధికారులు వారి పనితీరుతో జన్మభూమికి రావాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా జన్మభూమిలో ప్రతి రోజూ ఒక అంశంపై చర్చించడం వాటి గురించి గ్రామస్థులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో షేహన్షా, సీడీపీవో గీతాంజలి, మార్కెట్ యార్డు ఛైర్మన్ రామాంజనేయులు, జడ్పీటీసీ సభ్యుడు కొల్లాపురప్ప, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సర్పంచుల బిల్లులు జరిగేలా చూడండి

గత రెండు నెలలుగా సర్పంచులు ఇస్తున్న చెక్కులను బ్యాంకు అధికారులు చెల్లించడం లేదని తిరిగి పంపుతున్నారని సర్పంచులు ఎమ్మెల్యేకు విన్నవించారు. గత రెండు నెలల నుంచి తాము గ్రామంలో చేయించిన పనులకు సంబంధించిన బిల్లులకు చెక్కులు తీసుకెళ్లిన ప్రతిసారి బ్యాంకు అధికారులు వెనక్కి పంపడం జరుగుతోందని అధికారులు మాత్రం తమకేం తెలియదంటున్నారని తెలిపారు. బ్యాంకు అధికారులతో, ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు.



హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

యూటీఎఫ్ కాలమానిని ఆవిష్కరణ



కాలమానిని ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే : బ్రహ్మసముద్రం తహసీల్దారు కార్యాలయ ఆవరణలో శనివారం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ సంఘం (యూటీఎఫ్) 2018 సంవత్సరానికి సంబంధించి నూతన కాలమానిని, దైనందినిలను ఎంఈవో ఓబులపతి, తహసీల్దారు వెంకటశేషు చేతుల మీదుగా ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య, మండల అధ్యక్షుడు మారుతి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు చెలిమే గౌడు, రాజన్న, సాయిరాం, భాస్కర్, జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ విద్యారంగ పటిష్టతకు, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం తమ సంఘం నిరంతరం పోరాడుతుందన్నారు. డీఏ, పీఆర్సీ, బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు.

ఏపీటీఎఫ్...

కుందుర్పి, న్యూస్‌టుడే : ఏపీటీఎఫ్ కాలమానిని ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. శనివారం ఎంఆర్సీ కేంద్రంలో ఎంఈవో చెంద్రాయుడు చేతుల మీదుగా 2018 కాలమానిని, దైనందిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు విశ్వేశ్వరప్రసాద్, సలహాదారుడు గోపాల్, మండల అధ్యక్షుడు ఈరప్ప, ప్రధాన కార్యదర్శి హనుమంతు, జిల్లా కౌన్సిలర్ బి.సి.తిమ్మప్ప, అక్కులన్న, బొమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



కాలమానిని ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న అధికారులు

బాధితులకు సాయం అందజేత

పెరుగుపాళ్యం (శెట్టూరు), న్యూస్‌టుడే : శెట్టూరు మండలంలోని పెరుగుపాళ్యంలో బాధిత కుటుంబానికి శనివారం తహసీల్దారు సుబ్రహ్మణ్యం, ఎంఈవో రామచంద్ర, ఎంపీడీవో రామచంద్ర ఆర్థికసాయం అందజేశారు. గత అక్టోబర్ 19న దీపావళి రోజున విద్యార్థులు నవీన్, సురేష్‌లు ప్రమాదవశాత్తు చెక్‌డ్యామ్‌లోపడి మృతి చెందిన విషయం తెలిసిందే. విద్యార్థి నవీన్ కుటుంబానికి రూ.25 వేలు బాల బీమా కింద అందజేసినట్లు ఎంఈవో తెలిపారు. సురేష్ అనే విద్యార్థి బెంగళూరులో చదువుతున్న కారణంగా ఎలాంటి సాయం అందలేదని అధికారులు తెలిపారు. ఇక నుంచి విద్యార్థులు ప్రమాదాల్లో మృతి చెందితే ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దారు శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందాలి

కంబదూరు, న్యూస్‌టుడే : పార్టీలకతీతంగా అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని జడ్పీటీసీ సభ్యుడు రామ్మోహన్ చౌదరి పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోవింద చౌదరి ఆధ్వర్యంలో జన్మభూమి - మా ఊరు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాలు అందని పేదలకు కచ్చితంగా అందేలా చూడాలన్నారు. తహసీల్దారు రఫిక్ అహమ్మద్, ఎంపీడీవో శివారెడ్డి, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వేదికమీద ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సీడీపీవోకు ఘనంగా వీడ్కోలు

రాయదుర్గం గ్రామీణం,: రాయదుర్గం ఐసీడీఎస్ సీడీపీవో సరోజమ్మ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. పట్టణంలోని వీరాంజనేయస్వామి కల్యాణ మండపంలో ఆమెకు వీడ్కోలు సభ నిర్వహించారు. అంగన్వాడీ ఉద్యోగులు, ఐసీడీఎస్ సిబ్బంది సీడీపీవోకు పూలమాలలు వేసి ఘనంగా సన్మానం చేసి వీడ్కోలు పలికారు. రాయదుర్గం తహసీల్దారు నాగరాజు, డిప్యూటీ తహసీల్దారు బాలకిషన్, రాయదుర్గం, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్ మండలాల ఐసీడీఎస్ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ఉచిత ఎంసెట్ శిక్షణ

కణేకల్లు, న్యూస్‌టుడే : తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇస్తున్న ఎంసెట్ ఉచిత శిక్షణను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సోమశేఖరరెడ్డి మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులు నాగిరెడ్డి సూచించారు. శనివారం ఆ కళాశాలలో ఎంసెట్ ఉచిత శిక్షణ ఇస్తున్న అధ్యాపకులకు ఆయన ప్రోత్సాహక నగదును అందజేశారు. విద్యార్థులకు అందుబాటులో ఉండేలా కళాశాలలో శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రమేష్, ఆంజనేయులు, ధనుంజయ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం



సునంద గైక్వాడ్

రాయదుర్గం, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ స్వకుళసాళి మహిళా మండలి కార్యదర్శిగా రాయదుర్గానికి చెందిన సునంద గైక్వాడ్ ఎన్నికయ్యారు. ఇటీవల ఆదోనిలో జరిగిన సమావేశంలో రాష్ట్రస్వకుళసాళి మహిళా మండలి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మహిళా మండలి రాష్ట్ర అధ్యక్షురాలిగా ఆదోనికి చెందిన లోకేశ్వరబాయిని ఎన్నుకోగా కార్యదర్శిగా సునందగైక్వాడ్‌ను ఎన్నుకున్నారు. వారితో పాటు ఎంపికైన నూతన కార్యవర్గసభ్యులు ఆదివారం ఉదయం పట్టణంలోని బళ్లారి రోడ్డు పక్కన గల హటకేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న స్వకుళసాళి సమాజ సత్రంలో రాష్ట్ర అధ్యక్షురాలు ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారోత్సవం జరగనున్నట్లు ఆ మండలి కార్యదర్శి సునందగైక్వాడ్ తెలిపారు.

పరిష్కారాలే లేవు.. తిరిగి దరఖాస్తులా..?


అధికారులు, ప్రజాప్రతినిధులను నిలదీయండి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : గతంలో జరిగిన నాలుగు జన్మభూమి సభల్లో ఇచ్చిన దరఖాస్తులకు ఇప్పటి వరకూ పరిష్కారాలు చూపలేదని.. తిరిగి దరఖాస్తులు తీసుకునేందుకు జన్మభూమి - మా ఊరు నిర్వహిస్తుండటం హాస్యాస్పదంగా ఉందని సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడు సంజీవప్ప విమర్శించారు. శనివారం పట్టణంలోని బంగి ఎర్రిస్వామి మెమోరియల్ భవనంలో సీపీఐ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవప్ప మాట్లాడుతూ గత నాలుగు విడతల జన్మభూమి సభల్లో అపరిష్కృతంగా ఉన్న దరఖాస్తులే 1.47 లక్షలు ఉన్నాయని, తిరిగి దరఖాస్తులు తీసుకునేందుకు వచ్చే అధికారులు, ప్రజా ప్రతినిధులను నిలదీయాలన్నారు. పింఛన్లు, ఇంటి స్థలాలు, పక్కా ఇళ్లు, బియ్యం కార్డులు, రుణమాఫీ, పంట నష్ట పరిహారాలు ఇలా చెప్పుకొంటుపోతే అనేక సమస్యలను పరిష్కరించాలని ఇచ్చినా నేటికీ సమస్యలకు పరిష్కారాలు చూపలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమస్యలు పరిష్కరించకపోతే గ్రామాల్లో ప్రజలే తిరగబడతారన్నారు. రుణమాఫీ అనంతపురంలో పెట్టడం దారుణమని కళ్యాణదుర్గం డివిజన్ కార్యాలయం లోనే ఏర్పాటు చేయాలని, గడువు మరింత పెంచాలని డిమాండ్ చేశారు. కూరగాయల మార్కెట్‌కు మరొక స్థలం చూపించి, మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ తాలూకా సహాయ కార్యదర్శి మహదేవ, కార్యవర్గ సభ్యులు తిరుపాలు, అశ్వర్థ, నాగరాజు నాయక్, సీపీఐ నాయకులు శీనా, బాబు, మురళి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కొత్తరేషన్ కార్డులకు 450 దరఖాస్తులు



రేషన్ కార్డుల దరఖాస్తులను నమోదు చేస్తున్న ఉద్యోగులు

శెట్టూరు, న్యూస్‌టుడే : శెట్టూరు మండలంలో కొత్తగా రేషన్ కార్డుల కోసం 450 దాకా ప్రజల నుంచి దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు సుబ్రహ్మణ్యం, ఉప తహసీల్దారు శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే మండలంలోని 38 చౌకధాన్యం దుకాణాలు ఉండగా 13,632 రేషన్ కార్డులకు సరకులు ఇస్తున్నామని తెలిపారు. దరఖాస్తులన్నింటినీ విచారణ చేసి అర్హత ఉన్న వారికి కొత్తగా రేషన్ కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు.

మడకశిర

నేడు అఖండ భజన

రొళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని బీజీహళ్లి అయ్యప్పస్వామి భక్తమండలి ఆధ్వర్యంలో సీసీగిరి విరుపాక్ష స్వామి ఆలయంలో ఆదివారం అఖండ భజన సంకీర్తన నిర్వహిస్తున్నట్లు గురుస్వామి రాజన్న తెలిపారు. పరిసర గ్రామాల్లోని అయ్యప్ప భక్తులు పాల్గొనాలని కోరారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

రొళ్ల, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఎయిడ్స్ బాధితులను కించపరచకుండా ప్రేమతో ఆదరించాలని ఐసీటీసీ కౌన్సిలర్ అంజినప్ప పేర్కొన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో వెలుగు సీసీ శాంతమ్మ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు వివరించారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

మడకశిరగ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదోతరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో మాదిరి పరీక్ష మెటీరియల్‌ను అందిస్తున్నట్లు యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కె.భూతన్న తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు టీటీగోవిందప్ప చేతుల మీదుగా మెటీరియల్ అందజేశారు. యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పాఠాలను విద్యార్థులు శ్రద్ధతో విని మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ నరసింహప్ప, జిల్లా కార్యదర్శి మాలింగప్ప, ప్రధాన కార్యదర్శి జోగప్ప, యూటీఎఫ్ నాయకులు ప్రభాకర్, ఆదినారాయణ, మద్దిలేటి, లింగప్ప, హనుమంతరాయ తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష మెటీరియల్ అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఆర్డీటీ సేవలు పేదలకు వరం

మడకశిరగ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఆర్డీటీ సంస్థ పేదలకు వరంలాంటిదని ఎంపీపీ బొజ్జప్ప పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మరువపల్లిలో ఆర్డీటీ సంస్థ విదేశీ దాతల సహకారంతో నిర్మించిన 16నూతన ఇళ్లను ఆయన సంస్థ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌డీ కృష్ణవేణి, స్పెయిన్ దేశస్థులతో కలిసి ప్రారంభించారు. విదేశీయులను గ్రామస్థులు, లబ్ధిదారులు ఘనంగా సన్మానించారు. ఎంపీపీ మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల్లో గృహ నిర్మాణం, పేదలకు ఉన్నతవిద్య, క్రీడల్లో ప్రోత్సాహం అందిస్తోందన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించి వారి అభివృద్ధికి కృషిచేయడం అభినందించదగ్గ విషయమన్నారు. కృష్ణవేణి మాట్లాడుతూ గ్రామంలో నీటిశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారని త్వరలో ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, కమ్యూనిటీ ఆర్గనైజర్లు నాగరాజు, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.



విదేశీయులకు సన్మానం

సార్వత్రిక టీకాపై అవగాహన

అమరాపురం, న్యూస్‌టుడే: అమరాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శనివారం సార్వత్రికటీకా కార్యక్రమంపై అంగన్‌వాడీ, ఆశ, ఆరోగ్యసిబ్బందికి అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి ఐదేళ్ల వరకు క్రమంతప్పక టీకా వేయించేలా తల్లిదండ్రులకు వివరించాలన్నారు. గర్భిణులకు టీకాలు వేయాలని కోరారు.

రైతులకు న్యాయం చేయండి

చిలమత్తూరు, న్యూస్‌టుడే: కొడికొండ నుంచి అగళి వరకు ఏర్పాటవుతున్న జాతీయరహదారిలో భాగంగా బైపాస్‌రోడ్డును చిలమత్తూరులో నిర్మించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యాక్షుడు సిద్ధారెడ్డి పేర్కొన్నారు. స్థానిక సొసైటీ ఆధ్వర్యంలో మండల రైతులతో శనివారం సమావేశం ఏర్పాటుచేశారు. ఆయన మాట్లాడుతూ దేమకేతేపల్లి, వడ్డిచెన్నంపల్లి, తుమ్మలకుంట, చిలమత్తూరు, గాండ్రాళ్లపల్లి, మరవకొత్తపల్లి గ్రామాల్లో రహదారి కోసం రైతులు పొలాలను తీసుకోవటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రైతుల అనుమతి లేకుండానే సర్వే చేశారన్నారు. గ్రామంలోనే భవనాలు తొలగించి రోడ్డు వెడల్పు చేస్తే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయక కార్యదర్శి వినోద్‌కుమార్, రైతు సంఘం మండల కార్యదర్శి లక్ష్మినారాయణ, సీపీఎం డివిజన్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ బిల్లులు అందించండి

రొళ్ల, న్యూస్‌టుడే: మండలంలో జనవరి 2 నుంచి ప్రారంభమయ్యే 5వ విడత జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి ఏడీఏ మల్లికార్జున తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎం.రాయాపురం ఎంపీటీసీ సభ్యుడు సిద్ధగంగప్ప మాట్లాడుతూ గత మార్చి నుంచి అక్టోబరు వరకు ట్యాంకర్ల ద్వారా గ్రామాలకు తాగునీటిని సరఫరా చేశామని, బిల్లులు ఇప్పటివరకు అందించలేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీడీఓ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ద్వారా ఎంబుక్ చేయించి అందిస్తే బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ప్రత్యేక అధికారి మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి జన్మభూమి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశానికి ఎంపీపీ రాజన్న, ఎంపీడీఓ సరస్వతి, తహసీల్దార్ ఇబ్రహిం, ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యావికాసానికి కృషి

సేవామందిర్(పరిగి), న్యూస్‌టుడే: నిరుపేద విద్యార్థుల విద్యావికాసానికి ఏఎం.లింగణ్ణ అహర్నిశలు శ్రమించారని పలువురు వక్తలు ప్రశంసించారు. శనివారం సేవామందిర్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుడు వి.ఎన్.రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యపోరాట సమయంలో ఎందరో సమరయోధులకు ఆశ్రయం కల్పించి, రహస్య పోరాటాలకు నిలయంగా ఏర్పడిందే సేవామందిర్ అని పేర్కొన్నారు. సేవామందిర్ వ్యవస్థాపకుడు ఏఎం.లింగణ్ణ సమాధికి ప్రముఖులు నివాళులు అర్పించారు. సేవామందిర్ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుండటం హర్షణీయమన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కె.తిప్పేస్వామి, కార్యదర్శి కె.టి.శ్రీధర్, ప్రముఖ కవులు సడ్లపల్లి చిదంబరెడ్డి, మల్లెల నరసింహమూర్తి, ఈశ్వరయ్య, ఎస్ఎస్‌బీఎన్ విశ్రాంత ప్రధానాచార్యులు రమేష్‌నారాయణ, ఫణీంద్రబాబు, చాంద్‌బాషా, మండల నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ఆమిదాలగొంది(మడకశిర గ్రామణం), న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఆమిదాలగొంది శ్రీవెంకటేశ్వర వృద్ధాశ్రమంలో శనివారం దాతలు వృద్ధులకు దుప్పట్లు, స్వెట్టర్లు పంపిణీ చేశారు. కర్ణాటకలోని చెళ్లెకెర పట్టణానికి చెందిన ఎంఆర్ పరిశ్రమ వ్యవస్థాపకుడు మధు తన పుట్టినరోజు సందర్భంగా వాటిని అందించారన్నారు. అనంతరం వృద్ధులకు అన్నదానం చేసినట్లు నిర్వాహకుడు తిమ్మారెడ్డి తెలిపారు.

నేడు రుణమాఫీ సమస్య పరిష్కార వేదిక

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతపురం గుత్తిరోడ్డులోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఆదివారం ఉదయం 9 గంటలకు రుణమాఫీ సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు వ్యవసాయశాఖ ఉప సంచాలకులు మల్లికార్జున, ఏఓ ముస్తాక్ అహ్మద్ తెలిపారు. మడకశిర నియోజకవర్గంలో అర్హత ఉండి రుణమాఫీ కానీ రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, కుటుంబీకులు ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డు నకలు, ఓటరు గుర్తింపు కార్డు, రుణం పొందిన బ్యాంకు ఖాతా నెంబరు తీసుకెళ్లాలని సూచించారు.

పోటీల్లో ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రతిభ

మడకశిరగ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని పెనుకొండ రోడ్డు ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు బాపట్లలో జరిగిన అంతర్ కళాశాల పోటీల్లో ఉత్తమప్రతిభ కనబరిచినట్లు కళాశాల అసోసియేట్ డీన్ రమణ తెలిపారు. బాపట్ల వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాలల పోటీలు శనివారం ముగిశాయి. పోటీల్లో పాల్గొన్న మడకశిర వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు మంచిప్రతిభ కనబరచడంతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారు. వాలీబాల్ ఫైనల్‌లో తిరుపతిపై గెలిచి మొదటి బహుమతి, బాల్ బ్యాడ్మింటన్‌లో ద్వితీయ బహుమతి, క్యారమ్స్‌లో ద్వితీయ బహుమతి సాధించారు. బాపట్ల, మడకశిరకు సమాన పాయింట్లు రావడంతో ఇద్దరికీ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ అందించినట్లు కళాశాల పీడీ బాబాఫక్రుద్దీన్ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.



గెలుపొందిన బహుమతులతో విద్యార్థులు

నీటి సమస్య పరిష్కారానికి వినతి

హెచ్‌టీహళ్లి(రొళ్ల), న్యూస్‌టుడే: మండల పరిధిలోని హెచ్‌టీహళ్లి వడ్రహట్టిలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సరస్వతిని కలిశారు. తాగునీటి కోసం రెండు బోర్లు ఏర్పాటు చేశారని, వాటిలో నీరు సమృద్ధిగా ఉందన్నారు. మొదటి బోరు ద్వారా పైప్‌లైన్ ఏర్పాటుచేసి నీటిని అందిస్తున్నా పలువురు కొళాయిలు అక్రమంగా ఏర్పాటు చేసుకోవడం, పలుచోట్ల లీకేజీలతో పూర్తిస్థాయిలో అందడం లేదని నాగరాజు, తిమ్మరాజు, మంజునాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. రెండోబోరుకు కొత్తగా విద్యుత్తు మోటారు, స్టార్టర్ అమర్చాలని విన్నవించారు. అక్రమ కొళాయిలు తొలగించి మరో బోరుకు విద్యుత్తు మోటారు బిగిస్తామని ఎంపీడీఓ తెలిపారు.



సమస్యను వివరిస్తున్న గ్రామస్థులు

విద్యుత్తు సరఫరాకు వినతి

మడకశిరగ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలో వీధిదీపాలు, మంచి నీటి పథకాల బోర్లకు సంబంధించి విద్యుత్తు సంఫరాను పునరుద్ధరించాలని తెదేపా పట్టణ అధ్యక్షుడు మనోహర్, కౌన్సిలర్లు విద్యుత్తు శాఖ అధికారులను కోరారు. శనివారం స్థానిక విద్యుత్తు శాఖ కార్యాలయంలో ఏఈ చెన్నకృష్ణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణంలో వీధిపాలు లేక జనం ఇబ్బంది పడుతున్నారన్నారు. జనవరి 2న విద్యుత్తు బకాయిలు చెల్లించేలా చూస్తామన్నారు. ప్రతినెలా సక్రమంగా విద్యుత్తు బిల్లులు చెల్లించేలా కౌన్సిలర్లు నిర్ణయం తీసుకుని కమిషనర్‌కు తెలియజేస్తామన్నారు. ఏఈ మాట్లాడుతూ పట్టణంలో రూ.6.5కోట్ల విద్యుత్తు బకాయిలు ఉన్నాయని సాధ్యమైనంత త్వరగా చెల్లించాలన్నారు. వీధి దీపాలకు విద్యుత్తు సరఫరా చేస్తామని, సత్వరమే బకాయిలు బిల్లులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఓబన్న, జేఎస్ నాగరాజు, పార్టీ జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి భక్తర్, నాయకులు రాజా, ఫయాజ్, గోపాల్, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఏఈకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు, కౌన్సిలర్లు

మడకశిర

భ్రూణహత్యలు ఆపండి

గుడిబండ, న్యూస్‌టుడే: భ్రూణహత్యలు ఆపాలని, ఆడపిల్లలను రక్షించాలని హెల్త్ ఎడ్యూకేటర్ సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భస్థ లింగ నిర్ధరణ నిరోధకచట్టంపై అవగాహన కల్పించారు. ఆడ, మగ ఇద్దరూ సమానమేనన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిని ఉషా, పీహెచ్ఎన్ ఇంద్రాణి, ఎంపీహెచ్ఈవోలు నారాయణస్వామి, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై నూర్పిడి ప్రమాదకరం

గుడిబండ, న్యూస్‌టుడే: రహదారులపై రోడ్లపై ఉలవ, జొన్న, రాగి తదితర పంటల నూర్పిడి ప్రమాదమని మడకశిర సీఐ శుభకుమార్ పేర్కొన్నారు. మండలంలోని కేఎన్.పల్లి వద్ద రోడ్డుపైనే ఉలవగడ్డిని వేయడంతో అమరాపురం వెళ్తున్న సీఐ, రొళ్ల ఎస్ఐ నాగన్న, కానిస్టేబుల్ నాగరాజు ఇతర వాహనాల చోదకులతో కలిసి తొలగించారు.

స్వచ్ఛత దిశగా పల్లెలు



పూర్తయిన మరుగుదొడ్డి

అమరాపురం, న్యూస్‌టుడే: మహిళల ఆత్మగౌరవం కాపాడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకోవాలని పిలుపునిచ్చింది. ఇందుకు ఆర్థికంగా చేయూత కూడా అందిస్తోంది. ఈ నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. మండలంలోని 11 పంచాయతీల పరిధిలో 7500 మరుగుదొడ్లు మంజూరయ్యాయి. ఇప్పటివరకు 3వేల నిర్మాణాలు చేపట్టగా 1600 పూర్తయ్యాయి. ప్రతి పంచాయతీకి మండలస్థాయి అధికారిని బాధ్యుడిగా నియమించడంతో పాటు నిర్మించుకోనివారికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందవని ప్రచారం చేయటంతో నిర్మాణాలు వేగవంతమయ్యాయి. మహిళా సంఘాల సభ్యులు పనులు చేపట్టారు. ఇప్పటివరకు మరుగుదొడ్లు లేక ఆరుబయట మలమూత్ర విసర్జనతో రోగాలతో పాటు విషపురుగుల బెడదతో ఇబ్బంది పడేవారు. ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనివ్వడంతో మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రజలు ముందుకొస్తున్నారు.

ఒక్కసారిగా పెరిగిన ధరలు

ప్రభుత్వం ఒకేసారి అధిక సంఖ్యలో మరుగుదొడ్లు మంజూరు చేయడంతో నిర్మాణానికి వినియోగించే రింగులు, రాళ్లు, కూలి సైతం ఒక్కసారిగా పెరిగిపోయింది. మరుగుదొడ్ల గుంతలోకి అమర్చే సిమెంటు రింగులు మూడునెలల కిందట ఒక్కొక్కటి రూ.300 ఉండగా ప్రస్తుతం రూ.450 తీసుకుంటున్నారు. రాతి కట్టడం కట్టే రాళ్ల ధర గతంలో లోడుకు రూ.1200 ఉండగా ప్రస్తుతం రూ.1600 నుంచి రూ.1800 వరకు ధర చెల్లించాల్సి వస్తోంది. కూలీలకు రోజుకు రూ.300 నుంచి రూ.400 వరకు చెల్లించాల్సి వస్తోంది.



గుంతకు రాతికట్టడం

అన్ని ధరలు పెరిగాయి



మరుగుదొడ్డి నిర్మిస్తున్నాం. ధరలు పెరగటంతో ప్రభుత్వం అందించే ప్రోత్సాహకం రూ.15వేలు సరిపోవడం లేదు. చేతి నుంచి మరో రూ.10వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. అప్పు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాన్ని రూ.20వేలు ఇవ్వాలి. **- జయలక్ష్మీ, గౌడనకుంట**

బిల్లులు ఇవ్వాలి...



మరుగుదొడ్డి నిర్మాణం పూర్తవగానే బిల్లులు అందేలా చూడాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రోత్సాహకం పెంచితే బాగుంటుంది. మరుగుదొడ్లు నిర్మించుకుని ఉపయోగించుకుంటే చాలావరకు రోగాలు తగ్గుతాయి. **- రామక్క, తమ్మడేపల్లి**



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తిప్పేస్వామి

విలువలతో కూడిన విద్యను అందించాలి

అమరాపురంరోడ్డు(మడకశిర గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను బోధించాలని ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. శనివారం అమరాపురం రోడ్డులోని సాయి అక్షర జూనియర్ కళాశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నతస్థాయికి ఎదుగుతారన్నారు. ఉత్తమ మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు జిల్లా ఉపాధ్యక్షుడు ఆనందరంగారెడ్డి, ప్రిన్సిపల్ నాగరాజు, విశ్రాంత ప్రిన్సిపల్ బాలన్న, నాయకులు ఫయాజ్, నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మడకశిరగ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చందకచర్లలో శుక్రవారం రాత్రి ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మీసాల నాగరాజు గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ తిప్పేస్వామి, సర్పంచి రాధమ్మ, తెదేపా జిల్లా కార్యదర్శి ఆదినారాయణ, నాయకులు సుబ్బరాయుడు, ఆంజనేయులు తదితరులు నాగరాజు గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. బాధిత కుటుంబీకులను ఓదార్చి చంద్రన్న బీమా కింద తక్షణసాయంగా రూ.5వేల చెక్కును అందజేశారు. మాజీ ఎమ్మెల్యే సుధాకర్, డీహెచ్‌పీఎస్ వ్యవస్థాపకులు హనుమంతు, దండోరా నాయకులు ఎల్‌కే నరసింహులు, జయరాం, రాయుడు, రఘు, అంజి తదితరులు పాల్గొని సంతాపం తెలిపారు.

తుమకూరు నగరాభివృద్ధికి చర్యలు

తుమకూరు, న్యూస్‌టుడే: తుమకూరు నగర నియోజకవర్గ అభివృద్ధికి నాల్గున్నరేళ్లలో రూ.1300కోట్లతో అనేకఅభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశామని మరికొన్ని ప్రగతిపథంలో ఉన్నాయని నగర ఎమ్మెల్యే డా.రఫిక్ అహమ్మద్ పేర్కొన్నారు. నగరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2013నుంచి ఇప్పటి వరకు అనేక సంక్షేమ పథకాలు చేపట్టినట్లు తెలిపారు. తుమకూరు నాజూకు నగరంగా ఎంపికై ఇప్పటికే రూ.216కోట్లు మంజూరయ్యాయన్నారు. జనవరిలో మరిన్ని ప్రారంభోత్సవాలు జరగనున్నట్లు తమ హయాంలో అబివృద్ధి పనులే వచ్చే ఎన్నికల్లో తనకు శ్రీరామరక్ష అన్నారు. నగరబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆటోరాజు, పాలికె సభ్యుడు నదీంబాషా, మంజుళ తదితరులు పాల్గొన్నారు.



తప్పిన ప్రమాదం

దెబ్బతిన్న కారు

ఆమిదాలగొంది(మడకశిరగ్రామీణం), న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఆమిదాలగొందిలో శనివారం ఉదయం త్రుటిలో ప్రమాదం తప్పింది. తుమకూరు నుంచి రైల్వే అధికారి శేఖర్, భార్య, పిల్లలతో కలిసి పావగడ కనుమ ఓబళేశుని దేవాలయానికి బయల్దేరారు. ఆమిదాలగొంది సమీపంలో టైరు పగిలి వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న వారు సీటు బెల్టు ధరించడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. గ్రామస్థులు సహకారంతో వాహనాన్ని పక్కకు తొలగించారు.

తుమకూరు బి.ఇ.ఒ. బసవరాజుకు వీడ్కోలు

తుమకూరు, న్యూస్‌టుడే: తుమకూరు తాలూకా విద్యాధికారిగా (బి.ఈ.ఒ.) పనిచేసిన బసవరాజుకు నగరంలోని బాలభవనంలో వీడ్కోలు సమారంభం నిర్వహించారు. రాష్ట్ర ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సంఘం పధాధికారులు బి.ఈ.ఓ బసవరాజును సన్మానించి సత్కరించారు. ప్రాథమిక పాఠశాలల సంఘం తుమకూరు తాలూకా అధ్యక్షుడు ఆర్.పరమేష్, పధాధికారులు హనుమనాయక్, కార్యదర్శి నాగరాజు, శివన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాశీవిశ్వనాథ్

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

గుడిబండ, న్యూస్‌టుడే: రాళ్ళపల్లి వీఆర్‌వో ప్రకాష్‌రావ్ సేవలు ప్రసంశనీయమని తహసీల్దార్ మోహన్‌దాస్ పేర్కొన్నారు. ప్రకాష్‌రావ్ పదవీవిరమణ సందర్భంగా సన్మానసభ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి వీఆర్‌వో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ శివశంకర్, ఆర్ఐ వెంకటరాముడు, వీఆర్‌వోలు తిమ్మప్ప, రంగనాథ్, రామప్ప, నాగరాజు, త్యాగరాజు, శివమ్మ, చెన్నరెడ్డి, నాయకులు చంద్రశేకర్, సన్నమారప్ప తదితరులు పాల్గొన్నారు.



ప్రకాష్‌రావ్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

కొత్త పద్ధతులతో మెరుగైన దిగుబడి

అగళి, న్యూస్‌టుడే: పట్టు రైతులు కొత్త కొత్త పద్ధతులతో మెరుగైన దిగుబడి సాధించవచ్చని మడకశిర ఏడీ రామేశ్వరరావ్ పేర్కొన్నారు. మండలంలోని ముత్తేపల్లిలో శనివారం పట్టురైతులతో కేంద్రపట్టు పరిశ్రమశాఖ ఆధ్వర్యంలో అధికారులు, శాస్త్రవేత్తలు ఇష్టాగోష్ఠి నిర్వహించారు. ఏడీ రామేశ్వరరావ్, ఆర్ఎస్ఆర్ఎస్ శాస్త్రవేత్త విజయనాయుడు మాట్లాడుతూ రైతులు మెలకువలు పాటించి మంచి దిగుబడి వచ్చేలా చూడాలన్నారు. ఆకు నాణ్యత పెంచేందుకు సేంద్రియ ఎరువుల మోతాదు, మందుల పిచికారీని వివరించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఉపాధి ద్వారా నిర్మించిన షెడ్డులకు బిల్లులు కాలేదని, అక్టోబరుకు సంబంధించి ప్రోత్సాహం ఖాతాకు జమా కాలేదన్నారు. మల్బరీ తోట పెంచేందుకు పెట్టుబడి ఖర్చులు కూడా పెంచాలన్నారు. రైతులకు భూసార పరీక్ష కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్‌వో రామయ్య, ఏఎస్‌వో గురుదత్త, పట్టు పరిశ్రమశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఏడీ రామేశ్వరరావ్

పట్టు పరిశ్రమతో ఉపాధి

గుడిబండ, న్యూస్‌టుడే: పట్టుపరిశ్రమతో ఉపాధి లభిస్తోందని సెర్ప్ సెరికల్చర్ ప్రతినిధి కాశీవిశ్వనాథ్ పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో జడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌మూర్తి అధ్యక్షతన పట్టురైతుల సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా షెడ్ల నిర్మాణం, మల్బరీసాగుకు ఆర్థిక చేయూత ఇవ్వనున్నట్లు వివరించారు. జడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ ఉపాధి, పట్టుపరిశ్రమ శాఖ ద్వారా రైతులకు రాయితీ అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివయ్య, ఎంపీపీ సన్నీరప్ప, వైఎస్ ఎంపీపీ తిప్పేస్వామి, ఏవో బాలానాయక్, సెరికల్చర్ ఇన్‌స్పెక్టర్ శివాజీరావ్, పట్టురైతులు పాల్గొన్నారు.

పెనుకొండ

ఐదుగురి బైండోవర్

అంబేడ్కర్‌కూడలి(పెనుకొండ పట్టణం): అక్రమంగా మద్యం దుకాణాలు నిర్వహిస్తూ.. గతంలో పట్టుబడిన నిందితులను శనివారం ఎక్సైజ్ పోలీసులు పెనుకొండ తహసీల్దార్ హసీనాసుల్తానా ఎదుట బైండోవర్ చేశారు. ఎక్సైజ్ ఎస్సై శ్రీధర్ మాట్లాడుతూ గతంలో కేసులున్న వారిని బైండోవర్ చేశామని, వీరు మండలంలోని మునిమడుగు, మరువపల్లి, గొల్లపల్లి, శెట్టిపల్లి గ్రామాలకు చెందిన వారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై జబీవుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రదర్శనను తిలకిస్తున్న శిల్పా కాలేశ్వర్ తదితరులు

పౌష్టికాహారం తీసుకోవాలి

మడకశిరరోడ్డు (పెనుకొండ), న్యూస్‌టుడే: పోషక విలువలు కలిగిన ఆహారాన్ని విద్యార్థులు తినాలని షిర్డీ సాయి గ్లోబల్ ట్రస్టు నిర్వాహకురాలు శిల్పా కాలేశ్వర్ పేర్కొన్నారు. శనివారం పెనుకొండలోని గ్లోబల్‌జెన్ పాఠశాలలో విద్యార్థులు ఇంటి వద్ద తయారు చేసుకు వచ్చిన పలు వంటలను ప్రదర్శించారు. హాజరైన శిల్పాకాలేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై వంటల ప్రదర్శనను ప్రారంభించారు. విటమిన్లు, పోషకాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో ఎస్బీహెచ్ మేనేజర్ రషీద, ఆర్డీటీ ఏటీఎల్ గిరిజ, గ్లోబల్‌జెన్, ప్రగతి పాఠశాలల కరస్పాండెంట్ శ్రీనివాసులు, అధ్యాపకులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

పెనుకొండ, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ జనార్దన్ హెచ్చరించారు. శనివారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఆదివారం రాత్రి 10 గంటల నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు మూడు పోలీస్ బృందాలు మండలంలో వాహనాల తనిఖీ చేపడతాయని పేర్కొన్నారు. ద్విచక్ర వాహన చోదకులు, వాహన దారులు మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. సంబంధిత వాహనాలను సీజ్ చేస్తామని చెప్పారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

ద్వారకామాయినగర్(సోమందేపల్లి), న్యూస్‌టుడే: సమ్మెటీవ్-1 పరీక్షల కోసం పుస్తకాలతో కుస్తీ పట్టిన ఉన్నత విద్యార్థుల్లో మానసిక ఉల్లాసాన్ని కలిగించడానికి క్రీస్తుజ్యోతి పాఠశాలలో క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం వరకు బాలురు, బాలికలకు వేర్వేరుగా కబడ్డీ, టెన్నికాయిట్, ఖో ఖో, క్రికెట్, హ్యాండ్‌బాల్, చదరంగం తదితర క్రీడాపోటీలు నిర్వహించారు. పోటీల్లో తమ జట్లను గెలిపించుకునేందుకు ఎవరికి వారు తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో చక్కని ప్రతిభను ప్రదర్శించిన పోటీల్లో బ్లూ హౌస్ బాల,బాలికల బృందాలు మొదటి స్థానంలో నిలిచారు. ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎల్లో, గ్రీన్ హౌస్ బృందాలు, చివరగా రెడ్ హౌస్ బృందం నిలిచిందని క్రీస్తు జ్యోతి ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ ప్రసాద్, ఎండీ అనిల్‌కుమార్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. జనవరి 26న విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

ద్విచక్ర వాహనం అదుపు తప్పి గాయాలు

పెనుకొండ పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని షీప్‌ఫారం సమీపంలో శనివారం పెనుకొండ నుంచి అడదాకులపల్లికి వెళుతున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో అడదాకులపల్లికి చెందిన శివాజి నాయక్‌కు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే పెనుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

నిరీక్షణకు భరోసా దక్కేనా

● 'జన్మభూమి'పై పేదల ఆశలు ● పింఛన్ల కోసం పండుటాకుల ఎదురుచూపు

గోరంట్ల, న్యూస్‌టుడే: పేదలకు భరోసా ఇస్తున్న ప్రధాన సంక్షేమ పథకాలైన సామాజిక పింఛన్లు, రేషన్‌కార్డుల పంపిణీ వంటి పథకాలు జన్మభూమి కార్యక్రమంలో మినహా మధ్యలో మంజూరు కావడం లేదు. ఒకటికి పది సార్లు దరఖాస్తులు సమర్పించినా మంజూరు కోసం ఎదురు చూడడం పేదల వంతైంది. మండలాలకు మంజూరవుతున్న పింఛన్ల సంఖ్య తక్కువగా ఉండటం, లబ్ధిదారుల ఎంపిక జన్మభూమి కమిటీ సభ్యుల ద్వారా జరుగుతుండటం కారణంగా అర్హులకు పింఛన్లు దక్కక ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. పింఛన్ల విషయంలో మాత్రం పూర్తిగా అన్యాయం జరుగుతోందన్న ఆవేదన బాధితుల నుంచి వినిపిస్తోంది. ప్రస్తుతం ఒక్కో నియోజకవర్గానికి రెండు వేల పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు ఇది వరకే నాయకులు ప్రకటించారు. ఈనేపథ్యంలో పెనుకొండ నియోజకవర్గంలోని అయిదు మండలాలకు సమానంగా పంచితే గోరంట్ల మండలానికి 400 పింఛన్లు మంజూరవుతాయి. ప్రస్తుతం మండలవ్యాప్తంగా నిరీక్షిస్తున్న వారి సంఖ్య 1800 మంది ఉన్నారని అధికారులు చెబుతున్నారు. ఈసారి 25 శాతం మందికి మాత్రమే పింఛన్లు దక్కే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. మిగిలిన వారి పరిస్థితి మళ్లీ ప్రశ్నార్థకమే!.

పింఛన్ల కోసం నిరీక్షణలో ఉన్న వారి సంఖ్య (నవంబరు వరకు)

మండలం	వృద్ధాప్య	వితంతు	చేనేత	కల్లుగీత	దివ్యాంగులు
గోరంట్ల	483	411	03	05	129
పెనుకొండ	257	150	09	02	152
సోమందేపల్లి	300	200	28	02	60
రొద్దం	330	176	16	03	96



పులేరులో జరిగిన జన్మభూమి కార్యక్రమం (పాతచిత్రం)

86 ఏళ్లు .. అందని పింఛను



నారాయణమ్మ వయస్సు 86 ఏళ్లు. ఆధార్, రేషన్‌కార్డుల్లోనూ నమోదైంది. గోరంట్లలోని భారత్ పెట్రోల్ బంకు సమీపంలో నివసిస్తున్నారు. కొన్నేళ్లుగా నడవలేని స్థితి. పింఛను కోసం ఈమె కుమారుడు పదిసార్లకు పైగా అధికారులకు దరఖాస్తు చేశారు. జనవరిలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో అమాత్యులు, పాలకులకు ఈమెను చూయించారు. ఇంతవరకు పింఛన్ మంజూరు కాలేదు. అన్ని అర్హతలున్న మా లాంటివారికి ప్రభుత్వ ఫలాలు ఎందుకు అందడం లేదని వృద్ధురాలు ప్రశ్నిస్తున్నారు.

ఏడు పదుల వయస్సు.. ఆపై మానసిక వికలాంగురాలు



ఈ చిత్రంలోని వృద్ధురాలి పేరు మస్తానమ్మ. 72 ఏళ్ల వయస్సు కలిగిన ఈమె పింఛను అందడం లేదు. వృద్ధురాలి కుమారుడు బాబు టీకొట్టు నిర్వహిస్తున్నారు. తల్లికి పింఛను మంజూరు కోసం దరఖాస్తు చేసినా అధికారులు అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప మంజూరు చేయడం లేదని ఆయన ఆరోపిస్తున్నారు. ప్రతి జన్మభూమి కార్యక్రమంలో అర్జీ ఇస్తున్నాం, జనవరిలో నిర్వహించే కార్యక్రమంలో ఆశగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.

ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు

పింఛన్ల కోసం వస్తున్న దరఖాస్తులను ఎప్పటికపుడు ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. జనవరిలో జరిగే జన్మభూమిలో మంజూరుకు సంబంధించి ఇంకా సమాచారం అందాల్సి ఉంది. నిబంధనల మేరకు పింఛన్లు మంజూరైన వారికి పంపిణీ చేస్తాం.

- ఆజాద్, ఎంపీడీవో గోరంట్ల

మహిళలకు ఉపాధి అవకాశాలు

గొట్లూరు(ధర్మవరం పట్టణం),న్యూస్‌టుడే: పేద మహిళకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి రాయితీపై సిల్క్ రీలింగ్ పరికరాలను అందిస్తున్నట్లు సెంట్రల్ సిల్క్ బోర్డు డైరెక్టర్ సుభాష్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం ధర్మవరం మండలంలోని గొట్లూరు గ్రామంలో రాయితీపై ఏర్పాటు చేసిన సిల్క్ రీలింగ్ కుటీర పరిశ్రమాన్ని పట్టు పరిశ్రమశాఖ జేడీ అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుభాష్ నాయక్ మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం పెద్ద ఎత్తున రాయితీలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీలకు చెందిన నాగలక్ష్మి, రమేష్‌కు రూ.50 లక్షలతో సిల్క్ రీలింగ్ కుటీర పరిశ్రమకు రుణ సదుపాయాన్ని కల్పించినట్లు తెలిపారు. ఇందులో రూ.28.05 లక్షలు రాయితీ పోగా మిగిలిన సొమ్మును బ్యాంకు, లబ్ధిదారుల వాటా కింద చెల్లింపు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ పరిశ్రమ ద్వారా 50 మంది మహిళలకు స్థానికంగా ఉపాధి అవకాశం దక్కుతుందన్నారు. ధర్మవరం పట్టణంలో గతంలో జనరల్ కేటగిరి కింద రాయితీపై 15 సిల్క్ రీలింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మది అలిగన్, పట్టు పరిశ్రమ డివిజన్ సంచాలకురాలు శోభారాణి, సర్పంచి శివయ్య, మహదేవ్, నల్లబాబు, వెంకటేశ్వర్లు, బ్యాంకు మేనేజర్లు లోకేష్, వెంకటేష్, మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.



పరిశ్రమను ప్రారంభిస్తున్న అరుణకుమారి

పుస్తక ప్రదర్శన

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక కళాశాల క్రీడామైదానం వద్ద భారీ పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. నిర్వాహకులు శివప్రసాద్, ఉడుముల శివారెడ్డి మాట్లాడుతూ పాఠకులకు మూడు వేల పుస్తకాలను పాఠకులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. 15 రోజుల పాటు ప్రదర్శన ఉంటుందని చెప్పారు.

ముమ్మరంగా తాగునీటి పైప్‌లైన్ పనులు

పెనుకొండ పట్టణం, న్యూస్‌టుడే: గొల్లపల్లి జలాశయం నుంచి హిందూపురానికి తాగునీటిని అందించే లక్ష్యంతో జరుగుతున్న పనులు వేగంగా జరుగుతున్నాయి. శనివారం పెనుకొండ మండలం హరిపురం సమీపంలో పనులకు సంబంధించి పైపులను దింపారు. వచ్చే వేసవి నాటికి హిందూపురానికి తాగునీటిని అందించేందుకు రూ.194 కోట్లతో పనులు చేపట్టారు. ఇప్పటికే గొల్లపల్లి జలాశయంలో ఇంక్‌వెల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.



హరిపురం వద్ద దింపుతున్న పైపులు

గుంతల రహదారికి మరమ్మతులు

రొద్దం, న్యూస్‌టుడే: చెరుకూరు నుంచి రొద్దంకు వెళ్లే రహదారి గుంతలతో అధ్వానంగా మారింది. చోదకులు రాకపోకలు చేయడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్పందించిన అధికారులు రహదారిపై ఏర్పడిన గుంతల్లో తారు వేసి పూడుస్తున్నారు. ఈ పనులు సుమారు ఐదు కిలో మీటర్ల వరకు చేపటాల్సి ఉంది. సమస్య తీరడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గుంతలు పూడుస్తున్న కూలీలు

పెనుకొండ

దైనందిని విడుదల

పరిగి: పరిగిలో శనివారం యూటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర దైనందినిని ఎంపీపీ సత్యనారాయణ, ఎంఈవో లక్ష్మీదేవి ఆవిష్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు కొనసాగిస్తోందన్నారు. యూటీఎఫ్ శాఖ మండల అధ్యక్షుడు డి. అశ్వర్థనారాయణ, కార్యదర్శి మహంతేష్, జిల్లా కార్యదర్శి ఓబులేశు, కోశాధికారి హఫీజ్‌ఖాన్, జిల్లా కౌన్సిల్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత జీవనం సాగించాలి

ఆనందపురం(సోమందేపల్లి), న్యూస్‌టుడే: గ్రామంలో ప్రజలందరూ కలసి మెలసి ప్రశాంతంగా జీవనం సాగించాలని ఎస్సై ప్రసాద్ సూచించారు. శనివారం సాయంత్రం ఆయన సిబ్బందితో కలసి గ్రామాన్ని సందర్శించారు. నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. సిబ్బంది రంగస్వామి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

జన్మభూమిని విజయవంతం చేద్దాం



వివరాలు వెల్లడిస్తున్న గోరంట్ల ఎంపీడీవో

గోరంట్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం 2018 జనవరి రెండో తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అయిదో విడత జన్మభూమి- మా ఊరు కార్యక్రమం సమన్వయంతో విజయవంతం చేద్దామని ఎంపీడీవో ఆజాద్ పిలుపునిచ్చారు. కార్యక్రమ ఏర్పాట్లపై చర్చించడానికి శనివారం మండల పరిషత్తు సమావేశపు గదిలో మండల ప్రత్యేకాధికారి రత్నం అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి శాఖాధికారి ఉదయం తొమ్మిది గంటలకు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉండాలని అక్కడి నుంచి అందరూ కలిసి గ్రామాలకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. ప్రతి శాఖకు సంబంధించి పూర్తి సమాచారంతో రావాలని కోరారు. ఏ రోజు ఏ అంశంపై చర్చించాలన్న విషయాలపై వివరించారు. ఇదే సందర్భంగా మరుగుదొడ్ల నిర్మాణాలపై అధికారులతో సమీక్షించారు. ఫిబ్రవరి ఆఖరు నాటికి పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టి మార్చి 31 నాటికి లక్ష్యాన్ని చేరుకునే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. పురోగతిపై ప్రతిరోజూ ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిన అవసరముందన్నారు. సమావేశంలో తహసీల్దార్ మసూద్‌వలీ, ఈవోపీఆర్డీ అంజినప్ప, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య, నీటి పారుదల, గృహ నిర్మాణ శాఖ, ఐసీడీఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైజంక్షన్(సోమందేపల్లి): ఐదో విడత జన్మభూమి- మాఊరు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సహకరించాలని ఎంపీడీవో నాగన్న, ప్రత్యేకాధికారి కృష్ణానాయక్, తహసీల్దార్ రామాంజనేయరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మధ్యాహ్నం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమంపై మండల స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, జన్మభూమి కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా అధికారులు మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ, అభివృద్ధి పథకాలను సక్రమంగా అందించడం ద్వారా సంతృప్తికర సమాజంగా తీర్చిదిద్దేందుకు అధికారులకు జన్మభూమి కమిటీ సభ్యులు సహకరించాలని వారు సూచించారు. కార్యక్రమ చివరి రోజు సోమందేపల్లిలో సాంస్కృతిక కార్యక్రమాలను,



మాట్లాడుతున్న సోమందేపల్లి ఎంపీడీవో నాగన్న

బహుమతుల ప్రదానం జరుగుతుందని చెప్పారు. మండలంలో ఐదు వేలు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను 2018 ఫిబ్రవరి నెలలోగా పూర్తయ్యేలా అందరూ సహకారం అందించాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో మండల జన్మభూమి కమిటీ సభ్యులు డీసీ వెంకటేశులు, సిద్ధలింగప్ప, రామకృష్ణ, వెంకటేశులు, అధికారులు ఆంజనేయులు నాయక్, మహ్మద్ ముజామిల్, ప్రహ్లాద, వెంకటలక్ష్మమ్మ, వెంకటేశులు, రమణారెడ్డి, గంగాద్రి, చంద్రశేఖర్, జయచంద్ర, సమాఖ్య అధ్యక్షురాలు అనసూయమ్మ, ఉప సర్పంచి డీసీ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



బాండు అందజేస్తున్న ఏపీజీబీ ఆర్.ఎం. బి.రంగన్న

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

గుట్టూరు(పెనుకొండ పట్టణం), న్యూస్‌టుడే: మహిళల ఆర్థిక అక్షరాస్యత సాధిస్తే ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు కదిరి రీజినల్ మేనేజర్ బి.రంగన్న అన్నారు. శనివారం మండలంలోని గుట్టూరు ఆంధ్రపగతి గ్రామీణ బ్యాంకు ఆవరణలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన, బ్యాంకు తొలి వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బి.రంగన్న మాట్లాడుతూ బ్యాంకులో పొదుపు డిపాజిట్లు, అప్పులు పొందటం, రుణాలను వాయిదాల్లో చెల్లించటం తదితర ఆర్థిక అంశాలపై ఖాతాదారులకు అవగాన కల్పించారు. కార్యక్రమంలో గుట్టూరు శాఖ మేనేజర్ సుధీర్‌రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ నిమ్మలను పరామర్శించిన మంత్రి



ఎంపీ నిమ్మలతో మాట్లాడుతున్న మంత్రి సునీత

గోరంట్ల, న్యూస్‌టుడే: హిందూపురం పార్లమెంటు సభ్యుడు నిమ్మల కిష్టప్ప మాతృమూర్తి ఆదిలక్ష్మమ్మ శుక్రవారం మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం గోరంట్లలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఎంపీని రాష్ట్ర మంత్రి పరిటాల సునీత, జిల్లా పరిషత్ ఛైర్మన్ పూలనాగరాజు, పలువురు ఎమ్మెల్యేలు పరామర్శించారు. ఎమ్మెల్యేలు బీకే పార్థసారధి, గోనుగుంట్ల సూర్యనారాయణ, అత్తార్ చాంద్ బాషా, ఎమ్మెల్సీ గుండుమాల తిప్పేస్వామి, హిందూపురం పార్లమెంటు పరిధిలోని వివిధ మండలాలకు చెందిన తెదేపా ప్రజాప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు ఎంపీని పరామర్శించిన వారిలో ఉన్నారు. మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. స్థానిక తెదేపా నాయకులు, కార్యకర్తలు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

విద్యావికాసానికి కృషి

సేవామందిర్(పరిగి), న్యూస్‌టుడే: నిరుపేద విద్యార్థుల విద్యావికాసానికి ఏఎం.లింగణ్ణ అహర్నిశలు శ్రమించారని పలువురు వక్తలు ప్రశంసించారు. శనివారం సేవామందిర్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుడు వి.ఎన్.రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యపోరాట సమయంలో ఎందరో సమరయోధులకు ఆశ్రయం కల్పించి, రహస్య పోరాటాలకు నిలయంగా ఏర్పడిందే సేవామందిర్ అని పేర్కొన్నారు. సేవామందిర్ వ్యవస్థాపకుడు ఏఎం.లింగణ్ణ సమాధికి ప్రముఖులు నివాళులు అర్పించారు. సేవామందిర్ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుండటం హర్షణీయమన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కె.తిప్పేస్వామి, కార్యదర్శి కె.టి.శ్రీధర్, ప్రముఖ కవులు సడ్లపల్లి చిదంబరెడ్డి, మల్లెల నరసింహమూర్తి, ఈశ్వరయ్య, ఎస్ఎస్‌బీఎన్ విశ్రాంత ప్రధానాచార్యులు రమేష్‌నారాయణ, ఫణీంద్రబాబు, చాంద్ బాషా, మండల నాయకులు పాల్గొన్నారు.

వారధిగా నిలవాలి

వైజంక్షన్(సోమందేపల్లి), న్యూస్‌టుడే: అర్హులకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను సక్రమంగా దరిచేర్చేందుకు ప్రభుత్వానికి- ప్రజలకు వారధిగా సాధికార మిత్రలు నిలవాలని ప్రత్యేకాధికారి కృష్ణానాయక్, తహసీల్దార్ రామాంజనేయరెడ్డి, ఎంపీడీవో నాగన్న పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం స్థానిక వెలుగు కార్యాలయంలో మండలంలో ఎంపికైన మొత్తం 423 మంది మహిళా సాధికార మిత్రలకు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. శిక్షణను అధికారులు తనిఖీ చేశారు. ప్రతిఒక్కరూ సేవాభావంతో, పేదల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరిస్తూ అర్హులకు న్యాయం చేయాలని వారు సూచించారు. సమాఖ్య అధ్యక్షురాలు అనసూయమ్మ, ఏపీఎం జయచంద్ర, ఎంఎస్‌ఏ గంగరత్న, శిక్షకులు కళావతి, ఈశ్వరమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.



కరదీపికను పంపిణీ చేస్తున్న అధికారులు

బాధ్యతగా విధులు నిర్వహిద్దాం



గోరంట్ల: కాలమానిని విడుదల చేస్తున్న ఎంఈవో, యూటీఎఫ్ నాయకులు

గోరంట్ల, న్యూస్‌టుడే: బాధ్యతగా విధులు నిర్వర్తించి ఆపై సమస్యలపై పోరాటం చేద్దామని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) మండల నాయకులు పేర్కొన్నారు. స్థానిక విద్యాశాఖ వనరుల కేంద్రంలో 2018 సంవత్సర దైనందిని, కాలమానిని శనివారం సాయంత్రం విద్యాధికారి కలీముల్లా చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యాధికారి మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు విద్యాభివృద్ధికి సహకరించాలన్నారు. సంఘం నాయకులు మాట్లాడుతూ నాలుగున్నర దశాబ్దాలుగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా యూటీఎఫ్ పని చేస్తోందని పేర్కొన్నారు. విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావడంతోపాటు సంఘాన్ని మరింత పటిష్టం చేసుకునేందుకు ఐక్యంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షుడు మురళీ, అధ్యక్ష కార్యదర్శులు చాంద్‌బాషా, కిష్టప్ప, సంఘం సీనియర్ నాయకులు హనుమంతు, శ్రీధర్‌రావు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

కాలమానిని ఆవిష్కరణ

అంబేడ్కర్‌కూడలి(పెనుకొండ పట్టణం): ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నూతన కాలమానిని, దైనందినిలను శనివారం పట్టణంలోని ఉపఖజాన కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యాధికారి ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ యూటీఎఫ్ రూపొందించిన దైనందిని, కాలమానిని ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగ పడేవిధంగా రూపొందించారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివశంకరప్ప, ఏటీవో వేణుగోపాల్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుధాకర్, రాష్ట్రకార్యవర్గ సభ్యులు నారాయణస్వామి, మండల నాయకలు నరేష్, రమేష్, తదితరలు పాల్గొన్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మరుగుదొడ్ల ప్రచార బోర్డు

దిష్టిబొమ్మల్లా ప్రచార బోర్డులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై ప్రజల్లో విస్తృత ప్రచారం కోసం మండల పరిషత్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద పెద్ద ప్రచార బోర్డులను ఏర్పాటు చేయించింది. గతేడాది వీటిని ఏర్పాటు చేశారు. వాటిపై అతికించిన పెద్ద ప్రచార పోస్టర్లు ఎండలకు ఎండి వర్షాలకు తడిసి చివరకు ఇలా దిష్టిబొమ్మలుగా దర్శనమిస్తున్నాయి. జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో గ్రామాల్లో ప్రచారం కోసం ప్రచార గోడ పత్రికలను ప్రభుత్వం అందజేసింది. వాటిని ప్రచార బోర్డులపై అతికించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సోమందేపల్లి

ప్రధానోపాధ్యాయుడి సేవలు ప్రశంసనీయం

గొరవనహళ్లి(పరిగి), న్యూస్‌టుడే: ఉపాధ్యాయుడిగా శివయ్య సుదీర్ఘ సేవలు అందించి అనేకమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం మండలంలోని గొరవనహళ్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శివయ్య పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యనారాయణ, ఎంఈఓ లక్ష్మీదేవి, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి

కూరగాయల ధరలు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు దినసంతలో నిన్నటి ధరలు. టమోటా 10, పచ్చిమిరప 30, వంకాయలు 20, బెండ 40, ఉల్లిపాయలు 50, బంగాళా దుంపలు 20, కాప్సికం 60, ముల్లంగి 20, బీరకాయలు 40, కాకర 40, క్యారెట్ 60, బీన్స్ 40, చిక్కుడు కాయలు 40, క్యాబేజి 20, అల్లం 60, బీట్‌రూట్ 40, కాలీఫ్లవర్ 30, మునగకాయలు 60, వెల్లుల్లి 60.

నిత్యావసర వస్తువుల కిలో ధరలు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: బియ్యం: హంస-25, సన్నరకం బియ్యం- 40 నుంచి 60 వరకూ, కందిబేడలు-65, శనగబేడలు- 75, పామాయిల్- 70, చింతపండు- 200, పెసరబ్యాల్లు-80, ఎండు మిరప- 90, కొబ్బరి- 160, గోధుమపిండి- 28, శనగపిండి- 90, చక్కెర- 40, బెల్లం- 50, రాగులు- 34, జొన్నలు- 20, సద్దలు- 20, ఉలవలు- 60, కొర్రలు- 40.

పది ఫలితం.. జీవితానికి మలుపు



నల్లమాడలో పుస్తకాలు పంపిణీ

నల్లమాడ న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలో చదివే పేద విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకుని రావాలని కదిరి రోటరీక్లబ్ అధ్యక్షుడు ప్రశాంత్ పేర్కొన్నారు. శనివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలోస్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 115 మంది పదో తరగతి విద్యార్థులకు పఠనా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు సమీపిస్తుండటంతో చరవాణి, టీవీలకు దూరంగా ఉండాలన్నారు. పరీక్షలు పూర్తయ్యేంతవరకు ఒత్తిడికి గురి కాకుండా ఇష్టపడి చదివితే కష్టం ఉండదన్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధిస్తే మీ పాఠశాల జిల్లాలో పేరొందడమే కాక మంచి భవిష్యత్తు ఏర్పరుచుకొన్నవారవుతారన్నారు. ఈ కార్యక్రమంలో నల్లమాడ ప్రాథమిక వైద్యాధికారి రామకృష్ణ, బాబా ఫకృద్దీన్, రోటరీక్లబ్ సభ్యులు తాహీర్‌వలి, రాఘవ పాల్గొన్నారు.

విద్యార్థులకు పఠన సామగ్రి వితరణ

కొండకమర్ల (ఓబుళదేవరచెరువు), న్యూస్‌టుడే: మండలంలోని కొండకమర్ల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో పదోతరగతి చదువుతున్న 74 మంది విద్యార్థులకు కదిరి రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శనివారం పఠన సామగ్రిని పంపిణీ చేశారు. గ్రామీణప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం తమ వంతుగా పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస ప్రశాంత్, దాతలు సుందరరాజు, శ్రీనివాసులు తెలిపారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు కన్నకలలను సాకారం చేసేందుకు బాగా చదవాలని ఉన్నత విద్యతోనే పేదరికాన్ని జయించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నజీమున్నీషా, ఉపాధ్యాయులు మధుసూదన్‌రాజు, షరీఫ్ పాల్గొన్నారు.

చేయూతనందించడంలోనే తృప్తి

గూనిపల్లి(బుక్కపట్నం), న్యూస్‌టుడే : విద్యార్థులకు తమ వంతు చేయూతనందించడంలోనే తృప్తి ఉందని దాత బలరామ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గూనిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు బుక్కపట్నం గ్రామానికి చెందిన బలరామ్‌రెడ్డి, సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు రాత పుస్తకాలు, ఇతర సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రతిఒక్కరూ చేయూతనందించి వారి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల విద్యార్థులకు ఎంతో మెరుగైన విద్యను నేడు ఉపాధ్యాయులు అందిస్తున్నారని దాతలుసైతం తగిన ప్రోత్సాహం అందిస్తే విద్యార్థులు మరింత మెరుగైన విద్య పొందుతారని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పుస్తకాలు అందిస్తున్న బలరామ్‌రెడ్డి, కుటుంబ సభ్యులు



మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘ సభ్యులు

1న నూతన కార్యాలయం ప్రారంభం

బుక్కపట్నం: బుక్కపట్నం గ్రామంలో జనవరి 1న భవన నిర్మాణ కార్మికుల సంఘ నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించనున్నట్లు మండల భవన నిర్మాణ కార్మికుల సంఘ అధ్యక్షుడు నారాయణస్వామి పేర్కొన్నారు. గ్రామంలో 15 రోజుల క్రితం భవన నిర్మాణ కార్మికుల సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నామని, కార్మికుల సమస్యలను సమష్టిగా పరిష్కరించుకునేందుకు ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు.. 1న కార్యాలయ భవనం ప్రారంభించనున్నామని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ చీఫ్‌విప్ పల్లె రఘునాథ్‌రెడ్డి, భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర అధ్యక్షుడు తోరం రాజులు హాజరుకానున్నారు. మండలంలోని భవన నిర్మాణ కార్మికులు ప్రతిఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని సంఘ సభ్యులు తెలిపారు.

సమన్వయంతో పనిచేస్తేనే పురోగతి

బైరాపురం (కొత్తచెరువు), న్యూస్‌టుడే: మండలంలోని బైరాపురం పంచాయతీలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ తీరును ప్రత్యేకాధికారి ఓబులపతి శనివారం పరిశీలించారు. ఎంపీడీవో రఘునాథగుప్తతో కలిసి మాట్లాడుతూ 234 మందిలో ఇప్పటికి 82 పూర్తి చేశారు. 143 పునాది స్థాయిలో ఉన్నాయని తెలిపారు. నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయడానికి ఉపాధి, పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అందరూ సమన్వయంతో పని చేస్తేనే పురోగతి సాధించడానికి వీలవుతుందన్నారు. కార్యదర్శి రమేష్, ఈ.సి రఘురాం పాల్గొన్నారు.

రుణపరిష్కార వేదిక రేపటికి మార్పు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: వ్యవసాయ పంటరుణాల మాఫీకాని రైతుల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన పరిష్కార వేదికను జనవరి 1వ తేదీకి మార్పు చేసినట్లు మండల వ్యవసాయాధికారి సతీష్‌బాబు తెలిపారు. రైతుల రద్దీ కారణంగా అర్జీల స్వీకరణ తేదీని మార్చినట్లు తెలిపారు. రైతులు ఈమార్పును గమనించాలని ఆయన కోరారు.

ఐక్యతతోనే రిజర్వేషన్లను నిలుపుకోగలం



గిరిజన నాయకుల ప్రచారం

ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే: బోయ, వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని ఎస్టీ ఐకాస సంఘ నాయకులు స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏస్టీలు సమావేశమై భవిషత్తు ప్రణాళికపై చర్చించారు. బంజారా సంఘ నాయకులు కాలేనాయక్, గోపాల్‌నాయక్ మాట్లాడుతూ ఐక్యతతోనే ఏస్టీ రిజర్వేషన్లు నిలుపుకోగలమని అందుకు ప్రతి ఒక్క గిరిజనుడు ఏకం కావాలన్నారు. జనవరి 27న అనంతపురంలో జరిగే గిరిజనుల శంఖారావం సభకు భారీ సంఖ్యలో తరలిరావాలని రవీంద్రనాయక్, నారాయణస్వామి నాయక్, సునీల్‌నాయక్, మోహన్ నాయక్, బాలాజీనాయక్, రత్నాబాయి, రమణనాయక్ కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



కమ్మవారిపల్లిలో రహదారిని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఛైర్మన్ బెస్తచలపతి, పుడా ఛైర్మన్ కడియాల సుధాకర్ నాయుడు, జిల్లా తెదేపా ఉపాధ్యక్షుడు చెన్నకేశవులు పేర్కొన్నారు. శనివారం పెద్దకమ్మవారిపల్లి నుంచి దొమ్మరికాలనీకి వెళ్లే రహదారిని పరిశీలించారు. రహదారి అధ్యానంగా ఉండటంతో ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నామని, బాగు చేయించాలని కాలనీ ప్రజలు మెరపెట్టుకున్నారు. రహదారిపై మట్టివేయించి తాత్కాలికంగా సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాలనీలో లీకేజీ అవుతున్న తాగునీటి ట్యాంకును పరిశీలించి, మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. రెండు రోజుల్లో రహదారి ఏర్పాటు చేయకపోతే, కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు గుడూరుఓబిలేసు, కోనంకి శేఖర్, ఏఈ మురళీధర్ పాల్గొన్నారు.

సంపు నిర్మాణానికి తగు స్థలం చూపాలి



తహసీల్దార్‌కి వినతిపత్రం ఇస్తున్న ఛైర్మన్లు, కమిషనర్

పుట్టపర్తిగ్రామీణం,న్యూస్‌టుడే: నీటి నిల్వకు సరిపడా స్థలం చూపాలని నగర పంచాయతీ, పుడా ఛైర్మన్లు బెస్తచలపతి, కడియాల సుధాకర్‌నాయుడు, కమిషనర్ విజయ్‌భాస్కర్‌రెడ్డి తహసీల్దార్‌ను కోరారు. శనివారం ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం నాన్ అమృత్ పథకం కింద రూ. 42 కోట్లతో పట్టణ వాసులకు 30 ఏళ్ల కాలం పాటు నీటి సమస్య రాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలతో నీటి సరఫరాకు బృహత్తర ప్రణాళిక తయారు చేశామని చెప్పారు. ఈ ప్రణాళిక కార్యరూపం దాల్చాలంటే 9 మిలియన్‌లీటర్ల నీటి సామర్థ్యం ఉన్న సంపు నిర్మించాల్సి ఉందన్నారు. పట్టణంలో అన్ని ప్రాంతాలకు అనువుగా ఉండే చోట సంపు నిర్మించాలని అందుకు తగిన స్థలం చూపాలని కోరారు. మామిళ్లకుంట-ధర్మవరం రోడ్డుకు సమీపంలో 1.50 ఎకరాల స్థలం ఉందని రైతులతో మాట్లాడి స్థలం సేకరించాలని కోరారు. అక్కడ స్థలం దొరికితే చెరువు నుంచి కృష్ణా జలాల సరఫరా సాధ్యపడుతుందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా తెదేపా ఉపాధ్యక్షుడు చెన్నకేశవులు, కౌన్సిలర్ షకీలా, ఏఈ మురళి ఉన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



రాస్తారోకోలో మాట్లాడుతున్న షబ్బీర్

ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని మసీదులో మతగురువును హత్యచేసి, ఖురాన్‌ను కాల్చిన గుర్తుతెలియని దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని స్థానిక ముస్లిం మైనార్టీలు శనివారం ప్రధానరహదారిపై రాస్తారోకో చేశారు. వీరికి మద్దతుగా ఆవాజ్, సీపీఎం, సీపీఐ, బీ.సీ.జనసభ నాయకులు రాస్తారోకోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు షబ్బీర్, ఆవాజ్ జిల్లాకమిటీ సభ్యుడు చాంద్‌బాషా మాట్లాడుతూ ముస్లింల ప్రార్థనమందిరం అయిన మసీదులోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి హత్య చేయడం, పవిత్రమైన ఖురాన్‌ను కాల్చడం సరైనది కాదన్నారు. దుండగులను గుర్తించి అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాస్తారోకోతో కదిరి-హిందూపురం ప్రధాన రహదారిపై వాహనాలు నిలిచిపోయి రాకపోకలు స్తంభించాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ముస్లిం నాయకులకు నచ్చజెప్పి రాసారోకోను విరమింపజేశారు. ఈ రాస్తారోకోలో సీపీఎం, సీపీఐ నాయకులు రమణ, శ్రీనివాసులు, మున్నా, హైదర్‌వలీ, బీసీ జనసభ మండలాధ్యక్షుడు ఎం.ఎస్. షబ్బీర్, టికే కరీం, వెల్డింగ్‌బాషా, ముబారక్, బాబాజాన్, సాధిక్ పాల్గొన్నారు.

పుట్టపర్తి

లారీని ఢీకొన్న జేసీబీ

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు-పుట్టపర్తి రహదారిలో జేసీబీ డ్రైవర్ మద్యం మత్తులో ఎదురుగా వచ్చిన ఐషర్ వాహనం, ఇంటి ప్రహరీని ఢీకొన డంతో ప్రమాదం జరిగింది. శుక్రవారం రాత్రి కూడలి నుంచి సందీప్ థియేటర్ వైపు వెళ్తున్న జేసీబీ యంత్రం ఉన్నపళంగా ఎదురుగా వస్తున్న ఐషర్ వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో వాహనం డీజిల్ ట్యాంకు పగిలి డీజిల్ నేలపాలైంది. తరువాత వెనుకవైపున్న ఇంటి ప్రహరీని ఢీకొన్నాడు.

జన్మభూమిపై నేడు సమీక్షా సమావేశం

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు మండలంలో ఐదో విడత జన్మభూమి మాఊరు కార్యక్రమ నిర్వహణపై ప్రత్యేకాధికారి ఓబుళపతి ఆధ్వర్యంలో ఆదివారం సమీక్షా సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో రఘునాథగుప్త తెలిపారు. మండల, గ్రామస్థాయి అధికారులందరూ మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

పాలన చేతగాకపోతే దిగిపోండి

ఛైర్మన్, మాజీ ఛైర్మన్ మధ్య వాగ్వాదం



ప్రశ్నిస్తున్న గంగన్న

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలో సత్యసాయి భక్తులు, నిరుపేదలకు సురక్షిత తాగునీరు అందించాలనే సంకల్పంతో సత్యసాయి ఎన్టీఆర్ శుద్ధ జల కేంద్రాలను నిర్మిస్తే, విద్యుత్తు సరఫరా ఎందుకు ఆపారో చెప్పాలని మాజీ ఛైర్మన్ పీసీగంగన్న డిమాండ్ చేశారు. శనివారం నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం ఛైర్మన్ బెస్త చలపతి అధ్యక్షతన జరిగింది. శుద్ధ జల కేంద్రాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించాలని జీవో ఉన్నప్పటికి, ఎందుకు నిలిపేశారని, పరిపాలన చేయడం చేతకాకపోతే పదవి నుంచి దిగిపోవాలని ఛైర్మన్ బెస్త చలపతిపై మాజీ ఛైర్మన్ మండిపడ్డారు. నిరుపేదలకు 20 లీటర్ల నీటిని రూ.2లకే అందించే, శుద్ధ జలకేంద్రాలకు విద్యుత్తు సరఫరా నిలిపివేసి, పార్టీకి ప్రజల్లో చెడ్డపేరు తెచ్చారన్నారు. ఓట్లు వేయాలని ఏడాదిలో వెళ్లాలని, ఏ ముఖం పెట్టుకొని ప్రజల వద్దకు వెళ్లాలన్నారు. ఫోర్జరీ సంతకాలతో ఆర్‌డీ, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, అభివృద్ధిని అన్ని విధాలా అడ్డుకున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదులో చేసిన సంతకాలు తమవి కావని కౌన్సిలర్లు వెంకటరమణమ్మ, షకీల, లక్ష్మిదేవి ఖండించారు. నీటి శుద్ధి ప్లాంట్లకు విద్యుత్తు సరఫరా బిల్లులు నగర పంచాయతీ నుంచే చెల్లించాలని కౌన్సిలర్ దిల్‌షాద్‌బేగం సమావేశాన్ని బహిష్కరించారు. శుద్ధ జల కేంద్రాలకు నగర పంచాయతీయే బిల్లులు చెల్లించాలని కౌన్సిల్ సభ్యులందరు కోరారు. కౌన్సిల్ తీర్మానం మేరకు నగర పంచాయతీ నుంచే విద్యుత్తు బిల్లులు చెల్లించేందుకు ఆర్డీకి పంపుతామని, ఉత్తర్వులు వచ్చిన వెంటనే బిల్లులు చెల్లిస్తామని ఛైర్మన్ హామీ ఇచ్చారు. కార్మికులకు నెలనెలా ఎందుకు వేతనాలు చెల్లించడంలేదని, ఈఎస్ఐ జమ చేయాలని, చెప్పులు, వస్త్రాలు, నూనె, పరికరాలు అందించాలని కౌన్సిలర్ ఓబిలేసు కోరారు. రహదారులను అర్ధంతరంగా మధ్యలో నిలిపివేయడంతో భక్తులు, పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారని త్వరితగతిన పూర్తి చేయించాలని కౌన్సిలర్ సుభాషిణి కోరారు. కేబుల్ పనులకు తవ్విన గుంతల పూడ్చివేత పనుల్లో నాణ్యత లోపించిందని తగు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. నగర పంచాయతీకి 2017-18లో బడ్జెట్ రూ.3,94,64,000 ప్రవేశపెట్టగా, ప్రస్తుతం 2018-19 బడ్జెట్ రూ.4,29,19,000 అంచనాలతో రూపొందించి, ఈ మేరకు కౌన్సిల్‌లో తీర్మానించామని మేనేజర్ మురళి తెలియజేశారు. తమ కాలనీల్లో సమస్యలను కౌన్సిలర్లు పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో ఏఈలు మురళీధర్, స్వామి, శానిటేషన్ అధికారి శివయ్య పాల్గొన్నారు.



ప్రదర్శనగా వస్తున్న రైతులు

చెరువుకు నీరిస్తే బీడు భూములు సాగులోకి

జగరాజుపల్లి,వెంకటగారిపల్లి,కప్పలబండ(పుట్టపర్తిగ్రామీణం)న్యూస్‌టుడే: కృష్ణా జలాలతో జగరాజుపల్లి చెరువును నింపాలని ఆయా గ్రామాల రైతులు, ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం జగరాజుపల్లి, వెంకటగారుపల్లి, కప్పలబండ, గౌనికుంటపల్లి గ్రామాల రైతులు, ప్రజలు సమస్యపై తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ముందుగా ఆయా గ్రామాల రైతులు గణేష్ కూడలి నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు ప్రదర్శనగా వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగరాజుపల్లి చెరువులో నీరుంటే నాలుగు గ్రామాల్లో 750 కుటుంబాలు సుభిక్షంగా ఉంటాయని తెలిపారు. పదిహేనేళ్లుగా చెరువు నిండక పోవడంతో భూములు బీళ్లుగా మారాయని, పనుల్లేక రైతులు, కూలీలు వలస వెళ్తున్నారని, ఇప్పటికే 200 కుటుంబాలు పనుల్లేక ఉపాదికోసం వలస వెళ్లారన్నారు. చెరువుకు దగ్గరలో హంద్రీనీవా కాలువ ప్రవహిస్తోందని తద్వారా ఎత్తిపోతల కింద చెరువుకు నీరిచ్చి బీడు భూములను సాగులోకి తీసుకు వచ్చేలా ప్రభుత్వానికి సమస్యను నివేదించాలని తహసీల్దార్‌ను కోరారు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

కమనీయం..సాయి గానామృతం



సాయి పూర్వ విద్యార్థుల కచేరీ

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రశాంతి నిలయంలో సాయి పూర్వ విద్యార్థులు సంగీత కచేరీని కమనీయంగా నిర్వహించారు. శనివారం సాయికుల్వంత్ మందిరంలో సంగీత కళాశాల పూర్వ విద్యార్థులు ఆలపించిన 'సాయి ఈశ్వర్ సంధ్య' గానామృతం భక్తులను పరవశులను చేసింది. నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ..సత్యసాయిని కీర్తిస్తూ శ్రావ్యంగా గీతాలను ఆలపించారు. పూర్వ విద్యార్థులు భక్తుల హృదయాలను హత్తుకునే విధంగా ప్రసంగించారు. సత్యసాయి విద్యాసంస్థల్లో ప్రవేశ అనుభూతితో ప్రారంభించి, సత్యసాయితో గల ప్రేమ బంధాన్ని భక్తులకు వివరించారు. సత్యసాయి పూర్వ విద్యార్థులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

అల్ప విద్యుత్తు అవస్థలు తీర్చండి

కంబాలపర్తి(పుట్టపర్తిగ్రామీణం): అల్ప విద్యుత్తుతో అవస్థలు పడుతున్నాం సమస్యకు పరిష్కారం చూపాలని రైతులు ఏడీఈ కాళిదాసుకు విన్నవించారు. శనివారం చెర్లోపల్లి పంచాయతీ కంబాలపర్తి గ్రామ రైతులు విద్యుత్తు సమస్య పరిష్కారం కోరుతూ ఏడీఈకి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ప్రస్తుతం రబీ పంటలు సాగు చేశామని అల్పవిద్యుత్తు కారణంగా మోటార్లు మొరాయిస్తున్నాయని, పొలానికి తడులు ఇవ్వలేక పోతున్నామని వాపోయారు. ఇలాగే విద్యుత్తు సరఫరా కొనసాగితే మోటార్లు కాలిపోతాయని, పంటలు ఎండిపోతాయని నష్టం వాటిల్లక ముందే పరిష్కారం చూపాలని విన్నవించారు. ఇటీవల ఓడీసీ మండలం కొండకమర్ల నుంచి విద్యుత్తు ఇస్తున్నారని యథావిధిగా బుక్కపట్నం మండలం జానకంపల్లి విద్యుత్తు కేంద్రం నుంచి నాణ్యమైన విద్యుత్తు సరఫరా ఇవ్వాలని కోరారు. పరిశీలించి సమస్యకు పరిష్కారం చూపుతామని ఏడీఈ రైతులకు నచ్చజెప్పి పంపారు.

తాగునీటి ఎద్దడి రానివ్వం

ఎనుములపల్లి(పుట్టపర్తిగ్రామీణం): పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య రానివ్వమని, బోర్లు, ఇతరత్రా ద్వారా పుష్కలంగా అందిస్తామని ఛైర్మన్ బెస్తచలపతి అన్నారు. శనివారం ఎనుములపల్లి ఎస్సీ, బీసీ కాలనీల్లో ఎస్సీ ఉప ప్రణాళిక నిధులు రూ.2.20 లక్షలతో బోరుబావి తవ్వకం పనులను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బోరు నుంచి పైపులైను పనులు చేపడతామన్నారు.

ఇసుక తరలింపు అడ్డగింత

బైరాపురం(కొత్తచెరువు), న్యూస్‌టుడే: కొత్తచెరువు మండలం బైరాపురం దగ్గర వంగపేరు నుంచి ఇసుక అక్రమ రవాణాతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచి, పలువురు గ్రామ పెద్దలు కలిసి ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. నాలుగు నెలలుగా యథేచ్ఛగా ఇసుక తరలింపుతో వంగపేరులో రాళ్లు తేలాయన్నారు. వర్షాలు కురవని నేపథ్యంలో ఇసుకను పూర్తిగా తోడేస్తే వచ్చేవేసవిలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. రెవెన్యూ అనుమతులు ఉన్నాయని ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ల యజమానులు చెబుతున్నారన్నారు. ట్రాక్టర్లను అడ్డుకుంటే ఎదురుతిరగడంతో ఘర్షణ వాతావరణం తలెత్తుతోందని వాపోయారు. అయితే ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ప్రభుత్వ గృహాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకోసం అయితే ఎలాంటి అభ్యంతరం లేదని తహసీల్దార్ వసంతకుమార్ తెలిపారు. అలా కాకుండా ఇసుక వ్యాపారం చేస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే తాగునీటి పథకాలు, వ్యవసాయ బోర్లు, వంతెనల ప్రదేశాల్లో ఇసుక తవ్వకాలు జరగకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇసుక రవాణాపై రెవెన్యూ అధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని ఎస్.ఐ రాజేష్ తెలిపారు.



అక్రమ రవాణాను అడ్డుకుంటున్న గ్రామస్థులు

2 నుంచి జన్మభూమి సభలు

బుక్కపట్నం, న్యూస్‌టుడే : మండలంలో జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని 2 నుంచి 11 వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని 11 పంచాయతీ గ్రామాల్లో 2 నుంచి 8 వరకు జన్మభూమి మా ఊరు గ్రామ సభలను నిర్వహించేందుకు ఇప్పటికే అన్ని శాఖల అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపామన్నారు. ఆ షెడ్యూలును ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మార్పు చేశామన్నారు. 2న కృష్ణాపురం, కొత్తకోట, 3న పాముదుర్తి, 4న అగ్రహారం, 5న గూనిపల్లి, 6న సిద్ధరాంపురం, 7న మారాల, 8న యాదాలంకపల్లి, 9 గశికవారిపల్లి, 10న నార్సింపల్లితండా, 11న బుక్కపట్నం పంచాయతీ గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయన్నారు.

ఘనంగా ముగిసిన స్వర్ణోత్సవం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

నల్లమాడ న్యూస్‌టుడే: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవం ఘనంగా జరిగింది. శనివారం పూర్వ విద్యార్థులు, గురువుల ఆత్మీయ కలయికతో పాఠశాల ప్రాంగణం పులకరించిపోయింది. మొదటగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహ్లాదంగా, ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా గురువులు, పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 1960లో స్థాపించిన ఈ పాఠశాల అంచెలంచెలుగా ఎదిగి నేడు సమారు 12 ఎకరాల్లో 600 మంది విద్యార్థులతో ఉండడం ఆనందదాయకమన్నారు. ప్రతి ఒక్కరూ పాఠశాల అభివృద్ధికి పాటు పడాలని పిలుపునిచ్చారు. ఈ పాఠశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత హోదాలు, రాజకీయ రంగంలోను అన్నింటా రాణించారని నాటి ఉపాధ్యాయులు పేర్కొన్నారు. గతంలో పాఠశాలలో చదివే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వినయ, విధేయతలతో గౌరవించేవారన్నారు. ప్రస్తుతం కార్పొరేటు విద్య మోజులో పడిపోయారన్నారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎనలేని ఆదరణ, అమూల్య గౌరవం లభించేవన్నారు. నేడు సాంకేతికత అభివృద్ధి చెందిన కాలంలో మన బడి పిలుస్తోందనే కార్యక్రమం ద్వారా నాటి విద్యార్థులంతా తమను గుర్తుంచుకొని, ఇన్ని రోజులు ఇలా సంబరాలు చేయడం చాలా సంతోషం కలిగించిందన్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన వారందరికి పాఠశాల పూర్వ విద్యార్థి రమేష్ నాయక్ భోజన వసతి, స్వర్ణోత్సవ ఏర్పాట్లు చేసినందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు

రాయదుర్గం

రేపటి నుంచి పింఛన్లు పంపిణీ

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలో 2018వ సంవత్సరం జనవరి నెలలో 3,749 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మంజూరైనట్లు రాయదుర్గం ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. అందుకు ప్రభుత్వం రూ. 40.85 లక్షలు మంజూరు చేసిందన్నారు. 1 నుంచి 5వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు.

బీమా ప్రీమియం చెల్లింపు

బొమ్మనహాళ్ : మండలంలోని నేమకల్లులో 467 మందికి చంద్రన్న బీమా కింద రూ. 6,700 ప్రీమియాన్ని గ్రామానికి చెందిన బసప్ప చెల్లించారు. గ్రామంలో నిరుపేదలకు ఒక్కొక్కరికి రూ. 15 వంతున ప్రీమియం చెల్లించడానికి చెక్కును ఏపీఎం రియాజ్‌బేగ్‌కు అందించారు. ఈ కార్యాక్రమంలో తెదేపా మండల కన్వీనర్ బలరామిరెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

నేడు నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం



సునంద గైక్వాడ్

రాయదుర్గం, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ స్వకుళసాళి మహిళా మండలి కార్యదర్శిగా రాయదుర్గానికి చెందిన సునంద గైక్వాడ్ ఎన్నికయ్యారు. ఇటీవల ఆదోనిలో జరిగిన సమావేశంలో రాష్ట్రస్వకుళసాళి మహిళా మండలి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మహిళా మండలి రాష్ట్ర అధ్యక్షురాలిగా ఆదోనికి చెందిన లోకేశ్వరబాయిని ఎన్నుకోగా కార్యదర్శిగా సునందగైక్వాడ్‌ను ఎన్నుకున్నారు. వారితో పాటు ఎంపికైన నూతన కార్యవర్గసభ్యులు ఆదివారం ఉదయం పట్టణంలోని బళ్లారి రోడ్డు పక్కన గల హటకేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న స్వకుళసాళి సమాజ సత్రంలో రాష్ట్ర అధ్యక్షురాలు ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారోత్సవం జరగనున్నట్లు ఆ మండలి కార్యదర్శి సునందగైక్వాడ్ తెలిపారు.

సీడీపీవోకు ఘనంగా వీడ్కోలు

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : రాయదుర్గం ఐసీడీఎస్ సీడీపీవో సరోజమ్మ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. పట్టణంలోని వీరాంజనేయస్వామి కల్యాణ మండపంలో ఆమెకు వీడ్కోలు సభ నిర్వహించారు. అంగన్‌వాడీ ఉద్యోగులు, ఐసీడీఎస్ సిబ్బంది సీడీపీవోకు పూల మాలలు వేసి ఘనంగా సన్మానం చేసి వీడ్కోలు పలికారు. రాయదుర్గం తహసీల్దారు నాగరాజు, డిప్యూటీ తహసీల్దారు బాలకిషన్, రాయదుర్గం, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్ మండలాల ఐసీడీఎస్ పర్యవేక్షకులు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అధ్యాపకులకు నగదును అందజేస్తున్న ట్రస్టు నిర్వాహకుడు

ఉచిత ఎంసెట్ శిక్షణ

కణేకల్లు, న్యూస్‌టుడే : తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇస్తున్న ఎంసెట్ ఉచిత శిక్షణను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సోమశేఖరరెడ్డి మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులు నాగిరెడ్డి సూచించారు. శనివారం ఆ కళాశాలలో ఎంసెట్ ఉచిత శిక్షణ ఇస్తున్న అధ్యాపకులకు ఆయన ప్రోత్సాహక నగదును అందజేశారు. విద్యార్థులకు అందుబాటులో ఉండేలా కళాశాలలో శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రమేష్, ఆంజనేయులు, ధనుంజయ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

2 నుంచి జన్మభూమి..

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలో జనవరి 2 నుంచి 10వ తేదీ వరకు ప్రభుత్వం నిర్వహించే 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని రాయదుర్గం మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసులు తెలిపారు. జనవరి 2వ తేది ఉదయం వడ్రవన్నూరు గ్రామంలో జన్మభూమి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం డి.కొండాపురం, 3న గ్రామదట్ల, టి.వీరాపురం, 4న బీఎన్‌హళ్లి, 74 ఉడేగోళం, 5న ఆవులదట్ల, నాగిరెడ్డిపల్లి, 6న కొంతానపల్లి, ఆర్బీవంక, 7న మల్లాపురం, మెచ్చిరి, పల్లేపల్లి, 8న రేకులకుంట, జుంజురాంపల్లి, 9న వేపరాళ్ల, కెంచానపల్లి, 10న చదం, చదం గొల్లలదొడ్డి గ్రామ పంచాయితీలలో జరుగుతాయన్నారు. ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు హాజరు కావాలన్నారు.

తాగి వాహనాలు నడిపితే వాహనం సీజ్

నేడు విస్తృతంగా పోలీసుల తనిఖీలు



బొమ్మనహాళ్, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా ఆదివారం సాయంత్రం నుంచి ఎవరైనా తాగి వాహనాలను నడిపితే వాహనాలను సీజ్ చేస్తామని ఎస్సై నాగమధు హెచ్చరికలు చేశారు. శనివారం బొమ్మనహాళ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు కూడా గ్రామాల్లో మద్యం తాగి రాత్రి వేళల్లో వాహనాలను అతివేగంగా నడిపినా చట్టరీత్య చర్యలు తీసుకొంటామన్నారు. ప్రధాన రహదారుల్లో పోలీసుల ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి తాగి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అలాగే శిరస్త్రాణం ధరించి, డ్రైవింగ్ లైసెన్స్, వాహనం రికార్డు, ఇన్సూరెన్స్ వంటి రికార్డులు వాహన చోదకుల వద్ద ఉండాలన్నారు.

రాయదుర్గం, రాయదుర్గం గ్రామీణం : ఆదివారం సాయంత్రం నుంచి జనవరి 1వ తేదీ ఉదయం 5 గంటల వరకు రాయదుర్గం సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ముఖ్య కూడళ్లల్లో శ్వాస పరీక్షలు (డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు), వీడియో తీయించనున్నట్లు స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. చలపతిరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల పలువురి ప్రాణాలకు ప్రమాదం ఉన్నందున ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపితే వారి వాహనాలు స్వాధీనం చేసుకుని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. క్రిమినల్ కేసుల వివరాలను అన్ని ప్రభుత్వ శాఖలకు చట్టబద్ధంగా ఉంచుతామన్నారు. దీంతో వివిధ ఉద్యోగ నియామకాలు, విదేశీ ప్రయాణం లేదా ఉద్యోగాలకు అవసరమైన పాస్‌పోర్టు, వీసాలు పొందు సమయంలో పలు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా రోడ్లపై గుమిగూడి ఇతరుల భద్రతకు వ్యక్తిగతంగా కాని, మూకుమ్మడిగా కాని భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదివారం రాత్రి 12.30 గంటల వరకు మాత్రమే రాయదుర్గం సర్కిల్ పరిధిలో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని ఆనందంగా గడుపుకోవాలన్నారు. శాంతి, భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

కణేకల్లు : కొత్త సంవత్సర వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ రామారావు హెచ్చరించారు. డిసెంబరు 31 అర్ధరాత్రి 12.30 దాటాక వీధుల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ అల్లరి చేస్తూ.. నిర్వహించే వేడుకలకు అనుమతించేది లేదన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే పరీక్షలు నిర్వహించి కేసులు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు.

'జన్మభూమి - మాఊరు' విజయవంతం చేద్దాం

ఎస్ఎస్ ఫ్యాక్టరీ (బొమ్మనహాళ్), న్యూస్‌టుడే : జనవరి 2 నుంచి 11వ తేదీ వరకు జరిగే ఐదో విడిత జన్మభూమి - మాఊరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో గంగన్న, తహసీల్దారు శివయ్య అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో 2018 జనవరిలో 10 రోజులపాటు జరిగే జన్మభూమి - మాఊరు కార్యక్రమాన్ని ప్రజలు పండగలా జరపడానికి సహకరించాలన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణ పరిష్కారం కోసం కూడా మండల స్థాయి అధికారులు కృషి చేయాలన్నారు. జన్మభూమిలో ఉచిత వైద్యశిబిరాలు, పశువైద్య శిబిరాలు, రేషన్ కార్డులు, పింఛన్లు పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాధికార మిత్రలు, జన్మభూమి కమిటీ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ గంగన్న

సమయాన్ని వృథా చేసుకోవద్దు..!

రాయదుర్గం, న్యూస్‌టుడే : పదో తరగతి పరీక్షలు మరో 75 రోజుల్లో జరగనున్న నేపథ్యంలో విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా ఏకాగ్రతతో చదివితే మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావచ్చని స్టేట్ అకడమిక్ అధికారి, జిల్లా సమన్వయకర్త డి.వెంకటప్పయ్య అన్నారు. శనివారం కళ్లిమఠం ఉన్నత పాఠశాలలో పట్టణంలోని అయిదు మున్సిపల్ పాఠశాలలకు చెందిన 300ల మంది పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు కృషి, పట్టుదలతో ప్రణాళికాబద్ధంగా చదివితే పదిలో పదికి పది మార్కులు సులభంగా సాధించవచ్చన్నారు. చదువును కష్టంగా కాక ఇష్టంగా చదువుకోవాలన్నారు. పదో తరగతిలో కనీసం 50 శాతం మంది విద్యార్థులైనా పదికి పది మార్కులు తీసుకురావాలన్నారు. పదికి పది మార్కులు సాధించిన వారికి అమరావతిలో ప్రతిభా అవార్డులు, ల్యాబ్‌టాప్‌లు ప్రధానం చేస్తామన్నారు. ఇడుపుల పాయ ట్రిపుల్ ఐఐటీలో సీటు వస్తుందన్నారు. ఉచిత విద్య, వసతితో పాటు ఉద్యోగం వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతపురంలో త్వరలో పెద్దఎత్తున ఐటీ కంపెనీలు ఏర్పాటవుతాయని వాటిలో ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన వారికి జిల్లాకో మున్సిపల్ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా కార్పొరేట్ విద్యను అందిస్తామన్నారు. రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, నెల్లూరు జిల్లా కేంద్రాల్లో ఇప్పటికే మున్సిపల్ జూనియర్ కళాశాలల నడుపుతున్నట్లు తెలిపారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా మంచిపోషక విలువలతో కూడి సులభంగా జీర్ణమయ్యే ఆకుకూరలు, కాయగూరలను తీసుకోవాలన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రతి విద్యార్థి పరీక్షల సమయంలో తన ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలన్నారు. విద్యార్థులకు పాఠశాలల్లోనూ, సిలబస్ పరంగా ఎలాంటి సందేహాలు ఉన్నా 99127 58620 సెల్‌కు ఫోన్ చేసి చెబితే ఆ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం. కృష్ణ, యూఎల్‌బీ సమన్వయకర్త రమేష్, ఉపాధ్యాయులు నాగభూషణం, రేఖా, మహాలక్ష్మి, మహాలక్ష్మి, రామాంజనేయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న వెంకటప్పయ్య

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాల్లో కాలానుగుణ వ్యాధులపై ఆశా, ఆరోగ్య కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌వో ప్రదీప్‌కుమార్, సూపర్‌వైజర్ బాబురాజు అన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆశా, ఆరోగ్య కార్యకర్తల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి రోగులకు ఎప్పటికప్పుడు వైద్యం అందివ్వాలన్నారు. గ్రామాల్లో చాలా మంది గర్భిణులు ఇళ్లల్లోనే కాన్పులు చేయించుకోవడం వల్ల నష్టాలు జరిగే అవకాశం ఉంటుందని, కావున ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చైతన్యం తీసుకొని రావాలన్నారు. గ్రామాల్లో హైరిస్కులున్న కేసులను ఎప్పటికప్పుడు పరిశీలించి తగిన వైద్యం అందివ్వాలన్నారు.



వన్నూరప్పను సన్మానిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు

ఉద్యోగులు వారధిగా ఉండాలి

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : రాయదుర్గం ఈవోఆర్డీ వన్నూరప్ప శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భారతి అధ్యక్షతన వన్నూరప్పకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఆయన ఈవోఆర్డీగా అందించిన సేవలను ఎంపీడీవో శ్రీనివాసులు డిప్యూటీ తహసీల్దారు బాలకిషన్ కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు వారిధిగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందిస్తూ వారి మన్ననలు పొందినప్పుడే ఉద్యోగులకు సమాజంలో సరైన గౌరవం లభిస్తుందన్నారు. వన్నూరప్పను సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రభుత్వ ఉద్యోగులు శాలువాలు, పూలమాలలతో సన్మానించి వీడ్కోలు పలికారు. ఎంఈవో నాగమణి, మండల కార్యాలయం సూపరింటెండెంట్ బలరామారావు, ఉద్యోగులు, పీఆర్ జేఈ మునిస్వామి, పంచాయతీ కార్యదర్శులు, జాతీయ ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గం

కొత్త రేషన్ కార్డులకు 1,100 దరఖాస్తులు

కణేకల్లు, న్యూస్‌టుడే : మండలంలో అన్ని గ్రామాల నుంచి గత ఏడాది కాలంగా కొత్త రేషన్ కార్డులకు 1,100 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు వాణిశ్రీ పేర్కొన్నారు. రేషన్ కార్డులకు ప్రజలందించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, మంజూరుకు ప్రభుత్వానికి నివేదించినట్లు చెప్పారు.

ఉపాధ్యాయుడి చేయూత

కణేకల్లు, న్యూస్‌టుడే : మండలంలోని అంబాపురం పాఠశాలలో శనివారం విద్యార్థులకు టై, బెల్టు పంపిణీ చేశారు. ఉపాధ్యాయుడు మల్లికార్జున వితరణతో విద్యార్థులకు టై, బెల్టుకు కొనుగోలు చేసి పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం విజయసారథి తెలిపారు. గ్రామానికి చెందిన దాత ధనంజయరెడ్డి అందించిన రూ.10 వేలు విరాళంతో సింటెక్స్ ట్యాంకు ఏర్పాటు చేసి తాగు నీటి వసతి కల్పించామన్నారు.

ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలు

● నిబంధనలకు విరుద్ధంగా అంగన్‌వాడీ కేంద్రాలు ● శిథిల ట్యాంకు కింద ఏర్పాటు

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే : గ్రామాల్లో ప్రజలకు ప్రయోజనం చేకూర్చాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు దాన్ని మరిచి ఇష్టారాజ్యంగా నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపడుతున్నారు. ప్రభుత్వం అభివృద్ధి పనులకు మంజూరు చేస్తున్న లక్షలాది రూపాయలను ప్రజలకు ఉపయోగపడేలా కాకుండా సొంత లాభాపేక్షతో ప్రజాప్రయోజనాలను తుంగలో తొక్కి పనులు చేస్తున్నారు. మండలంలోని కలుగోడు గ్రామంలో సుమారు 3 వేలకు పైగా జనాభా ఉంది. అక్కడ చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నూతన అంగన్‌వాడీ కేంద్రాల భవనాలను నిర్మించటానికి ప్రభుత్వం ఒక్కొక్క భవనానికి రూ.7 లక్షలతో మూడు భవనాలను మంజూరు చేసింది. ఒక్కొక్క భవనానికి సుమారుగా అర కిలో మీటరు దూరమైనా ఉండి, కాలనీ చుట్టుపక్కల చిన్న పిల్లలకు రావటానికి పోవటానికి వీలుండే విధంగా కుటుంబాల దగ్గరలో, ఆదే కాలనీలో గాని, కాలనీకి దగ్గర్లోగాని కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. కానీ గ్రామంలో కొత్తగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం-2, 4 రెండు భవనాలు కాలనీ వాసులకు దూరంగా ఉన్నాయని, రెండు కేంద్రాలు దగ్గర దెగ్గరగా అర కిలో మీటరు నిడివి లేకుండా నిర్మించారు. అవి పిల్లలకు ఇబ్బంది కలిగేలా దూరంగా ఉన్నాయని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదపుటంచున నిర్మాణం

నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం - 2 భవనం, పూర్తిగా శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంకు కిందనే నిర్మించారు. ట్యాంకు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ప్రమాదకరంగా ఉన్న స్థలంలో నిర్మాణం చేపట్టడం వల్ల భవిష్యత్తు ట్యాంకు వల్ల చిన్న పిల్లలకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవిని వివరణ కోరగా



ప్రమాదకరంగా ట్యాంకు కిందనే నిర్మించిన ఆంగన్‌వాడీ కేంద్రం

ట్యాంకు శిథిలావస్థకు చేరిన విషయం తెలియదని, అప్పుడు కేంద్ర భవన నిర్మాణం చేపట్టడానికి అనువైన స్థలం దొరక్క పోవటంతో వల్ల నిర్మాణానికి అనుమతిచ్చామన్నారు.

దంపతుల మధ్య రాజీ

రాయదుర్గం, న్యూస్‌టుడే : కుటుంబంలో నెలకొన్న చిన్నపాటి మనస్పర్థాలతో విడిపోయిన దంపతుల మధ్య న్యాయవాదులు రాజీ చేసి తిరిగి కాపురానికి పంపారు. పట్టణానికి చెందిన రాజూనాయక్ తన భార్య వరలక్ష్మిబాయిని శారీరకంగా, మానసికంగా హింసిస్తుండటంతో ఆమె శనివారం స్థానిక కుటుంబ సంక్షేమ కేంద్రాన్ని ఆశ్రయించింది. న్యాయవాదులు రవిచంద్ర, వసుంధరాదేవి, హరికృష్ణ, బాబా ఫకృద్దీన్‌లు భార్యా, భర్తలతోపాటు ఇరువర్గాలకు చెందిన వారిని పిలిపించి చర్చించి రాజీ చేశారు. వరలక్ష్మిబాయిని భర్త రాజూనాయక్ ఇంటికి పంపారు.

ఏకాదశి ఆదాయం రూ.4.07 లక్షలు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే : మండలంలోని ఉంతకల్లు వెలసిన రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో శుక్రవారం జరిగిన వైకుంఠ ఏకాదశి సందర్భంగా రూ.4,07,807 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌ఛార్జి, కణేకల్లు డిప్యూటీ తహసీల్దారు వీరేష్ తెలిపారు. ఈ ఏడాది వైకుంఠ ఏకాదశి ఆదాయం బాగా పెరిగింది. వచ్చిన ఆదాయంలో రూ.85,250 భక్తులకు అన్నదానం, ఆలయ ఖర్చులు అయినట్టు తెలిపారు. మిగిలిన రూ.3,22,557 దేవాల అభివృద్ధి ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు.




మాట్లాడుతున్న బలరామిరెడ్డి

సాధికార మిత్రలే కీలకం

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే : ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేపట్టే అభివృద్ధి పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని తెదేపా మండల కన్వీనర్ బలరామిరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు కొండాపురం వాణి అన్నారు. వెలుగు కార్యాలయంలో శనివారం సాధికార మిత్రలకు జరిగిన శిక్షణ సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని బొమ్మనహాళ్, శ్రీధరఘట్ట, ఉప్పరహాళ్, శింగానహల్లి, గోనేహాళ్ తదితర గ్రామాలకు చెందిన సాధికార మిత్రలకు శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల బలోపేతానికి సాధికార మిత్రలు కృషి చేయాలన్నారు. సంఘాల సభ్యులకు ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం విరివిగా రుణాలు మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రియాజ్, మాజీ మండల కన్వీనర్ జగన్నాథ్‌రెడ్డి, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కావాలి

రాయదుర్గం, న్యూస్‌టుడే : అనంతపురం జిల్లాలో ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారికి ప్రాణదాతలు కావాలని రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ రామకృష్ణ అన్నారు. పట్టణంలోని ఎన్‌జీవో హోంలో శనివారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. పట్టణంలోని 200ల దాకా రాయల్, కె.టి.ఎస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు, రక్తదాతలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయదుర్గంలో ఎక్కువ సంఖ్యలో రక్తదానం చేయటానికి ముందుకురావటం హర్షణీయమన్నారు. జిల్లాలో నీటికి కరవు ఉన్నా రక్తదాతలకు కరవు లేదని ఆర్డీటీ డైరక్టర్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ ఛైర్మన్ సిరప్ప అన్నారు. రెండ్ క్రాస్ సొసైటీ రాయదుర్గం కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఎన్‌జీవో సంఘం కార్యదర్శి కె.సత్యనారాయణలు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో యువత చురుకుగా పాల్గొనటం హర్షణీయమన్నారు. రక్తదాతలకు మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గ సభ్యులు అమర్‌నాథ్‌రెడ్డి, ఆ సంఘం కార్యవర్గ సభ్యులు నాగన్న, జన విజ్ఞాన వేదిక నాయకులు ఈరన్న, మనోహర్‌లు సర్టిఫికెట్‌లు అందించారు. రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ ఛైర్మన్ రామకృష్ణ, మెడికల్ ఆఫీసర్ రామాంజనేయులు, బాలరాజు, వేణుగోపాల్‌రెడ్డి, ఇబ్రహీం, లోకేష్, సురేష్, నగేష్, మాంతేష్‌లు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువతీ, యువకులు

క్లబ్ భవనానికి స్థలం కేటాయించరూ..

రాయదుర్గం, న్యూస్‌టుడే : నియోజకవర్గంలో విస్తృత సేవా కార్యక్రమాలను అమలు పరుస్తున్న లయన్స్ క్లబ్ కార్యాలయ నిర్మాణానికి అయిదు సెంట్ల స్థలాన్ని కేటాయించాలని లయన్స్ క్లబ్ కార్యదర్శి అబ్దుల్ కాలిక్, కోశాధికారి సత్యనారాయణ, వి.అంబోజీరావ్, తహసీల్దారు నాగరాజుకు శనివారం విజ్ఞప్తి చేశారు. పట్టణ శివారులో ప్రేమ సన్నిధి స్వచ్ఛంద సంస్థకు కేటాయించిన స్థలం వద్ద ఉన్న స్థలాన్ని తమకు కేటాయించాలన్నారు. స్థలాన్ని పరిశీలించి న్యాయం చేస్తానని తహసీల్దారు హామీ ఇచ్చారు.

పరిష్కారాలే లేవు.. తిరిగి దరఖాస్తులా..?

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : గతంలో జరిగిన నాలుగు జన్మభూమి సభల్లో ఇచ్చిన దరఖాస్తులకు ఇప్పటి వరకూ పరిష్కారాలు చూపలేదని.. తిరిగి దరఖాస్తులు తీసుకునేందుకు జన్మభూమి - మా ఊరు నిర్వహిస్తుండటం హాస్యాస్పదంగా ఉందని సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడు సంజీవప్ప విమర్శించారు. శనివారం పట్టణంలోని బంగి ఎర్రిస్వామి మెమోరియల్ భవనంలో సీపీఐ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవప్ప మాట్లాడుతూ గత నాలుగు విడతల జన్మభూమి సభల్లో అపరిష్కృతంగా ఉన్న దరఖాస్తులే 1.47 లక్షలు ఉన్నాయని, తిరిగి దరఖాస్తులు తీసుకునేందుకు వచ్చే అధికారులు, ప్రజా ప్రతినిధులను నిలదీయాలన్నారు. పింఛన్లు, ఇంటి స్థలాలు, పక్కా ఇళ్లు, బియ్యం కార్డులు, రుణ మాఫీ, పంట నష్ట పరిహారాలు ఇలా చెప్పుకొంటు పోతే అనేక సమస్యలను పరిష్కరించాలని ఇచ్చినా నేటికీ సమస్యలకు పరిష్కారాలు చూపలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమస్యలు పరిష్కరించకపోతే గ్రామాల్లో ప్రజలే తిరగబడతారన్నారు. రుణమాఫీ అనంతపురంలో పెట్టడం దారుణమని కళ్యాణదుర్గం డివిజన్ కార్యాలయంలోనే ఏర్పాటు చేయాలని, గడువు మరింత పెంచాలని డిమాండ్ చేశారు. కూరగాయల మార్కెట్‌కు మరొక స్థలం చూపించి, మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ తాలూకా సహాయ కార్యదర్శి మహదేవ, కార్యవర్గ సభ్యులు తిరుపాలు, అశ్వర్థ, నాగరాజు నాయక్, సీపీఐ నాయకులు శీనా, బాబు, మురళి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రాయదుర్గం, న్యూస్‌టుడే : తెలుగుదేశం పార్టీ నియోజకవర్గంలో అమలు పరుస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజాదరణ పొందాలని మంత్రి కాలవ శ్రీనివాసులు కుమారుడు, తెలుగు యువత నాయకుడు కాలవ భరత్ తెదేపా కార్యకర్తలకు సూచించారు. శనివారం పట్టణంలోని మంత్రి నివాసంలో పట్టణ తెదేపా అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసనసభ ఎన్నికలు ఏడాది మాత్రమే ఉన్న తరుణంలో పట్టణంలో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. ప్రతిపక్షాల విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. ఈ సందర్భంగా సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్‌ను కాలవ భరత్ బాధితులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు రాజేష్ సామాజిక మాధ్యమాలకు సంబంధించిన విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు హనుమంతు, పురుషోత్తం, మురళి, వెంకటస్వామినాయుడు, లోకేష్, కోదండ, రామకృష్ణ, హరికృష్ణ, రామాంజనేయులు తెలుగు యువత కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాలవ భరత్

తగ్గిన నేరాల సంఖ్య

పెరిగిన రహదారి ప్రమాదాలు

కణేకల్లు, న్యూస్‌టుడే : మండలంలో 2016 ఏడాది కంటే 2017లో నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు. గత ఏడాది మొత్తం 140 కేసులు నమోదవగా ఈ ఏడాది 132 కేసులు నమోదైనట్లు చెప్పారు. గత ఏడాది కంటే నేరాల సంఖ్య తగ్గినా, క్రిమినల్ హత్య, రహదారి వంటి ప్రమాదాల కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. ఇందులో క్రిమినల్ కేసులు గత ఏడాది కంటే 63 నమోదైతే ఈ ఏడాది 73 కేసులు నమోదైనట్లు తెలిపారు. హత్యా కేసులు 2, నేరాలు 2, అత్యాచారం 3, చోరీలు 5, రహదారి ప్రమాదాలు గత ఏడాది 14 జరగ్గా.. ఈ ఏడాది 18 ప్రమాదాలు జరిగినట్లు వివరించారు.

రాప్తాడు

భక్తిశ్రద్ధలతో శనిత్రయోదశి పూజలు

శారదానగర్, న్యూస్‌టుడే: శనిత్రయోదశి పురస్కరించుకుని నగరంలోని పలు ఆలయాల్లో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయాల్లోని శనీశ్వరుడికి అభిషేకాలు, అలంకరణ చేశారు. శివకోటి ఆలయంలో శనైశ్చరస్వామికి తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నవగ్రహ కన్యా పాశుపతహోమం చేశారు. కార్యక్రమంలో ఆలయప్రధాన అర్చకులు సుబ్బయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావానికి మారుపేరు

రామగిరి, న్యూస్‌టుడే: వృత్తిపట్ల అంకితభావంతో పనిచేసి, పౌర సేవలు అందించిన వ్యక్తి రామ్మూర్తి అని తహసీల్దార్ ఆదినారాయణ కొనియాడారు. శనివారం మండల కేంద్రంలోని కార్మిక భవనంలో రామగిరి సీఎస్ డీటీగా పదవీ విరమణ పొందిన రామ్మూర్తిని సత్కరించారు. పలువురు మాట్లాడుతూ, రామ్మూర్తి సేవలు మరువలేనివని... ఎవరికీ ఏ ఇబ్బంది లేకుండా తన పని తాను చేసుకుంటూనే.. ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. అనంతరం రామ్మూర్తి దంపతులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డీటీ నాగరాజు, ఆర్ఐ ప్రభంజన్ రెడ్డి, వీఆర్వోలు నరసింహులు, రామాంజనేయులు, కేశవ, ముత్యాలప్ప, డీలర్లు చిత్తరంజన్, శ్రీరాములు, చంద్రప్ప, రామలింగ తదితరులు పాల్గొన్నారు.


రామ్మూర్తిని సన్మానిస్తున్న అధికారులు

సాంకేతికమైన విద్య!

◆ పేద పిల్లలకు అందని ఫలం ◆ బోధకులు లేక దక్కని నైపుణ్యం ◆ పట్టించుకోని విద్యాశాఖ అధికారులు


ఆత్మకూరులో మూలనపడిన కంప్యూటర్లు

న్యూస్‌టుడే, ఆత్మకూరు

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను అన్ని విధాలుగా తీర్చిదిద్దాలనేది సర్కారు సంకల్పం. అందుకే... విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించేందుకు రూ.లక్షలు వెచ్చించి పాఠశాలలకు కంప్యూటర్లను అందజేసింది. కానీ... వీటి ద్వారా నైపుణ్యాలను, మెలకువలను దరి చేర్చేందుకు బోధకులను నియమించ లేదు. దీంతో పాఠశాలల్లో ఉన్న కంప్యూటర్లు కాస్తా దుమ్ము పట్టి భవిష్యత్తులో ఎందుకూ పనికి రాకుండా తయారవుతున్నాయి. ఇలాగైతే... సాంకేతిక పరిజ్ఞానంతో పరుగులు తీస్తున్న ప్రైవేటు పాఠశాలల జోష్‌ను ప్రభుత్వ పాఠశాలలు అందుకునేదెన్నడు? అద్భుత ఫలితాలు సాధించేదెన్నడో అధికారులే చెప్పాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పిల్లలను మేటిగా నిలిపేలా చొరవ చూపాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

మూలనపడిన కంప్యూటర్లు...

కంప్యూటర్ విద్యను బోధించే వారిని తొలగించడంతో చాలా పాఠశాలల్లో కంప్యూటర్లు మూలనపడ్డాయి. ఒక్కొక్క పాఠశాలకు దాదాపు రూ.2 లక్షలు వెచ్చించి కంప్యూటర్ బల్లలు, సామగ్రి, ప్రింటర్లు సరఫరా చేశారు. వారానికి మూడు తరగతులు నిర్వహించేందుకు సరిపడా పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమం ప్రారంభించిన మొదటి సంవత్సరం సాంకేతిక విద్యతోపాటు కంప్యూటర్ విద్యను విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందించారు. తర్వాత కంప్యూటర్ ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వకపోవడంతో వారు ఉద్యోగాలు మానేశారు. దీంతో కంప్యూటర్ విద్య అటకెక్కింది. రాష్ట్రంలో ఎన్నో పథకాలను ప్రారంభిస్తున్నా మూలన పడిన సాంకేతిక విద్య గురించి ఆలోచించడం లేదు.

ఆశలు అడియాశలేనా?...

మండలంలోని తలుపూరు, ఆత్మకూరు, ముట్టాల, సనప, తోపుదుర్తి ఉన్నత పాఠశాలలకు గతంలో కంప్యూటర్లను అందజేసింది. ఆయా పాఠశాలల్లో అనుకూలత మేరకు జనరేటర్లు కూడా పంపిణీ చేశారు.

నివేదన


నిరుపయోగంగా జనరేటర్

కార్యక్రమం ప్రారంభంలో జిల్లాలో కేవలం 50 పాఠశాలలకు మాత్రమే ఎన్ఐఐఎస్ ద్వారా అనుమతులు మంజూరు చేసి విజయం సాధించారు. అయితే అన్ని పాఠశాలల్లోనూ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం ఓ సంస్థకు అప్పజెప్పింది. అంతే సంస్థ ఒప్పంద కాలం పూర్తి కావడం, పునరుద్ధరణపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో పాఠశాలలో కంప్యూటర్ విద్య కలగానే మారింది. అసలు కొన్ని చోట్ల ప్రభుత్వం ఇచ్చిన కంప్యూటర్లు ఉన్నాయా లేవా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. కనీసం వచ్చే విద్యా సంవత్సరం నాటికైనా కంప్యూటర్ విద్య అందుబాటులోకి తేవాలని పిల్లలు, తల్లిదండ్రులు అభిలషిస్తున్నారు.

కంప్యూటర్ నేర్చుకోవాలనుంది



కంప్యూటర్ నేర్చుకోవాలని చాలా ఆసక్తిగా ఉంది. మా పాఠశాలలో కంప్యూటర్లు ఉన్నా నేర్పించడానికి బోధకులు లేరు. దీంతో అవి పూర్తిగా దుమ్ము పట్టాయి. గతంలో ప్రధానోపాధ్యాయులు రూ.వేల సొమ్ము సొంతంగా వెచ్చించి మరమ్మతులు చేయించినా ఫలితం లేదు. ప్రైవేటు కేంద్రాలకు వెళ్లి నేర్చుకుందామంటే అంత సమయం, స్తోమత లేదు. - **వేణు, తలుపూరు**

మేమే ప్రయత్నిస్తున్నాం



గతంలో కంప్యూటర్ బోధించడానికి బోధకుడు ఉండేవారు. కంప్యూటర్ గురించి కాస్తో కూస్తో నేర్పించారు. ఇప్పుడు లేకపోవడంతో చేసేది లేక ఉపాధ్యాయులు సూచనల మేరకు మేమే కంప్యూటర్ ఓపెన్ చేసి నేర్చుకుంటున్నాం. అయితే ఉన్న కంప్యూటర్లు కొద్ది నెలల కిందట పాడయ్యాయి. మాకు కంప్యూటర్ విద్య అందుతున్న నమ్మకం కోల్పోతున్నాం. - **షహేర, ఆత్మకూరు**

ఉన్నతాధికారులకు నివేదించాం



కొన్నేళ్ల కిందట పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను బోధించే ఉపాధ్యాయులను తొలగించారు. అప్పటి నుంచి పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేరు. ఈ సమస్యను పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా ఎలాంటి ప్రయోజనం లేదు. యువకులు, పూర్వ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల వారు ఎవరైనా ముందుకు వస్తే పిల్లలకు మేలు జరుగుతుంది. - **నరసింహారెడ్డి, ఎంఈవో**

వితంతు పింఛన్లు మంజూరు చేయాలి


ధర్నా చేస్తున్న వైకాపా నాయకులు

ఆత్మకూరు (రాప్తాడు) న్యూస్‌టుడే: అర్హులైన వితంతువులు అందరికీ పింఛన్ పంపిణీ చేయాలని వైకాపా నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఎంపీడీవో కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేశారు. మండలంలో అనేక మంది వితంతువులు పింఛన్ రాక తల్లడిల్లుతున్నారని అన్నారు. తెదేపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వృద్ధాప్య పింఛన్ ఆ పార్టీ వారికే ఇవ్వడం తగదని అన్నారు. వృద్ధాప్య పింఛన్ కన్నా ముందుగా వితంతు పింఛన్ అందజేయాలని డిమాండ్ చేశారు. పలుమార్లు అధికారులకు దరఖాస్తులు ఇస్తున్నా వారు పట్టించుకోవడం లేదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందిస్తున్నామని చెబుతున్నా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అందరికీ న్యాయం చేయాలని కోరారు. నాయకులు రామాంజనేయులు, వైకాపా కార్యకర్తలు పాల్గొన్నారు.

వీధిదీపాలను ఏర్పాటు చేయరూ


నిరసన తెలుపుతున్న నాయకులు

సనప (ఆత్మకూరు) న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామాల్లో వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు స్పందించి వీధి దీపాలను ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి రామకృష్ణ కోరారు. మండలంలోని సనప గ్రామంలో శనివారం విద్యుత్తు స్తంభాలకు కాగడాలను వెలిగించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. గ్రామీణులు చీకటి పడ్డాక బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గ్రామాల్లో మురుగు రహదారుల మీదు పారుతున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. ప్రజాసమస్యలపై అధికారులు స్పందించకుండా నిర్లక్ష్యం వహించడం తగదని అన్నారు. త్వరలో నిర్వహించే జన్మభూమి కార్యక్రమంలోపు గ్రామాలలోని సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ప్రతి రైతుకు ప్రభుత్వం రుణమాఫీ ఫలాలు అందేలా చూడాలని.. లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తామని అన్నారు. ప్రతినిధులు మల్లికార్జున, వెంకటరాముడు, ఓబుళేసు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానాల అభివృద్ధికి కృషి

గొరిదిండ్ల (ఆత్మకూరు), న్యూస్‌టుడే: మండలంలోని గొరిదిండ్లలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన శ్మశాన వాటిక అభివృద్ధి పనులను అధికారులు పరిశీలించారు. గ్రామంలోని శ్మశాన వాటికను రూ.6 లక్షలు వెచ్చించి పూర్తి స్థాయిలో బాగు చేస్తున్నట్లు అధికారిణి సంగీత తెలిపారు. శ్మశాన వాటికలు అత్యంత దుర్భరంగా ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆమె చెప్పారు. ఇప్పటికే మండలంలోని బి.యాలేరు, గొరిదిండ్లలో శ్మశాన వాటికలను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు.


నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

విద్యార్థుల సమస్యలపై స్పందించండి

పంపనూరుతండా (ఆత్మకూరు): పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలకు వస్తుంటారు.. వారిని ఉన్నతంగా తీర్చిదిద్దడానికి విద్యా సమస్యలపై ఉపాధ్యాయులు స్పందించాలని ఎంఈవో నరసింహారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పంపనూరు తండాలోని ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన పరిశీలించారు. దేశ భవిష్యత్తుని మార్చే వ్యక్తులను తయారు చేయవలసిన బాధ్యత ఉపాధ్యాయులదే అనీ.. ఇందుకు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. పాఠశాలకు సరైన సమయంలో రావడమే కాకుండా విధులు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. పాఠశాలకు ఉపాధ్యాయులు వచ్చాక సమయాన్ని వృథా చేయకుండా విద్యార్థులకు పాఠాలను బోధించాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని నాణ్యంగా విద్యార్థులకు అందించాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థిని సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో

మద్యం గొలుసు దుకాణంపై దాడి

రామగిరి, న్యూస్‌టుడే: మండలంలోని నసనకోటలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న గొలుసు దుకాణంపై శనివారం రామగిరి పోలీసులు దాడులు నిర్వహించారు. నిర్వాహకుడు పోతన్నను అదుపులోకి తీసుకొని, ఆయన వద్ద నుంచి 18 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి నిర్వాహకుడిని కోర్టుకు పంపుతామని చెప్పారు.

సంక్షేమానికి వారధిగా ఉండాలి

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా సాధికార మిత్రులు పనిచేయాలని ఏపీఎం నాగేంద్ర పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సాధికార మిత్రలకు ఇస్తున్న శిక్షణ శనివారం ముగిసింది. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడటమే సాధికార మిత్ర కర్తవ్యమని అన్నారు. ప్రతి 35 కుటుంబాలకు ఒక సాధికార మిత్రను ఎంపిక చేశామన్నారు. మొత్తం మండలంలోని 14 పంచాయతీలకు 410మంది సాధికార మిత్రలను ఎంపిక చేసి వారికి ఈ నెల 27 నుంచి 30వరకు శిక్షణ ఇచ్చామన్నారు.

జన్మభూమి- మాఊరు

విజయవంతం చేయండి


రామగిరి: సమీక్షకు హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

రామగిరి, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది జనవరి 2 నుంచి నిర్వహించనున్న జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ పరంధామయాదవ్ తెలిపారు. శనివారం రామగిరి తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ నిర్వహించిన వీసీలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశమై జన్మభూమి కార్యక్రమం షెడ్యూల్‌ను సిద్ధంచేశారు. ఎంపీపీ మాట్లాడుతూ, క్షేత్రస్థాయి నుంచి మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ, గ్రామాల వారీగా నిర్వహించే జన్మభూమి- మాఊరు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే సభలు, సాంస్కృతిక కార్యక్రమాల గురించి సమావేశంలో వివరించారు. ఎంపీడీవో పూల నరసింహులు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జనార్దన, ఇరిగేషన్ ఏఈ రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజరు లీలావతి, ఏపీవో సుజాత, రామగిరి ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయిని ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

✦ **కార్యక్రమాలు ఇలా...:** జనవరి 2న గంతిమర్రి, 3న కుంటిమద్ది, 4న పోలేపల్లి, 5న నసనకోట, 6న మాదాపురం, 8న ఎం.సీ పల్లి, 9న పేరూరు, 10న కొండాపురం, 11న రామగిరి పంచాయతీలో జన్మభూమి మా ఊరు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

✦ **ఆత్మకూరు:** జనవరి 2 నుంచి జన్మభూమి-మాఊరు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆదినారాయణ తెలిపారు. 2న పి.సిద్ధరాంపురం, పి.యాలేరు, 3న ఆత్మకూరు, 4న సింగంపల్లి, పంపనూరు, 5న గొరిదిండ్ల, ముట్టాల, 6న వేపచెర్ల, తోపుదుర్తి, 8న సనప, రంగంపేట, 9న మదిగుబ్బ, 10న తలుపూరు, వడ్డుపల్లి, 11న బి.యాలేరులో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

✦ **రాప్తాడు:** జనవరి రెండు నుంచి నిర్వహించబోయే జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసులు పేర్కొన్నారు. 2న భోగినేపల్లి, పాలచెర్ల, 3న గాండ్లపర్తి, కొత్తపల్లి, 4న బుక్కచెర్ల, బొమ్మేపర్తి, 5న పుల్లలరేవు, గొందిరెడ్డిపల్లి, 6న గొళ్లపల్లి, హంపాపురం, 7న రాప్తాడు, 8న చెర్లోపల్లి, మరూరు, 9న బండమీదపల్లి, ఎర్రగుంట, 10న ప్రసన్నాయపల్లి, 11న రాప్తాడులో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పరిమితికి మించితే చర్యలు


ఆటోడ్రైవర్లకు సూచనలు ఇస్తున్న ఎస్సై

రామగిరి, న్యూస్‌టుడే: పరిమితికి మించి సామర్థ్యంతో వెళ్లే ఆటోలపై చర్యలు తప్పవని రామగిరి ఎస్సై విజయ్‌కుమార్ హెచ్చరించారు. శనివారం మండలంలోని ఆటోడ్రైవర్లకు రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ, రహదారి భద్రత కోసం రూపొందించిన పంచ సూత్రాలు పక్కాగా పాటించాలన్నారు. ఆటో చోదకులకు చోదక అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆటోలకు ధ్రువపత్రాలు ఉండాలన్నారు. రహదారికి అడ్డంగా ఆటోలు ఆపి ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. చరవాణిలో మాట్లాడుతూ వాహనం నడిపితే ప్రమాదాలు తథ్యమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు, జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ మోహన్‌నాయక్, కానిస్టేబుళ్లు చంద్ర, మురళి, నాగర్జున పాల్గొన్నారు.

ఏఐఎం జిల్లా ఇన్‌ఛార్జి ఎన్నిక

అనంత గ్రామీణం (తపోవనం), న్యూస్‌టుడే: అంబేడ్కర్ ఇండియా మిషన్ జిల్లా బాధ్యులుగా నాగమునెయ్యను ఎన్నుకున్నారు. శనివారం ఎన్‌జీఓ హోమ్‌లో ఏఐఎం సభ్యుల సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సమన్వయకర్తగా రామాంజనేయులు, ఉద్యోగుల విభాగం సమన్వయకర్తగా పుండరీకాక్ష, న్యాయవాదుల సమన్వయ కర్తలుగా రంగనాయకులు, ఆంజనేయులను నియమించారు.

అభివృద్ధిలో భాగస్వాములుకండి


మంత్రితో మాట్లాడుతున్న వైకాపా నాయకులు

రామగిరి, న్యూస్‌టుడే: తెలుగుదేశం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలని మంత్రి పరిటాల సునీత పిలుపునిచ్చారు. అనంత గ్రామీణ మండలానికి చెందిన వైకాపా నాయకుడు ధనుంజయ్‌యాదవ్ పలువురితో కలసి శనివారం వెంకటాపురం విచ్చేసి మంత్రి సునీతను, పరిటాల శ్రీరామ్‌ను కలిశారు. మంత్రి సునీత గ్రామీణ మండలంలోని తెదేపా నాయకులు, ధనుంజయ్‌యాదవ్‌తో కలసి చర్చించారు. త్వరలోనే అధికారంగా తెదేపా తీర్థం పుచ్చుకుంటామని తెలిపిన ధనుంజయ్‌యాదవ్‌తో మంత్రి మాట్లాడుతూ, పార్టీల కోసం హత్యలు, గొడవలకు దిగితే.. ఇరు కుటుంబాలు నష్టపోతాయన్నారు. భవిత అంధకారం అవుతుందనీ.. ఎటువంటి పరిస్థితుల్లోనూ వాటి జోలికి వెళ్లవద్దని మంత్రి వారికి సూచించారు. అందరూ కలసి కట్టుగా పనిచేసి పార్టీ బలోపేతానికి, అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో పరిటాల మహేంద్ర, అనంతపురం గ్రామీణ మండల తెదేపా నాయకులు పలువురు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న వైద్యాధికారిణి

ఆసుపత్రి ప్రసవంతో శ్రేయస్కరం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆసుపత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు క్షేమమని వైద్యాధికారిణి పంకజాక్షి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో శనివారం వైద్య సిబ్బందికి ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రసవించిన వారికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాన్ని అందిస్తున్న విషయాన్ని వైద్య సిబ్బంది ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కాన్పు సమయంలో మహిళలు 108 వాహనం ద్వారా ఆసుపత్రికి చేరుకోవాలన్నారు. ప్రసవం అనంతరం ఉచితంగా బేబీ కిట్లను అందజేస్తామన్నారు. ముఖ్యంగా ప్రభుత్వాసుపత్రిలో కాన్పు అయిన వెంటనే బిడ్డ జనన ధ్రువీకరణ పత్రాన్ని పొందడం గురించి అవగాహన చేపట్టాలని సూచించారు. బాలింతలను తిరిగి ఇంటికి పంపడానికి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉపకరిస్తుందని అన్నారు. హైరిస్క్ ఉన్న గర్భిణులను గుర్తించి వారికి ప్రత్యేక పరీక్షలు నిర్వహించి, వైద్యాన్ని పూర్తిగా ఉచితంగా అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న సేవలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి వారిని చైతన్యవంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఎంపీహెచ్‌ఈవో నాగేశ్వరయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి తోడ్పడాలి

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆర్యవైశ్య మహిళలు సేవా కార్యక్రమాలు విరివిగా నిర్వహించి సమాజాభివృద్ధికి తోడ్పాటునందించాలని ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పాతూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరిగిన శ్రీనివాస కల్యాణాన్ని ఆయన తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా గుణం ఉన్న ఆడపడుచులు బయటి ప్రపంచానికి వచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సేవలతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం జేసీ దివాకర్‌రెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, కొత్తవూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మచ్చా నరసింహులు తదితరులకు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో పాతూరు ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు ముత్యాలరంగయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ధర్మకర్త నాగరత్నం, సాయినాథ గుప్తా, ఆర్యవైశ్య మహిళామండలి అధ్యక్షురాలు మేడా అరుణ, ప్రధాన కార్యదర్శి చల్లా స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.


కాలమానిని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: విద్యార్థులను దేశభవిష్యత్తును మార్చే ఆయుధంగా తీర్చిదిద్దాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో క్యాలెండర్లను, పదో తరగతి మాదిరి ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు. విద్యార్థులు సాధించిన విజయాలతోనే ఉపాధ్యాయులకు, పాఠశాలలకు గుర్తింపు వస్తుందని అన్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ఉపాధ్యాయులు వెలికి తీయాలన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నిలపాలని కోరారు. వచ్చే పదో తరగతి పరీక్షలల్లో సత్ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక మాదిరి ప్రశ్నపత్రాల పుస్తకాన్ని విడుదల చేశామని వారు చెప్పారు. సి, డి గ్రేడు విద్యార్థులు కేవలం ఈ పుస్తకాలలో ఉన్న సమాచారాన్ని తెలుసుకోవడం ద్వారా ఉత్తీర్ణులు అయ్యే వీలుందన్నారు. ముఖ్యంగా కేవలం 2, 3 మార్కులతో ఉత్తీర్ణత కోల్పోతున్న విద్యార్థులకు చక్కగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఎంఈవో నరసింహారెడ్డి, యూటీఎఫ్ మండల కార్యదర్శి రామాంజనేయులు, జగన్నాథం, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

శింగనమల

చీనీ రైతులకు అవగాహన

తాడిపత్రి గ్రామీణం, న్యూస్‌టుడే: సస్యరక్షణ చర్యలు చేపడితేనే చీనీతోటలో అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యానశాఖ అధికారిని ఫజులున్నిసాబేగం చీనీ తోటల సాగు రైతులకు సూచించారు. స్థానిక ఉద్యానశాఖ కార్యాలయంలో శనివారం రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అనంతరం వెంకటరెడ్డిపల్లి ఆదర్శ రైతు రాజశేఖర్‌రెడ్డి తాను చీనీ తోట సాగులో అవలంభించే పద్ధతులపై రైతులకు అవగాహన కల్గించారు. కార్యక్రమంలో ఎంపీఈఓలు వేణుగోపాల్‌రెడ్డి, మనోహర్, తాడిపత్రి, పెద్దపప్పూరు, యాడికి మండలాల చీనీ తోటల రైతులు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

తాడిపత్రి గ్రామీణం, న్యూస్‌టుడే: రహస్యంగా చరవాణుల ద్వారా మట్కా నిర్వహిస్తున్న మట్కా కేంద్రంపై పట్టణ పోలీసులు దాడులు చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని హరిజనవాడలో పోలీసులు దాడులు చేసి ముగ్గురు నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు.

కష్టం సుఖం.. లాభం నష్టం

2017

● ఈ ఏడాది మిశ్రమ ఫలితాలు ● 2017లో అభివృద్ధికి పెద్ద పీట

శింగనమల, న్యూస్‌టుడే: కాలం గడుస్తోంది.. కాలమానిని మారుతోంది.. ఆంగ్ల నూతన సంవత్సరం రాబోతోంది.. ఈ ఏడాది కష్టసుఖాలు, లాభనష్టాలతో మిశ్రమ ఫలితాలు మిగిల్చింది. నియోజకవర్గ ప్రజలు కొంచెం ఇష్టం, కొంచెం కష్టంగా గడిపారు. పలు గుర్తులతో 2017 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. కొంగొత్త ఆశలతో 2018ని ఆహ్వానిస్తున్నారు. ఏడాది ప్రారంభంలో రైతులను ఊరించిన వరుణ దేవుడు చెరువులు, కుంటలను నీటితో నింపి, పొంగి పొర్లించాడు. అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారు. నాలుగేళ్లుగా హెచ్చెల్సీ నీటితో వరి, ఆరు తడి పంటలను పండించుకొనే రైతుకు ఈ ఏడాది ఆయకట్టు సాగుకు నీటి లభ్యత దొరికింది. అనంతపురం నుంచి అమరావతి వరకు వెళ్లే ఆరు వరుసల రోడ్డు నియోజకవర్గంలో పొరడంతో కొంత ఆశాజనకమైంది.



పదేళ్ల తర్వాత నిండిన శింగనమల చెరువు

సాగు.. సాకారం

వర్షాధారంపై ఆధారపడి జీవిస్తున్న అన్నదాతలకు వరుణుడు తోడై పంటలకు సాగునీరు, వర్షపు నీరు అందింది. ఆరేళ్లుగా దక్కని వేరుసెనగ పంట ఈ ఏడాది దక్కింది. వాగులు, వంకలు, చెరువులు నిండి భూగర్భ జలం పెరిగింది. చెరువుల్లోకి నీరు చేరడంతో నియోజకవర్గంలో పదేళ్ల కాలంగా సాగు కాని ఆయకట్టు భూములు సాగులోకి వచ్చాయి. ప్రధానంగా శింగనమల చెరువు నిండటంతో సుమారు ఐదు వేల ఎకరాల ఆయకట్టులో వరి పంట సాగు చేస్తున్నారు. బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, శింగనమలకు ఆరేళ్లుగా అందని హెచ్చెల్సీ నీరు ఈ సారి రావడంతో సుమారు 15వేల ఎకరాల్లో వరి సాగుచేశారు. పుట్లూరు, యల్లనూరు, శింగనమల మండలాల్లో 500 అడుగుల్లో దొరకని భూగర్భజలం ప్రస్తుతం 200 అడుగుల్లో లభిస్తోంది. ఫలితంగా ఈ ఏడాది అన్నదాతకు వ్యవసాయం పై మక్కువ కలిగేలా చేసింది.



గ్రామాల్లో నిర్మించిన చంద్రన్న బాటలు

అభివృద్ధి దిశగా అడుగులు

నియోజకవర్గంలో చంద్రన్న బాటలో భాగంగా సుమారు 65,547 మీటర్ల సీసీ రోడ్లు వేశారు. తాగునీటి సమస్య పరిష్కారానికి గార్లదిన్నె వద్ద రూ. 43 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు పనులు చేపట్టారు. ఎస్సీ కాలనీలు, గ్రామాలకు రూ. 11.46 కోట్లతో రోడ్డు వేశారు. నార్పలలో ఇండోర్ స్టేడియం, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేశారు. కొర్రపాడు వద్ద గురుకుల పాఠశాల నిర్మాణానికి రూ. 13 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. చెరువుల మరమ్మతులు, నీటి కుంటల నిర్మాణాలకు రూ. 12 కోట్లు ఖర్చుచేశారు. యల్లనూరు మండలంలో రూ. 1350 కోట్లతో గండికోట ఎత్తిపోతల పనులు, రూ. 118 కోట్లతో నిట్టూరు, బొప్పేల్లి, బుక్కాపురం చెరువు కట్ట పనులు చేపట్టారు.

విషాదం నింపిన ప్రమాదాలు

ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాల్లో ప్రయాణిస్తూ అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 42 మంది ప్రాణాలు కోల్పోయారు. గార్లదిన్నె మండలం కనుంపల్లి వద్ద ఒకే కుటుంబానికి చెందిన వారు నలుగురు మృతిచెందారు. బీకే సముద్రం మండలంలో ద్విచక్ర వాహనాల్లో ప్రమాదాలకు గురై సుమారు 12 మంది మృతిచెందారు. శింగనమల మండలం గుమ్మేపల్లి గ్రామంలో సెప్టెంబర్ 6న ముగ్గురు చిన్నారులు నీటిలో పడి మృతిచెందారు.



బీకే సముద్రంలో ప్రమాదం (పాత చిత్రం)

జనవరి 2 నుంచి జన్మభూమి- మా ఊరు

పుట్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని 23 గ్రామపంచాయతీల్లో జనవరి 2వ తేదీ నుంచి జన్మభూమి- మా ఊరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నేహమ్మ్యా పేర్కొన్నారు. జనవరి 2న ఎ.కొండాపురం, ఎస్.కొండేపల్లి, గాండ్లపాడు, 3న శణగలగూడూరు, అరకటవేముల, 4న సూరేపల్లి, దోసలేడు, 5న చెర్లోపల్లి, మడ్డిపల్లి, 6న చాలవేముల,కుమ్మనమల, రంగరాజుకుంట, 8న మడుగుపల్లి, జంగంరెడ్డిపేట, ఎల్లుట్ల, 9న కడవకల్లు, కందికాపుల, బాలాపురం, 10న సి.వెంగన్నపల్లి, తక్కళ్లపల్లి, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి, 11న పుట్లూరు గ్రామపంచాయతీల్లో జన్మభూమి- మన ఊరు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

బుక్కరాయసముద్రం మండలంలో..

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: మండలంలోని నీలంపల్లి గ్రామంలో జనవరి 2వ తేదీ నుంచి జన్మభూమి- మా ఊరు కార్యక్రమం ప్రారంభిస్తామని ఎంపీడీఓ ప్రదీప్ కుమార్ తెలిపారు. 2న నీలంపల్లి, జంతులూరు, 3న చెదుళ్ల, కొర్రపాడు, 4న చెన్నంపల్లి, బొమ్మలాటపల్లి 5న పసలూరు, సిద్దరాంపురం 6న దయ్యాలకుంటపల్లి, రెడ్డిపల్లి, 7న దండువారిపల్లి, గోవిందపల్లి 8న పొడరాళ్ల, వడియంపేట 9న అగ్రహారం, వెంకటాపురం, 10న రేగడికొత్తూరు, బాట్లోకొత్తపల్లి 11న బుక్కరాయసముద్రం గ్రామంలో జన్మభూమి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

గార్లదిన్నె మండలంలో..

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామాల్లో జనవరి 2 నుంచి 11వ తేదీ వరకు ఐదో విడత జన్మభూమి-మా ఊరు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్‌రెడ్డి శనివారం తెలిపారు. జనవరి 2న ఇల్లూరు, కల్లూరు, 3న కొప్పలకొండ, ముంటిమడుగు, 4న ఎంపీఆర్‌డ్యాం, పెనకచెర్ల, 5న కోటంక, మర్తాడు, 6న తిమ్మంపేట, గార్లదిన్నె, 7న కేశవాపురం, కామలాపురం, 8న యర్రగుంట్ల, ముకుందాపురం, 9న బూదేడు, క్రిష్టాపురం, 10న కనుంపల్లి, శిరివరం గ్రామ పంచాయతీల్లో జన్మభూమి సభలు జరుగుతాయని ఎంపీడీవో భాస్కర్ రెడ్డి వివరించారు.

నార్పల మండలంలో..

నార్పల గ్రామీణం: జన్మభూమి- మా ఊరు కార్యక్రమాలను విజయవంతం చేద్దామని ఎంపీడీఓ సాల్మన్‌రాజు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులందరూ జన్మభూమి- మా ఊరు కార్యక్రమాలకు సన్నద్ధం కావాలన్నారు. గత జన్మభూమిలో వచ్చిన అర్జీల పూర్తి వివరాల నివేదిక తయారు చేయాలన్నారు. జనవరి 2న నాయనపల్లి, వెంకటాంపల్లి, 3న నడిమిదొడ్డి, చామలూరు, 4న కేశేపల్లి, గడ్డంనాగేపల్లి, 5న గంగనపల్లి, బి.పప్పూరు, 6న రంగపురం, గూగూడు, 8న హెచ్.సోదనపల్లి, గుంజేపల్లి, 9న బండ్లపల్లి, సిద్దరాచెర్ల, 10 దుగుమర్రి, బొందలవాడ, 11 నార్పలలో గ్రామసభలు జరగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్‌బాబు, ఎస్సై శ్రీనివాసులు, ఎంఈఓ కిష్టయ్య, ఏపీఓ విమల, ఏపీఎం శ్రీనివాసులు, పంచాయతీ ఇంజినీరు శ్రీధర్‌శర్మ, నరసింహులు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆడపిల్లను బతకనిద్దాం.. ఎదగనిద్దాం

చుక్కలూరు(తాడిపత్రి గ్రామీణం): ఆడపిల్లను బతకనిద్దాం.. ఎదగనిద్దాం అని ఆరోగ్య విద్యా బోధకుడు మల్లయ్య పేర్కొన్నారు. మండలంలోని చుక్కలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆశ డే సందర్భంగా ఆశా కార్యకర్తలతో పీహెచ్‌సీ వైద్యాధికారి వేముల సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రంలో సూపర్‌వైజర్లు షబ్బీర్ అహమ్మద్, అబ్దుల్ రెహమాన్, సుమతీదేవి, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దస్తగిరి స్వామి ఉత్సవాలు



యల్లనూరులో అన్నదానం చేస్తున్న ముస్లిం సోదరులు

యల్లనూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని దస్తగిరి స్వామి ఉత్సవాలు శనివారంతో ముగిసినట్లు మతపెద్ద ఖాజీఖాదర్‌బాషా తెలిపారు. ఉదయం దస్తగిరి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. రెండు రోజుల పాటు ఆనందోత్సాహాల నడుమ జరుపుకొన్నారు. అనంతరం గ్యార్మీ పండుగ సందర్భంగా హాజరైన ప్రజలకు తహసీల్దారు కార్యాలయం వద్ద పెద్దఎత్తున ముస్లిం సోదరులు అన్నదాన వసతి ఏర్పాటు చేశారు.



శిక్షణకు హాజరైన సాధికార మిత్రలు

ఉత్సాహంగా.. యువజన వేడుక

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని వడియంపేట గ్రామంలో ఏర్పాటైన షిరిడీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ యువజనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాలలో చదువుతున్న ఇంజినీరింగ్ విద్యార్థులు జిల్లా స్థాయి, వర్సిటీ స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా విద్యార్థులను కళాశాల అధ్యాపకులు ప్రత్యేకంగా జ్ఞాపికలు అందించారు. అనంతరం విద్యార్థులు కళాశాలలో నాటికలు ప్రదర్శించి, సినీ గేయాలకు నృత్యాలు చేస్తూ ఆనందడోళికల్లో మునిగి తేలారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మోహన్ రెడ్డి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న ఇంజినీరింగ్ విద్యార్థినులు

ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలి

నార్పల గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా వ్యవహరించాలని ఏపీఎం శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో శనివారం సాధికార మిత్రలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సేవా భావం ఉన్న ప్రతి మహిళా తన కుటుంబంతో పాటు గ్రామంలోని మరో 35 కుటుంబాలకు మార్గదర్శనం చేసేలా సాధికారమిత్రలు ఉండాలన్నారు. శిక్షణను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని సమాజం అభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మునిరెడ్డి, నాగనంద తదితరులు పాల్గొన్నారు.

శింగనమల

వివాహానికి ఆర్థిక సాయం

శింగనమల, న్యూస్‌టుడే: శింగనమల జామియా మసీదు ఆధ్వర్యంలో ఓ నిరుపేద కుటుంబానికి వివాహానికి అవసరమైన సొమ్మును అదించినట్లు మసీదు ముతవల్లి బాషా తెలిపారు. స్థానిక మసీదులో శనివారం శింగనమలకు చెందిన సత్తార్ కుమార్తె వివాహానికి రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలోనే నిరుపేదగా జీవిస్తున్న సత్తార్‌కు మసీదు పెద్దలు, ముస్లిం సోదరుల నిర్ణయం మేరకు ఈ సొమ్మును ఆ కుటుంబానికి అందించినట్లు తెలిపారు.

సాధికారమిత్రలకు ప్రత్యేక శిక్షణ

యల్లనూరు, న్యూస్‌టుడే: ప్రతి సాధికారమిత్ర ఇంటి పరిసరాల్లోని 35 కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందేలా కృషిచేయాలని ఐకేపీ ఏపీఎం సాంబశివుడు పేర్కొన్నారు. స్త్రీశక్తి భవనంలో శనివారం సాధికారమిత్రలకు ప్రత్యేక శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. సాధికార మిత్రల విధులు, విధానాలు, చేయాల్సిన పనులను ఐకేపీ డీపీఎం గంగాధర వివరించారు.

చనిపోయిన వారి పేర్లతో పింఛను స్వాహా

● యూనిట్లు లేకుండానే వర్మీకంపోస్టు యార్డుల బిల్లులు ● సామాజిక తనిఖీ

యల్లనూరు, న్యూస్‌టుడే: యల్లనూరులో వర్మీకంపోస్టు యూనిట్లు లేకుండానే బిల్లులు డ్రా చేశారని అవినీతిపై ఎన్నిమార్లు అర్జీలు ఇచ్చినా ఫలితం లేదని ప్రజావేదికలో గ్రామ కమిటీ అధ్యక్షులు రామాంజనేయులు, రైతు గోవర్దన్ ధ్వజమెత్తారు. వారి ఆరోపణలు విన్న ప్రిసైడింగ్ అధికారి యల్లనూరు పంచాయతీలో మళ్లీ విచారణ చేయాలని అధికారులను ఆదేశించారు. చిలమకూరు పంచాయతీలో లక్ష్మన్న రెండు నెలలు, యల్లమ్మ మూడు నెలలు, బాలసుబ్బమ్మ రెండు నెలల కిందట మృతి చెందారు. పింఛన్ల డబ్బులు స్వాహా చేశారని సామాజిక తనిఖీ బృందం సభాముఖంగా తెలిపింది. శనివారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 10వ విడత బహిరంగ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. 2016 నవంబర్ 1 నుంచి 2017 సెప్టెంబర్ 30వ తేదీ వరకు జరిగిన పనులకు సామాజిక తనిఖీ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అదనపు ప్రాజెక్టు డైరెక్టరు రాజేంద్రప్రసాదు, చంద్రన్న బీమా డీపీఎం గంగాధర, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి షాహిద్, డీఆర్‌డీఏ పింఛను విభాగం నజీర్, తాడిపత్రి ఏపీడీ లావణ్యకుమారి, ఎంపీడీఓ విష్ణుప్రసాద్ హాజరయ్యారు. డీఆర్పీలు ప్రతి పంచాయతీలో ఎంత నిధులు ఖర్చుపెట్టారు.. క్షేత్రస్థాయిలో జరిగిన నివేదికలను తయారు చేసుకొని ప్రజావేదికలో అధికారుల సమక్షంలో చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి, ఏపీవో గంగరాజు, రాజ్యలక్ష్మి ఎస్సార్పీ రవి, డీఆర్పీలు, సాంకేతిక సహాయకులు శంకర్, జయరాం, చంద్రకళ, సూర్యనారాయణరెడ్డి, శివానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వర్మీకంపోస్టులో అవినీతిపై వివరిస్తున్న గ్రామ కమిటీ సభ్యులు



బాస్కెట్‌బాల్ విజేత జట్టు

క్రీడలతో ఆరోగ్యం

నార్పల గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పీడీ నగేష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మిల్కాసింగ్ క్రీడాపోటీలు శనివారం ఉత్సాహంగా సాగాయి. ఆయన మాట్లాడుతూ.. ఒత్తిడికి లోనై ప్రతి విద్యార్థి మానసిక అలసటకు గురవుతున్నారన్నారు. శనివారం హైజంప్, లాంగ్‌జప్, వందమీటర్లు, నాలుగు వందల మీటర్ల పరుగు పందెం, బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.

లక్ష్యాలను పూర్తిచేయాలి

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్క కారకర్త వారి లక్ష్యాలను నూటికి నూరు శాతం పూర్తిచేయాలని సీహెచ్‌ఓ నాగరాజు అన్నారు. మండల కేంద్రం గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శనివారం ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించాలని, ప్రసవాలు ఆసుపత్రుల్లో జరిగేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. వచ్చే నెలలో జరగబోయే జన్మభూమి గ్రామసభల గురించి వివరించారు. కార్యక్రమంలో కుష్ఠవ్యాధి నివారణ అధికారి డాక్టర్ ఇర్షాద్ అహమ్మద్, పీహెచ్‌ఎన్ సాయికుమారి, సూపర్‌వైజర్లు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీహెచ్‌వో నాగరాజు



తహసీల్దారు కార్యాలయం వద్ద పారుతున్న మురుగు

మురుగు.. దారిలో పరుగు

బీకేఎస్ మేజర్ పంచాయతీలో సహకార సొసైటీ కార్యాలయం ఎదుట మురుగు కాలువలో నీటిని ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రధాన రహదారిపైకి మళ్లించారు. దారిపై మురుగు పరుగు పెడుతుండటంతో గ్రామ ప్రజలు, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నార్పల క్రాస్ నుంచి అనంతపురం పట్టణం వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా తహసీల్దారు కార్యాలయం ఎదుట మురుగుకాల్వను అధికారులు వారం రోజులుగా మూసివేశారు. ఈ నీరంతా ప్రధాన రోడ్డుపైకి వదిలారు. వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం



కొనుగోలుకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న

మొక్కజొన్న కొనుగోలుకు గడువు పెంపు

కడవకల్లు(పుట్లూరు), న్యూస్‌టుడే: మండలంలోని కడవకల్లు గ్రామంలోని సహకార కేంద్రం నుంచి మొక్కజొన్న కొనుగోలు సాగుతోంది. కొనుగోలుకు శనివారం ఆఖరు రోజుగా ప్రకటించారు. రైతుల ఇబ్బందులపై 'గోడు వినండి... గడువు పెంచండి' శీర్షికన శనివారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన వ్యవసాయాధికారులు ధాన్యం కొనుగోలుకు గడువు పొడిగిస్తున్నట్లు తెలిపారు. మొక్కజొన్న కొనుగోలుకు సంక్రాంతి వరకు గడువు పెంచినట్లు వ్యవసాయాధికారి అన్వేష్‌కుమార్ పేర్కొన్నారు.

వ్యాధి నిరోధక టీకాపై అవగాహన

బి.పప్పూరు(నార్పల గ్రామీణం), న్యూస్‌టుడే: చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాను తప్పనిసరిగా వేయించాలని వైద్యురాలు శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మండల పరిధిలోని బి.పప్పూరులో శనివారం వ్యాధినిరోధక టీకాపై ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో టీకాపై అవగాహన కల్పించాలన్నారు. జన్మభూమి- మాఊరు కార్యక్రమాల్లో 35 ఏళ్లు దాటిన మహిళలకు ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ సుబ్రహ్మణ్యం, పీహెచ్‌ఎన్ సువార్తమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీరాములు, దీనాకుమారి, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టరు బోల్తా.. త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

రాయలచెరువు(యాడికి), న్యూస్‌టుడే: స్థానిక ఉన్నత పాఠశాల సమీపంలోని వంతెన పైనుంచి 20 అడుగుల లోతులో శనివారం ఓ ట్రాక్టరు పడిపోయి ధ్వంసమైంది. త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. అప్పేచెర్ల తిమ్మాపురం నుంచి రాయలచెరువు వైపు ఇటుకల లోడుతో వస్తున్న ట్రాక్టరు ప్రమాదవశాత్తు వంకలోకి పడిపోయింది. ఇటుకల లోడుపైన, డ్రైవరు పక్కన కూర్చున్న వారితో పాటు డ్రైవరు కూడా కిందపడిపోయారు. ట్రాక్టరు కింద పడకుండా పక్కకు పడిపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ట్రాక్టరులో ఉన్న డ్రైవరు వెంకటనాయుడుతో పాటు నారాయణస్వామి, సుంకన్న, సూరికి రక్తగాయాలయ్యాయి. ఘటనా స్థలం సమీపంలోనే ఉన్న రహదారి భద్రతా వాహన సిబ్బంది వెంటనే వారిని భద్రతా వాహనంలోనే గుత్తికి తరలించారు. క్షతగాత్రులకు అక్కడ చికిత్స అందిస్తున్నారు.



పెద్దన్నకు ఆర్థిక సాయం అందిస్తున్న వెంకటనాయుడు

అంధ విద్యార్థికి ఆర్థికసాయం

జంతులూరు(బుక్కరాయసముద్రం), న్యూస్‌టుడే: మండల పరిధిలోని జంతులూరు గ్రామానికి చెందిన రామకృష్ణ కుమారుడు పెద్దన్న అనే అంధ విద్యార్థికి ఓ ప్రవాస భారతీయుడు రూ.15 వేలు ఆర్థికసాయం అందించారు. డీఎస్సీ శిక్షణ నిమిత్తం అయ్యే ఖర్చులపై విదేశాల్లో బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తున్న తన మిత్రుడు వేణుబాబుకు విషయం తెలిపినట్లు వెంకటనాయుడు వివరించారు. శనివారం పెద్దన్నకు ఈ మొత్తం అందిస్తామన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న వెంకటనారాయణమ్మ

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజలు మరుగుదొడ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తిచేసేలా మండల అధికారులు చొరవ తీసుకోవాలని ప్రత్యేక ఉప కలెక్టర్ వెంకటనారాయణమ్మ ఆదేశాలు జారీచేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల ప్రభుత్వ అధికారులతో సమావేశమైన ఆమె గ్రామాలకు నియమించిన ప్రత్యేక అధికారులతో మరుగుదొడ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. మండల అధికారులు ప్రజలు మరుగుదొడ్ల నిర్మాణాలపై ఆసక్తి చూపడం లేదని ప్రత్యేక ఉప డిప్యూటీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రదీప్‌కుమార్, ఉప తహసీల్దారు సురేష్, ఏపీఓ ఆదినారాయణమ్మ, ఎంఈఓ గురుప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎస్టీయూ కాలమాన పట్టిక విడుదల

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: స్టేట్ టీచర్స్ యూనియన్ మండల కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాఘవేంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా నరసింహమూర్తి, ఆర్థిక కార్యదర్శిగా శ్రీనివాసులు, జిల్లా కౌన్సిలర్లుగా కె.చంద్రశేఖర్, డి.చంద్రశేఖర్, విశ్వనాథ్, మహిళా కన్వీనర్‌గా శ్రావణి, ఉపాధ్యక్షురాలిగా జరనీబేగం, కార్యదర్శులు, అసోసియేట్ అధ్యక్షులను ఎన్నుకున్నట్లు నాగభూషణ, డేనియల్ తెలిపారు. అనంతరం గార్లదిన్నె ఎమ్మార్సీ కార్యాలయంలో 2018 కాలమానపట్టికను, దైనందినిని మండల విద్యాధికారి తార చంద్రానాయక్ చేతుల మీదుగా విడుదల చేయించారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల నాయకులు పాల్గొన్నారు.



కాలమాన పట్టికను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, తదితరులు

తాడిపత్రి

మట్కా నిర్వాహకుల అరెస్టు

తాడిపత్రి గ్రామీణం, న్యూస్‌టుడే: రహస్యంగా చరవాణుల ద్వారా మట్కా నిర్వహిస్తున్న మట్కా కేంద్రంపై పట్టణ పోలీసులు దాడులు చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని హరిజనవాడలో పోలీసులు దాడులు చేసి ముగ్గురు నిర్వాహకులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.14,990 నగదు, మట్కా చీటీలు, చరవాణులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఆదివారం పన్ను చెల్లించవచ్చు

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే: ఆదివారం సెలవు రోజు అయినా పన్ను కట్టే సౌకర్యం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ తెలిపారు. 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నులు చెల్లించే గడువు నేటితో ముగుస్తుందని ఆయన తెలిపారు. ఆదివారం లోగా నీటి, ఇంటి పన్నులు చెల్లించాలన్నారు.

కళ్లుగప్పి.. కొల్లగొట్టి

● ఆలయ భూముల్లో అక్రమ తవ్వకాలు ● ఎర్రమట్టి తరలింపు.. పట్టించుకోని అధికారులు



నెలకొండరాయుడుకు పూజలు చేస్తున్న భక్తులు(పాత చిత్రం)

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: ఒకప్పుడు ఆలయభూములను కమిటీ సభ్యులు, ఆలయసిబ్బంది ఆధ్వర్యంలో కొందరు రైతులకు కౌలుకు ఇచ్చి ఆకౌలునుంచి వచ్చిన డబ్బుతో అర్చకుల వేతనాలు, ఆలయాల బాగోగులను చూసి ధూపదీప నైవేద్యాలను కొనసాగించేవారు. ప్రస్తుతం ఆపరిస్థితి మారింది కొందరు స్వార్థపరులు ఇక్కడి ఆలయ భూముల్లో యథేచ్ఛగా ఎర్రమట్టిని కొల్లగొడుతున్నా.. అధికారయంత్రాంగం చోద్యం చూస్తోంది.

భూములు నాశనం..

ప్రభుత్వం నుంచి పనులు పొందిన వ్యక్తులు ఇతర ప్రాంతాల నుంచి ఎర్రమట్టిని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇక్కడైతే కొనుగోలు లేకుండా ఉచితంగా వస్తోందని ఆలయ భూముల్లో తవ్వకాలు జరుపుతున్నారు. విలువైన ఆలయ భూములను కొల్లగొడుతున్నారు. పంచాయతీకి, ఆలయానికి సంబంధించి కొంత రుసుం చెల్లించి మట్టిని తీసుకెళ్లాల్సి ఉంటుంది, అవేమీ పట్టకుండా అడిగే వారు లేరని మట్టిని తరలించుకుని వెళ్తున్నారు. ఇదివరకు ఈ భూముల్లో రైతులు పలు పంటలను సాగుచేసి, కాస్తో కూస్తో దిగుబడులు పొంది ఆలయాల బాగోగులు చూసేవారు. ప్రస్తుతం ఆలయభూములు అన్యాక్రాంతం అవుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. ప్రస్తుతం ఎర్రమట్టిని తరలించుకెళ్లడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి భూములు ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. పనులు దక్కించుకున్న కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు పంచాయతీలకు ఎలాంటి పన్నులు చెల్లించకుండా యథేచ్ఛగా ఎర్రమట్టిని తరలించి ఆలయ ఆస్తులను కొల్లగొడుతున్నారు. ఆలయ భూములతో పాటు కొండలను కూడా వదిలిపెట్టడంలేదు. మండలంలోని అప్పేచెర్ల సమీపంలో నారేపల్లిగుట్ట వద్ద కొందరు అక్రమంగా ఎర్రమట్టిని తరలించారు.

గ్రామస్థుల చందాలతోనే ధూపదీపాలు

సమీపంలోని కొండల్లో వెలసిన నెలకొండరాయుడు పూజలు, అర్చనలు, నైవేద్యాలు చేయాలంటే ఆలయ కమిటీ సభ్యులు ఇతరులతో చందాలు వసూలు చేసి మరి చేయాల్సి వస్తోంది. స్వామికి 21 ఎకరాలు ఉన్నా కౌలునుంచి వచ్చిన సొమ్ముతో ఎప్పుడో ఒకప్పుడు పండుగలా చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి పోయింది, కనీసం ధూపదీపనైవేద్యాలు చేయాలన్నా ఇతరుల సాయం అడగాల్సిందే. మాన్యాలు ఉన్నా స్వామికి పూజలు కరవవుతున్నాయి. గ్రామస్థులే కొందరు ముందుకొచ్చి దాతల సాయం కోసం అర్థించాల్సివస్తోంది. మాన్యం భూములను అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నా.. ఏమీ పట్టనట్లు వ్యవహరించడంతో యథేచ్ఛగా మట్టిని తరలించుకెళ్తున్నారు.

● ఈ విషయంపై దేవదాయశాఖ ఏఈ నాగేంద్రరావుతో ప్రస్తావించగా.. ఎవరూ తమ అనుమతులు తీసుకెళ్లలేదని, ఆలయానికి కూడా ఎలాంటి పన్నులు కట్టలేదన్నారు. అప్పుడప్పుడు స్వామివారికి కొంతడబ్బును నైవేద్యాల కోసం ఇస్తుంటామన్నారు.



మట్టిపోగా రాళ్లు ఏర్పడ్డాయి

పంచాయతీకి పన్ను కట్టలేదు

పంచాయతీ పరిధిలో ఎర్రమట్టిని తరలించుకెళ్తున్నారని విషయం తెలియదు. తవ్వుకెళ్తున్నా పంచాయతీకి పన్నుల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. అలాంటివి చెల్లించలేదు. గడచిన ఆరేళ్లలో ఎవరూ పన్నుల రూపంలో చెల్లించలేదు.

- చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి



ఆలయ భూముల్లో తవ్వకాలు జరిపిన ప్రదేశం

పెద్దవడుగూరులోని నెలకొండరాయుడు సర్వేనెంబరు 777లో 21.04ఎకరాలు, సోమేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన సర్వే నెంబరు 778లో 11.54 ఎకరాల భూములు సుమారు 32ఎకరాలు ఉంది. వీటిలో కొంత భూమిని ఎస్సీలకు ఇవ్వగా.. మిగిలిన భూములను రైతులకు కౌలుకు ఇచ్చి వచ్చిన సొమ్ముతో ఆలయాల పునఃరుద్ధరణ పనులు చేపట్టేవారు. ఆ భూముల్లో కొందరు స్వార్థపరులు పాగావేసి విలువైన ఎర్రమట్టిని తరలిస్తున్నారు. పంచాయతీ, రెవెన్యూ అధికారుల అనుమతులు తీసుకోకుండా యథేచ్ఛగా మట్టిని తరలించి సొమ్ముచేసుకుంటున్నారు.

ఎవరూ అనుమతులు తీసుకోలేదు

పెద్దవడుగూరు సమీపంలో ఉన్న నెలకొండరాయుడు ఆలయభూముల్లో ఎర్రమట్టిని తరలించేందుకు ఎవరూ అనుమతులు తీసుకోలేదు. ఇలా తవ్వుకుంటున్నామని కూడా కనీసం ఎవరూ అడగలేదు. అప్పేచెర్ల సమీపంలో ఉన్న నారేపల్లి గుట్టలో కూడా తరలించుకెళ్తున్న ఎర్రమట్టి విషయంలోనూ ఎలాంటి అనుమతులు రాలేదు తాము ఎవరికి అనుమతులు ఇవ్వలేదు.

- విష్ణువర్ధన్‌రెడ్డి, తహసీల్దారు



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఛైర్మన్ గంగాధర్

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలని శ్రీవాణి విద్యా సంస్థల ఛైర్మన్ గంగాధర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక యల్లనూరు రోడ్డులోని శ్రీవాణి పాఠశాల విద్యార్థులు 23 మంది జాతీయ సైన్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబరిచారు. వారికి అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగేందుకు పోటీ పరీక్షలు ఎక్కువగా నిర్వహించాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. నేషనల్ సైన్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభ చూపి ద్వితీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు.

సాధికారమిత్రలకు ప్రత్యేక శిక్షణ

యల్లనూరు, న్యూస్‌టుడే: ప్రతి సాధికారమిత్ర ఇంటి పరిసరాల్లోని 35 కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందేలా కృషిచేయాలని ఐకేపీ ఏపీఎం సాంబశివుడు పేర్కొన్నారు. స్త్రీశక్తి భవనంలో శనివారం సాధికారమిత్రలకు ప్రత్యేక శిక్షణా తరగతులను ఏర్పాటు చేశారు. సాధికార మిత్రల విధులు, విధానాలు, చేయాల్సిన పనులను ఐకేపీ డీపీఎం గంగాధర వివరించారు.

దాతల సాయంతో విద్యాభివృద్ధి

తేరన్నపల్లి (తాడిపత్రి గ్రామీణం), న్యూస్‌టుడే: దాతల సాయంతో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ తెలిపారు. మండలంలోని తేరన్నపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో దాదాపు 20 మంది విద్యార్థులు చదువులో వెనుకబడ్డారని తెలిపారు. వీరికి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలనే ఉద్దేశంతో ఉదయం, సాయంత్రం ట్యూషన్ ఏర్పాటు చేశామన్నారు. నిర్వహణకు ప్రతి నెలా రూ.2,500 అవసరం అవుతుంది.

ఇదే గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు కిరణ్ దృష్టికి తీసుకెళ్లగా. . ఆయన సానుకూలంగా స్పందించారు. సంవత్సరం పొడవునా ప్రతి నెలా ట్యూషన్ నిర్వహణకు అయ్యే ఖర్చును తానే చెల్లిస్తానని చెప్పారు. ఇందులో భాగంగా శనివారం చెక్కును అందజేశారు.

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి

నరసాపురం(పెద్దపప్పూరు), న్యూస్‌టుడే: ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కుమ్మెత, నరసాపురం, పెండేకల్లు గ్రామాల్లో కొత్తగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాలను శనివారం ప్రారంభించారు. అర్హత ఉన్న వారినే అంగన్‌వాడీ కార్యకర్తలుగా నియమించాలని సీడీపీఓ శశికళకు సూచించారు. ప్రభుత్వం నుంచి అంగన్‌వాడీలకు అందుతున్న ప్రయోజనాలను పక్కాగా అందించాలన్నారు. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి పైసా ప్రజలదే అని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనేక పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని ప్రజలకు సూచించారు. గ్రామస్థులు స్వచ్ఛందంగా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఆరాతీసి వెంటనే పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ అనురాధ, తహసీల్దారు రమాదేవి, ఎస్సై ఆంజనేయులు, ఎంఈఓ మాధవ, ఎంపీపీ సుభద్రమ్మ, ఉప ఎంపీపీ శ్రీనివాసులునాయుడు, సర్పంచులు కేశవరెడ్డి, కుళ్లాయమ్మ, తెదేపా నాయకులు రామాంజనేయులురెడ్డి, లోకనాథరెడ్డి, నాగిరెడ్డి, రంగనాయకులు, సూర్యనారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి, చిదంబరి, వెంకటనారాయణరెడ్డి, హరి, తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే



జెండాలను ఊరేంగింపుగా తీసుకెళ్తున్న కాలనీవాసులు

కులమతాలకు అతీతంగా గ్యార్మీ వేడుకలు

తాడిపత్రి గ్రామీణం, న్యూస్‌టుడే: కుల మతాలకు అతీతంగా గ్యార్మీ వేడుకలను నిర్వహిస్తున్నట్లు కాలనీ వాసులు పేర్కొన్నారు. మండల పరిధిలోని రమేష్‌రెడ్డి కాలనీలో శనివారం గ్యార్మీ వేడుకలను కాలనీ వాసులంతా కలిసి ఘనంగా నిర్వహించుకున్నారు. 11 రోజుల పాటు ఖురాన్ చదివిన అనంతరం గంధం వేడుకలను నిర్వహించామన్నారు. శనివారం ప్రత్యేకంగా పూల మాలలతో అలంకరించి జెండాలను కాలనీ అంతా ఊరేంగించి, జెండాకట్ట వద్ద వాటిని ఉంచుతామని తెలిపారు. ఈ వేడుకల్లో గన్నెవారిపల్లి సర్పంచి చింబిలి వెంకటరమణ, చింబిలి ప్రసాద్‌నాయుడు, వైకాపా నాయకులు రమేష్‌రెడ్డి, మున్నా, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాపై అవగాహన

బి.పప్పూరు(నార్పల గ్రామీణం), న్యూస్‌టుడే: చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాను తప్పనిసరిగా వేయించాలని వైద్యురాలు శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. మండల పరిధిలోని బి.పప్పూరులో శనివారం వ్యాధినిరోధక టీకాపై ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో టీకాపై అవగాహన కల్పించాలన్నారు.

తాడిపత్రి

మాతాశిశుమరణాలు లేకుండా చూడాలి

క్రిష్టిపాడు(పెద్దవడుగూరు): గ్రామీణ ప్రాంతాల్లో మాతాశిశుమరణాలు లేకుండా ప్రతి కార్యకర్త చొరవ తీసుకోవాలని క్రిష్టిపాడు ఆరోగ్యకేంద్రం సూపర్‌వైజరు విజయకుమారి పేర్కొన్నారు. క్రిష్టిపాడు ఆసుపత్రి ప్రాంగణంలో శనివారం ఆశ దినోత్సవానికి ఆసుపత్రి పరిధిలోని కార్యకర్తలతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జనవరి 2నుంచి జన్మభూమి- మా ఊరు

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం నిర్వహించే జన్మభూమి-మా ఊరు కార్యక్రమాలు జనవరి 2 నుంచి 8వ తేది వరకు జరుగుతాయని పురపాలక కమిషనర్ శివరామకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని ఆయా వార్డులల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పింఛను, ఇళ్లు, రేషన్‌కార్డు ఇంకా పలు సమస్యలతో బాధపడుతున్న వారు ఇందులో అర్జీ ఇవ్వాలని ఆయన తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

కాలమాన పట్టికల ఆవిష్కరణ



పెద్దపప్పూరు: కాలమాన పట్టికను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరంలో పేద విద్యార్థులకు చేయూత అందించాలని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఏపీటీఎఫ్‌కు చెందిన 2018 క్యాలెండర్, డైరీని శనివారం ఎమ్మెల్యే నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రఘురామిరెడ్డి, రవీంద్రారెడ్డి, డేనియల్, రామాంజినేయులు, ఓబయ్య, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మండలకేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం ఎంఈవో మాధవ చేతుల మీదుగా యూటీఎఫ్ నూతన కాలమాన పట్టికను ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురామయ్య, నాయకులు మధుప్రసాద్, నారాయణస్వామి, మహబూబ్‌బాష, లక్ష్మీనారాయణ, గ్రంథాలయ అధికారి జయరాం పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలంలోని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయ కాలమాన పట్టిక, డైరీలను మండల విద్యాధికారి రాముడుచే ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణంలో ఆవిష్కరించారు. ఏపీటీఎఫ్ (1938) మండల నాయకులు సూర్యనాగిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రహంతుల్లా, రాజేష్, రమేష్, హేమంత్‌కుమార్, అశ్వర్థ, శంకర్‌రెడ్డి, బాలాంజనేయులు, నారాయణస్వామి పాల్గొన్నారు. ఏపీటీఎఫ్ (2005) మండల శాఖ అధ్యక్షులు రాజేష్, కార్యదర్శి దాదాఖలందర్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వెంకటరామిరెడ్డి, శ్యామ్ రవిబాబు, తదితరులు పాల్గొని డైరీ, కాలమానపట్టికలను విడుదల చేశారు.



పెద్దవడుగూరు: పట్టికలను విడుదల చేస్తున్న మండల విద్యాధికారి



తాడిపత్రి పట్టణం: ఎమ్మెల్యే, ఏపీటీఎఫ్ సభ్యులు



బాధితుడికి చెక్కు అందిస్తున్న స్లేట్, ప్లేట్ అధ్యక్షుడు

అభాగ్యుడికి ఆర్థిక సాయం

తాడిపత్రి గ్రామీణం, న్యూస్‌టుడే: నాలుగు చేతులు కలిస్తే ఒకరికి చేయూతనందించవచ్చని స్లేట్, ప్లేట్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రాజోలు శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. హిందూపురం పట్టణానికి చెందిన వెంకటరమణ అనే కిడ్నీ బాధితుడికి తమ సంస్థ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం శనివారం రూ.లక్ష చెక్కును అందించారు. కార్యక్రమంలో స్లేట్, ప్లేట్ స్వచ్ఛంద సంస్థ ఉపాధ్యక్షుడు ఓబులేసు, కార్యదర్శి బషీర్ అహ్మద్, సభ్యులు ఆనంద్‌రెడ్డి, నాగేశ్వరరావ్, రాజు, శాస్త్రి, హెచ్‌పీ గ్యాస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

రాయలచెరువు(యాడికి): స్థానిక ఉన్నత పాఠశాల సమీపంలోని వంతెన పైనుంచి 20 అడుగుల లోతులో శనివారం ఓ ట్రాక్టరు పడిపోయి ధ్వంసమైంది. త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. అప్పేచెర్ల తిమ్మాపురం నుంచి రాయలచెరువు వైపు ఇటుకల లోడుతో వస్తున్న ట్రాక్టరు ప్రమాదవశాత్తు వంకలోకి పడిపోయింది. ఇటుకల లోడు పైన, డ్రైవరు పక్కన కూర్చున్న వారితో పాటు డ్రైవరు కూడా కిందపడిపోయారు. ట్రాక్టరు కింద పడకుండా పక్కకు పడిపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ట్రాక్టరులో ఉన్న డ్రైవరు వెంకటనాయుడుతో పాటు నారాయణస్వామి, సుంకన్న, సూరికి రక్తగాయాలయ్యాయి. ఘటనా స్థలం సమీపంలోనే ఉన్న రహదారి భద్రతా వాహన సిబ్బంది వెంటనే వారిని భద్రతా వాహనంలోనే గుత్తికి తరలించారు. క్షతగాత్రులకు అక్కడి చికిత్స అందిస్తున్నారు.



బోల్తాపడిన ట్రాక్టరు

ఆడపిల్లను బతకనిద్దాం.. ఎదగనిద్దాం

చుక్కలూరు(తాడిపత్రి గ్రామీణం): ఆడపిల్లను బతకనిద్దాం.. ఎదగనిద్దాం అని ఆరోగ్య విద్యా భోధకుడు మల్లయ్య పేర్కొన్నారు. మండలంలోని చుక్కలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆశ డే సందర్భంగా ఆశా కార్యకర్తలతో పీహెచ్‌సీ వైద్యాధికారి వేముల సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రంలో సూపర్‌వైజర్లు షబ్బీర్ అహమ్మద్, అబ్దుల్ రెహమాన్, సుమతీదేవి, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

చీనీ రైతులకు అవగాహన

తాడిపత్రి గ్రామీణం, న్యూస్‌టుడే: సస్యరక్షణ చర్యలు చేపడితేనే చీనీతోటలో అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యానశాఖ అధికారిని ఫజులున్నీసాబేగం చీనీ తోటల సాగు రైతులకు సూచించారు. స్థానిక ఉద్యాన శాఖ కార్యాలయంలో శనివారం రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అనంతరం వెంకటరెడ్డిపల్లి ఆదర్శ రైతు రాజశేఖర్‌రెడ్డి తాను చీనీ తోట సాగులో అవలంభించే పద్ధతులపై రైతులకు అవగాహన కల్గించారు. కార్యక్రమంలో ఎంపీఈఓలు వేణుగోపాల్‌రెడ్డి, మనోహర్, తాడిపత్రి, పెద్దపప్పూరు, యాడికి మండలాల చీనీ తోటల రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు రంగయ్య

జన్మభూమి-మా ఊరును అడ్డుకుంటాం

తాడిపత్రి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం ప్రచార ఆర్భాటాల కోసం నిర్వహిస్తున్న జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని సీపీఐ తరఫున అడ్డుకుంటామని సీపీఐ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రంగయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పట్టణ సమీపంలోని రంగప్ప కాలనీలో శనివారం సీపీఐ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రంగయ్య మాట్లాడుతూ.. అర్జీలు స్వీకరించి నేటికి మూడు నెలలు అవుతున్నా.. ఇంకా రుణాలు జమ చేయకుండా మళ్లీ అర్జీలు స్వీకరించడం రైతులను మభ్యపెట్టడమేనని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి, మండల కార్యదర్శి గంగరాజు, సహాయ కార్యదర్శులు వెంకటరాముడు, రామ్మోహన్, దస్తగిరి, శ్రీరాములు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ప్రధానం

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మండల న్యాయాధికార సంస్థ అధ్యక్షుడు బుజ్జప్ప పేర్కొన్నారు. స్థానిక ఉప కారాగారాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఆవేశంతో విచక్షణ కోల్పోవడం వల్ల కలిగే నష్టాల గురించి ఖైదీలకు ఆయన వివరించారు. జైలులోని వంటశాల, మరుగుదొడ్లు, గదులను పరిశీలించారు. అనంతరం ఖైదీల భోజన నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభుకుమార్, కార్యదర్శి సాహుల్, సతీష్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు మునయ్య, సూర్యనారాయణ, శివయ్య, శ్రీనివాసులు, విష్ణు, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ పండగ

యాడికి, న్యూస్‌టుడే: మండలంలోని యాడికి, రాయలచెరువుల్లో శనివారం ముస్లింలు ఘనంగా గ్యార్మీ పండగ నిర్వహించారు. యాడికి లోని ప్రధాన రహదారిపైనా, రాయలచెరవులోని నగరూరు రోడ్డు, గుత్తిరోడ్డు, చందన గేటు తదితర ప్రాంతాల మీదుగా మక్కా మదీనా నమూనాలను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. జెండాలను చేతబూనిన యువకులు, చిన్నారులు ఉత్సాహంగా ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం పెద్ద ఎత్తున మసీదుల వద్ద అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు జాఫర్, ఇబ్రహీం, ఫక్రుద్దీన్, మహబూబ్ బాషా, ఎస్సైబాషా, మెకానిక్ జాఫర్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.



రాయలచెరువులో ఊరేగింపులో పాల్గొన్న ముస్లింలు

ఉరవకొండ

ప్రభుత్వ పథకాలపై అవగాహన

మాళాపురం(విడపనకల్లు): ప్రభుత్వ పథకాలపై కైజాల యాప్ ద్వారా ట్రైనీలు అజిత్, శివకుమార్ శనివారం వి.కొత్తకోట, మాళాపురం గ్రామాల్లో అవగాహన కల్పించారు. తెదేపా గ్రామ కమిటీలు, మండల కమిటీలకు పథకాల గురించి సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరించారు. సమస్యలు ఉంటే యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. ఆర్గనేజర్ ధనుంజయ్య పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడదాం

విడపనకల్లు, న్యూస్‌టుడే: బెస్త సామాజిక వర్గం ఆర్థికంగా, రాజకీయంగా అట్టుడుగున ఉన్నారని బెస్త సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య, ఉపాధ్యక్షులు గంగన్న తెలిపారు. శనివారం విడపనకల్లులో బెస్త సంఘం జిల్లా నాయకులు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ రాజకీయంగా చైతన్యవంతులుగా కావాలని, హక్కుల కోసం పోరాడదామని పిలుపునిచ్చారు. రాజకీయంగా రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.



సత్కరిస్తున్న అధికారులు

లక్ష్యంపై నిర్లక్ష్యం



బెళుగుప్ప: నిర్మాణంలో ఉన్న వ్యక్తిగత మరుగుదొడ్డి

ఉరవకొండ పట్టణం, న్యూస్‌టుడే: స్వచ్ఛత అనే పదం వింటేనే ఎంతో హాయి అనిపిస్తుంది. అదే దానిని పాటిస్తే ఆరోగ్యకరమైన ఆనందాన్ని నింపుతుంది. అలాంటి స్వచ్ఛతను ప్రతి గ్రామంలోనూ నెలకొల్పాలన్న ఉద్దేశంతో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టింది. వాటి వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజానీకం కూడా గుర్తిస్తోంది. అనేక మంది నిర్మించుకోవడానికి ముందుకు వస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యంతో అవి ముందుకు సాగడంలేదు. ఉరవకొండ నియోజకవర్గంలో మరుగుదొడ్ల నిర్మాణాల వేగం ఆశించిన స్థాయిలో పుంజుకోవడంలేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల అలసత్వానికి నిలువుటద్దంలా సాగుతున్నాయి. లబ్ధిదారుల ఇబ్బందులను పరిష్కరిస్తే మరింత వేగంగా నిర్మాణాలు చేపట్టే ఆస్కారం ఉంది.

వేగాన్ని అందుకోని నిర్మాణాలు

నియోజకవర్గంలో 84 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటిలో 2.65 లక్షల జనాభా ఉంది. స్వచ్ఛభారత్ మిషన్ కింద ఐదు మండలాలకు కలిపి 24,837 మంజూరు అయ్యాయి. వాటిలో 22,192 నిర్మాణాల ప్రారంభానికి మండల పరిషత్తు అభివృద్ధి అధికారులు అనుమతులు జారీ చేశారు. వాటిలో 6,080 వేల మరుగుదొడ్లు మొదటి దశలో ఉన్నాయి. వీటిలో 4,140 మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తయినట్లు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఈ లక్ష్యాన్ని పరిశీలిస్తే వాటి నిర్మాణాలు అనుకున్నంత వేగంగా సాగడం లేదు. కొన్ని మండలాల్లో నిర్మాణాలు వేగంగా కనిపిస్తున్నా, మరికొన్ని మండలాల్లో నత్తనడకగా సాగుతున్నాయి.

మండలం	మంజూరైనవి	అనుమతి లభించినవి	నిర్మాణంలో ఉన్నవి	పూర్తయినవి
ఉరవకొండ	5951	4853	1230	740
విడపనకల్లు	5250	4702	619	423
బెళుగుప్ప	4729	4384	1639	1135
కూడేరు	4930	4452	1277	875
వజ్రకరూరు	3977	3801	1315	967
మొత్తం	**24837**	**22192**	**6080**	**4140**

ఎదురవుతున్న సమస్యలు

వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ సామగ్రి పరంగా లబ్ధిదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇసుకతో పాటు గుంతల్లో ఏర్పాటు చేసుకునే రింగులు, సిమెంటు, ఇటుకల కొరత కనిపిస్తోంది. గ్రామాల్లో భవన నిర్మాణ కార్మికుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఇబ్బందులుపడుతున్న దాఖలాలు ఉన్నాయి.

అధికారులు చొరవ చూపితే...

నిర్మాణాలకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలి. నిర్మాణాలకు సంబంధించి బిల్లుల మంజూరులో ప్రత్యేక దృష్టి సారించాలి. రెండో దశలో విడుదల కానున్న బిల్లులను సకాలంలో లబ్ధిదారుల ఖాతాలకు వేస్తే వారు చొరవ చూపి పూర్తి చేసుకుంటారు.

స్వచ్ఛంద సంస్థలను భాగస్వామి చేస్తున్నాం

- శివకుమార్, ఎంపీడీవో, ఉరవకొండ

వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేయడానికి ఉన్నత అధికారుల సూచనల మేరకు స్వచ్ఛంద సంస్థలను భాగస్వామి చేస్తున్నాం. కొన్ని గ్రామాలను వారికి అప్పగించాం. గత వారం రోజులుగా పనులు వేగవంతంగా సాగుతున్నాయి. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపడుతాం.

పదోన్నతి పొందిన ఉద్యోగికి సత్కారం

ఉరవకొండ, న్యూస్‌టుడే: పోలీసు కమ్యూనికేషను విభాగంలో పదోన్నతి సాధించి ఏఎస్ఐగా నియమితులైన రాజశేఖరగౌడును సీఐ చిన్నగౌసు, ఎస్ఐలు నగేష్‌బాబు, ఖాన్‌లు సత్కరించారు. ఉరవకొండలో బాధ్యతలు స్వీకరించిన తర్వాత అధికారులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఆ శాఖలోని ఉద్యోగులు పాల్గొని అభినందనలు తెలిపారు.

పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలి

అంజుమన్‌కాలనీ (గుంతకల్లు), న్యూస్‌టుడే : కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి యువతీయువకులు ముందుకు రావాలని జిల్లా పరిశ్రమల కేంద్ర జనరల్ మేనేజరు సుదర్శన్‌బాబు అన్నారు. అంజుమన్ కాలనీలోని స్త్రీశక్తి భవనంలో శనివారం పట్టణంలోని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, విద్యార్థుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు, విద్యావంతులు ఉద్యోగాలపై ఆధారపడకుండా పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి పొందుతూ మరికొందరికి ఉపాధి కలుగజేయడానికి ముందుకు రావాలన్నారు. ఇందుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారాన్ని అందిస్తామని చెప్పారు. వినియోగదారులకు మంచి సేవలు అందించే వారే రాణిస్తారని చెప్పారు. కార్యక్రమంలో యువకులు, పారిశ్రామిక శిక్షణా కేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. సమావేశంలో పరిశ్రమల కేంద్రం ఉప సంచాలకులు సువదర్‌రాజు, స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ సీనియర్ బ్రాంచ్ మేనేజరు నాంచారయ్య, గుంతకల్లు పారిశ్రామికవేత్త రామ్మోహన్ గుప్తా పాల్గొని ప్రసంగించారు.

సంతోషంగా వేడుకలు జరుపుకోవాలి



ఎస్సై జనార్దననాయుడు

వజ్రకరూరు, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని ఎస్సై జనార్దననాయుడు కోరారు. పోలీసు స్టేషన్‌లో శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఈనెల 31న రాత్రి పది గంటల నుంచి సోమవారం తెల్లవారుజామున ఐదు గంటల వరకు వివిధ ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తారన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. మండల కేంద్రంలో ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. కొనకొండ్ల, చాబాల, పీసీప్యాపిలి, బోడసానిపల్లి వైపు అధికంగా తనిఖీలు చేస్తామన్నారు.



దస్త్రాలను పరిశీలిస్తున్న అధికారులు

జీబీసీని పరిశీలించిన ఈఈ

విడపనకల్లు, న్యూస్‌టుడే: విడపనకల్లు మండలంలోని గుంతకల్లు బ్రాంచి ప్రధానకాలువను ఈఈ రాజశేఖర్ పరిశీలించారు. శనివారం మొదటిసారిగా ఆయన విడపనకల్లుకు వచ్చి సహాయ ఇంజనీరు కార్యాలయాన్ని సందర్శించారు. గుంతకల్లు బ్రాంచి ప్రధానకాలువ విస్తీర్ణం, పొడవు, పిల్లకాలువలు, ఆయకట్టు వివరాలకు సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించారు. పలు విషయాలపై డీఈ శ్రీనివాసులతో చర్చించారు. ఈకార్యక్రమంలో ఆలూరు బ్రాంచి కెనాల్ డీఈ, స్థానిక జేఈలు మంజునాథ్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలు

బెళుగుప్ప, న్యూస్‌టుడే: కంటి సమస్యలతో బాధపడుతున్న వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆసుపత్రి వారు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారని మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో స్థానిక వాసవీకల్యాణ మండపంలో ఆర్య వైశ్య సంఘం బెళుగుప్ప వారి ఆధ్వర్యంలో వైద్య నిపుణులు శ్రీరామ్, మహమ్మద్ వైద్య పరీక్షలు నిర్వహించారు. 250 మందికి చికిత్సలు చేయగా 140 మంది కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిపారు. వీరందరికి ఉచితంగా బెంగళూరులో శంకర కంటి ఆసుపత్రి వారు చికిత్సలు, ఆపరేషన్లు చేస్తున్నట్లు తెలిపారు.

రుణమాఫీ కోసం తరలివెళ్లిన రైతులు

వజ్రకరూరు: రుణమాఫీ కాని రైతులు అనంతపురం మార్కెట్ యార్డులో దరఖాస్తులు అందించాలని రైతు సాధికార సంస్థ అధికారులు కోరడంతో శనివారం మండలం నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. పంట రుణాలు పొందినా రుణమాఫీ కాక పోవడంతో రైతులు ఆధారాలను తీసుకొని వెళ్లారు. మండల రైతులు కోసం మండల ఏవో మధుకర్, సిబ్బంది అక్కడే ఉండి వారికి సహాయం చేశారు. రైతులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తామన్నారు.

ఇలాగైతే.. తాగేదెలా..!



తాగునీటి కొళాయి వద్ద పందుల సంచారం

ఉరవకొండ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో తాగునీటి కొళాయి వద్ద పందుల సంచారం అధికంగా ఉంది. కొళాయి వద్ద తాగునీటిని పట్టుకోవడానికి రోగులు వెళ్లి, వాటిని తరమినా అవి అక్కడ నుంచి కదలని పరిస్థితి. దీంతో వారు భయాందోళన మధ్య దాటి దగ్గర నుంచే నీటిని పట్టుకుంటున్నారు. చాలా రోజులుగా ఆసుపత్రి ప్రాంగణంలో వాటి సంచారం కొనసాగుతోంది. కొళాయి వద్ద నిరుపయోగమైన నీటిలో తిరుగుతూ అవి ఆ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. ఆసుపత్రి అధికారులు స్పందించి, వాటి సంచారాన్ని అరికట్టాలని రోగులు కోరుతున్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రమీళమ్మ

క్రీడలతో స్నేహపూరిత వాతావరణం

వజ్రకరూరు: నూతన సంవత్సరంలో యువత స్నేహపూరిత వాతావరణంలో ఉండాలని సీఎస్ఐ చర్చి అధ్వర్యంలో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు మతపెద్ద ప్రమీళమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని సత్యసాయిబాబా క్రీడామైదానంలో శనివారం యువతకు క్రికెట్ పోటీలను నిర్వహించారు. పోటీలకు వచ్చిన క్రీడాకారులను మతపెద్ద పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన వారికి నూతన సంవత్సరం రోజున బహుమతులు ఇవ్వనున్నారు.

ఉరవకొండ

దుకాణాలను బంద్ చేయించాలి

గుంతకల్లు: కొత్త సంవత్సరం సందర్భంగా పట్టణంలోని బార్‌లు, మద్యం దుకాణాలను శనివారం, సోమవారం మూసేయాల్సిందేనని ఐద్వా పట్టణ అధ్యక్షురాలు జ్యోతి, భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మారుతీప్రసాద్ అన్నారు. దుకాణాలు మూసేయాలని శనివారం పట్టణ సి.ఐ.రాజాకు వినతిపత్రాన్ని అందజేశారు. యువకులు మద్యాన్ని తాగి ప్రమాదాలకు గురవుతారని, శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు.

వైద్యాధికారి సేవలను మరవలేం

తిలక్‌నగర్ (గుంతకల్లు): గుంతకల్లు మున్సిపల్ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి రామమూర్తి గుంతకల్లు పట్టణానికి అందిస్తున్న సేవలను తాము మరువలేమని మున్సిపల్ అధ్యక్షురాలు అపర్ణ, ఉపాధ్యక్షుడు శ్రీనాథ్‌గౌడ్, కమిషనర్ సత్యనారాయణ అన్నారు. ఆయన ఉద్యోగ విరమణను పుస్కరించుకొని శనివారం మున్సిపల్ సమావేశపు మందిరంలో ఘనంగా సత్కరించారు.

ప్రజాసేవతోనే ఉద్యోగులకు గౌరవం



ఉద్యోగిని సన్మానిస్తున్న అధికారులు

ఉరవకొండ, న్యూస్‌టుడే: రెవెన్యూశాఖలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి పదవీవిరమణ చేస్తున్న చంద్రశేఖర్‌గౌడును ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు శనివారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. మండలంలోని చిన్నముష్టూరు గ్రామానికి చెందిన చంద్రశేఖరగౌడు కార్యదర్శి నుంచి సీనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తూ పదవీవిరమణ చేశారు. ఈసందర్భంగా ఉరవకొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రతినిధులు కిష్టప్ప, తిమ్మప్ప, వెంకటస్వామి, తహసీల్దార్ అనీల్‌కుమార్, ఎస్ఐ నగేష్‌బాబు, ఎంపీపీ సుంకురత్నమ్మ, డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, శంకరప్ప, విజయభాస్కర్ అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉరవకొండ పట్టణం, న్యూస్‌టుడే: ఏ ఉద్యోగయిన తన విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరిస్తూ సకాలంలో సేవలు అందించినప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందని విడపనకల్లు తహసీల్దారు శంకరయ్య పేర్కొన్నారు. విడపనకల్లులో అంగన్‌వాడీ కార్యకర్తగా పని చేస్తూ శనివారం పదవీ విరమణ పొందిన కార్మిక సంఘం కార్యదర్శి సువర్ణను ఆయన సత్కరించారు. పట్టణంలోని గవిమఠంలో ఏర్పాటు చేసిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్ని విభాగాల్లో కంటే స్త్రీశిశు సంక్షేమం ప్రధానమైందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అశ్వర్థ, ఐసీడీఎస్ అధికారులు, సీఐటీయూ కార్మిక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

విడపనకల్లు: ఉపాధ్యాయ వృత్తి ఆదర్శవంతమైనదని విద్యార్థులను తీర్చిదిద్ది సమాజానికి వెలుగుచ్చేది ఉపాధ్యాయులే అని వక్తలు పేర్కొన్నారు. విడపనకల్లులోని ప్రధాన ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పార్వతమ్మ పదవీవిరమణ సందర్భంగా శనివారం సన్మాన సభను నిర్వహించారు. వారు మాట్లాడుతూ పదవీవిరమణ చేసిన పార్వతమ్మ 30 ఏళ్లగా విద్యార్థుల కోసం పరితపించారని, అంకిత భావంతో పని చేశారన్నారు. పిల్లలను క్రమశిక్షణలో ఉంచుతూ ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దారన్నారు. అనంతరం ఆమెకు ఉపాధ్యాయ బృందం, ఎంఈవో చలపతి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి జడ్పీటీసీ సభ్యుడు తిప్పయ్య, ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, విజయ్‌మోహన్, నాగేంద్రప్ప, నాయకులు హనుమప్ప, ధనుంజయ్య, భాస్కర్ పాల్గొన్నారు.



పార్వతమ్మను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

విజయోత్సవ ఊరేగింపు

ఆమిద్యాల(ఉరవకొండ), న్యూస్‌టుడే: జిల్లాస్థాయి పుట్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ఆమిద్యాల ఉన్నత పాఠశాల జట్టును శనివారం ఆమిద్యాలలో విజయోత్సవ ఊరేగింపు నిర్వహించారు. అనంతపురంలో ఆర్డీటీ, పుట్‌బాల్ సంఘం సంయుక్తంగా నిర్వహించిన అండర్-15 జిల్లాస్థాయి పుట్‌బాల్ పోటీల్లో విజేతగా నిలచిన ఆమిద్యాల ఉన్నత పాఠశాల జట్టును ఊరేగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు గంగాభవాని, శ్రీనివాసులు, మారుతి పాల్గొన్నారు.

మరమ్మతు చేయిస్తే నీటిని అందిస్తా..!



మరమ్మతుకు గురయిన చేతిపంపు

ఉరవకొండ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో పాత ఎస్‌బీఐ నుంచి ఇందిరానగర్‌కు వెళ్లే దారిలో చేతి పంపు ఉంది. ఆ వీధిలోని వారంతా కొళాయిలకు సరఫరా అయ్యే తాగునీటితో పాటు ప్రత్యామ్నాయంగా చేతిపంపు నీటిని వాడుకునే వారు. అయితే సిమెంటు రోడ్డు నిర్మించడంతో సగానికి పైగా చేతిపంపు సిమెంటు రోడ్డులో కలిసి పోయింది. దీంతో దాదాపు రెండేళ్లుగా ఆ చేతి పంపు నిరుపయోగంగా మారింది. కొళాయిలకు తాగునీరు సరఫరా కానప్పుడు వారికి ప్రత్యామ్నాయంగా నీటిని పట్టుకునే అవకాశాలు లేవు. అధికారులు స్పందించి దానిని మరమ్మతు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌ఎన్

వ్యాధినిరోధక టీకాలపై అవగాహన

బెళుగుప్ప, న్యూస్‌టుడే: మాతాశిశు సంరక్షణలో ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ముఖ్యపాత్ర పోషించాలని పీహెచ్‌ఎన్ పద్మావతి పేర్కొన్నారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిరోధక టీకాలపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ టీకాల కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో ప్రణాళికాబద్ధంగా అమలు చేయడానికి వైద్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలన్నారు. అలాగే జన్మభూమి కార్యక్రమంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు గురుప్రసాద్, త్యాగరాజ్, వెంకటరమణ, శాంతకూమారి తదితరులు పాల్గొన్నారు.

పీఏబీఆర్‌డ్యాం నుంచి నీరు విడుదల

పీఏబీఆర్ డ్యాం(కూడేరు, న్యూస్‌టుడే): మండల పరిధిలోని పీఏబీఆర్ జలాశయం నుంచి 25న విడుదల చేయాల్సి ఉండగా ఇరిగేషన్ అధికారులు పొడగించడంతో నీటిని విడుదల చేయలేదు. అయితే ట్రైల్‌రన్ కోసం కుడికాలువ గేట్లను ఎత్తడంతో అవి కాస్త మరమ్మతులకు నోచుకున్నాయి. దీంతో అధికారులు, సిబ్బంది గేట్లకు ఆరు రోజుల అనంతరం మరమ్మతులు చేశారు. ప్రస్తుతం జలాశయంలో 4.167 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాంకు చేరుకున్న ఈఈ మోహన్‌మూర్తి కుడికాలువకు నీరు విడుదల చేసేందుకు స్విచ్‌ఆన్ చేశారు. జలాశయం నుంచి కుడికాలువకు 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఈ పక్కీరప్ప, ఏఈ సుబ్రహ్మణ్యం, ఏఈ రామకృష్ణ, జ్యోతి, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



స్విచ్‌ఆన్ చేస్తున్న మోహనమూర్తి

2నుంచి జన్మభూమి- మాఊరు కార్యక్రమం

కూడేరు, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామాల్లో జనవరి 2 నుంచి 5వ తేదీ వరకు జన్మభూమి - మాఊరు కార్యక్రమాన్ని జరుపుతున్నట్లు ఎంపీడీవో లక్ష్మీనారాయణ శనివారం పేర్కొన్నారు. 2న గొట్కూరు, కమ్మూరు, 3న ఇప్పేరు, కళగల్ల, 4న కూడేరు, ముద్దలాపురం, 5న కొర్రకోడు, జల్లిపల్లి, 6న ఉదిరిపికొండ, మరుట్ల, 8న పి.నారాయణపురం, తిమ్మాపురం, 9న అరవకూరు, చోళసముద్రం గ్రామ పంచాయతీలో ఉంటుందని అన్నారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన తెలియజేశారు.

వ్యక్తిగత మరుగుదొడ్లతోనే ఆరోగ్యం

విడపనకల్లు, న్యూస్‌టుడే: వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకుందామని రెండో జేసీ సయ్యద్ ఖాజా తెలిపారు. శనివారం విడపనకల్లు మండల పరిషత్తు కార్యాలయంలో మరుగుదొడ్ల నిర్మాణాలపై సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులతో రెండో జేసీ సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ మండలానికి 5,235 మరుగుదొడ్లు మంజూరు అయితే 415 మాత్రమే పూర్తి అయ్యాయని చాలా వెనుకబడి ఉందని చెప్పారు. మండలంలో బహిరంగ మలవిసర్జన ఎక్కడ ఉండకూడదని ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండాలన్నారు. జనవరి 26 కల్లా పునాది స్థాయి, ఫిబ్రవరి 26 లోపల రెండో దశ నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ప్రతినిధులు తిప్పయ్య, రవీంద్ర, శంకరయ్య, షకీలాబేగం, ఐజయ్య, ఎంఈవో, పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణంపై సమీక్ష

బెళుగుప్ప, న్యూస్‌టుడే: అపరిశుభ్రతకు మారుపేరైన మండల కేంద్రంలో అధికారులు హడావుడిగా పలు వీధులు, మురుగు కాలువలు శుభ్రం చేయించారు. కొన్ని రోజులుగా వీధుల్లో పేరుకుపోయిన చెత్త, మురుగు కాలువలు పొంగిపొర్లుతున్నా పట్టించుకోని అధికారులు శనివారం హఠాత్తుగా శుభ్రం చేయడంతో గ్రామస్థులు ఆశ్చర్యానికి గురయ్యారు. జేసీ 2 ఖాజామొహిద్దీన్ వ్యక్తిగత మరుగుదొడ్ల ప్రగతిని పరిశీలించేందుకు రావడంతో గ్రామాన్ని పరిశుభ్రంగా చూపించాలని హడావుడిగా చర్యలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ వీరపాండియన్ మరుగుదొడ్ల నిర్మాణంపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో మండల అధికారులతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. మరుగుదొడ్ల గ్రామస్థాయి ప్రత్యేకాధికారులైన సలీమ్, విద్యుత్తుశాఖ అధికారి నాగేనాయక్, అటవీ శాఖాధికారి రమేష్, సాక్షర భారత్ భాస్కర్, మండల ప్రత్యేకాధికారి సమావేశానికి గైర్హాజరు కావడంతో మెమోలు జారీచేసినట్లు ఎంపీడీవో సుధామణి తెలిపారు.

ఎస్టీ జాబితాలోకి చేర్చాలని డిమాండ్



ప్రసంగిస్తున్న జిల్లా అధ్యక్షుడు

ఉరవకొండ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్థికంగా, రాజకీయంగా, సామాజిక పరంగా వెనుకబడుతున్న బెస్తల సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బెస్త గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం పట్టణంలో ఆ సామాజిక వర్గం ఆత్మీయ సమావేశాన్ని పవన్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమ అభివృద్ధికి మత్స్యశాఖ తరుపున కనీస చర్యలు కరవయ్యాయన్నారు. చేపలు పట్టడానికి అవసరమైన కనీస సదుపాయాలు కూడా కల్పించలేదని వాపోయారు. రాయితీ రుణాల వర్తింపులోనూ తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆక్రోశించారు. బెస్త సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండు చేశారు. అనంతరం ఉరవకొండ బెస్త గంగపుత్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడుగా హరిప్రసాద్, ఉపాధ్యక్షుడు రామన్న, కార్యదర్శి పవన్‌కుమార్, సహాయ కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, కోశాధికారి రవిచంద్ర, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బెస్త సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

విపత్తుల నిర్వహణలో యువతే కీలకం



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఉరవకొండ పట్టణం, న్యూస్‌టుడే: ప్రకృతి పరంగా ఎలాంటి వైపరీత్యాలు ఎదురయినా ప్రజలు ఇబ్బంది పడకుండా సహాయం అందించడంలో యువత ముందుండాలని ఉరవకొండ అగ్నిమాపక అధికారి బసవరాజు పేర్కొన్నారు. 'విపత్తుల నిర్వహణ - ప్రథమ చికిత్స' అనే శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండోరోజు అగ్ని ప్రమాదాల నివారణలో యువత పాత్రపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాలు జరుగున్నప్పుడు తక్షణం స్పందించి, మంటలను అదుపు చేయాలన్నారు. వాటిని ఎలా అదుపు చేయాలో అవగాహన కల్పించామన్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారు తీసుకోవాల్సిన ప్రథమ చికిత్స చర్యలు గురించి జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్ వివరించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామచంద్ర మూర్తి, రెడ్‌క్రాస్ ప్రాంతీయ సమన్వయకర్త శంకరరెడ్డి, అధికారి రమేష్, అధ్యాపకులు, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.